సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 సంచిక: 160

SUNDAY Special

ఆదివారం 31-8-2025

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



గంటకు 400 కిలోమీటర్లు

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటైన ముంబై–అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. 'ఈ–10' షింకన్సెన్ బుల్లెట్ రైలు 2030లో పట్టాలెక్కనుంది. -2లో



వరల్డ్ బ్యాడ్మింటన్ సెమీస్‌లో భారత జోడీ

వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి సెమీ ఫైనల్లోకి ప్రవేశించారు. తద్వారా టోర్నీలో కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు. -12లో



చైనాలో అడుగుపెట్టిన మోదీ

ప్రధాని మోదీ ఏడేళ్ల తరువాత చైనాలో అడుగుపెట్టారు. ఆది, సోమవారాల్లో జరిగే ఎస్‌సీఓ సమావేశంలో పాల్గొంటారు.

- వివరాలు 6లో



పింఛన్ కోసం ధన్‌ఖడ్ దరఖాస్తు

రాజస్తాన్ మాజీ ఎమ్మెల్యే అయిన తనకు పింఛన్‌ను పునరుద్ధరించాలని మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ దరఖాస్తు చేసుకున్నారు.

- వివరాలు 6లో



పాక్ తోక ముడిచింది..

ఆపరేషన్ సిందూర్‌ను నాలుగు రోజుల్లోనే ముగించడానికి గల కారణాన్ని ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ బయటపెట్టారు.

- వివరాలు 6లో



రాజస్తాన్‌కు ద్రవిడ్ గుడ్‌బై

ఐపీఎల్ జట్టు రాజస్తాన్ రాయల్స్ హెడ్ కోచ్ పదవి నుంచి రాహుల్ ద్రవిడ్ తప్పుకున్నాడు. 2025లోనే అతను కోచ్‌గా ఉన్నాడు.

- వివరాలు 12లో



వీకెండ్ ఓటీటీ

ప్రస్తుతం ఓటీటీల్లో ట్రెండింగ్‌లో ఉన్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే..



'కింగ్‌డమ్'

- విజయ్ దేవరకొండ హీరోగా నటించిన చిత్రం 'కింగ్‌డమ్'. శివ (సత్య దేవ్), సూరి (విజయ్ దేవరకొండ) అనే ఇద్దరు అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.



'మెట్రో: ఇన్ దినో'

- ఆదిత్యారాయ్ కపూర్, అనుపమ్ ఖేర్, సారా అలీఖాన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'మెట్రో: ఇన్ దినో'. నేటి కాలంలో రిలేషన్‌షిప్స్, లవ్, రొమాన్స్ వంటి అంశాల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.



'శోధ'

- పవన్ కుమార్, సిరి రవి కుమార్, సప్తమీ గౌడ, అనూష రంగనాథ్, అరుణ్ సాగర్, మెయిన్ లీడ్ రోల్స్‌లో నటించిన కన్నడ సిరీస్ 'శోధ'. ఓ లాయర్ భార్య మిస్సింగ్, ఆ లాయర్‌కు జరిగే యాక్సిడెంట్ ప్రధానాంశాలుగా ఉన్న ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది.

50% సీలింగ్ ఎత్తివేత!

- బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు వీలుగా బిల్లులు రూపొందించిన సర్కారు
- బీసీలకు 42% రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు
- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్
- వరద నష్టంపై నేడు జిల్లా కలెక్టర్లు, మంత్రులతో సీఎం సమీక్ష
- కేబినెట్ భేటీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొన్నం, పొంగులేటి

పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులు ఆమోదించిన మంత్రివర్గం

రెండు బిల్లులు శాసనసభలో ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపాలని నిర్ణయం



కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కోరం కనకయ్య

సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లపై 50% గరిష్ట పరిమితి ఎత్తివేసి పంచాయతీరాజ్, పురపాలక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రూపొందించిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర శాసనసభలో ఈ రెండు బిల్లులను ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం శాసనసభ కమిటీ హాల్లో సమావేశమైన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

బీసీ కోటా పెంపునకు అడ్డంకిగా నాటి బిల్లులు: బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించేందుకు గత మార్చిలో శాసనసభలో రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపించగా, ఆయన ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. రిజర్వేషన్లపై 50% సీలింగ్ విధిస్తూ 2018లో పంచాయతీ రాజ్ చట్టానికి, 2019లో మున్సిపల్ చట్టానికి నాటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన సవరణ బిల్లులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా మారాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై 50% సీలింగ్ ఎత్తివేసేందుకు గత మంత్రివర్గ సమావేశంలో ఆర్డినెన్స్‌లను ఆమోదించి గవర్నర్‌కు

మిగతా 2వ పేజీలో ▶

అనూహ్యం.. గెలుపే వ్యూహం

- జూబ్లీహిల్స్ అభ్యర్థి అవుతాడనుకున్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ హోదా.. కేబినెట్‌లోనూ చోటు!
- అమేర్ అలీఖాన్‌కు ప్రభుత్వ పదవి
- జూబ్లీహిల్స్ రేసులో బొంతు, నవీన్ యాదవ్

10లో

ట్రంప్ టారిఫ్‌లు అక్రమం



- అమెరికా అప్పీళ్ల కోర్టు సంచలన తీర్పు
- ట్రంప్‌నకు శరాఘాతం
- యూఎస్ సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్న ట్రంప్ సర్కార్

"ప్రపంచంలోని ప్రతి దేశంపై ఇష్టారీతిన అంతర్జాతీయ టారిఫ్‌లు పెంచేసే అధికారం, అర్హత అధ్యక్షుడికి లేవు. ఐఈఈపీఏ చట్టానికి విరుద్ధంగా అధ్యక్షుడు నిర్ణయాలు తీసుకున్నారు."

6లో

ట్రంప్‌కేమైంది?

మరణించారంటూ వదంతులు.. ఇంటర్నెట్‌లో ట్రెండింగ్

- వైట్‌హౌస్ 'అనుమానాస్పద' మౌనం
- కొన్నాళ్లుగా ఆరోగ్యం అంతంతే!
- గద్దెనెక్కేందుకు సిద్ధమన్న వాన్స్
- నాటి నుంచీ మరిన్ని ఊహాగానాలు

6లో

అసెంబ్లీ నేడు ఒక్కరోజే

వర్షాకాల సమావేశాలు నేటితో ముగించాలని నిర్ణయం

- బీఏసీ సమావేశంలో ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆదివారం సభ ముందుకు 'కాళేశ్వరం'పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు.. చర్చ
- ఆ తర్వాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేతకు సంబంధించిన బిల్లులు
- ప్రజా సమస్యలపై 15 రోజుల పాటు చర్చించాలని బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ప్రతిపాదన
- ప్రభుత్వం అంగీకరించకపోవడంతో బీఆర్‌ఎస్ వాకౌట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు రెండోరోజు ఆదివారంతోనే ముగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పలు జిల్లాల్లో వర్ష బీభత్సం, గణేశ్ నిమజ్జనం తదితరాల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అవసరమైతే కొద్ది విరామం తర్వాత మళ్లీ సమావేశాలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు శనివారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) భేటీలో ప్రభుత్వం ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, ఎంఐఎం పార్టీలు కూడా కనీసం 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని కోరినట్లు తెలిసింది. ఆ ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించక పోవడంతో భేటీ నుంచి బీఆర్‌ఎస్ వాకౌట్ చేసింది.

కాళేశ్వరం నివేదిక సమర్పించనున్న సీఎం

ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్

మిగతా 10వ పేజీలో ▶



పేదల కోసం శ్రమించిన గొప్ప నేత సురవరం

- సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- నమ్మిన సిద్ధాంతాలను చివరి వరకు ఆచరించిన అవిశ్రాంత యోధుడని ప్రశంస
- సురవరం చిరకాలం గుర్తుండేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- సురవరం చిత్రపటానికి నివాళి.. పాటల సీడీ ఆవిష్కరణ
- పాల్గొన్న సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సహా పలువురు ప్రముఖులు

2లో

గణపతి బప్పా మోరియా.. యూరియా కావాలయ్యా

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు బీఆర్‌ఎస్ నిరసన

గన్‌పార్కు వద్ద యూరియా సంచులు, ప్లకార్డుల ప్రదర్శన

- వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ధర్నా
- సచివాలయం ఎదుట బైఠాయింపునకు యత్నం
- అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌కు తరలించిన పోలీసులు

10లో



గన్‌పార్కు వద్ద ఖాళీ యూరియా సంచులతో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డి,గంగుల, పద్మారావు, మల్లారెడ్డి, సుధీర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు



ఏ వంట నూనె మంచిది?

- కొన్ని నూనెలను కలిపి వాడుకోవడం ఉత్తమం
- రోజుకు 20–50 గ్రాములకు మించకూడదు
- పామాయిల్ కూడా ఆరోగ్యానికి మంచిదే
- కొబ్బరి నూనెతో అనేక ప్రయోజనాలు

- 14లో

రైతుపై చేయి చేసుకున్న ఎస్సై

- నారాయణపేట జిల్లా తీలేరులో యూరియా పంపిణీ సందర్భంగా ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్..
- ఎస్సైపై చర్యలు తీసుకుంటామన్న జిల్లా ఎస్పీ



రైతుపై చేయి చేసుకుంటున్న ఎస్సై రాము

5లో

ఇదండీ సంగతి



మళ్లీ నోటీసులు ఎందుకు సార్ సింపుల్‌గా తీసేస్తే పోలా!!



కలలకు మేత.. కడుపే!

- ఆహారానికీ- పీడకలలకు సంబంధం!
- లాక్టోస్, గ్లూటెన్ పడకుంటే నిద్రలేమి
- పేగుల నుంచి మెదడుకు బ్యాడ్ సిగ్నల్స్
- ఫైబర్, లీన్ ప్రొటీన్‌లతో కలల విరుగుడు
- నీల్సన్, డెనాల్డ్, పావెల్ అధ్యయనం

పడనివి తింటే పీడకలలు మన పీక పట్టుకుంటాయట!.. ఆహారమేమో కడుపులోకి వెళ్లేది. కలలేమో బ్రెయిన్‌లోంచి వచ్చేవి. కాబట్టి కలలకు, తినే తిండికి లింకేమిటంటారా?.. దీనికి సంబంధించే తాజాగా ఓ అధ్యయనం జరిగింది. తినే ఆహారానికీ, నిద్రలో వచ్చే కలలకు సంబంధం ఉంటుందని ఇది తేల్చింది. కలలపై 2005 నుంచి ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న మరొక అధ్యయనం.. ఫాస్ట్‌ఫుడ్ తినే వారి కంటే పాల ఉత్పత్తులతో కూడిన ఆహారం తినే వారికే ఎక్కువగా వింతైన కలలు వస్తున్నట్లు కనుగొంది!. ఇంకా వివిధ అధ్యయనాలేం చెబుతున్నాయంటే..

3లో

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అతి పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటైన ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. గుజరాత్‌లోని స్టేషన్స్‌లో సివిల్ పనులు పూర్తి అయ్యాయని రైల్వే శాఖ ప్రకటించింది. అత్యాధునిక సాంకేతికతతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ఈస్ట్ జపాన్ రైల్వే కంపెనీ అభివృద్ధి చేస్తున్న 'ఈ-10' షింకన్సెన్ బుల్లెట్ రైలు 2030లో పట్టాలెక్కనుంది. గంటకు 400 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లడం ఈ ట్రైన్ ప్రత్యేకత. - సాక్షి, స్పెషల్ డెస్క్



గంటకు 400 కిలోమీటర్లు!

జపాన్ పర్యటనలో భాగంగా షింకన్సెన్ బుల్లెట్ రైలులో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జపాన్ సహకారంతో ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టును భారత ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. హైస్పీడ్ రైల్ నడపడం కోసం అక్కడ శిక్షణ పొందుతున్న భారత డ్రైవర్లతోనూ మోదీ ముచ్చటించారు. ఈ నేపథ్యంలో దేశంలోని తొలి హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు మరోసారి వార్తల్లోకెక్కింది.

దేశంలో మొట్టమొదటి హైస్పీడ్ బుల్లెట్ రైలు

'ఈ-10' షింకన్సెన్ రైళ్లు పంపనున్న జపాన్

ముంబై-సబర్మతి మధ్య 2030లో పరుగు

ప్రాజెక్టు వ్యయం రూ.1,08,000 కోట్లు

స్థల సేకరణ పూర్తి

మహారాష్ట్రలో భూసేకరణ, అనుమతుల జాప్యం, కోవిడ్-19 మహమ్మారి.. తదితర కారణాలతో ఈ ప్రాజెక్టు దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం అయింది. ప్రాజెక్టుకు కావాల్సిన 1,389.5 హెక్టార్ల భూ సేకరణ పూర్తి అయినట్టు రైల్వే శాఖ వెల్లడించింది. అన్ని అనుమతులూ పొంది, సివిల్ కాంట్రాక్టులన్నీ నిర్మాణ సంస్థలకు అప్పగించారు.

80 నిమిషాల్లో...

గంటకు 400 కి.మీ. వేగంతో పరిగెత్తే ఈ-10 బుల్లెట్ ట్రైన్ ముంబై నుంచి సబర్మతికి మధ్య ఉన్న 508 కిలోమీటర్ల దూరాన్ని నాన్-స్టాప్‌గా అయితే 80 నిమిషాల్లో పూర్తి చేస్తుంది.

హైస్పీడ్ రైల్ కారిడార్ మొత్తం పొడవు 508 కి.మీ.

నర్మద, తపతి వంటి నదులపై నిర్మిస్తున్న మొత్తం 25 రివర్ బ్రిడ్జీలలో 17 పూర్తి



మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.1,08,000 కోట్లలో ఇప్పటికే రూ.78,839 కోట్ల వ్యయం

గుజరాత్‌లో 2027లో 50 కిలోమీటర్లలో పాక్షిక కార్యకలాపాలు

2030లో పూర్తిస్థాయిలో పరుగులు తీయనున్న బుల్లెట్ రైల్



508 కి.మీ. కారిడార్

బుల్లెట్ రైలు ప్రాజెక్టు గుజరాత్, మహారాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీల గుండా పోతుంది. మొత్తం కారిడార్ పొడవు 508 కిలోమీటర్లు. ఇందులో 12 స్టేషన్లు ఉంటాయి. వీటిలో మహారాష్ట్రలో నాలుగు, గుజరాత్‌లో ఎనిమిది రానున్నాయి. మహారాష్ట్రలో ముంబై స్టేషన్ భూగర్భంలో నిర్మిస్తుండగా మిగిలిన థానే, విరార్, బోయిసర్, అలాగే గుజరాత్‌లోని వాపి, బిలిమోరా, సూరత్, భారుచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి వద్ద ఎలివేటెడ్ స్టేషన్స్ రానున్నాయి.

- మొత్తం 8 స్టేషన్లలో ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి.
- 395 కి.మీ. పియర్ పనులు, 407 కి.మీ. ఫౌండేషన్, 337 కి.మీ. గర్డర్ క్యాస్టింగ్ కూడా పూర్తయ్యాయి.
- 17 రివర్ బ్రిడ్జీల నిర్మాణం పూర్తయింది. మరో 9 రివర్ బ్రిడ్జీల నిర్మాణం పూర్తికావచ్చింది.
- 317 కి.మీ. వయడక్ట్ నిర్మాణం కూడా పూర్తయింది.
- గుజరాత్‌లో 198 కిలోమీటర్ల ట్రాక్ సిద్ధమైంది.

ట్రయల్ రన్ 2027లో..

గుజరాత్‌లో మొదటి 50 కిలోమీటర్ల మార్గంలో 2027లో బుల్లెట్ రైలు పరుగు తీయనుంది. గుజరాత్‌లోని స్టేషన్ల నిర్మాణం 2027 డిసెంబర్ నాటికి, మొత్తం ప్రాజెక్టు 2029 డిసెంబర్ నాటికి పూర్తవుతుందని రైల్వే శాఖ ప్రకటించింది.

రూ.78,839 కోట్ల వ్యయం

ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,08,000 కోట్లు. ఈ ఏడాది జూన్ 30 నాటికి రూ.78,839 కోట్లు ఖర్చు చేశారు.

- ప్రాజెక్టు అంచనా వ్యయంలో 81 శాతం మొత్తాన్ని జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జికా) ద్వారా జపాన్ ప్రభుత్వం సమకూరుస్తోంది.
- ఈ ప్రాజెక్టులో రైల్వే శాఖకు 50 శాతం; మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలకు చెరి 25 శాతం వాటా ఉంది. ఆర్థిక సహాయంతోపాటు భారత్‌లో సమాచార సేకరణ, పరీక్షల కోసం రెండు షింకన్సెన్ రైళ్లను జికా ఉచితంగా సరఫరా చేస్తోంది.

ఈ-5 కాదు.. ఈ-10 రైళ్లు


ఒప్పందంలో భాగంగా జపాన్ ప్రభుత్వం 'ఈ–5' షింకన్సెన్ బుల్లెట్ రైళ్లు మనదేశానికి పంపాలి. కానీ, ఇప్పుడు అత్యాధునికమైన 'ఈ–10' రైళ్ల ఆ దేశం తయారుచేస్తోంది. వాటినే మనకు పంపనుంది. ఇవి జపాన్‌తోపాటు భారత్‌లోనూ 2030 ప్రారంభంలో ఎంట్రీ ఇవ్వనున్నాయి. 'ఈ–5' బుల్లెట్ ట్రైన్ వేగం గంటకు గరిష్ఠంగా 320 కి.మీ. కాగా, ఈ–10 రైలు వేగం 400 కి.మీ. ఈ రైళ్లను భారత్‌లోనూ తయారు చేసే అవకాశం ఉంది.

సముద్రగర్భ రైల్ టన్నెల్

ఈ కారిడార్‌లో 21 కిలోమీటర్ల పొడవైన సముద్రగర్భ రైల్ టన్నెల్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ముంబై–థానే మధ్య నిర్మిస్తున్న ఈ టన్నెల్‌లో భారత్‌లో మొట్టమొదటి 7 కి.మీ. పొడవైన సముద్రగర్భ సొరంగం కూడా ఉంది. 13.1 మీటర్ల వ్యాసం కలిగిన ఒకే ట్యూబ్ సొరంగంలో రెండు ట్రాక్‌లు ఉంటాయి. మహారాష్ట్రలోని 4 కి.మీ. టన్నెల్ పనులు, గుజరాత్‌లోని ఒకే ఒక్క టన్నెల్ నిర్మాణం పూర్తయ్యాయి.

ప్రపంచంలో అత్యంత వేగంగా వెళ్లే రైళ్లు (వేగం కి.మీ.లలో)

రైలు పేరు	దేశం	వేగం
షాంఘై మ్యాగ్‌లెవ్	చైనా	460
సీఆర్450	చైనా	453
సీఆర్400 ఫక్సింగ్	చైనా	350
టీజీవీ	ఫ్రాన్స్	320
షింకన్సెన్	జపాన్	320
యూరోస్టార్ ఇ320	యూకే/యూరప్	320
అల్ బొరాక్	మొరాకో	320





శనివారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ రామకృష్ణారావు. ఆయన సర్వీసును 7 నెలలు పొడిగిస్తూ ఇటీవల కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

నేడు కేరళకు సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదివారం కేరళ వెళ్లనున్నారు. ఆ రాష్ట్రంలోని అలెప్పి పట్టణంలో జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఉదయం అసెంబ్లీలో కాళేశ్వరంపై నివేదికను ప్రవేశపెట్టిన అనంతరం 11 గంటల సమయంలో బయలుదేరి బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో కొచ్చికి వెళ్తారని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అలెప్పికి వెళ్తారని సమాచారం. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఆయన సాయంత్రం 4 గంటల కల్లా హైదరాబాద్ చేరుకుంటారు. కాగా, ఈ కార్యక్రమంలో వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌లు కూడా పాల్గొంటారు.

రేవంత్‌కు బీసీ సమాజం రుణపడి ఉంటుంది

'రిజర్వేషన్ల పరిమితి'పై కొనగాల మహేశ్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యంతో రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల టీపీసీసీ అధికార ప్రతినిధి డా. కొనగాల మహేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రివర్గానికి శనివారం ఒక ప్రకటనలో ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌కు తెలంగాణ బీసీ సమాజం రుణపడి ఉంటుందని మహేశ్ వెల్లడించారు.

పేదల కోసం శ్రమించిన గొప్ప నేత

సురవరం సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

- సురవరం ప్రజలకు చిరకాలం గుర్తుందేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- సురవరం చిత్రపటానికి నివాళి.. పాటల సీడీ ఆవిష్కరణ
- పాల్గొన్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సహా పలువురు ప్రముఖులు



సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో హరగోపాల్, కోదండరాం, చాడ వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి, డి.రాజా, నారాయణ, జూపల్లి కృష్ణారావు, రామకృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: పేదల జీవితాల్లో మార్పు కోసం నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. నమ్మిన సిద్ధాంతాలను చివరి వరకు ఆచరించిన అవిశ్రాంత యోధుడని ప్రశంసించారు. సురవరం ఎల్లప్పుడూ ప్రజలకు గుర్తుండేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు హాజరైన సీఎం రేవంత్.. సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురవరం సుధాకర్‌రెడ్డిపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి తరంలో సురవరం ప్రతాప్‌రెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నె తీసుకురాగా రెండో తరంలో జైపాల్‌రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి వంటి వారు రాజకీయాల్లో రాణించారని గుర్తుచేశారు.

ప్రతిపక్షంలో ఎన్నేళ్లున్నా కమ్యూనిస్టులది ప్రజాపక్షమే..

ప్రస్తుతం కొందరు నేతలు రాజకీయం అంటే అధికారమే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అధికారంలో ఉంటాం తప్ప ప్రతిపక్షంగా ఉండలేమన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కానీ కమ్యూనిస్టులు మాత్రం ఎన్నేళ్లయినా ప్రతిపక్షంలో ఉండేందుకు ఇష్టపడతారని.. సమస్యలపై పోరాడి ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను దించడంలో ముందుంటారని చెప్పారు. కమ్యూనిజం అంటే లైబ్రరీలో దొరికే పుస్తకం కాదని.. ప్రజల కోసం కొట్లాడేవాళ్లని వ్యాఖ్యానించారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతం, ఆలోచన, ఇంకా పెరగాలని ఆకాంక్షించారు. మహనీయుల పేర్లు రాష్ట్రంలో శాశ్వతంగా నిలవాలనే ఉద్దేశంతోనే తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు, కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి జీవితాంతం పనిచేశారని.. ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ కేవీపీ రామచందర్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు బీవీ రాఘవులు, మాజీ శాసనసభ్యులు తమ్మినేని వీరభద్రం, సంపత్ కుమార్, గుమ్మడి నర్సయ్య, చాడ వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్‌తోపాటు సీపీఐ ప్రతినిధులు, సురవరం అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల లేదా క్రీడా మైదానం కోసం 4.5 ఎకరాలిస్తాం: సురవరం సతీమణి

సురవరం సుధాకర్‌రెడ్డి పేరిట యువత, విద్యార్థులకు ఉప యోగపడేలా డిగ్రీ కళాశాల లేదా క్రీడా మైదానాన్ని నిర్మించాలని సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అందుకోసం 4.5 ఎకరాల స్థలాన్ని అందజేస్తామని తెలిపారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్, ఏపీ సరిహద్దు ప్రాంతాల్లోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే ఆ సమస్యలు పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

సురవరం జీవితం రాజకీయ నేతలకు పాఠం: డి. రాజా

నిస్వార్థంగా ప్రజల కోసమే జీవించడం ఎలాగో సురవరం జీవితాన్ని చూస్తే అర్థమవుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. ప్రతి రాజకీయ నాయకుడికి ఆయన జీవితం ఒక పాఠంగా నిలుస్తుందన్నారు. సురవరం పాటించిన సిద్ధాంతాలు సీపీఐ సహా అన్ని పార్టీల నేతలకు ఆదర్శవంతమైనవన్నారు. సురవరంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకొనే క్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సభా వేదికపైనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

ముఖ్యమంత్రి ఓట్ చోరీ చేస్తున్నారు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మాట్లాడుతున్న రాంచందర్‌రావు. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓట్ చోరీ చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. శనివారం యూసుఫ్‌గూడలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ బీజేపీకి కంచుకోటని తెలిపారు. గతంలో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ నుంచి 48 మంది కార్పొరేటర్లు గెలిచారని, పార్లమెంట్ ఎన్నికలోనూ మంచి ఓట్ షేర్ సాధించామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపొంది మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలని నేతలకు సూచించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ నుంచే తెలంగాణలో ఆట మొదలుపెడదామని అన్నారు. అక్టోబర్ చివరివారం, నవంబర్ మొదటి వారంలో ఉపఎన్నిక ఉండే అవకాశం ఉందని చెప్పారు. బీఆర్ఎస్ కథ కంచికి చేరిందని, ఆ పార్టీ అధినేత ఫాంహౌస్‌కే పరిమితమయ్యా రన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ, దుబ్బాక మాదిరిగానే జూబ్లీహిల్స్‌లోనూ బీజేపీ గెలుపు ఖాయమ న్నారు. కాంగ్రెస్–ఎంఐఎం చీకటి ఒప్పందం చేసుకున్నా యని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఎంఐఎంకు వేసినట్లేనని పేర్కొన్నారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని రాంచందర్‌రావు ప్రకటించారు. ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎంపీ గరికపాటి మోహనరావు, చింతల రామచంద్రారెడ్డి, గౌతమ్‌రావు కమిటీలో ఉన్నారు.

తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

బీసీలకు 42% రిజర్వేషన్ల లబ్ధి పొందాలనే యోచన

- సెప్టెంబర్ తొలి వారంలో ఎన్నికల నోటిఫికేషన్!
- నెలాఖరులోగా రెండు దఫాలుగా ఎన్నికలు జరిగే చాన్స్
- అక్టోబర్ 20లోగా పంచాయతీ ఎన్నికలు?

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నందున, దాని నుంచి పూర్తిస్థాయిలో రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచనతో సర్కారు ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని, కాంగ్రెస్ చిత్తశుద్ధిని చాటుకున్నామనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాజకీయ పార్టీల గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను తొలుత నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలపై పైచేయి సాధించి, అత్యధికంగా జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీ అధ్యక్ష పదవులను గెలుచుకునేందుకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన నిర్ణయం ఉపకరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తర్వాత పార్టీ గుర్తుల రహితంగా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉంటాయని అంటున్నారు.

సన్నాహాల్లో పీఆర్ శాఖ, ఎస్ఈసీ

అన్ని పరిస్థితులూ అనుకూలిస్తే సెప్టెంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల చేసి, నెలాఖరులోగా రెండుదశల్లో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఆ తర్వాత 2, 3 వారాల వ్యవధిలో అంటే, అక్టోబర్ 20లోగా పంచాయతీ ఎన్నికలు ముగించేలా ప్రణాళికలు సిద్ధంచేసినట్టు చెబుతున్నారు. బ్యాలెట్ల ముద్రణకు పేపర్ ఆర్డర్ చేసి సిద్ధంగా పెట్టుకోవడం, జిల్లా కలెక్టర్లు బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌లను గుర్తించడం ఓటు నమోదుకు గుర్తుగా చేతి వేలిపై ఇంక్ గుర్తు వేసేందుకు (ఇన్‌డిలైబుల్ ఇంక్) ఇంక్ సంసిద్ధం చేసుకోవడం, ఓటర్ల జాబితాల తుది ప్రకటన వంటి సన్నాహాలు పంచాయతీరాజ్ శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) చేస్తున్నాయి. ఈనెల 28న ప్రచురితమైన గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా తమ అధికారిక వెబ్‌సైట్ (tsec.gov.in)లో ప్రజలు / ఓటర్లకు అందుబాటులో ఉన్నట్టు ఎస్ఈసీ తెలిపింది. అయితే ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ పరంగా మొదట రిజర్వేషన్ల ఫార్ములాను ఖరారు చేయాల్సి ఉంటుంది. ఈ ఫార్ములాకు అనుగుణంగా పీఆర్‌ఆర్‌డీ శాఖ బీసీలు, ఇతర వర్గాలకు రిజర్వేషన్ల శాతాన్ని ఖరారు చేస్తుంది. ఎన్నికల సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణా తరగతులు పూర్తి చేయాల్సి ఉంటుంది. స్థానిక ఎన్నికలు (ఎంపీటీసీ, జెడ్పీటీసీ) ఎప్పుడు జరపాలో ఎస్ఈసీకి ప్రభుత్వం తెలియజేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి సమాచారం అందిన వెంటనే ఎస్ఈసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు షెడ్యూల్

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు గాను పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం రాత్రి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ పోలింగ్ స్టేషన్ల జాబితాను జిల్లా కలెక్టర్ల ఆమోదంతో ఎంపీడీవోలు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులు సిద్ధం చేసి ప్రచురించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 10 కల్లా ఈ ప్రచురణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ సూచించింది.

వివిధ దశలు ఇలా...

సెప్టెంబర్ 6: మండల స్థాయిలో ఎంపీడీవోలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా ప్రచురించాలి. **సెప్టెంబర్ 8:** జిల్లా స్థాయిలో జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలి. **సెప్టెంబర్ 8:** మండల స్థాయిలో ఎంపీడీవోలు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలి.

సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు: వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు. **సెప్టెంబర్ 9:** ఫిర్యాదులు, అభ్యంతరాలు ఏవైనా ఉంటే పరిష్కారం లేదా తిరస్కారం.

సెప్టెంబర్ 10: జిల్లా ఎన్నికల అధికారుల ద్వారా ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ స్టేషన్ల తుది జాబితాల ప్రచురణ.

ప్రత్యేక జీవోతో స్థానిక ఎన్నికలు!

బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు జీవో విడుదలపై మంత్రివర్గంలో చర్చ

- జీవోను కోర్టులో సవాల్ చేస్తే గట్టిగా ఎదుర్కోవాలన్న మంత్రులు
- అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్లాలని సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ఎన్నికల విషయంలో.. ప్రస్తుతం ఉన్న 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టడం, ఆమోదించి గవర్నర్‌కు పంపడంతోనే ఆగరాదని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలిసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జీవోను జారీ చేసి ఎన్నికలకు వెళ్లాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. వాస్తవానికి రెండు నెలల కిందటే రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపి ఆర్డినెన్స్ గవర్నర్‌కు పంపించింది. దాదాపు రెండు నెలలు అవుతున్నా అది ఆమోదం పొందక పోవడాన్ని మంత్రులు చర్చించినట్లు తెలిసింది. ఆర్డినెన్స్ స్థానంలో బిల్లు అసెంబ్లీ ఆమోదం పొంది గవర్నర్‌కు పంపించినా, అక్కడ ఆమోదం పొందడంలో ఆలస్యమైతే సెప్టెంబర్‌లో ఎన్నికల నిర్వహణ ఇబ్బందిగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక జీవో జారీ చేసి ఎన్నికలకు వెళ్లాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అంతేకాకుండా ఆ జీవోను ఎవరైనా కోర్టులో సవాల్ చేస్తే గట్టిగా నిలబడి ఎదుర్కోవాలంటూ పలువురు మంత్రులు తమ అభిప్రాయాన్ని వెల్లడించినట్టు తెలుస్తోంది. హైకోర్టులో కేసు దాఖలైతే అది ప్రభుత్వ పరిశీలనకు రాకుండా తీర్పు ఇవ్వొద్దని కోరుతూ కేవియట్ దాఖలు చేయాలని, ఒకవేళ హైకోర్టులో ఏదైనా ప్రతికూల పరిస్థితులు వస్తే కులగణన డేటాను ఆధారం చేసుకుని సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించాలని మంత్రులు సూచించినట్టు సమాచారం.

50% సీలింగ్ ఎత్తివేత!

▶ మొదటి పేజీ తరువాయి

పంపించగా, ఆయన వాటిని సైతం ఆమోదించకుండా రాష్ట్రపతికి సిఫారసు చేశారని చెప్పారు. మరోవైపు పంచాయతీరాజ్ ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలంటూ హైకోర్టు గడువు విధించిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇటీవల న్యాయ నిపుణులతో చర్చించిందని తెలిపారు. తాజాగా బీసీలకు 42% రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించిందని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిందన్నారు. 50% సీలింగ్ ఎత్తివేసేందుకు వీలుగా ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టనున్న రెండు బిల్లుల ఆమోదానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్




గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌ల పేర్లను ప్రతిపాదించాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలతో సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టంపై ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. వర్షాలతో జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు, రైల్వే లైన్లు, చెరువులకు జరిగిన నష్టంపై సమగ్ర అంచనాలను సిద్ధం చేసి పూర్తి వివరాలతో ఈ సమావేశానికి రావాల్సిందిగా మంత్రివర్గం వారిని ఆదేశించిందని తెలిపారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పునరుద్ధరణ, మరమ్మతు పనులకు ఈ సమీక్షలో సీఎం ఆమోదం తెలుపుతారన్నారు.

గోవుల సంక్షేమానికి కొత్త విధానం

గోవుల సంక్షేమానికి విధివిధానాలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. గోవుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, సీఎస్ఆర్, ఇతర మార్గాల్లో నిధుల సమీకరణ తదితర అంశాలతో ఒక పాలసీని రూపొందించినట్టు పొంగులేటి తెలిపారు. ఇలావుండగా ప్రాజెక్టులకు వచ్చే వరదలను కచ్చితంగా అంచనా వేసేందుకు అవసరమైన సాంకేతిక పరికరాల సమకూర్చుకోవడానికి కావాల్సిన కేంద్ర నిధుల కోసం నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో చేరాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

డబ్బులు చెల్లించని మిల్లర్లపై పీడీ యాక్ట్

గత ప్రభుత్వం 2022–23 రబీ సీజన్‌లో సమీకరించి మిల్లర్లకు కేటాయించిన ధాన్యంలో ఇంకా 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీ కాలేదని, ఆ ధాన్యానికి సంబంధించిన డబ్బులను రికవరీ చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని పొంగులేటి తెలిపారు. డబ్బులు చెల్లించని మిల్లర్లపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టాలని తీర్మానించామన్నారు. మత్స్య సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో వాటిలోని సభ్యులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

కలలకు మేత.. కడుపే!

ఇంతవరకూ ఎవరు చెప్పినా, "పగటి పూట ఆలోచనలే రాత్రి పూట కలలు" అని చెప్పినవాళ్లే. సిగ్మండ్ ఫ్రాయిడ్ అదే చెప్పారు. మన వేదాలూ, ఉపనిషత్తులూ అదే చెప్పాయి. అయితే ఏం తింటే కలలు, పీడ కలలు వస్తాయో ఏ కలల శాస్త్రమూ చెప్పలేదు. ఏ శాస్త్ర పరిశోధనా గుట్టు విప్పలేదు. అయినా తినే ఆహారానికీ, నిద్రలో వచ్చే కలలకు సంబంధం ఉంటుందని అసలు ఎవరు ఊహిస్తారు కనుక?! ఆహారమేమో కడుపులోకి వెళ్లేది. కలలేమో బ్రెయిన్‌లోంచి వచ్చేవి. లింక్ ఎలా ఉంటుంది? అందుకే ఆ వైపుగా పరిశోధనలు జరగలేదు. తాజాగా ఇప్పుడు, పరిశోధన కాదు కానీ, అధ్యయనం ఒకటి జరిగింది. అందులో ఏం తేలిందంటే.. పడనివి తింటే పీడకలలు మన పీక పట్టుకుంటాయని!!

– సాక్షి, స్పెషల్ డెస్క్

ఏం తింటే వస్తాయి ?

కలలు ఎందుకొస్తాయో చెప్పే శాస్త్రాలే కానీ, ఏం తింటే కలలు వస్తాయో చెప్పిన శాస్త్రం ఒక్కటీ మనకు లేదు. 'ఆన్ డ్రీమ్స్' అని అరిస్టాటిల్ రాసినా, 'ది ఫిలాసఫీ ఆఫ్ డ్రీమ్స్' అని స్వామీ శివానంద విశ్లేషించినా.. అవేవీ కూడా 'కలలకు మేత ఎవరు వేస్తున్నారు?' అనే కోణం లోంచి దృష్టి సారించినవి కావు. అయితే ఇటీవల కెనడా అధ్యయనవేత్తలు కొందరు కలలకు–ఆహారానికి సంబంధం ఉందని నిర్ధారించటంతో, 'ఏం తింటే పీడ కలలు వస్తాయి?' అనే ఆసక్తి అంతటా మొదలైంది.

పాలు కలిస్తే పీడ కలలు!

తాజా అధ్యయనానికి ముందు కూడా కొన్ని సర్వేలు జరిగాయి. కానీ అవి – 'కలలకు, కడుపునకు సంబంధం ఉండే అవకాశం లేకపోలేదు' అన్నంత వరకు మాత్రమే ఫలితాలను అందించాయి. 2005 నుంచి ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న మరొక అధ్యయనం ఈ దిశగా ఒక అడుగు ముందుకు వేసి, ఫాస్ట్ ఫుడ్ తినే వారి కంటే పాల ఉత్పత్తులతో కూడిన ఆహారం తినే వారికే ఎక్కువగా వింతైన కలలు వస్తున్నట్లు కనుగొంది!

స్వీట్లు తినేవారిలో ఎక్కువ




2021లో జరిగిన సర్వేలో.. పండ్లు, చేపలు ఎక్కువగా తింటే, రాత్రి కన్న కలలు ఉదయానికి బాగా స్పష్టంగా జ్ఞాపకం ఉంటాయని; అలాగే చక్కెరలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల పీడ కలలు వస్తున్నాయనీ వేర్వేరుగా రెండు అంశాలను అధ్యయనవేత్తలు గుర్తించారు. ఇక 2015లో జరిగిన అధ్యయనంలో పాల్గొన్న వారిలో దాదాపు 18 శాతం మంది.. తినే ఆహారం కలలకు కారణం అవుతుందన్న భావనను ఆమోదించారు.

సైకాలజీ విద్యార్థులపై సర్వే

ఇరవై ఏళ్లుగా జరుగుతున్న అధ్యయనాలన్నిటికీ కొనసాగింపుగా, ఇటీవల 1,082 మంది కెనడా మనస్తత్వశాస్త్ర విద్యార్థులతో నీల్సన్, డెనాల్ట్, పావెల్ పరిశోధకులు ఆన్‌లైన్ సర్వే నిర్వహించారు. ఆ విద్యార్థుల ఆహార అలవాట్లు, ఆరోగ్యం ఎలా ఉంటున్నదీ, సరిగానే నిద్ర పోతున్నారా, ఎలాంటి కలలు వస్తుంటాయి అనే ప్రశ్నలు అడిగారు. ఆహారం, పడని ఆహారం కలలను ఎలా ప్రభావితం చేస్తోందన్నది కనిపెట్టటమే వారి లక్ష్యం. ఆ ప్రయత్నంలో పీడ కలలు రావటం పైన కూడా ఆహారం ప్రభావం ఉన్నట్లు వారు గుర్తించారు!

ఆహారానికీ–పీడ కలలకు సంబంధం!

- లాక్టోస్, గ్లూటెన్ పడకుంటే నిద్రలేమి
- పేగుల నుంచి మెదడుకు బ్యాడ్ సిగ్నల్స్
- ఫైబర్, లీన్ ప్రొటీన్‌లతో కలల విరుగుడు
- నీల్సన్, డెనాల్ట్, పావెల్ అధ్యయనం



తాజా అధ్యయన ఫలితాలు

- ఫుడ్ అలర్జీలు; గోధుమ, బార్లీలో ఉండే గ్లూటెన్ పడని వారికి పీడకలలు వస్తున్నాయి.
- ఆహారంలోని లాక్టోస్ పడని వారికి నిద్రలేమి ఉంటోంది.
- కడుపు నొప్పి, ఉబ్బరం వంటి జీర్ణాశయ ఇబ్బందులలో కూడా లాక్టోస్ పాత్ర ఉంటోంది.
- గట్ మైక్రోబయోమ్ (పెద్ద పేగులో ఉండే బ్యాక్టీరియాలోని సంక్లిష్ట వ్యవస్థ), కేంద్ర నాడీ వ్యవస్థ మధ్య సంబంధం ఉంది.
- పేగుల్లోని ఇబ్బంది నిద్రలో పీడ కలలకు దారితీస్తోంది.
- 'పోస్ట్–ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్' ప్రభావంగా కనిపించే పీడ కలలకు, ఆహారానికి లంకె కనిపించింది.
- కొన్ని ఆహారాలు కలలపై ఎంతవరకు ప్రభావం చూపుతాయో పరీక్షించడానికి మరిన్ని అధ్యయనాలు అవసరం.

తదుపరి అధ్యయనాలు

లాక్టోస్ ఉన్న జున్ను, లాక్టోస్ లేని జున్ను వంటి కొన్ని ఆహారాలను తిన్నప్పుడు ఏమి జరుగుతుందో పరీక్షించడం.	లాక్టోస్ పడని వారు, తరచుగా పీడకలలు వచ్చేవారు, వివిధ రకాల ఫుడ్ అలర్జీలు ఉన్న వారిని మరింత లోతుగా పరిశీలించడం.

విరుగుడు ఉపాయాలు

పీడకలల్ని నిరోధించటానికి అధ్యయనవేత్తలు కొన్ని సూచనలు ఇస్తున్నారు. అవి :

- రాత్రి ఆలస్యంగా తినకండి.
- తియ్యగా, కారంగా ఉండే ఆహారాలు భారీగా తీసుకోకండి.
- లాక్టోస్ పడకపోతే, పడుకునే ముందు పాల ఉత్పత్తులను తీసుకోకండి. లాక్టోస్ లేని ఆహారాన్ని భుజించండి.
- గట్టిగా ఉన్న, ఎక్కువ కాలం నిల్వ ఉన్న జున్నులో.. మృదువైన, తాజా జున్నులో కంటే లాక్టోస్ తక్కువగా ఉంటుంది.
- మీకు ఫుడ్ అలర్జీలు ఉంటే, పడుకునే ముందు అటువంటి ఆహారాలను తీసుకోవడం తగ్గించండి.
- మీ నిద్రను లేదా కలల నాణ్యతను ప్రభావితం చేసే ఆహార పదార్థాలేవో మీకు మీరే గుర్తించండి.
- నిజంగా అవి మీ నిద్రను లేదా మీ కలల నాణ్యతను ప్రభావితం చేస్తాయో లేదో చూడటానికి వాటిని అప్పుడప్పుడు తినకుండా, ఏం జరుగుతుందో గమనించండి.
- ఫైబర్ ఉన్న పండ్లు, కూరగాయలు, లీన్ ప్రొటీన్లతో కూడిన (కొవ్వులు, కేలరీలు తక్కువగా ఉండేవి) పోషకాలు అధికంగా ఉండే సమతుల ఆహారం తీసుకోండి. చక్కగా నిద్రపడుతుంది.

ప్రధాన అధ్యయనాలు

బ్రిటిష్ చీజ్ బోర్డ్ (2005)	నీల్సన్, పావెల్ (2015)
అబ్దుల్ రజాక్ ఎట్ ఆల్ (2021)	నీల్సన్, డెనాల్ట్, పావెల్ (2025)

మైనార్టీ గురుకులంలో ఏసీబీ అధికారుల తనిఖీ



తనిఖీలు చేస్తున్న అధికారులు

కొణిజర్ల: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అమ్మపాలెం లోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం ఏసీబీ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఏసీబీ ఖమ్మం డీఎస్పీ వై.రమేశ్ నేతృత్వంలో ఫుడ్‌సేఫ్టీ, తూనికలు–కొలతలు, శానిటేషన్, ఆడిట్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఉదయం 6.30 గంటలకే పాఠశాలకు చేరుకుని డార్మెటరీలు, తరగతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణ, వంట షెడ్డు, సామగ్రిని పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉందా? లేదా అని తూకం వేసి నిర్ధారించుకున్నారు. పాఠశాలలో సౌకర్యాలు, బోధన, భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తమకు కాస్మెటిక్ చార్జీలు ఇవ్వడం లేదని, ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం లేదని, ఇంటర్ విద్యార్థులకు భోజనం సరిపోనందున కోటా పెంచాలని, సాయంత్రం 6 గంటలకే భోజనం పెడుతుండటంతో అర్ధరాత్రి ఆకలితో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. రమేశ్ మాట్లాడుతూ తరగతి గదులు, ఆవరణలో పారిశుద్ధ్యం లోపాన్ని గుర్తించామని, మరుగుదొడ్లను శుభ్రం చేయడం లేదని, రికార్డుల నిర్వహణ సరిగా లేదని గుర్తించామని చెప్పారు. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. తనిఖీల్లో వివిధ శాఖల అధికారులు శేఖర్, లోకేశ్, షేక్ బాబు, బి.ప్రవీణ్‌కుమార్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

రీడెప్లాయ్‌డ్ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పింఛన్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని రీడెప్లాయ్‌డ్ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి తమ డిమాండ్‌ను తెలియజేయాలని శనివారం ఒక ప్రకటనలో ఈశ్వర్ కోరారు. రాష్ట్రంలోని ప్రతి సీపీఎస్ ఉద్యోగి ఈ కార్యక్రమానికి వచ్చి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసేలా ఒత్తిడి తేవాలని విన్నవించారు.

ఉర్దూ జర్నలిస్టుల నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణా తరగతులు

ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దన్

సాక్షి, హైదరాబాద్: ఉర్దూ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి 100 కంప్యూటర్లు సమకూర్చడానికి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంగీకరించారని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దన్ తెలిపారు. శనివారం తెలంగాణ మీడియా అకాడమీలో ఉర్దూ జర్నలిస్టుల పునఃచరణ తరగతుల ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జర్నలిస్టులు, ఉర్దూ జర్నలిస్టుల నైపుణ్యాన్ని పెంచే విధంగా ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని ఉర్దూ జర్నలిస్టుల కోసం ఉర్దూ అకాడమీ ద్వారా సహాయం చేయడానికి తనవంతు కృషి చేస్తానని తాహెర్ హామీ ఇచ్చారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాతృభాషకు తగినంత ప్రేరణ, ఆదరణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ జర్నలిస్ట్ మాజీద్, మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఎదుట మావోయిస్టుల లొంగుబాటు

వెంకటాపురం(ఎం): మావోయిస్టు పార్టీకి చెందిన ఏడుగురు సభ్యులు శనివారం ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఎదుట లొంగిపోయారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన లొంగిపోయినవారి వివరాలు వెల్లడించారు. 'పోరు కన్న.. ఊరు మిన్న'అనే నినాదంతో తమ శాఖ అవగాహన కల్పిస్తుండటంతో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఏడుగురు సీనియర్ మావోయిస్టు సభ్యులు తోటి ఉంగి అలియాస్ రాజే, కొడ్మె సుక్కు, సోడి భీమ అలియాస్ దీప, కుంజం వరలక్ష్మి అలియాస్ రోజా, పొడ్డం జోగ, కొర్స పాయికీ, సోడి ఆదమ్మలు లొంగిపోయినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఒకరు ఏరియా కమిటీ సభ్యుడుకాగా, ముగ్గురు పార్టీ సభ్యులు, ఒకరు ఆర్‌పీసీ అధ్యక్షుడు, ఒకరు మిలిషియా సభ్యుడు, మరొకరు చైతన్య నాట్యమండలి సభ్యురాలు ఉన్నట్లు తెలిపారు. లొంగిపోయిన ఏడుగురు మావోయిస్టులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున తక్షణ సహాయం అందించామన్నారు. మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు.



వీకెండ్ రష్

బడా గణేశుడ్ని దర్శించుకునేందుకు శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఖైరతాబాద్ వైపు వచ్చే రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. కిలోమీటర్ల మేర క్యూలైన్ కన్పించింది. వీకెండ్ కావడంతో అధిక సంఖ్యలో జనం ఖైరతాబాద్ గణేశుడ్ని దర్శించుకున్నారు. ఈ కారణంగా మెట్రో రైళ్లు, సిటీబస్సులు కిటకిటలాడాయి. ఇక భక్తులకు దర్శనం కల్పించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– సాక్షి, హైదరాబాద్



క్లుప్తంగా...

ఉద్యోగుల సప్లిమెంటరీ, జీపీఎఫ్ బిల్లులకు మోక్షం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులకు సంబంధించి రూ.392 కోట్లు, అలాగే సెప్టెంబర్ 2024 వరకు ఉన్న రూ.308 కోట్ల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం క్లియర్ చేసింది. తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ)కి ఇచ్చిన హామీ మేరకు ఈ బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసిందని టీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదేవిధంగా మిగిలిన చెల్లింపులు కూడా వేగవంతంగా చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.30 కోట్లు

ఉత్తర్వులు విడుదల చేసిన ప్రణాళిక శాఖ



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా)కి రూ.30 కోట్లు మంజూరయ్యాయి. కొడంగల్ అసెంబ్లీ పరిధిలోని నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో అభివృద్ధి పథకాల కింద ఖర్చు చేసేందుకు కాడా చైర్మన్, వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ ప్రణాళిక శాఖ కార్యదర్శి (అదనపు బాధ్యతలు) జ్యోతిబుద్ధ ప్రకాశ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

సీపీజీఈటీ-25లో స్పోర్ట్స్ కోటా అమలు చేయాలి

టీజీసీహెచ్ఈకి ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ వినతి

సాక్షి, హైదరాబాద్: సీపీజీఈటీ–2025 ప్రవేశాల్లో స్పోర్ట్స్ కోటా అమలు చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్(పీఎస్‌యూ) కోరింది. ఈమేరకు శనివారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సెక్రటరీ శ్రీరాం వెంకటేశ్‌ను పీఎస్‌యూ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. ఉస్మానియా యూనివర్సిటీ, కేయూ, టీయూ, పాలమూరు వర్సిటీ, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) నాన్ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే అడ్మిషన్ ప్రక్రియలో స్పోర్ట్స్ క్రీడాకారులకు ప్రత్యేక కోటా అమలు చేయకపోవడంతో ఆయా కేటగిరీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, వెంటనే స్పోర్ట్స్ కోటా అమలు చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్, ఓయూ నాయకులు శ్రీధర్ యాదవ్, సంతోష్ కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుట్రపూరితంగా ప్రొఫెషనల్ కోర్సులకు మాత్రమే స్పోర్ట్స్ కోటా అమలు చేసే విధంగా జీవో రూపొందించారని, నాన్ ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు.

అక్షర దీపాలు.. ఆరని మంటలు

దండకారణ్యంలో 16 ఏళ్ల తర్వాత తెరుచుకున్న బడులు

- గిరిజన బాలల బోధనకు శిక్షాదూత్‌ల నియామకం
- వారిని ఇన్‌ఫార్మర్లుగా అనుమానిస్తున్న మావోయిస్టులు
- ఇప్పటికే నక్సలైట్ల చేతిలో పది మందికిపైగా హతం



ఆగస్టు 15న కాంకేర్ జిల్లా బీణగుండాలోని అమరవీరుల స్తూపంపై జాతీయ జెండా ఎగురవేస్తున్న మనేశ్ నరేటి (ఆ తర్వాత రెండు రోజులకు ఈయన మావోల చేతిలో హత్యకు గురయ్యాడు)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: నక్సలైట్ ఉద్యమం, దానిని అణచివేసేందుకు ప్రభుత్వ బలప్రయోగంతో కొన్నేళ్లుగా కల్లోలంగా మారిన ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో పదహారేళ్ల తర్వాత మళ్లీ అక్షర కాంతులు పరుచుకుంటున్నాయి. ఏనాడో మూతబడిన పాఠశాలలు ఇటీవల తిరిగి తెరుచుకుంటున్నాయి. దట్టమైన అడవుల్లో నివసించే గిరిజనుల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా శిక్షాదూత్ పేరుతో టీచర్లను నియమించింది. నక్సల్స్‌ను అణచివేసేందుకు 2005లో సల్వాజుడుం పేరుతో ప్రత్యేక సాయుధ దళాలను ఏర్పాటుచేశారు. సల్వాజుడుం దళాలు అంగన్‌వాడీలు, ప్రభుత్వ బడుల్లోనే క్యాంపులు ఏర్పాటు చేసుకోవటంతో బస్తర్ ప్రాంతంలో వేలాది స్కూళ్లను మావోయిస్టులు పేల్చివేశారు. అయితే, 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్) మొదలైన తర్వాత మావోయిస్టులు వెనక్కి తగ్గటంతో మూతబడిన స్కూళ్లను భద్రతా దళాలు తిరిగి తెరిపిస్తున్నాయి. ఈ స్కూళ్లలో బోధన కోసం స్థానిక యువతకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అవకాశం కల్పించింది. పది, ఇంటర్ చదివిన యువతకు గౌరవ వేతనం చెల్లిస్తూ శిక్షాదూత్‌ల పేరుతో నియమించింది.

వరుస హత్యలు

శిక్షాదూత్‌లను పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా మావోయిస్టులు అనుమానిస్తున్నారు. కాంకేర్ జిల్లా బీణగుండా పాఠశాలలో శిక్షాదూత్‌గా పనిచేస్తున్న మనేశ్ నరేటి ని ఈ నెల 17న హత్య చేశారు. 29న సుక్మా జిల్లా సిల్‌గేర్‌లో లక్ష్మణ్ బార్సే అనే మరో శిక్షాదూత్‌ను గొడ్డళ్లతో నరికి చంపారు. ఆ మరుసటి రోజే బీజాపూర్ జిల్లా గంగలూర్ ఏరియాలో నెంద్ర పాఠశాల శిక్షాదూత్ కల్లు తాటి మావోయిస్టుల చేతిలో హతమయ్యాడు. శుక్రవారం సాయంత్రం మావోయిస్టులు కల్లు తాటి (30)తోపాటు మరొక శిక్షాదూత్‌ను కిడ్నాప్ చేశారు. కల్లు తాటిని ఉరితీసి హత్య చేయగా, మరొకరిని వారి అదుపులోనే ఉంచుకున్నారు. ఇప్పటివరకు బస్తర్‌లోని ఏడు జిల్లాల పరిధిలో హత్యకు గురైన శిక్షాదూత్‌ల సంఖ్య పదికి చేరింది. వీరిలో బీజాపూర్ జిల్లాలో ఐదుగురు, సుక్మా జిల్లాలో నలుగురు ఉన్నారు. ఇప్పటికే మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో చనిపోతున్న భద్రతా దళాల్లో స్థానిక ఆదివాసీ యువకులతో కూడిన డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) జవాన్లే ఎక్కువగా ఉంటున్నారు. దీనికి తోడు శిక్షాదూత్ పేరుతో మరోసారి ఆదివాసీ యువతనే సమిధలుగా మారుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు చంపిన వారి సంఖ్య 33కు చేరగా.. ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పటి నుంచి 72 మంది గిరిజనులు హత్యకు గురయ్యారు.

ఆధారాలున్నా.. ఆరాలకే పరిమితం

సివిల్ సెటిల్‌మెంట్లలో కొందరు ఐపీఎస్‌లు

- ఎంపీ, ఎమ్మెల్యే అవుతానంటూ ఓ ఐపీఎస్ ప్రకటన
- నిఘా విభాగం దర్యాప్తులో అవినీతిపై పక్కా ఆధారాలు?
- లాబీయింగ్‌లతో చర్యలు తీసుకోవడంలో సందిగ్ధంలో ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: 'గతంలో ప్రజాప్రతినిధులు ఏదైనా అంశం ప్రస్తావిస్తే.. అధికారులు అందులోని లోటుపాట్లను విశ్లేషించేవారు. ఇప్పుడు ఒక తప్పు చేద్దామంటే మూడు చేద్దామనే అధికారులను చూస్తున్నాం. కొత్తగా ఎంపికైన ఐపీఎస్‌లలో కొందరు శిక్షణలో ఉండగానే యూనిఫామ్ వేసుకుని ప్రైవేటు పంచాయితీలు చేస్తున్నారు. ఈ ధోరణి సమాజానికి మంచిది కాదు'.. విశ్రాంత ఐఏఎస్ గోపాలక్రిష్ణ నాయుడి స్వీయచరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. ఆయన మాటలు అక్షర సత్యాలని నిరూపిస్తున్నారు కొందరు ఐపీఎస్ అధికారులు. దందాలు, సెటిల్‌మెంట్లతో చెలరేగిపోతున్నారన్న ఆరోపణలు వచ్చినా.. వారి అక్రమార్జనకు సంబంధించిన ఆధారాలు లభించినా డోంట్‌కేర్ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. జీహెచ్ఎంసీలోని కమిషనరేట్ల పరిధిలో ఉన్న 'కీలక' డీసీపీల అవినీతిపై మీడియాలో ఇటీవల వరుస కథనాలు వచ్చాయి. ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలున్న కొందరు నేతలతో కలిసి ముగ్గురు డీసీపీలు ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించినట్టు వచ్చిన కథనాలు సంచలనం సృష్టించాయి. ఆ ముగ్గురు డీసీపీలలో ఒకరు గతంలో ఒక మాఫియా డాన్ కేసులో సస్పెండ్ అయిన అధికారి కాగా..మరో ఇద్దరు గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేసి, ప్రస్తుతం గ్రేటర్ సౌత్‌లోని ఆయా జోన్లలో యూనిట్ అధికారులుగా కొనసాగుతున్నారు. ఆరోపణలు వచ్చిన ఐపీఎస్‌లలో ఎక్కువమంది ఒకే కీలక కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్నవారు కావడం గమనార్హం. తాజాగా అదే కమిషనరేట్ పరిధిలో పనిచేసే మరో 'ప్రత్యేక' డీసీపీ తాను త్వరలోనే ఎంపీ లేదా ఎమ్మెల్యే కాబోతున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారన్న వార్త పోలీస్‌శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇలాంటి అధికారుల అవినీతిపై నిఘా విభాగం ఆరా తీసి ఆధారాలతో నివేదికలు రూపొందిస్తోంది. అయితే అలాంటి వారిపై చర్యలు ఉండట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అవినీతికి లాబీయింగ్ రక్షణ

పోలీస్ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చిన్న తప్పుచేసినా అధికారులు వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. ఐపీఎస్‌ల విషయంలో మాత్రమే మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో యూనిట్ ఆఫీసర్లుగా తమ జోన్లలో అవినీతిని అరికట్టాల్సినవారే కంచే చేను మేసింది అన్నట్లుగా అక్రమార్జనకు తెగబడుతున్నారు. వారివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నా, వారి 'బ్యాక్‌గ్రౌండ్' కారణంగా చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉంటోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు అవినీతి ఐపీఎస్‌లు స్థానిక నాయకుల నుంచి ఢిల్లీ స్థాయిలో కీలక నేతల వరకు మంచి సంబంధాలు పెట్టుకుని పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నట్టు వినికిడి. దీంతో వారిపై కనీసం బదిలీ వేటు వేసేందుకు కూడా ప్రభుత్వం వెనుకడుగు వేసే పరిస్థితి నెలకొందని పోలీస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనూ ఇదే తరహాలో కొందరు ఐపీఎస్‌ల అవినీతిపై ఆధారాలు లభించడంతో ప్రభుత్వం వారిని బదిలీ చేసింది. ఆ తర్వాత అంతా సెట్‌రైట్ అయ్యింది. అయితే, ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్‌ల విషయంలో ఎందుకు తాత్సారం జరుగుతోందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నిఘా నివేదికల ఆధారంగా వారిపై బదిలీ వేటు వేసి అప్రాధాన్య పోస్టులకు పంపుతారా లేదా? అనే చర్చ పోలీస్ వర్గాల్లో జోరుగా నడుస్తోంది.

సబ్యసాచి ఘోష్‌కు సంక్షేమ శాఖలు

- గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉంటూనే ఇతర శాఖల సమన్వయం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంక్షేమ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌ను నియమించారు. 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సబ్యసాచి ఘోష్‌ను గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించడం తోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ఈ శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ వ్యూహాత్మక కార్యాచరణ సిద్ధంచేసే బాధ్యతను అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి, కమిషనర్‌గా పనిచేస్తున్న అలగు వర్షిణి కేంద్ర సర్వీసులకు ఎంపికకావడంతో ఆమె శనివారం రిలీవ్ అయ్యారు. దీంతో ఆ బాధ్యతలను సబ్యసాచిఘోష్‌కు అప్పగించారు. సంక్షేమ శాఖలకు పాలనాపరమైన నిర్దేశం చేయడంతోపాటు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను అమలు చేయాలని సబ్యసాచి ఘోష్‌ను ప్రభుత్వం ఆదేశించింది. సమీక్షలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని సూచించింది. కాగా, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా పనిచేసిన అలగు వర్షిణి స్థానంలో ఇంటర్ బోర్డు సంచాలకులు కృష్ణ ఆదిత్యకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు శనివారం రాత్రి వరకు వెలువడలేదు.



ప్రతి ప్రయత్నమునకును ప్రతి క్రియకును తగిన సమయ మున్నదనియు,
నీతిమంతులకును దుర్మార్గులకును దేవుడే తీర్పు తీర్చుననియు
నా హృదయములో నేననుకొంటిని.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.అష్టమి రా.9.39 వరకు తదుపరి నవమి, **నక్షత్రం:** అనూరాధ ప.3.42 వరకు తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.9.50 నుండి 11.33 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.32 నుండి 5.24 వరకు, **అమృత ఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మమతా బెనర్జీ (ప.బెం. సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

నూట నలభై తొమ్మిది పుస్తకాలు రాశాక కూడా, ఇవాళ రాయటం మొదలు పెట్టిన కొత్త పుస్తకానికి ప్రారంభ వాక్యం కుదరటం లేదు! నెహ్రూ నుంచి ముందుకు రావటమా, లేక నరేంద్ర మోదీ నుంచి వెనక్కు వెళ్లటమా?

భారత ప్రధానుల మీద నేను తలపెట్టిన మహాకావ్య యజ్ఞమిది. జనవరి 22 నుండి కోల్‌కతా బుక్ ఫెయిర్. ఆ లోగా నా బుక్ బయటికి వచ్చేయాలంటే ప్రారంభ వాక్యం ఏమిటన్నది చూసుకోకూడదు.

నిజానికి, తొలి వాక్యానికి ఇంత యోచన అక్కర్లేదు. బెంగాల్ నుంచి ఒక్క ప్రధానీ లేరు కనుక బెంగాల్‌ను అమితంగా ఇష్టపడిన నెహ్రూజీతో నా పుస్తకాన్ని మొదలు పెట్టొచ్చు.

నెహ్రూ పొద్దస్తమానం ఇక్కడికి వచ్చి వెళుతుండేవారు. కవులతో, కళాకారులతో ముచ్చట్లు పెట్టేవారు. టాగూర్, సుభాష్ చంద్రబోస్‌లతో క్లోజ్‌గా ఉండేవారు. నేనూ ఆ కాలం నాటి రచయిత్రిని అయుంటే... బహుశా నెహ్రూకూ, నాకూ మధ్య కూడా స్నేహం ఏర్పడి ఉండేదా! నా పెదవులపై చిరునవ్వు.



నెహ్రూ తర్వాత, నాలో మెదిలిన వారు శ్రీమతి గాంధీ. ఇక్కడే శాంతి నికేతన్‌లో ఆమె చదువుకున్నారు. నెహ్రూకి, శ్రీమతి గాంధీకి మధ్యలో ప్రధానిగా ఉన్న శాస్త్రీజీతో కూడా పుస్తకం మొదలు పెట్టొచ్చు. బోస్ మరణం లాగే, శాస్త్రీజీ మరణం కూడా ఒక మిస్టరీ! లేదంటే, నెహ్రూకీ–శాస్త్రీజీకీ మధ్యలో, శాస్త్రీజీకీ–శ్రీమతి గాంధీకీ మధ్యలో ప్రధానిగా ఉన్న నందాజీని తీసుకోవచ్చు. కానీ ఆయన బెంగాల్‌తో అస్సలు కనెక్ట్ అయి లేరు.

మొరార్జీ దేశాయ్ ఒకసారి ఇక్కడికి వచ్చి గంగలో మునకలేసి వెళ్లారు. చరణ్ సింగ్ అసలు కలకత్తాకే వచ్చినట్లు లేరు! వీపీ సింగ్, అప్పటి బెంగాల్ సీఎంతో మాట్లాడటానికి వచ్చారు. చంద్రశేఖర్ ఒక ఇండస్ట్రియలిస్టును కలిసేందుకు కలకత్తా వచ్చి వెళ్లినట్లున్నారు. దేవెగౌడ కూడా కలకత్తా వచ్చారు. పొలిటికల్‌గా నాకు సపోర్టు ఇచ్చారు. ఐ.కె. గుజ్రాల్ సైన్స్ సిటీని ప్రారంభించి వెళ్లారు.

అసలింత ఆలోచన లేకుండా నేరుగా రాజీవ్ గాంధీతో ప్రారంభ వాక్యాన్ని మొదలు పెట్టొచ్చు. నేను కలిసిన తొలి ప్రధాని ఆయన. నన్ను తన సిస్టర్‌లా చూసుకున్నారు. కెరీర్‌లో నాకు లిఫ్ట్ ఇచ్చారు.

పీవీని, వాజ్‌పేయిని, మన్మోహన్‌ని కూడా నేను కలిశాను కానీ, పీవీజీ ఎప్పుడైనా కలకత్తా వచ్చారేమో నాకు గుర్తు లేదు. అటల్‌జీ కలకత్తాలో మా ఇంటికి కూడా వచ్చారు. మన్మోహన్ కలకత్తా వచ్చి నా కోసం ఎన్నికల ప్రచారం చేశారు. తొలిసారి నన్ను సీఎంను చేసిన ఎన్నికలవి! ఇక మోదీజీ అయితే ఉదయం లేస్తూనే ఇప్పుడు బెంగాల్‌లో ఉంటున్నారు. మార్చిలో అసెంబ్లీ ఎన్నికలు!

ఇంతమంది దిగ్గజాలలో ఎవరితో పుస్తకం మొదలు పెట్టాలో నిర్ణయించుకుంటే బహుశా ఆ వెనకే ప్రారంభ వాక్యం రావచ్చా అని ఆలోచిస్తూ ఉన్నాను.

"శుభేచ్ఛా పీసీ" అంటూ లోపలికి వచ్చాడు అభిషేక్. తను నా అన్న కొడుకు.

"రా, భిపో... వచ్చి కూర్చో" అని దగ్గరకు పిలిచాను. కూర్చున్నాక, "పుస్తకం ఎవరితో మొదలు పెడితే బాగుంటుంది?" అని అడిగాను. ప్రధానుల మీద నేను పుస్తకం రాయబోతున్నట్లు అభిషేక్‌కి తెలుసు.

కాసేపు దీర్ఘంగా ఆలోచించి, "అయినా పీసీ, ప్రధాన మంత్రుల మీద పుస్తకాన్ని ప్రధాన మంత్రులతోనే ఎందుకు ప్రారంభించాలి? ప్రధానిగా అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయాన్ని గౌరవించి, ఆ అవకాశాన్ని వదులుకున్న వారితో మొదలు పెట్టొచ్చు కదా?" అన్నాడు!

క్షణం తర్వాత గానీ, అభిషేక్ ఎవరి గురించి చెబుతున్నాడో నాకు అర్థం కాలేదు. అర్థమయ్యాక, "ఎక్సలెంట్, భిపో" అని మెచ్చుకోలుగా తన వైపు చూశాను.

బెంగాల్‌కు 23 ఏళ్లు సీఎంగా ఉన్న జ్యోతి బసు ప్రధాని కాలేకపోవచ్చు. బెంగాల్‌లో ఆయన నా రాజకీయ ప్రత్యర్థి అయితే కావచ్చు. కానీ, నేను రాయబోయే ప్రధానుల పుస్తకానికి నిండుదనాన్నయితే తేగలిగినవారే!

ఏనుగుపై తొడగొట్టిన ఎలుక!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



భారత్, అమెరికా దేశాల మధ్య సంబంధాలు క్రమంగా క్షీణిస్తున్న దశ అనూహ్యంగా మొదలైంది. ఏనుగు కుంభస్థలంపై ఎలుక పిల్ల ఓ మొట్టికాయ వేసిందట! రెండు దేశాలను ఉద్దేశించి ఓ ఆర్థిక నిపుణుడు చేసిన వ్యాఖ్యానం ఇది. అయితే ఇందులో ఏనుగెవరు? ఎలుకెవరు? గత పాతికేళ్లుగా డాలర్ డ్రీమ్స్‌ను పలవరిస్తూ వస్తున్న మన మిడిల్ క్లాస్ కుటుంబ రావులు ఈ ప్రశ్నకు ఠకీమని సమాధానం చెప్పగలరు. అపారమైన ఆర్థిక – సైనిక బలం, అగ్రరాజ్య హోదా ఉన్న అమెరికా ఎలుకెట్లా అవుతుంది? లక్షల సంఖ్యలో మన వంశోద్ధారకుల్ని కూడా ఉద్ధరిస్తున్న అమెరికా దేశం ఏనుగు కాకుండా ఎలుకవుతుందా అనే సందేహం వారికి ఉంటుంది. మరి నూటా నలభై కోట్ల జనాభా, అందులో 90 కోట్ల మంది యువత ఉన్న భారత దేశాన్ని కూడా ఎలుకతో పోల్చడం సాధ్యంకాదు కదా!

వాణిజ్య ట్యారిఫ్‌లను ఆయుధాలుగా మార్చుకొని కొంత కాలంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కవ్వింపు చర్యలకు పాల్పడటం, తదనంతర ప్రపంచ పరిణామాల నేపథ్యంలో రిచర్డ్ ఓల్ఫ్ అనే అమెరికన్ ఆర్థికవేత్త చేసిన విశ్లేషణ సంచలనంగా మారింది. భారతదేశంపై ట్రంప్ చేసిన 50 శాతం సుంకాల 'యుద్ధ ప్రకటన'పై ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆయన ఈ వ్యాఖ్యానాన్ని విస్తారమైన అర్థంలో చేశారనుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా కలిగే దీని పర్యవసానాలను దృష్టిలో పెట్టుకొని ఏనుగుపై ఎలుక మొట్టికాయ వేసినట్లేనని అన్నారు. ప్రపంచ జనాభాలో నాలుగున్నర శాతం లేని దేశం 95 శాతం ప్రజలను ఆజ్ఞాపించాలని చూసే పెత్తందారీతనం బెడిసి కొడుతుందని ఆయన జోస్యం చెప్పారు.

అమెరికా ట్యారిఫ్ కొరడా ప్రయోగం భారత్‌పై ప్రభావం చూపబోదని దాని అర్థం కాదు. తక్షణ ఫలితంగా భారత్ ఇబ్బందికర పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. మొత్తం అంతర్జాతీయ వాణిజ్యంలో 90 బిలియన్ డాలర్ల పైచిలుకు లోటును భారత్ ఎదుర్కొంటున్నది. ఈ లోటులో సింహభాగం చైనా వాణిజ్యంలోనే! 'మేకిన్ ఇండియా' సత్ఫలితాలిస్తే తప్ప ఈ లోటును అధిగమించడం సాధ్యం కాదు. ఒక్క అమెరికా వాణిజ్యంలోనే భారత్ మిగులు భాగస్వామిగా ఉంటున్నది. అమెరికాకు 87 బిలియన్ డాలర్ల సరుకుల్ని ఎగుమతి చేస్తున్న మన దేశం అక్కడి నుంచి 45 బిలియన్ డాలర్ల కిమ్మత్తు చేసే సరుకుల్ని దిగుమతి చేసుకుంటున్నది. 50 శాతం ట్యారిఫ్ ప్రభావం 70 శాతం వ్యాపారంపై పడుతుందని, ఫలితంగా వెనువెంటనే 20 బిలియన్ డాలర్ల మేరకు నష్టపోతామని ఎగుమతిదార్ల సంస్థలు చెబుతున్నాయి. వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోతారు. తిరుపూర్, నోయిడా, సూరత్ వంటి పట్టణాల్లో అప్పుడే ఉద్యోగాల కోత, ఫ్యాక్టరీల మూత మొదలైంది.

అమెరికా కొరడా ఝుళిపిస్తుంటే భారత్ చేతులు ముడుచుకొని కూర్చుంటుందా? కూర్చోలేదు కూడా! ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పటివరకూ భారత నాయకత్వం పరిణతితో, ప్రాప్తకాలజ్ఞతతో వ్యవహరించిందనే చెప్పాలి. భారత్ – పాక్‌ల మధ్య ఏర్పడిన తీవ్ర ఉద్రిక్తతల సందర్భాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. యుద్ధం మొదలుకావడం, రెండు రోజుల్లోనే పాక్‌ను భారత్ దారుణంగా దెబ్బతీయడం, ఆ వెనువెంటనే కాల్పుల విరమణ ప్రకటన రావడం జరిగింది. భారత్ – పాక్‌లు ప్రకటించకముందే తన వల్లనే యుద్ధం ఆగిపోయిందని ట్రంప్ ప్రకటించుకున్నారు. దీన్ని భారత్ అధికారికంగా ఖండించలేదు. ట్రంప్‌కు మోదీ భయపడ్డారని, ఆయన ఆదేశించగానే కాల్పుల విరమణ అమలు చేశారనే ప్రచారం జరిగింది. చాలా మంది నమ్మారు. తదనంతర పరిణామాలను గమనిస్తే అప్పటి అభిప్రాయం కేవలం అపోహ మాత్రమే కావచ్చనిపిస్తున్నది. గతంలో విధించిన 25 శాతం ట్యారిఫ్‌కు అదనంగా మరో 25 శాతం విధించడానికి కారణం తాము ఆంక్షలు విధించిన రష్యా నుంచి భారీఎత్తున చమురు కొనుగోలు చేయడమేనని ఇప్పుడు అమెరికా చెబుతున్నది. అసలు కారణం అది కాదన్న సంగతి అందరికీ తెలుసు.

అమెరికాలోని వ్యవసాయ, పాల ఉత్పత్తి రంగాలను చిరకాలంగా భారత మార్కెట్ ఊరిస్తున్నది. అవి భారత్‌లో ప్రవేశించగలిగితే ఇబ్బడిముబ్బడిగా అమెరికా విత్తన కంపెనీలు, పాల ఉత్పత్తుల కంపెనీలు లాభాలు పోగేసుకోగలుగుతాయి. జన్యుమార్పిడి పంటలైన సోయాబీన్, మొక్కజొన్నలను దిగుమతి చేసుకోవాలని అమెరికా భారత్‌ను డిమాండ్ చేస్తున్నది. వ్యవసాయ రంగాన్ని పరాధీనం చేయగలిగే జీఎమ్ పంటలను ఒక విధానంగా భారత ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. అట్లానే పాల ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని అమెరికా షరతు పెట్టింది. ఈ షరతు అంగీకరిస్తే దేశవాళీ పాడి పరిశ్రమ లక్ష కోట్లకు పైగా నష్టపోతుందని ఒక అంచనా. పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న దేశం పాల ఉత్పత్తులను చౌక సుంకాలకు దిగుమతి చేసుకోవడం ఏమిటి? ఇప్పటికీ 40 శాతం మంది ప్రజలు వ్యవసాయ ఆధారిత రంగాలపై ఆధారపడిన దేశం విషతుల్యమైన జీఎమ్ పంటలను దిగుమతి చేసుకోవలసిన అవసరమేమిటి? ట్రంప్ సర్కార్ కోరిన ఈ హిరణ్యాక్ష వరాలకు భారత్ తలాడించలేదు.

ఆయన నోబెల్ బహుమతి పిచ్చికి భారత ప్రభుత్వం సహకరించలేదన్న దుగ్ధ కూడా అమెరికా అధ్యక్షుడిని వేధిస్తున్నదట! ట్రంప్ మధ్యవర్తిత్వం వల్లనే కాల్పుల విరమణకు ఒప్పుకున్నామని భారత్ ఒక మాట అధికారికంగా చెబితే తనకు నోబెల్ శాంతి బహుమతి దక్కుతుందని ట్రంప్ ఆశ. భారత్ – పాక్ వ్యవహారాల్లో మూడో దేశం జోక్యాన్ని చాలాకాలంగా భారత్ అంగీకరించడం లేదు. ఒక దేశాధినేత నోబెల్ పిచ్చిని తీర్చడం కోసం తన దేశ సార్వభౌమాధికారంతో రాజీపడడానికి భారత్ అంగీకరించలేదు. ఇటువంటి రాజీ పట్ల పాక్‌కు ఎటువంటి అభ్యంతరమూ లేదు. ట్రంప్ కోరుకుంటున్న ప్రకటనను పాక్ మిలిటరీ చీఫ్ అసీఫ్ మునీర్ చేశారు. దాంతో మునీర్‌ను పొగడ్తల్లో ముంచడమే గాక ఆయన్ను వైట్‌హౌస్‌లో భోజనానికి ప్రత్యేకంగా ట్రంప్ ఆహ్వానించారు.

ఏకధ్రువ ప్రపంచం నుండి బహుధ్రువ ప్రపంచం వైపు మానవాళి అడుగులు వేస్తున్న కీలకమైన మలుపులో భారతదేశం తన ప్రయోజనాల కోసం అనుసరించవలసిన విదేశీ విధానంపై కేంద్ర సర్కార్‌కు ఇప్పటికే ఒక స్పష్టత ఉన్నది. అంతర్జాతీయ సంబంధాల్లో సిద్ధాంతాల పాత్ర ప్రచ్ఛన్న యుద్ధంతోపాటే కరిగిపోయింది. భౌగోళిక రాజకీయ అవరోధాలున్న సందర్భాల్లోనూ ఉభయతారకంగా నెగ్గుకురావడానికి అవసరమైన వ్యూహాలకు మన విదేశాంగ విధానం పెద్దపీట వేస్తున్నది. విదేశాంగ మంత్రిగా ఉన్న జైశంకర్ దీర్ఘకాలం పాటు దౌత్యవేత్తగా పనిచేశారు. ఆ అనుభవ సారాన్ని రంగరించి, ప్రభుత్వ ఆలోచనల్ని కూడా కలబోసి 'ది ఇండియా వే' (భారత్ మార్గం : అనిశ్చిత ప్రపంచంలో అనుసరణీయ వ్యూహాలు) అనే పుస్తకాన్ని రాశారు. మారిన అంతర్జాతీయ పరిస్థితుల్లో అనుసరించదగిన వ్యూహాలపై అందులో చర్చించారు. భారత విదేశాంగ విధానం ఇప్పుడీ తాజా పంథాలోనే కొనసాగుతున్నట్టు కనిపిస్తున్నది.

ఇంకెంతోకాలం అగ్రరాజ్యంగా అమెరికా మనలేదని, డాలర్ పెత్తనానికి కూడా రోజులు దగ్గరపడినట్లేనని పలువురు ఆర్థిక నిపుణులు జోస్యం చెబుతున్నారు. ట్రంప్ చర్యలు ఈ పరిణామాన్ని వేగవంతం చేయగలవని అంచనా వేస్తున్నారు. అమెరికా నాయకత్వంలోని 'జీ–7' దేశాల పాశ్చాత్య కూటమిని ఆర్థిక రంగంలో 'బ్రిక్స్' దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) ఇప్పటికే అధిగమించడాన్ని ఇందుకు రుజువుగా వారు చూపెడుతున్నారు. వచ్చే ఏడాది 'బ్రిక్స్' కూటమికి భారత్ నాయకత్వం వహించబోతున్నది. భౌగోళిక రాజకీయాలతోపాటు పలు అంశాలపై వైరుధ్యాలున్న రెండు అతిపెద్ద దేశాలను (భారత్ – చైనా) వ్యూహాత్మక స్నేహం వైపు నడిపించిన ఘనత ట్రంప్‌దేనని అమెరికన్ నిపుణులే విమర్శిస్తున్నారు. ఇండో – పసిఫిక్ ప్రాంతంలో చైనా విస్తరణను అడ్డుకోవడానికి అమెరికా, ఇండియా, జపాన్, ఆస్ట్రేలియాలతో కలిసి ఏర్పడిన 'క్వాడ్' కూటమి తాజా పరిణామాలతో నిర్వీర్యమైనట్టే!

గల్వాన్ ఘర్షణ అనంతరం రెండు దేశాల మధ్యన ఏర్పడిన ఉద్రిక్తతలను ఉపశమింపజేయడానికి అవసరమైన కొన్ని చర్యలను రెండు దేశాలూ ఇప్పటికే తీసుకోవడం ఆరంభించాయి. మన విదేశాంగ మంత్రి జైశంకర్ జిన్‌పింగ్‌ను కలిశారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఢిల్లీకి వచ్చి మంతనాలు జరిపారు. భారత యాత్రికుల కోసం మానస సరోవరం మార్గాన్ని చైనా తెరిచింది. చైనాకు విమానయానాలను భారత్ పునరుద్ధరించింది. చైనాలోని తియాంజిన్‌లో ప్రారంభమైన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటున్నారు. శనివారం నాడాయనకు చైనాలో ఆత్మీయ స్వాగతం లభించింది. భారతదేశపు శాస్త్రీయ సంగీత నృత్యాలతో చైనా యువతీ యువకులు ఆయన్ను అలరించారు. అమెరికా పెత్తందారీతనానికి వ్యతిరేక వేదికను ఈ సదస్సు బలోపేతం చేసే అవకాశం ఉన్నది.

ఆదివారం నాడు చైనా అధ్యక్షుడు షీ–జిన్‌పింగ్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. ద్వైపాక్షిక సమస్యలు, సంబంధాలపై వారి మధ్య చర్చలు జరగవచ్చు. ఎస్‌సీఓ శిఖరాగ్ర సభకు అమెరికా బద్ధ శత్రువైన రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కూడా హాజరవుతున్నారు. ఈ నేతలతో కూడా మోదీ చర్చలు జరిపే అవకాశం ఉన్నది. రష్యాతో మనది చెక్కుచెదరని దశాబ్దాల స్నేహబంధం. ఇరాన్‌తో మనకున్న అనుబంధానికి శతాబ్దాల చరిత్ర ఉన్నది. ట్రంప్ ట్యారిఫ్‌ల నేపథ్యంలో భారత్ కొత్త మార్కెట్‌లకు విస్తరించడం కోసం అందివచ్చిన వేదికలన్నిటినీ ఉపయోగించుకుంటుంది. ఈ ప్రయాణంలో భారత్ వైఖరి వేగిరపడిన చందంగా కాకుండా ఆచితూచి వ్యవహరిస్తున్నట్టుగానే కనిపిస్తున్నది. ఎస్‌సీఓ సమావేశం ముగిసిన తర్వాత బుధవారం నాడు బీజింగ్‌లో మరో భారీ ర్యాలీని చైనా నిర్వహిస్తున్నది. రెండో ప్రపంచ యుద్ధంలో సామ్రాజ్యవాద శక్తులను (ముఖ్యంగా జపాన్ సామ్రాజ్యవాదం) ఓడించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చైనా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నది. ఎస్‌సీఓ సభకు హాజరయ్యే దేశాలన్నీ ఈ ర్యాలీకి హాజరవుతున్నా భారత్ మాత్రం జపాన్ పట్ల స్నేహభావంతో హాజరు కావడం లేదు. పైగా తియాంజిన్ సదస్సుకు ముందు రెండు రోజులపాటు ప్రధాని మోదీ జపాన్‌లో పర్యటించారు. రెండు దేశాల మధ్య టెక్నాలజీ రంగంలో పలు ఒప్పందాలు కుదిరాయి. జపాన్ కూడా భారత ప్రధానికి ఘనమైన స్వాగతాన్నే ఏర్పాటు చేసింది. జపనీయులు గాయత్రీ మంత్రాన్ని పఠిస్తూ ఆయనకు ఆహ్వానం పలికి ఆకట్టుకున్నారు.

ఒక విపత్కర పరిస్థితిని ఎదుర్కోవడానికి, ఒక అభివృద్ధి చెందిన దేశం హోదా వైపు అడుగులు వేయడానికి ఆచరణాత్మకమైన, వివేకవంతమైన విదేశాంగ విధానం ఒక్కటే సరిపోతుందా? దేశీయంగా అందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామా? అనే విషయాలను సమీక్షించుకోవలసిన సమయమిది. జీఎస్టీ శ్లాబుల కుదింపు, స్వదేశీ వాడకం ఉద్యమానికి ప్రధాని పిలుపు నివ్వడం ట్రంప్ ట్యారిఫ్‌ల నేపథ్యంలో తీసుకున్న చర్యలే కావచ్చు. వాటివల్లనే స్వదేశీ మార్కెట్ బలపడుతుందా? మన దేశ ప్రజల కొనుగోలు శక్తి బలంగా ఉంటే అమెరికా, యూరోపా దేశాల ఉమ్మడి బలంతో సమానంగా ఉంటుంది. అటువంటి వ్యవస్థను సృష్టించుకోగలగడమే చైనా విజయ రహస్యంగా ఆర్థికవేత్తలు చెబుతున్నారు. చైనా ఆర్థికాభివృద్ధి పంథా ఒక హైబ్రిడ్ మోడల్. అది పూర్తిస్థాయి పెట్టుబడిదారీ విధానం కాదు. సోషలిస్టు విధానమూ కాదు. ప్రభుత్వ నియంత్రణకు లోబడిన పెట్టుబడి పూర్తి లాభాపేక్షతో కాకుండా సామాజిక వృద్ధికి కట్టుబడి ఉంటుంది. ఈ ఆర్థిక విధానం ఫలితంగా కోట్లాది మంది పేదరికం సంకెళ్లను తెంచుకొని ఒక బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోగలిగారు. మనం మాత్రం సమాజంలో తీవ్ర అసమానతలకూ, పేదరికానికీ ఒక ముఖ్య కారణమైన ప్రైవేటీకరణ బాట వెంటనే ఇంకా పరుగులు తీస్తున్నాము. ఈ బాట ఇంకెంతమాత్రమూ పేదరికాన్ని నిర్మూలించలేదనీ, అసమానతల్ని పోగొట్టలేదనీ ఇప్పటికే రుజువైంది. దేశీయంగా బలమైన మార్కెట్‌ను నిర్మించుకోగలిగినప్పుడే రాచవీధిలో పట్టపుటేనుగు నడిచినంత ఠీవిగా అంతర్జాతీయ సంబంధాల్లో నడవగలం. ఎలుకల మొట్టికాయలు అప్పుడు ఏమీ చేయలేవు!


ఆయన నోబెల్ బహుమతి పిచ్చికి భారత ప్రభుత్వం సహకరించలేదన్న దుగ్ధ కూడా అమెరికా అధ్యక్షుడిని వేధిస్తున్నదట! ట్రంప్ మధ్యవర్తిత్వం వల్లనే కాల్పుల విరమణకు ఒప్పుకున్నామని భారత్ ఒక మాట అధికారికంగా చెబితే తనకు నోబెల్ శాంతి బహుమతి దక్కుతుందని ట్రంప్ ఆశ. భారత్ – పాక్ వ్యవహారాల్లో మూడో దేశం జోక్యాన్ని చాలాకాలంగా భారత్ అంగీకరించడం లేదు. ఒక దేశాధినేత నోబెల్ పిచ్చిని తీర్చడం కోసం తన దేశ సార్వభౌమాధికారంతో రాజీపడడానికి భారత్ అంగీకరించలేదు. ఇటువంటి రాజీ పట్ల పాక్‌కు ఎటువంటి అభ్యంతరమూ లేదు. ట్రంప్ కోరుకుంటున్న ప్రకటనను పాక్ మిలిటరీ చీఫ్ అసీఫ్ మునీర్ చేశారు. దాంతో మునీర్‌ను పొగడ్తల్లో ముంచడమే గాక ఆయన్ను వైట్‌హౌస్‌లో భోజనానికి ట్రంప్ ఆహ్వానించారు.

ఏకధ్రువ ప్రపంచం నుండి బహుధ్రువ ప్రపంచం వైపు మానవాళి అడుగులు వేస్తున్న కీలకమైన మలుపులో భారతదేశం తన ప్రయోజనాల కోసం అనుసరించవలసిన విదేశీ విధానంపై కేంద్ర సర్కార్‌కు ఇప్పటికే ఒక స్పష్టత ఉన్నది.

vardhelli1959@gmail.com

ఆరో రుద్రుడి అమోఘ ముద్ర

సందర్భం




తెలకపల్లి రవి

కవి, రచయిత, సినిమారంగ ప్రముఖుడు, కాలమిస్టు, చరిత్ర, సాహిత్య పరిశోధకుడు, నాలుగైదు భాషలు తెలిసినవారు, శ్రీశ్రీ భాషలో తొలుత ఆరో రుద్రుడు... ఆరుద్ర. విశాఖపట్నంలో 1925 ఆగస్టు 31న పుట్టిన భాగవతుల సదాశివ శంకర శాస్త్రి అనేక కలం పేర్లను వాడుతూ 'ఆరుద్ర'గా స్థిరపడ్డారు. ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేసిన ఆయన విద్యార్హత ఎస్సెస్సెల్సీనే! తండ్రి నరసింగరావు సాహిత్యాభిలాషి గనక కనిపించిన పుస్తకమల్లా తెస్తే మేనమామ శ్రీశ్రీ అప్పటికే విశాఖ రీడింగు రూములో పుస్తకాలన్నీ తాను చదివేసి ఆరుద్రతోనూ చదివించారు. ఆ విధంగా 13 ఏళ్ల వయసులోనే ఆరుద్ర కవిత్వ రచన మొదలుపెట్టారు. కొడవటిగంటి కుటుంబరావు కూడా రచనా శిల్పాన్ని మెరుగులు దిద్దారు. చాగంటి సోమయాజులు మార్క్సిజాన్ని మేధాగతం చేసుకోవడానికి ఉత్ప్రేరకంగా పనిచేశారు.

1942లో సెట్టి ఈశ్వరరావు సిఫార్సుపై ఆరుద్ర కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యాపై జర్మనీ దాడి చేశాక... అందుకు వ్యతిరేకంగా తన వంతు పాత్ర నిర్వహించేందుకై ఆరుద్ర వైమానిక దళంలో చేరారు. 'ఆనందవాణి' పత్రికలో కొలువుతో సహా అనేక మజిలీల తర్వాత మద్రాసులో స్థిరపడి సృజన, పరిశోధన సాగించారు. 1955లో దర్శక దిగ్గజం హెచ్‌ఎం రెడ్డి, శ్రీశ్రీలే సాక్షులుగా రూ.60 ఖర్చుతో రామలక్ష్మిని రిజిస్టరు వివాహం చేసుకున్నారు.

కవిత్వంలో ప్రయోగాలకూ ఆధునికతకూ ఆరుద్ర ప్రాధాన్యాన్నిచ్చారు. 'గాయాలూ గేయాలూ', 'సాహిత్యోపనిషత్', (ఛందస్సు లేని) 'ఇంటింటి పజ్యాలు', 'కూనలమ్మ పదాలు', 'సినీ వాలి', 'పైలా పచ్చీసు', 'అమెరికా ఇంటింటి పజ్యాలు' తదితర రచనలు చేశారు. నాట్యశాస్త్రంలోని 'హస్త లక్షణ పదాలు' మరో ప్రత్యేక రచన. 'ఆరుద్ర అరబ్బీ మురబ్బాలు' ఆయన మరణానంతరం వెలువడ్డాయి. జీవితపు చివరి దశలో మొదలు పెట్టిన 'మనిషి – ఆడ మనిషి' కావ్యంలోని ఒక భాగం 'స్త్రీ పురాణం' మహిళా కోణాన్ని ఆవిష్కరించింది. తను రాయని 'సినీవాలి' అనే కావ్యం రాసినట్టు ఎవరో పొరబాటున పేర్కొంటే ఆ పేరుతో కావ్యం రాశారు. ఇంటింటి పజ్యాలు, కేరా శతకము వంటివి అలవోక ప్రయోగాలే. 'కూనలమ్మ పదాలు' వందల మందిని కవులను చేశాయంటారు. వీర తెలంగాణ సాయుధ పోరాటంపై హరీంద్రనాథ్ చటోపాధ్యాయ గీతాలను తెలుగులోకి అనువదించగా సుందరయ్యగారి పుస్తకంలో ప్రచురించారు.

'కొండగాలి తిరిగింది' పేరిట వచ్చిన సినిమా పాటలు ఆయన పట్టును చెబుతాయి. 'ఎదగడానికెందుకురా



◆ సామాన్యుడికి సాహిత్య చరిత్ర తెలియడానికి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' మహాభారం వేసుకున్నానని ఆరుద్ర వినయంగా చెప్పినా... పండితులకే గొప్ప వనరు సమకూర్చారు.

తొందర' పాటలో నిరుద్యోగాన్ని వివరిస్తారు. 'గాంధీ పుట్టిన దేశమా ఇది' అంటూ ప్రశ్నిస్తారు. 'వేదంలా ఘోషించే గోదావరి', 'మహాబలిపురం' వంటి పాటలు వింటే రాగం చరిత్ర అల్లుకుపోవడం చూస్తాం. అందులో కూడా 'కట్టు కథల చిత్రాంగి కనకమేడలు' అంటూ అది నిజం కాదని సూచిస్తారు. 'కొట్టుకుని పోయే కొన్ని కోటి లింగాలు వీరేశలింగమొకడు మిగిలెను చాలు' అన్న ఆయన మాటలు సుభాషితాల్లా నిలిచిపోయాయి. 'రగిలింది విప్లవాగ్ని ఈ రోజు' అంటూ 'అల్లూరి సీతారామరాజు'కు రాసిన పాట కూడా గొప్పగా ఉంటుంది. సినిమా పాటల తీరు మారి విలువలు తగ్గిపోతున్న దృష్ట్యా వాటిని రాయడం విరమించుకున్నారు. 150 చిత్రాలకు మాటలూ, 500 చిత్రాల్లో నాలుగు వేల పాటలూ రాశారు. సినీ జనానికి ఆయనో విజ్ఞాన సర్వస్వంలా గోచరించేవారు.

సామాన్యుడికి సాహిత్య చరిత్ర తెలియడానికి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' మహాభారం వేసుకున్నానని ఆరుద్ర వినయంగా చెప్పినా... పండితులకే గొప్ప వనరు సమకూర్చారు. దాన్ని రాసే సమయంలో తీరిక లేకపోవడం వల్లనే గడ్డం చేసుకోవడం మానేసి పెంచేశానని సరదాగా చెబుతుండేవారు. 'వేమన వేదం', 'మన వేమన', 'వ్యాస పీఠం', 'గురజాడ గురుపీఠం' సంపుటాలు; 'ప్రజా కళలూ – ప్రగతివాదులూ' ఆయన ప్రజ్ఞకు ప్రతిబింబాలుగా నిలిచి ఉన్నాయి. 'రాముడికి సీత ఏమవుతుంది?', 'గుడిలో సెక్స్' అన్న గ్రంథాలు ఇప్పుడెంత సంచలనమయ్యేవో! కళలు, క్రీడలు, ఇంద్రజాలం వంటి అంశాలపై కూడా సాధికార గ్రంథాలు వెలువరించారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజాన్ని ఓడించాలంటూ సైన్యంలో చేరడంతో మొదలైన ఆరుద్ర రాజకీయ అవగాహన ఆఖరు దాకా ప్రగతిశీలంగానే సాగింది. సైద్ధాంతిక విభేదాలు పెరిగినపుడు మామూలు కవులుగా అందుకోవడంలో తాము పొరబడి ఉండొచ్చని నిస్సంకోచంగా వినయంగా చెప్పారేగానీ ఇతరులపై దాడి చేయలేదు.


1985లో ఆరుద్ర షష్టి పూర్తి సాహిత్య లోకంలో ఒక పండుగలా జరిగింది. తర్వాత కాలంలో ఆరుద్ర ఉద్యమానికి మరింత దగ్గరయ్యారు. సోవియట్ విచ్ఛిన్నం, ప్రపంచీకరణ, దేశంలో అయోధ్య వివాదం తరుణంలో ఆరుద్ర 'మనీ ప్రపంచం మనీ ప్రపంచం/ మనీ ప్రపంచం గెలిచిందా? మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం మారిందా?' అని ప్రశ్నించారు.

ఆరుద్ర 1998 జూన్ 4న కన్నుమూసిన సంగతి అంత్యక్రియలు ముగిశాక గాని తెలియలేదంటే అది ఆయన నిరాడంబరతకు ఓ నిదర్శనమే. తన అంతిమఘట్టం అలా నిశ్శబ్దంగా జరిగిపోవాలని ఆయన ఆకాంక్షించారని భార్య రామలక్ష్మి నా ఇంటర్వ్యూలో చెప్పారు. చరిత్రనే తిరగదోడే అసహన ధోరణులూ దాడులూ, కళాసాహిత్యాలలో వాణిజ్య ప్రలోభాలూ పెరిగిన ఈ తరుణంలో ఆరుద్ర జీవితం అధ్యయనానికీ, ఆచరణకూ మార్గదర్శకం.

వ్యాసకర్త సీనియర్ పత్రికా సంపాదకులు
(నేడు ఆరుద్ర శతజయంతి)

జనరంజక హరికథకుడు

సినిమాలు రాకముందు హరికథ, బుర్ర కథ వంటి వాటికి మంచి ఆదరణ ఉండేది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో భక్తి, వినోదాన్ని పెంపొందించ డానికి ఒక మాధ్యమంగా హరికథ రూపంలో సంప్రదాయ, మత పరమైన ప్రసంగాలు సాగేవి. ఆదిభట్ల నారాయణ దాసు హరికథ... వేద కాలం నాటి కళారూపమని భావించారు.



ఆదిభట్ల నారాయణ దాసు

19వ శతాబ్దపు చివరి నాటి విజయనగరం... సాహిత్యం కళాత్మక రంగాలకు కాణాచిగా ఉండేది. ఆ కాలంలో దుర్వాసుల సూర్యనారాయణ సోమయాజులు, కలిగొట్ల కామరాజు, మొహబత్ ఖాన్, పప్పు వెంకన్న, వీణా వెంకటరమణ దాసు వంటి మహానుభావుల సాంగత్యంలో నారాయణదాసు సహజ సిద్ధమైన కళానైపుణ్యం వికసించింది.

దాసుగారికి పూర్వం... హరికథను పురాణ కాలక్షేపం లాగా చెప్పేవారు. హరికథా భాగవతార్ కూర్చొని ఉండేవారు. రాగ ధోరణిలో కథ చెబుతూ, మధ్య మధ్య పూర్వుల కీర్తనలను పాడి వినిపించేవారు. ఆ రోజులలో హరికథకు పోయేవారిలో కథ కోసం పోయేవారు సగం మంది, సంగీతం కోసం పోయేవారు సగంమంది.

అయితే నారాయణదాసు హరికథను జనరంజకం చేశారు. ఆకర్షణీయమైన వేషం ధరించి, నిలబడి కథ చెప్పేవారు. కథ చెప్పడంలో పిట్టకథలనూ, హాస్యాన్నీ ప్రవేశపెట్టారు. తాళానికి, భావానికి అనుకూలంగా నాట్యం చేసేవారు. భక్తి, సంగీతం, నాట్యం, హాస్యాలను మేళవించి సర్వజనరంజకంగా కథ చెప్పేవారు. ఎవరో రాసినవి కాకుండా స్వయంగా హరికథలు రాసుకొని చెప్పారు. ఎంతో మందికి జీవనోపాధి కలిగించే విధంగా హరికథా స్వరూపాన్ని మార్చారు.

కుప్పుస్వామి నాయుడు హరికథ చెబుతుంటే విని, ఆదిభట్ల నారాయణ దాసు ప్రేరణ పొంది స్వతంత్ర జీవనానికి ఇదే మంచి మార్గమని హరికథలు చెప్పడానికి పూనుకున్నారు. దాసుగారు కథలు చెప్పడం ప్రారంభించటానికి ముందే ఇతరుల హరికథలు అచ్చు కూడా అయ్యాయి. ధూళిపాళ కృష్ణయ్య అనే కవి రాసిన హరికథలు, యక్షగానాల నుండి కొన్ని కీర్తనలను స్వీకరించాను అని ఆయనే స్వీయ చరిత్రలో చెప్పారు. 1864 ఆగస్టు 31న జన్మించిన నారాయణదాసు 1945 జనవరి 2న తుదిశ్వాస విడిచారు.

– ఎం. రాం ప్రదీప్ । జనవిజ్ఞానవేదిక సభ్యులు, తిరువూరు
(ఆగస్టు 31న ఆదిభట్ల నారాయణ దాసు జయంతి)

మానేరు 'మధ్య'లో ఇద్దరు రైతులు


మల్లారెడ్డిపేట వాగులో రెస్క్యూ బృందం

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన ఇద్దరు రైతులు మానేరు కురువ (వాగు మధ్యలో పంట పొలాలు ఉన్న ప్రాంతం)పై ఉన్నట్లు శనివారం అధికారులు గుర్తించారు. మానేరు వాగులో గల్లంతైన నర్మాలకు చెందిన నాగయ్య కోసం అధికారులు వాగు పరీవాహక ప్రాంతాల్లో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో భీముని మల్లారెడ్డిపేట శివారులోని కురువపై ఇద్దరు రైతులు ఉన్నట్లు గుర్తించారు. వారిని కురువ నుంచి బయటకు తీసుకువచ్చేందుకు అధికారులు రెస్క్యూ బృందాన్ని రప్పించారు. అయితే తాము కురువలోనే ఉంటామని.. అక్కడ ఇల్లు, బియ్యం, నిత్యావసర సామగ్రి ఉందంటూ గ్రామానికి వచ్చేందుకు రైతులు నిరాకరించారు. వరద తగ్గిన తర్వాత వస్తామంటూ తెలిపారు. కొంతసేపు వారితో మాట్లాడిన అధికారులు చివరికి సోమారపు సత్యనారాయణ అనే రైతును ఒప్పించి సురక్షితంగా గ్రామానికి తీసుకువచ్చారు. అయితే మరో రైతు రాజం గ్రామానికి వచ్చేందుకు నిరాకరించి అక్కడే ఉన్నట్లు తహసీల్దార్ మారుతిరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా మానేరు కురువలో చాలా మంది రైతులకు పంట భూములు ఉన్నాయని, రోజుల కొద్దీ అక్కడే ఉండటం వారికి సహజమేనని గ్రామస్తులు తెలిపారు.

నాలుగు రోజులుగా నది మధ్యలోనే


గోదావరి మధ్యలో రైతులు చిక్కుకుంది ఇక్కడే

కడెం: ఎగువన మహారాష్ట్రతోపాటు నిర్మల్ జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 5 లక్షల క్యూసెక్కులకుపైగా నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కడెం మండలం చిట్యాల్ సమీపంలోని గోదావరి కుర్రు(నది మధ్య ప్రాంతం)లో పశువులను మేపేందుకు వెళ్లిన ఇద్దరు రైతులు నాలుగు రోజులుగా అక్కడే చిక్కుకుపోయారు. చిన్నబెల్లాల్‌కు చెందిన ఎల్తాపు మొగిలి, టోపి గంగు తమ పశువులను మేపేందుకు ప్రతీరోజు చిట్యాల్ సమీపంలోని కుర్రుకు వెళ్తుంటారు. సాయంత్రం పశువులను అక్కడే కట్టేసి ఇంటికి వస్తుంటారు. ఈ నెల 27న ఉదయం రోజువారీలాగే వారు కుర్రుకు వెళ్లారు. అయితే మధ్యాహ్నం గోదావరి ప్రవాహం భారీగా పెరగడంతో అందులో నుంచి బయటకు రాలేకపోయారు. అక్కడే ఒక గుడిసెలో ఉంటున్నారు. వెంట తీసుకెళ్లిన నిత్యావసరాలతో వంట చేసుకుంటున్నామని కుటుంబ సభ్యులకు శనివారం ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆర్.ప్రభాకర్ వారితో మాట్లాడారు. తాము క్షేమంగానే ఉన్నామని వరద తగ్గిన తర్వాత ఇంటికి వస్తామని రైతులు తెలిపారు.

వరద బాధితుల వద్దకు కాంగ్రెస్

- నలుగురు ఎమ్మెల్సీలతో కమిటీ నియమించిన పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- నేడు కామారెడ్డికి కమిటీ సభ్యులు



సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజల వద్దకు వెళ్లి వారికి అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ శనివారం తమ పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, విజయశాంతి, బల్మూరి వెంకట్, శంకర్‌నాయక్‌లతో ఆయన ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ ఆదివారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లనుంది. వరదలతో ఎక్కువగా నష్టపోయిన కామారెడ్డిలో ఈ కమిటీ తొలుత పర్యటించి, జరిగిన నష్టాన్ని అంచనా వేస్తుందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

నాలాల ఆక్రమణ.. డివైడర్ల వల్లే..

కామారెడ్డి జిల్లా కేంద్రం నీటమునకకు ప్రధాన కారణాలివే

- నాలాల ఆక్రమణలతో రోడ్లను ముంచెత్తిన వరద
- ఎత్తయిన రోడ్డు డివైడర్ల వల్ల వెనక్కిమళ్లి కాలనీలను చుట్టుముట్టిన నీరు
- డ్రైనేజీల నిర్మాణంలో ఇంజనీరింగ్ లోపాలు, డివైడర్ల మధ్య ఖాళీలు వదలని ఫలితం


కామారెడ్డిలో డివైడర్లకు ఇరు వైపులా నిలిచిన నీరు (ఫైల్)


కామారెడ్డి జీఆర్ కాలనీ వద్ద కూల్చి వేసిన డివైడర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: భూమాఫియా నాలాలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలతోపాటు ప్రధాన రోడ్ల మధ్య ఖాళీ వదలకుండా ఎత్తయిన డివైడర్ల నిర్మాణం ఫలితంగానే కామారెడ్డి జిల్లా కేంద్రమంతా నీటమునిగేందుకు కారణమ య్యాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కామారెడ్డి పెద్ద చెరువు అలుగు నీరు వెళ్లే వాగును భూమాఫియా మింగేయడంతో వాగు పిల్ల కాలువలా మారిపోవడంతో తాజాగా కురిసిన భారీ వర్షాలకు వరదనీరు బయటకు వెళ్లే దారిలేక సమీపంలోని కాలనీలను చుట్టుముట్టింది. దీనికితోడు వరదనీరు అంతకంతకూ పెరిగి పాత జాతీయ రహదారిని తాకగా అక్కడ ఏర్పాటు చేసిన ఎత్తయిన డివైడర్ల వల్ల నీరంతా వెనక్కు తన్నింది. ఫలితంగా ఆయా కాలనీల్లోని ఇళ్లన్నీ నీట మునిగాయి. ఇళ్లలో చిక్కుకున్న వారిని పోలీసులు, అధికారులు ఎంతో కష్టపడి కాపాడాల్సి వచ్చింది. అప్పటికప్పుడు జేసీబీలను తెప్పించి డివైడర్లను ఎక్కడికక్కడ కూల్చేయడంతో వరద నీరంతా దిగువకు పారింది.

భారీ డివైడర్ల వల్ల..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో నర్సన్నపల్లి చౌరస్తా నుంచి మొదలుకొని టేక్రియాల్ చౌరస్తా వరకు దాదాపు 6 కి.మీ. మేర భారీ డివైడర్ నిర్మించారు. అలాగే సిరిసిల్ల రోడ్డులో బైపాస్ రోడ్డు నుంచి పాత బస్టాండ్ దాకా, నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవునిపల్లి దేవి విహార్ దాటే వరకూ భారీ డివైడర్లు నిర్మించారు. ఫలితంగా ఎగువ నుంచి వచ్చిన భారీ వరద డివైడర్లను దాటలేక వెనక్కు తన్ని దేవి విహార్ కాలనీలోని ఇళ్లలోకి చేరింది. ఈ నేపథ్యంలో డివైడర్‌ను కూల్చేసి నీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ఇంజనీరింగ్ లోపాలతో..

ఎంత వర్షం వచ్చినా నీరు వెళ్లిపోయేలా రోడ్లకు ఇరువైపులా పెద్ద డ్రైనేజీలు ఉండాలి. ఆ డ్రైనేజీల నుంచి వచ్చే నీరు వాగుల్లో కలవడానికి నాలాలు సరిగా ఉండాలి. అయితే కామారెడ్డి పట్టణమే కాదు.. చాలా పట్టణాలు, నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల వరదనీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంలో ఇంజనీరింగ్ లోపాల వల్ల ముంపు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించే సమయంలోనే డ్రైనేజీని కచ్చితంగా నిర్మించేలా నిబంధనలు రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే నాలాలను ఆక్రమణల చెర నుంచి విడిపించాలని డిమాండ్ చేస్తున్నారు.


సిరిసిల్ల జిల్లా నర్మాలకు చెందిన ఎడబోయిన లక్ష్మికి చెందిన 20 గుంటల భూమిలో వరి పంట పూర్తిగా వరద ప్రవాహంలో కొట్టుకుపోగా, పొలంలో భారీగా ఇసుక మేటలు వేసింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని లక్ష్మి వేడుకుంటోంది.
– సాక్షి ఫోటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా

6,500 ఎకరాల్లో ఇసుక మేటలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రభావితమైన అన్ని జిల్లాల నుంచి వ్యవసాయ శాఖ నివేదికలు తెప్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 6,500 ఎకరాల పంట పొలాల్లో ఇసుక మేటలు పెట్టినట్లు గుర్తించింది. ఇందులో అత్యధికంగా మెదక్ జిల్లాలోనే సుమారు 2,300 ఎకరాలను ఇసుక కమ్మేసిందని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 1,43,304 మంది రైతులకు చెందిన 2.20 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు తేల్చింది.

పోటెత్తిన వరదతోనే..: వ్యవసాయ శాఖ పేర్కొన్న ప్రకారం.. రెడ్ అలర్ట్ లాంటిది ఏదీ లేకుండానే ఒకేసారి 20 నుంచి 40 సెంటీమీటర్ల కుంభవృష్టి కురవడంతో భారీ ఎత్తున వరద వచ్చింది. అదంతా పంట పొలాల్లోకి రావడంతో ఇసుక మేటలు పెట్టింది. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో చెరువులు, కుంటలు తెగిపోయి మట్టితో కూడిన వరద పొలాల్లోకి చేరింది. అలాగే గోదావరి పరీవాహక జిల్లాల్లో ఉప్పొంగిన వరదల వల్ల కూడా ఇసుక, మట్టి పొలాలను ముంచెత్తింది. ఒక్క మెదక్ జిల్లాలోనే చెరువులు, కుంటలతో పాటు బ్రిడ్జీలు, రహదారులు 92 తెగిపోయా యి. తీవ్ర నష్టం వాటిల్లిన కామారెడ్డి జిల్లాలో 62 చెరువులు, కుంటలకు నష్టం కలిగింది. దాదాపు 500 ఎకరాల్లో ఇసుక మేటలు పెట్టింది. పత్తి, సోయాబీన్ తీవ్రంగా దెబ్బతినగా, చెరువులు, కుంటల కింద వరి కొట్టుకుపోయింది. నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, సిద్దిపేట తదితర జిల్లాల్లో కూడా ఇసుక మేటల వల్ల భారీగా నష్టం జరిగింది.

రైళ్ల రాకపోకలు షురూ..


భిక్కనూరు-తలమడ్ల రైల్వే స్టేషన్‌ల మధ్య పునరుద్ధరించిన రైల్వే ట్రాక్

భిక్కనూరు/ఖలీల్‌వాడి: నిజామాబాద్ – సికింద్రాబాద్ మధ్య రైల్వే లైన్ క్లియర్ అయింది. భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లా తల్లమడ్ల-తిప్పాపూర్ మధ్య రైల్వే ట్రాక్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీంతో మూడు రోజుల పాటు ఈ మార్గంలో రైళ్లు నిలిచిపోయాయి. యుద్ధప్రాతిపదికన ట్రాక్ మరమ్మతులు చేపట్టిన రైల్వే అధికారులు శనివారం ఉదయం 7.30 గంటలకు పనులు పూర్తి చేశారు. 350 మంది కార్మికులు, 10 హిటాచీ పొక్లెయిన్‌లు, 25 ట్రాక్టర్లతో రైల్వే ట్రాక్ మరమ్మతులను వేగంగా పూర్తి చేసినట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. పనులు పూర్తి కావడంతో ట్రాక్‌పై డెమో రైలుతో ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రాక్‌ను పూర్తిగా పరీక్షించిన తర్వాత రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు అనుమతి ఇచ్చారు. శనివారం మధ్యాహ్నం నిజామాబాద్ నుంచి రాయల సీమ ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బయల్దేరినట్లు అధికారులు తెలిపారు. కాగా, నిజామాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. బాసర వద్ద రైల్వే బ్రిడ్జిని ఆనుకొని గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు అటువైపు రైళ్లను రద్దు చేశారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టిన తర్వాత రాకపోకలు మొదలవుతాయని అధికారులు వెల్లడించారు. దీంతో సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా ముంబై, నాందేడ్, మన్మాడ్ తదితర ప్రాంతాలకు నడిచే రైళ్లను అధికారులు రద్దు చేశారు.

రైతుపై చేయి చేసుకున్న ఎస్సై


నర్సింహులపేట పీఏసీఎస్ ఎదుట యూరియా కావాలని ఏఓ వినయ్‌కుమార్ కాళ్లు మొక్కుతున్న మహిళా రైతు


ఎస్సై చేతిలోని యూరియా టోకెన్ల కోసం ఎగబడుతున్న రైతులు

- నారాయణపేట జిల్లా తీలేరులో యూరియా పంపిణీ సందర్భంగా ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్.. చర్యలు తీసుకుంటామన్న జిల్లా ఎస్పీ

మరికల్: నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని తీలేరు సొసైటీ వద్ద శనివారం రైతులకు యూరియా పంపిణీ సందర్భంగా ఓ రైతుపై ఎస్సై చేయి చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. తీలేరు సింగిల్ విండో సొసైటీకి శుక్రవారం 600 బస్తాల యూరియా రాగా శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచే సొసైటీ పరిధిలోని రైతులు అక్కడకు చేరుకొని చెప్పులు, రాళ్లు, చెట్ల కొమ్మలను క్యూలో పెట్టారు. ఉదయం 9 గంటలకు సిబ్బంది వచ్చి రైతులకు టోకెన్లు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించారు. ఈ క్రమంలో రైతులు ఒక్కసారిగా తోసుకురావడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీంతో ఏఓ రెహ్మాన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఎస్సై రాము సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. దీంతో సొసైటీ అధికారులు ఆయన చేతికి టోకెన్లు ఇచ్చారు. అయితే క్యూలో నిల్చున్న దాదాపు 800 మంది రైతులు టోకెన్ల కోసం పోలీసుల వద్దకు దూసుకొచ్చారు. కొందరు ఎస్సై చేతిలోంచి టోకెన్లు లాక్కోవడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. రైతులను నిలువరించే ప్రయత్నంలో సత్యనారాయణ అనే రైతుపై ఎస్సై చేయి చేసుకున్నారు. అనంతరం పరిస్థితి చేయిదాటకుండా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రాజేందర్‌రెడ్డి మరో 20 మంది పోలీసులను రప్పించారు. చివరకు పోలీస్ పహారాలో టోకెన్లు అందుకున్న రైతులకు రెండేసి బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. అయితే రైతుపై ఎస్సై దాడి చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవగా దీనిపై ఎస్సై రాము వివరణ ఇచ్చారు. పరిస్థితి చేయిదాటకుండా చూసే క్రమంలో ఓ రైతుపై అనుకోకుండా చేయి చేసుకోవాల్సి వచ్చిందన్నారు. మరోవైపు ఈ ఘటనపై స్పందించిన జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఎస్సైకి నోటీసులు జారీ చేశారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ ఉదంతంపై బాధిత రైతు సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్సై కావాలని తనను కొట్టలేదని, అనుకోకుండా చేయి తాకిందని చెప్పడం గమనార్హం.

రైతులకు తీరని యూరియా కష్టాలు


సిద్దిపేట జిల్లా నంగునూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో అన్నదాతలకు యూరియా కష్టాలు తీరడం లేదు. వివిధ ప్రాంతాల్లో యూరియా స్టాక్ లేదు బోర్డులు దర్శనమివ్వడంతో రైతులు శనివారం నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని నర్సింహులపేట, గూడూరులో యూరియా కోసం రైతులు రోడ్డుపై బైఠాయించారు. కరీంనగర్ మండలం దుర్శేడ్, నగునూరులో యూరియా కోసం రైతులు భారీగా తరలిరాగా ఆది, సోమవారాల్లో పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం సర్వారం పీఏసీఎస్ వద్ద సుమారు 300 మంది రైతులు క్యూలో నిల్చోగా ఒక్కో బస్తా చొప్పున 220 మందికే పంపిణీ చేశారు.


బాసర ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై వరద


బాసర శివాలయం వద్ద గోదావరి ఉధృతి

జలదిగ్బంధంలో బాసర సరస్వతీ ఆలయం

- తగ్గని గోదావరి ఉధృతి
- ట్రిపుల్‌ఐటీలో మొరాయించిన మోటార్లు
- పరిస్థితిని సమీక్షించిన నిర్మల్ జిల్లా కలెక్టర్

భైంసా: భారీ వర్షాలకు గోదావరి, మంజీర నదులు ఉప్పొంగాయి. దీంతో నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి ఉగ్రరూపందాల్చింది. వరుసగా రెండోరోజు శనివారం కూడా ఉధృతి తగ్గలేదు. మూడు కిలోమీటర్ల దూరం వరకు వరద పోటెత్తింది. దీంతో బాసర ఆలయం వరకు నీరు చేరింది. ఆలయం సమీపంలోని దుకాణాలు, ప్రైవేటు లాడ్జీలలోకి నీరు చేరింది. కలెక్టర్ అభిలాష అభినవ్ పరిస్థితిని సమీక్షించి, నష్టపోయిన పంట భూములను పరిశీలించారు. బాసర వంతెనను తాకుతూ వరద ప్రవహించడంతో ఎటుచూసినా నీరే కనిపించింది. వరద ఉధృతి కారణంగా రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. వంతెనపై పాదచారుల రాకపోకలను కూడా నిషేధించారు. బాసర ట్రిపుల్‌ఐటీలో వరద నీటిలో పంపు సెట్లు మునిగిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. అధికారులు పంపుసెట్ల మరమ్మతులు చేపట్టి, తాత్కాలికంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. బాసర గోదావరి వంతెన వద్ద ప్రత్యేక బృందాలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎస్సారెస్పీ, గడ్డెన్న వాగు ప్రాజెక్టుల ప్రభావం

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో లక్ష్మణచాంద మండలంలోని పొలాలు నీటిలో మునిగాయి. గడ్డెన్న వాగు ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలోనూ పంట భూములు నీటిలో ఉన్నాయి. ఎస్సారెస్పీ క్యాచ్‌మెంట్ ఏరియా, చుట్టుపక్కల గ్రామాలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎస్పీ జానకీ షర్మిల, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్, ఏఎస్పీ అవినాశ్‌కుమార్‌లు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

ట్రంప్‌కేమైంది?

మరణించారంటూ వదంతులు

- ఇంటర్నెట్‌లో యమా ట్రెండింగ్
- వైట్‌హౌస్ 'అనుమానాస్పద' మౌనం'
- కొన్నాళ్లుగా ఆరోగ్యం అంతంతే!
- గద్దెనెక్కేందుకు సిద్ధమన్న వాన్స్
- నాటినుంచీ మరిన్ని ఊహాగానాలు



న్యూఢిల్లీ: ట్రంప్‌కేమైంది? ఆయన బాగున్నారా? అసలు బతికే ఉన్నారా? అమెరికా అధ్యక్షుడు మరణించారంటూ శనివారం ఉన్నట్టుండి పుకార్లు పుట్టాయి. చూస్తుండగానే ప్రపంచమంతటా కార్చిచ్చు వేగంతో వ్యాపించాయి. ఈ వైనమంతా 'ట్రంప్ మరణించారు' పేరిట ఇంటర్నెట్లో రోజంతా యమా ట్రెండింగ్‌గా మారింది. సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలోనే ఏకంగా 60 వేలకు పైగా పోస్టులు పుట్టుకొచ్చాయి. గ్రోక్ తదితరాల్లోనైతే ఏకంగా 13 లక్షల మందికి పైగా ఈ విషయమై ఆరాలు తీశారు. నిజానికి 79 ఏళ్ల ట్రంప్ ఆరోగ్యం కొన్ని నెలలుగా అమెరికాలోనే గాక ప్రపంచమంతటా పెద్ద చర్చనీయాంశంగా మారింది. గత జూలైలో ఆయన చేతికి గాయం, కాళ్ల మడిమల వాపుతో కన్పించడంతో లెక్కలేనన్ని పుకార్లకు తెర లేచింది. ఆయన ఆరోగ్యం నిక్షేపంగా ఉందంటూ వైట్‌హౌస్ వర్గాలు వెంటనే వివరణ ఇచ్చినా అనుమానాలు మాత్రం నేటికీ ఆగలేదు. అందుకు తగ్గట్టే, ట్రంప్ తన గాయాలు, వాపులు తదితరాలను మేకప్‌తో మేనేజ్ చేస్తున్నారంటూ కొద్ది రోజుల క్రితం కూడా విపరీతంగా వార్తలు వెలువడ్డాయి. పైగా తాజా పుకార్లపై వైట్‌హౌస్ కూడా మౌనం పాటిస్తుండటం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. దీనికి తోడు ఇటీవల స్వయానా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ (41) చేసిన వ్యాఖ్యలు వీటికి మరింత ఆజ్యం పోశాయి. ''200 రోజులుగా (ఉపాధ్యక్షునిగా) మంచి శిక్షణ పొందుతూ వస్తున్నా. పెను విషాదమేదైనా జరిగి తప్పనిసరైతే, 'పెద్ద బాధ్యతలు' స్వీకరించేందుకు కూడా సిద్ధంగా ఉన్నా'' అని బుధవారం ఒక ఇంటర్వ్యూలో అన్నారాయన! ఆ వెంటనే సర్దుకుని, ''ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉంది. ఈ వయసులో కూడా అర్ధరాత్రి దాటేదాకా పని చేస్తున్నారు. మళ్లీ తెల్లవారుజామునే మేల్కొంటున్నారు'' అంటూ కవర్ చేసే ప్రయత్నం చేశారు. అయితే నాలుగు రోజులుగా బయటి ప్రపంచానికి కన్పించని ట్రంప్, శనివారం ఉదయమే తన మనవరాలు కై తదితరులతో కలిసి వర్జీనియాలో గోల్ఫ్ క్లబ్‌కు వెళుతున్న ఫొటోలు బయటికొచ్చాయి.

జనానికి దూరంగా...

కొంతకాలంగా ట్రంప్ బయట కన్పించడం బాగా తగ్గింది. అలాగని బయటి ప్రపంచానికి ఆయన పూర్తిగా దూరంగా ఉన్నారని చెప్పడానికి కూడా లేదు. సొంత సోషల్ మీడియా హ్యాండిల్ 'ట్రూత్ సోషల్'లో శనివారం తెల్లవారుజామున కూడా ఆయన ఖాతాలో ఒక మెసేజ్ దర్శనమిచ్చింది. ప్రపంచ దేశాలపై తాను విధించిన టారిఫ్‌లు ఇంకా అమల్లోనే ఉన్నాయని ట్రంప్ అందులో రాసుకొచ్చారు.

ఆ గాయం వెనక...

అప్పట్లో ఓవల్ ఆఫీసులో భేటీ సందర్భంగా గాయాలైన కుడి అరచేయిని ట్రంప్ వీలైనంతగా కప్పుకుంటూ మీడియా కంటబడ్డారు. దక్షిణ కొరియా అధ్యక్షునితో భేటీ సందర్భంగా కుడి చేయి వెనకవైపు గాయంతో కనిపిస్తున్న ట్రంప్ ఫొటోలు తాజాగా విపరీతంగా ట్రెండయ్యాయి. ఆయన దీర్ఘకాలంగా నరాల బలహీనతతో బాధ పడుతున్నట్టు తాజాగా జరిపిన వార్షిక ఆరోగ్య పరీక్షల్లో తేలింది. 70 ఏళ్ల పైబడ్డ వారిలో ఇది సాధారణమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలినా లెవిట్ అప్పట్లో అన్నారు. ట్రంప్ నరాల సమస్య పెద్ద విషయమేమీ కాదంటూ ఆయన వ్యక్తిగత వైద్యుని పేరిట ఒక లేఖ నోట్‌ను కూడా ప్రభుత్వం హడావుడిగా విడుదల చేసింది. అంతకుముందు గత ఫిబ్రవరిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో భేటీ సందర్భంగా కూడా ట్రంప్ కుడి చేయి ఇలాగే వార్తల్లో నిలిచింది. దానికి కొట్టొచ్చినట్టుగా కన్పించే స్థాయిలో మేకప్ వేసుకున్న వైనాన్ని అంతా గమనించారు.

టారిఫ్‌లు అక్రమం

అమెరికా అప్పీళ్ల కోర్టు సంచలన తీర్పు

- ట్రంప్‌కు శరాఘాతం
- యూఎస్ సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్న ట్రంప్ సర్కార్

వాషింగ్టన్: శత్రుదేశాలు, మిత్ర దేశాలు అనే తేడా లేకుండా ఎడాపెడా టారిఫ్‌ల వాతలు పెట్టిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అక్కడి అప్పీళ్ల కోర్టు షాక్ ఇచ్చింది. అధికారాలను మితిమీరి వాడేశారని, ఇలా టారిఫ్‌లు పెంచడం పూర్తిగా అక్రమమని వాషింగ్టన్‌లోని 'యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఫర్ ది ఫెడరల్ సర్క్యూట్' శుక్రవారం తీర్పు చెప్పింది. ''ప్రపంచంలోని ప్రతి దేశంపై ఇష్టారీతిన అంతర్జాతీయ టారిఫ్‌లు పెంచేసే అధికారం, అర్హత అధ్యక్షుడికి లేవు'' అని జడ్జీలు 7–4 మెజార్టీతో తీర్పు చెప్పారు. అధిక టారిఫ్‌లను తప్పుబడుతూ మేలో న్యూయార్క్‌లోని ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును మేం సమర్థిస్తున్నామని మెజారిటీ జడ్జీలు తమ తీర్పులో అభిప్రాయపడ్డారు. అమెరికా అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం(ఐఈఈపీఏ) ప్రకారమే ఈ టారిఫ్‌లు పెంచామన్న ట్రంప్ ప్రభుత్వం చేసిన వాదనలను జడ్జీలు తోసిపుచ్చారు. ఐఈఈపీఏ చట్టానికి విరుద్ధంగా అధ్యక్షుడు నిర్ణయాలు తీసుకున్నారు. అధికారాలను మితిమీరి ఉపయోగించారు. ఇలా భూగోళం మీది ప్రతి ఒక్క దేశంపై టారిఫ్ మోపకూడదు. పెంచిన టారిఫ్‌లను తొలగిస్తే ఇప్పటికిప్పుడే అమెరికా ఆర్థికవ్యవస్థ చిక్కుల్లో పడుతుంది. అందుకే అక్టోబర్ 14వ తేదీదాకా యథాతథ స్థితిని కొనసాగిస్తాం. ఆలోపు ఈ కేసును యూఎస్ సుప్రీంకోర్టు పరిశీలించాలని కోరుతున్నాం'' అని 127 పేజీల తీర్పులో అప్పీళ్ల కోర్టు తెలిపింది.

తీర్పుపై దుమ్మెత్తిపోసిన ట్రంప్

తన నిర్ణయాలకు వ్యతిరేకంగా వెలువడిన కోర్టు తీర్పుపై వెంటనే ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఆరోపణలు గుప్పించారు. ''తీర్పు తర్వాత సైతం నేను విధించిన టారిఫ్‌లు ఇంకొన్ని రోజులు అమల్లోనే ఉండబోతున్నాయి. పక్షపాతధోరణితోనే అప్పీళ్ల కోర్టు టారిఫ్‌లను తప్పుబట్టింది. అప్పీళ్ల కోర్టులో తీర్పు వ్యతిరేకంగా వచ్చిన సుప్రీంకోర్టులో గెలిచి తీరతాం. చివరకు గెలిచేది మేమే. ఒకవేళ టారిఫ్‌లను తొలగిస్తే దేశంలో వినాశనం తప్పదు. అది మన ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తుంది. వాస్తవానికి మన వ్యవస్థ బలీయంగా ఉండాలి. శత్రువు, మిత్రుడు అనే తేడా లేకుండా మనపై విదేశాలు మోపిన టారిఫ్‌ల భారాన్ని, వాణిజ్య లోటును అమెరికా సహించబోదు. విదేశాల విధానాలతో మన తయారీసంస్థలు, రైతులుసహా ప్రతి ఒక్కరూ ఇబ్బందిపడుతున్నారు. మన కార్మికులతోపాటు కర్మాగారాలను పరిరక్షించాలంటే విదేశాలపై టారిఫ్‌లను పెంచడమే అత్యుత్తమ మార్గం'' అని ట్రంప్ అన్నారు.

ఇప్పుడేం జరగొచ్చు?

అప్పీళ్ల కోర్టులో కేసును ఓడిపోవడంతో ట్రంప్ వెంటనే యూఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నారు. అక్కడే ట్రంప్ సర్కార్‌కు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. యూఎస్ సుప్రీంకోర్టులోని 9 మంది జడ్జీల్లో ఆరుగురిని రిపబ్లికన్ పార్టీ ప్రభుత్వాలే నియమించాయి. ఈ ఆరుగురిలో ముగ్గురిని స్వయంగా ట్రంప్ నియమించారు. వీరంతా ట్రంప్‌కు అనుకూలంగా తీర్పు చెప్పే అవకాశముంది. అయితే ఇతర ప్రభుత్వానికి సంబంధించిన కేసులతో పోలిస్తే స్వయంగా అధ్యక్షుడు కలుగజేసుకున్న కేసులను యూఎస్ సుప్రీంకోర్టు మరింత నిశితంగా పరిశీలించే వీలుంది. అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్)ను కాదని సొంతంగా తీసుకున్న నిర్ణయాలతో వెలువడిన కార్యనిర్వాహక ఉత్తర్వుల విషయంలో సుప్రీంకోర్టు పారదర్శకంగా వ్యవహరిస్తే ఈ కేసు ఫలితం ఎటువైపు రానుందో ఇప్పుడే చెప్పడం కష్టమే. ఒకవేళ సుప్రీంకోర్టు సైతం ట్రంప్ టారిఫ్‌లు చట్టవ్యతిరేకమని తేలిస్తే అమెరికా ఆర్థికవ్యవస్థలో ఆటుపోట్లు తప్పకపోవచ్చు. అదనపు టారిఫ్‌ల కింద వసూలుచేసిన వందల బిలియన్ డాలర్లను ఆయా దేశాలకు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

సెమీకండక్టర్ రంగం అత్యంత కీలకం

ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

- షింకాన్సెన్ బుల్లెట్ రైలులో జపాన్ ప్రధానమంత్రితో ప్రయాణం
- సెమీకండక్టర్ ప్లాంట్ సందర్శన



షింకాన్సెన్ బుల్లెట్ రైలులో ప్రయాణిస్తూ ఇషిబాతో మాట్లాడుతున్న మోదీ

టోక్యో: ప్రధాని నరేంద్ర మోదీ జపాన్‌లో షింకాన్సెన్ బుల్లెట్ రైలులో ప్రయాణించారు. జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబాతో కలిసి రాజధాని టోక్యో నుంచి 300 కిలోమీటర్ల దూరంలోని సెండాయ్‌కి చేరుకున్నారు. అక్కడ సెమీకండక్టర్ ప్లాంట్‌ను సందర్శించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మోదీ తొలి రోజు శుక్రవారం ఇషిబాతో సమావేశమై, ద్వైపాక్షిక చర్చలు జరిపారు. పలు అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రెండో రోజు శనివారం టోక్యో ఎలక్ట్రాన్ లిమిటెడ్–మియాగీ(టెల్ మియాగీ)ను సందర్శించారు. సెమీకండక్టర్ల తయారీలో ఈ సంస్థ అగ్రగామిగా మారింది. సెమీకండక్టర్ల తయారీలో పరస్పరం సహకరించుకోవాలని భారత్, జపాన్ ఇప్పటికే నిర్ణయానికొచ్చాయి. భారత్‌లో ప్లాంట్ల ఏర్పాటుకు జపాన్ సాంకేతిక సహకారం అందించనుంది. అలాగే 508 కిలోమీటర్ల ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టుకు జపాన్ సహకరించేలా ఒప్పందం కుదిరింది. సెండాయ్‌లో మోదీ గౌరవార్థం ఇషిబా ప్రత్యేక విందు ఇచ్చారు. ఇండియా–జపాన్ మధ్య సహకారంలో సెమీకండక్టర్ రంగం అత్యంత కీలకమని మోదీ ఉద్ఘాటించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. టోక్యో ఎలక్ట్రాన్ ఫ్యాక్టరీలో ట్రైనింగ్ రూమ్, ప్రొడక్షన్ ఇన్నోవేషన్ ల్యాబ్‌ను సందర్శించానని, అధికారులతో మాట్లాడానని తెలిపారు. సెమీకండక్టర్ల రంగంలో భారత్, జపాన్ గత కొన్నేళ్లుగా కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాయని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఈ సహకారం మరింత పెరగాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయంగా సెమీకండక్టర్ల సరఫరాలో టెల్–మియాగీ ప్రాధాన్యతను అధికారులు మోదీకి వివరించారు.

చైనాలో అడుగుపెట్టిన మోదీ

తియాంజిన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏడేళ్ల తర్వాత చైనాలో అడుగుపెట్టారు. జపాన్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకొని శనివారం సాయంత్రం చైనాకు చేరుకున్నారు. ఉత్తర చైనాలోని తియాంజిన్‌లో ఆదివారం, సోమవారం జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తోపాటు ఇతర దేశాల అధినేతలతో సమావేశమవుతారు. తియాంజిన్‌లో మోదీకి ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు సంప్రదాయ రీతిలో సంగీత, నృత్య కార్యక్రమాలతో స్వాగతం పలికారు. జిన్‌పింగ్‌తోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉంది. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం భారత్, చైనా కలిసికట్టుగా పనిచేయాలని, పరస్పరం సహకరించుకోవాలని మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. భారత ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం 50 శాతం టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో భారత్, చైనా మధ్య సంబంధాలు బలపడుతుండడం, మోదీ–జిన్‌పింగ్ భేటీ అవుతుండడాన్ని ప్రపంచదేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ప్రధాని మోదీ చివరిసారిగా 2018లో చైనాలో పర్యటించారు. ఎస్సీఓ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. అలాగే చైనా అధినేత జిన్‌పింగ్ 2019 అక్టోబర్‌లో భారత్‌లో పర్యటించారు.



తియాంజిన్ ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి సాదర స్వాగతం

గణనాథుడి చిత్రాన్ని షేర్ చేసిన చైనా

ప్రధాని మోదీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్‌లోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యూ జింగ్.. వినాయకుడి ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇరుదేశాలు కళలు, విశ్వాసం, సంస్కృతులను పంచుకున్నాయని వెల్లడించారు. ఇవి చైనాలోని టాంగ్ రాజవంశం కాలంలో, మొగావో గుహల్లోని గణనాథుడి ప్రతిమలు అని పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య శతాబ్దాలుగా బలమైన సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని చెప్పడానికి ఇవి అద్భుతమైన ప్రతీకలు అని యూ జింగ్ స్పష్టంచేశారు.

సనాపై ఇజ్రాయెల్ దాడులు.. హౌతీ రెబల్స్ ప్రధాని మృతి



కైరో: యెమెన్ రాజధాని సనాపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హౌతీ తిరుగుబాటుదారులు ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రధానమంత్రి అహ్మద్ అల్ రహావి చనిపోయారు. గురువారం జరిగిన ఈ దాడుల్లో రహావితోపాటు పలువురు మంత్రులు కూడా ప్రాణాలు కోల్పోయారని ఇరాన్ అండతో చెలరేగుతున్న హౌతీ రెబల్స్ ప్రకటించారు. 2024 ఆగస్టు నుంచి రహావి ప్రధాని బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఏడాది కాలంలో తమ ప్రభుత్వ పనితీరు, కార్యక్రమాల అమలుపై సమీక్ష జరుపుతుండగా ఈ దాడి జరిగినట్లు హౌతీలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌతీ ఉగ్ర పాలకులే లక్ష్యంగా సనాపై సైనిక దాడి జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. గాజాలో హమాస్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడులను ఖండిస్తూ, పాలస్తీనియన్లకు సంఘీభావంగా హౌతీ రెబల్స్ ఇజ్రాయెల్‌పై క్షిపణి, రాకెట్ దాడులకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే.

ఉక్రెయిన్ పార్లమెంట్ మాజీ స్పీకర్ హత్య



కీవ్: ఉక్రెయిన్ పార్లమెంట్ మాజీ స్పీకర్ ఆంద్రీ పరుబియ్ గుర్తు తెలియని దుండగుడి కాల్పుల్లో మృతి చెందారు. నగరంలోని ఫ్రాంకివ్‌స్కీ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుంది. ఆంద్రీ పరుబియ్ హత్యను దారుణ ఘటనగా అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభివర్ణించారు. హంతకుడిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు వెంటనే రంగంలోకి దిగాయన్నారు. 2013–14 మధ్య జరిగిన యూరో మైదాన్ ప్రజా ఉద్యమంలో ఆంద్రీ పరుబియ్ కీలకంగా వ్యవహరించారు. ప్రజా ఉద్యమాల వల్లే అప్పటి ఉక్రెయిన్ అధ్యక్షుడు యనుకోవిచ్ దేశం విడిచి పారిపోవడం, క్రిమియాను రష్యా ఆక్రమించుకోవడంతోపాటు రష్యా సరిహద్దు ప్రాంతాల్లో అంతర్యుద్ధం మొదలయ్యాయి.

రష్యా మళ్లీ తీవ్ర దాడులు

ఉక్రెయిన్‌పై మరోసారి రష్యా భారీ దాడులకు పాల్పడింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఏకంగా 537 డ్రోన్లు, 45 వరకు క్షిపణులను ప్రయోగించింది. జపొరిఝియా ప్రాంతంపై జరిగిన దాడుల్లో ఒకరు చనిపోగా పలువురు చిన్నారులు సహా డజన్ల కొద్దీ పౌరులు గాయాలపాలయ్యారని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది.

జపాన్ పీఎం దంపతులకు మోదీ కానుకలు

ఆంధ్రప్రదేశ్‌లో దొరికే అరుదైన చంద్రశిల బౌల్స్ అందజేత

న్యూఢిల్లీ: జపాన్‌లో పర్యటించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం జపాన్ ప్రధానమంత్రి షిగేరు ఇషిబాకు గౌరవప్రదంగా కొన్ని విలువైన కానుకలు బహూకరించారు. షిగేరు సతీమణికి సైతం మోదీ కానుక అందజేశారు. కశ్మీర్‌లో లభించే చేతితో అల్లిన అత్యంత నాణ్యమైన పశ్మీనా ఉన్ని శాలువను షిగేరు సతీమణి యోషికోకు బహూకరించారు. లద్దాఖ్‌లోని ఛాంగ్‌థంగీ జాతి మేక ఉన్నితో ఈ పశ్మీనా శాలువను తయారుచేశారు. ఈ శాలువ అత్యంత తేలికగా, మృదువుగా, వెచ్చగా ఉంటుంది. గతంలో కశ్మీరీ రాజుల కాలంలో ఈ పశ్మీనా ఉన్ని దుస్తులను ఎంతగానో ఇష్టపడేవారు. అదే సంస్కృతిని కశ్మీరీలు పరంపరగా కొనసాగిస్తూ హస్తకళను జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. శ్వేతవర్ణ అంచుతో, ఎరుపు, గులాబి రంగుల మేళవింపుతో అందంగా ఈ శాలువాను తయారుచేశారు. కాగితపు గుజ్జు, జిగురు ఇతర సామగ్రితో అందంగా రూపొందించిన చిన్న పెట్టెలో పెట్టి ఈ శాలువాను ఆమెకు అందజేశారు. ఈ చిన్న పెట్టె మీద సైతం పుష్పాలు, పక్షుల చిత్రాలను అందంగా పెయింటింగ్ వేశారు.

జపాన్ ఆహార అలవాట్లకు అనువుగా..

ఆంధ్రప్రదేశ్‌లో దొరికే అరుదైన గోధుమరంగు మూన్‌స్టోన్ రాయితో చేసిన రామెన్ గిన్నెను జపాన్ ప్రధానికి మోదీ బహూకరించారు. ఈ రామెన్ బౌల్‌ను పెట్టేందుకు రాజస్తానీ పార్చిన్‌కారి శైలిలో శ్వేత వర్ణ మక్రానా పాలరాయితో ఒక బేస్‌ను తయారుచేశారు. ఈ బేస్‌పై అరుదైన చిన్న రాళ్లను పొదిగారు. ఈ బౌల్‌లో ఆహారాన్ని జపాన్ శైలిలో తినేందుకు రెండు చాప్‌స్టిక్‌లను తయారుచేశారు. వాటి కొనలను వెండితో రూపొందించారు. పెద్ద బౌల్‌కు తోడుగా నాలుగు చిన్న బౌల్‌లను అందజేశారు. జపాన్‌లోని డోంబురీ, సోబా సంప్రదాయాల్లో ఇలా ఒక పెద్ద గిన్నె, నాలుగు చిన్న గిన్నెలను వాడతారు. మూన్‌స్టోన్ రాయి ప్రేమ, సమతుల్యత, రక్షణలను సూచిస్తుంది.



మోదీ బహూకరించిన చంద్రశిల బౌల్స్, చాప్‌స్టిక్స్

చొరబాట్ల స్పెషలిస్టు బాగూ ఖాన్ హతం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కీలక ఉగ్రవాది, చొరబాట్ల స్పెషలిస్టు, మానవ జీపీఎస్ బాగూ ఖాన్ అలియాస్ సమందర్ చాచాతోపాటు మరో ముష్కరుడు హతమయ్యాడు. నార్ ప్రాంతంలో భారత భూభాగంలోకి ప్రవేశిస్తుండగా అడ్డుకున్న భద్రతా సిబ్బందిపై వారు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో వారిద్దరూ మృతి చెందారు. 100కుపైగా చొరబాట్ల వెనుక బాగూ ఖాన్ ప్రోద్బలం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గురెజ్ సెక్టార్‌తోపాటు నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వెంట భారత్‌లోకి అక్రమ చొరబాట్లను ప్రోత్సహించాడని తెలిపారు. బాగూ ఖాన్ హిజ్బుల్ కమాండర్‌గా పనిచేశాడు. 1995 నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో మకాం వేసి, ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగించాడు. ఎన్నోసార్లు భారత భద్రతా దళాలకు చిక్కుకుండా త్రుటిలో తప్పించుకున్నాడు.

ఎమ్మెల్యే పింఛను కోసం ధన్‌ఖడ్ దరఖాస్తు

ఆయనకు రూ.42 వేల పెన్షన్ అందుతుందన్న అధికారులు



జైపూర్: రాజస్తాన్ మాజీ ఎమ్మెల్యే అయిన తనకు పింఛనును పునరుద్ధరించాలని మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దరఖాస్తు చేసుకున్నారు. కిషన్‌గఢ్ నియోజకవర్గం నుంచి 1993–1998 కాలంలో కాంగ్రెస్ శాసనసభ్యునిగా ఆయన కొనసాగారు. 2019 జూలై వరకు మాజీ ఎమ్మెల్యే పింఛను కూడా అందుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులవడంతో ఆ పింఛను నిలిచిపోయింది. అనంతరం ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. 2022 నుంచి ఆ పదవిలో కొనసాగుతున్న ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలతో జూలై 21వ తేదీన రాజీనామా చేయడం తెల్సిందే. అయితే, నిలిచిపోయిన మాజీ ఎమ్మెల్యే పింఛనును పునరుద్ధరించాలని రాజస్తాన్ అసెంబ్లీ సెక్రటేరియట్‌కు తాజాగా విజ్ఞాపన పంపారని అధికార వర్గాలు తెలిపాయి. ఉపరాష్ట్రపతి పదవికి చేసిన రాజీనామాను ఆమోదించినప్పటికీ నుంచి ఆయనకు మాజీ ఎమ్మెల్యే హోదాలో పింఛను అందించే ప్రక్రియను ప్రారంభించామని వివరించాయి. రాజస్తాన్‌లో ఒక దఫా ఎమ్మెల్యేగా పనిచేసిన వారికి నెలకు రూ.35 వేల చొప్పున పెన్షన్ అందిస్తారు. అదనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన పర్యాయాలు, వయస్సును బట్టి పింఛను మారుతూంటుంది. 70 ఏళ్లు పైబడిన వారికి పింఛనులో 20 శాతం పెంపుదల ఉంటుంది. ప్రస్తుతం ధన్‌ఖడ్ వయస్సు 74 ఏళ్లు అయినందుకు మాజీ ఎమ్మెల్యే హోదాలో పింఛను నెలకు రూ.42 వేల చొప్పున అందుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు, మాజీ ఉపరాష్ట్రపతి హోదాలో నెలకు రూ.2 లక్షల వరకు, మాజీ ఎంపీగా నెలకు రూ.31 వేల పింఛను అందుకునేందుకు ఆయన అర్హులని అధికారులు తెలిపారు. 1980ల్లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ధన్‌ఖడ్ 1990ల్లో లోక్‌సభకు ఎన్నికై, కేంద్ర మంత్రిగా పనిచేశారు.

50 కంటే తక్కువ ఆయుధాలకే తోకముడిచిన పాక్

'సిందూర్'ను ఆపాలని వేడుకుంది • ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్‌ను నాలుగు రోజుల్లోనే ముగించడానికి గల కారణాన్ని వైస్ చీఫ్ ఆఫ్ ద ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ బయటపెట్టారు. భారత వైమానిక దళం(ఐఏఎఫ్) 50 కంటే తక్కువ ఆయుధాలు ప్రయోగించగానే అది తట్టుకోలేక పాకిస్తాన్ కాళ్లబేరానికి వచ్చిందని, ఆపరేషన్ నిలిపివేయాలంటూ మనల్ని వేడుకుందని తెలిపారు. పాకిస్తాన్ భూభాగంలోని ఉగ్రవాద శిక్షణ శిబిరాలు, సైనిక స్థావరాలను మన సైన్యం ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. శనివారం ఢిల్లీలో ఎన్‌డీటీవీ రక్షణ సదస్సులో నర్మదేశ్వర్ తివారీ మాట్లాడారు. మే 9, 10వ తేదీల్లో భారత సైన్యం పాకిస్తాన్ సైన్యంపై పూర్తి ఆధిపత్యం సాధించినట్లు తెలిపారు. పాక్ దాడులను గట్టిగా తిప్పికొట్టినట్లు అన్నారు. 50 కంటే తక్కువ ఆయుధాలకే పాక్ సైన్యం తోకముడిచిందని, ఇలాంటి పరిణామం గతంలో ఎప్పుడూ జరగలేదని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్‌లో నర్మదేశ్వర్ తివారీ కీలకపాత్ర పోషించారు. వైమానిక దళానికి ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేశారు. 1971 నాటి యుద్ధంలో ఛేదించని లక్ష్యాలను సైతం ఆపరేషన్ సిందూర్‌లో ఛేదించామని ఆయన పేర్కొన్నారు. అత్యంత కచ్చితత్వంతో కూడిన దాడులతో పాకిస్తాన్‌ను చావుదెబ్బ కొట్టామని వ్యాఖ్యానించారు. ఎక్కడా గురితప్పకుండా ప్రతి ఆయుధాన్ని జాగ్రత్తగా ప్రయోగించామని, మన వ్యూహకర్తల, సైనికుల సామర్థ్యానికి ఇది నిదర్శనమని అని వివరించారు.

బిహార్ సీఎం అభ్యర్థిని నేనే

రాహుల్ సమక్షంలోనే తేజస్వీ వ్యాఖ్యలు



ఆరా(బిహార్): బిహార్‌లో మహాఘట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తానేనంటూ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించుకున్నారు. శనివారం ఆరా జిల్లాలో ఓటర్ అధికార్ యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ సమక్షంలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. బిహార్ సీఎం అభ్యర్థి ఎవరన్న దానిపై రాహుల్ గాంధీ ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. ఆరా ర్యాలీలో తేజస్వీ మాట్లాడుతూ..తాను ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాల్నే సీఎం నితీశ్ కుమార్ అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'ముందు నేను వెళ్తుంటే ప్రభుత్వం వెనుక వస్తోంది. కాపీ కొట్టే సీఎం కావాలా? ఒరిజినల్ సీఎం కావాలా?' అంటూ ప్రజలను ప్రశ్నించారు. మహాఘట్ బంధన్ తరఫున అసలైన సీఎం అభ్యర్థి తానేనంటూ ప్రకటన చేశారు. రాహుల్ గాంధీ మాత్రం మౌనంగా ఉండిపోయారు. దీంతో తేజస్వీ...కాంగ్రెస్ జాతీయ పార్టీయే అయినప్పటికీ బిహార్‌లో ఆర్జేడీ పెద్దన్న అని, తమదే పైచేయి అన్న అర్థంలో మాట్లాడారు.

ట్రంప్ భారత్‌కు వచ్చే అవకాశాల్లేవు

న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడి


న్యూయార్క్: భారత్‌లో ఈ ఏడాది చివర్లో జరిగే క్వాడ్ శిఖరాగ్రానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే అవకాశాలు లేవని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. గత కొద్ది నెలలుగా ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో ఆ పత్రిక ఓ కథనంలో ఈ మేరకు విశ్లేషించింది. దీనిపై అమెరికా, భారత్ అధికారులు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. నవంబర్‌లో భారత్ ఆతిథ్యంలో జరిగే శిఖరాగ్రంలో ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాల నేతలు పాల్గొనాల్సి ఉంది. భారత్–పాకిస్తాన్‌ల మధ్య కొనసాగిన నాలుగు రోజుల సంక్షోభం తన జోక్యంతోనే ముగిసిందంటూ ట్రంప్ పదేపదే చెప్పుకోవడం, భారత్ ఖండించడాన్ని న్యూయార్క్‌టైమ్స్ కథనంలో ప్రస్తావించింది. దీనిపై ట్రంప్ విషయంలో మోదీ సహనం కోల్పోయారని వ్యాఖ్యానించింది. పాకిస్తాన్ తనను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయడాన్ని ప్రస్తావించిన ట్రంప్..భారత్ కూడా అలాగే చేయాలని ఆశించి భంగపడ్డారని విశ్లేషించింది. ఇదే ఇద్దరి మధ్య అంతరాన్ని పెంచేందుకు ఆజ్యం పోశాయని పేర్కొంది. వీటికి ప్రతీకారంగానే రష్యా ఆయిల్ కొనుగోలు సాకుతో భారత్‌పై విపరీతంగా టారిఫ్‌ల భారం మోపారని తెలిపింది. టారిఫ్‌లపై చర్చలు కొలిక్కి రాకపోయేసరికి విసుగెత్తిన ట్రంప్ పలుమార్లు మోదీకి ఫోన్ చేసినా ఆయన స్పందించలేదని పేర్కొంది. అందుకే, భారత్–అమెరికాల మధ్య సంబంధాలు దిగజారడానికి రష్యా ఆయిల్ కొనుగోలు చేయడానికి మించిన కారణాలున్నట్లు విశ్లేషకులు సైతం అంటున్నారని ఆ కథనం వివరించింది.

కశ్మీర్‌లో మరోసారి మేఘ విస్ఫోటం

- రియాసీ, రాంబన్ జిల్లాల్లో విరిగిపడ్డ కొండచరియలు
- కుటుంబంలోని ఏడుగురు సహా 11 మంది మృతి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌పై ప్రకృతి ప్రకోపం కొనసాగుతోంది. శనివారం రియాసి, రాంబన్ జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లో క్లౌడ్ బరస్ట్, కొండచరియలు విరిగి పడిన రెండు వేర్వేరు ఘటనల్లో కుటుంబంలోని ఏడుగురు సహా మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. గత 15 రోజులుగా భారీ వర్షాలు, వరదలతో కశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో సంభవించిన నష్టం నుంచి ప్రజలు తేరుకోకమునుపే తాజా విషాదం చోటుచేసుకుంది.

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



గరిక గణపతి

శంకరపట్నం: మొలంగూర్ శివాలయంలో శనివారం వినాయకుడిని లక్ష ఉండ్రాళ్లు, గరిక పోసలతో అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



చికిత.. 'అగ్రశ్రేణి బంగారం'

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు: ఆర్చరీ పోటీల్లో ప్రపంచ క్రీడాకారులను మట్టి కరిపించిన చికిత శనివారం స్వగ్రామం చేరుకున్నారు. ఆమెను పలువురు సన్మానించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.0/26.0


వాతావరణం

జిల్లాలో వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

వామ్మో.. బేకరీలు

- ఫుడ్‌సేఫ్టీ ఆకస్మిక తనిఖీల్లో లోపాల గుర్తింపు



నగరంలోని ఓ హోంఫుడ్స్ తయారీ కేంద్రంలో నాసిరకంగా ఉన్న ఆలుగడ్డలు

కరీంనగర్ అర్బన్: ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నా వ్యాపారుల్లో ఎలాంటి జంకు లేకపోవడం విడ్డూరం. నాసిరకం, నిల్వ ఉన్న పదార్థాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తుండగా అవే లోపాలు, మోసాలు వెలుగుచూస్తున్నాయి. శనివారం నగరంలోని రెస్టారెంట్లు, బేకరీలు, స్నాక్స్ తయారీ కేంద్రాల్లో తనిఖీ నిర్వహించారు. ముకరంపురలోని నారాయణి బేకరీలో కేక్‌లకు వాడే కేక్ స్పాంజ్‌ను బేకింగ్ చేసే ప్రక్రియలో న్యూస్ పేపర్‌ను వినియోగించారని గుర్తించారు. ఫుడ్ కలర్స్ కాలం చెల్లినవిగా, కేక్స్‌పైన లేబులింగ్ సరిగా లేదని గుర్తించారు. కాలం చెల్లిన బాదం మిల్క్ బాటిల్స్‌ను పారబోసినట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు రోహిత్‌రెడ్డి, అంకిత్‌రెడ్డి వివరించారు. అదే ప్రాంతంలోని టర్నింగ్ పాయింట్ స్వగృహ హోమ్ ఫుడ్స్ కిచెన్ అపరిశుభ్రంగా ఉందని గుర్తించారు. నాసిరకం ఆయిల్ వాడుతున్నారని తేలింది. మార్కెట్ రోడ్డులోని కలఃన బేకరీ, స్వీట్ హౌజ్‌లో కాలం చెల్లిన ఫుడ్ కలర్స్ వాడినట్లు గుర్తించారు. వనస్పతి పాకెట్స్, కేక్‌లో వాడే కలర్డ్ చాక్లెట్స్, వర్మిసెల్లి ప్యాకెట్లు కాలం చెల్లినవిగా గుర్తించి, నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వివరించారు.


నిరక్షరాస్య మహిళలను 'ఉల్లాస్'లో నమోదు చేయండి

కరీంనగర్ అర్బన్: నిరక్షరాస్య మహిళలను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శనివారం నగరంలోని డీఆర్డీవో భవన్‌లో ఉల్లాస్ యాప్ నమోదు ప్రగతిపై సమీక్షించారు. చదువు మానేసిన మహిళలను ఓపెన్ స్కూల్‌లో, వృద్ధ మహిళలు, దివ్యాంగులు, కిషోర బాలికలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించాలన్నారు. ఉల్లాస్ యాప్ నమోదులో రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో ఉన్నామని, జిల్లాను ప్రథమస్థానానికి తీసుకురావాలని కోరారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా చదువు మానేసిన, ఫెయిల్ అయిన మహిళలు ఎస్సెస్సీ, ఇంటర్ చదివేలా ప్రోత్సహించి రిజిస్ట్రేషన్, అడ్మిషన్ తీసుకోవాలని తెలిపారు. సదరం, పెన్షన్ జాబితా ఆధారంగా 60 ఏళ్ల పైబడిన అర్హత గలవారితో వృద్ధుల సంఘాలను, దివ్యాంగులతో దివ్యాంగుల సంఘాలను ఏర్పాటు చేయాలని అన్నారు.

శాతవాహనలో డీజీలాకర్‌పై వర్క్‌షాప్

కరీంనగర్‌క్రైం: శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో యూజీసీ ఆఫైర్స్ సెల్ ఆధ్వర్యంలో శనివారం డిజిలాకర్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. 'ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్స్ రిజిస్ట్రీ'ని డిజీలాకర్ యాప్‌తో అనుసంధానం చేస్తూ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఒక పర్మినెంట్ అకౌంట్ ప్రొఫైల్‌ను తయారుచేసే విధానంపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ రవికుమార్ మాట్లాడుతూ.. డీజీ లాకర్‌తో విద్యార్థులు తమ సర్టిఫికెట్లు, ఇతర సమాచారాన్ని డిజిటల్ రూపంలో పొందుపరుచుకోవచ్చని సూచించారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: మరమ్మతు పనుల నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల వరకు 11 కె.వీ.కోర్టు రోడ్ ఫీడర్ పరిధి లోని బ్యాంక్ కాలనీ రోడ్ నంబర్ 1 నుంచి 4 వరకు, ఎస్ఆర్ఆర్ కళాశాల రోడ్డు నుంచి ఆర్టీ సీ వర్క్‌షాపు వరకు గల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఏ పంజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

యువతకు శిక్షణ

విద్యానగర్(కరీంనగర్): జిల్లాలోని గ్రామీణ గిరిజన నిరుద్యోగ యువతకు స్వామి రామానంద తీర్థ రూరల్ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి నిమిత్తం 105 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ అధికారి సంజీవ్ శనివారం తెలిపారు. డిగ్రీ చదివిన వారికి అకౌంట్స్ అసిస్టెంట్ ట్యాలీలో, ఇంటర్ పాసైన అయిన వారికి కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో, పదోతరగతి చదివిన వారికి ఆటో మొబైల్, సోలార్ సిస్టం ఇన్‌స్టలేషన్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 1వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు, బయోడేటాతో యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లోని స్వామి రామానంద తీర్థరూరల్ సంస్థలో సంప్రదించాలని సూచించారు.

వరద దండిగా.. ప్రాజెక్టులు నిండుగా..

- గరిష్ట స్థాయికి ఎల్లంపల్లి, మధ్య, దిగువ మానేరు డ్యాంలు
- మోయతుమ్మెద, మూలవాగు నుంచి ఎల్ఎండీకి తగ్గిన వరద
- ఎల్లంపల్లికి అనూహ్యంగా పెరిగిన వరద
- క్రమంగా దిగువకు నీటిని నిలిపివేస్తున్న అధికారులు
- వేసవి వరకు సాగు, తాగునీటికి ఇబ్బంది లేదంటున్న అధికారులు

ప్రాజెక్టు రిపోర్ట్



నిండు కుండలా ఎల్లంపల్లి ప్రాజెక్టు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టులు గరిష్ట నీటిమట్టానికి చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి, మానేరుపై నిర్మించిన ఎగువ, మధ్య, దిగువమానేరు ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటితో కళకళలాడుతున్నాయి. కామారెడ్డి, ఎగువ ప్రాంతాలు, ఎస్సారెస్పీ, వరద కాలువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. దీంతో మానేరు ప్రాజెక్టుల నుంచి దిగువనకు నీటి విడుదల నిలిపివేశారు. ఎగువమానేరు పూర్తిస్థాయి నీటి మట్టం 2టీఎంసీలు కాగా, ప్రస్తుతం అదేస్థాయిలో ఉంది. ప్రాజెక్టులోకి 5,798 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. 5,798 క్యూసెక్కులు కిందికి వదులుతున్నారు. మిడ్‌మానేరు నుంచి నీటి విడుదల నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 27 టీఎంసీలు కాగా 25 టీఎంసీల నీరుంది. ప్రాజెక్టుకు కీలకమైన మూలవాగు, వరద కాలువ, మానేరు నదుల నుంచి ఇప్పటికీ 20వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. మొన్న వర్షాల సమయంలో ఇన్‌ఫ్లో 60వేల క్యూసెక్కుల వరకు వెళ్లిన విషయం తెలిసిందే. 12,930 క్యూసెక్కుల ఔట్‌ఫ్లోను వదులుతున్నారు. లోయర్‌మానేరు డ్యాంకు ఇన్‌ఫ్లో దాదాపుగా నిలిచి పోయింది. నిన్న మొన్నటి వరకు 50వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మిడ్‌మానేరు నీటిని నిలిపేయగానే 293 క్యూసెక్కులకు పడిపోయింది. మోయతుమ్మెద, మానేరు నుంచి వరద నిలిచిపోయింది. ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండిన నేపథ్యంలో వా నాకాలం, యాసంగి వరకు వ్యవసాయానికి ఇబ్బంది లేదని నీటిపారుదలశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రధాన ప్రాజెక్టుల్లో నీటిమట్టం(టీఎంసీల్లో)

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం
ఎగువమానేరు	2	2
మధ్యమానేరు	27	25
లోయర్‌మానేరు	24	21
ఎల్లంపల్లి	20	13

ఎల్లంపల్లికి పోటెత్తిన వరద

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద అనూహ్యంగా పెరిగింది. మహారాష్ట్రలో కురుస్తోన్న భారీ వర్షాలతో గోదావరికి వరదపోటు పెరగడమే ఇందుకు కారణం. బుధవారం వరకు 5 లక్షల క్యూసెక్కుల వరకు వచ్చిన వరద ప్రస్తుతం 7,60,652 క్యూసెక్కులకు పెరిగింది. కాగా 7,35,847 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 20 టీఎంసీలుకాగా, 13.33 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నిల్వ ఉన్న సమయంలో ఎగువ నుంచి ఆకస్మికంగా భారీస్థాయిలో వచ్చిన వరదతో గోదావరిఖని పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. అందుకే, కేవలం 13 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచి 62 గేట్లకుగాను 37 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు.



ఎగువ మానేరు




మధ్యమానేరు



దిగువమానేరు





మంచాలపై జ్వరపీడితులు

- జిల్లాను వణికిస్తున్న జ్వరాలు
- ఇప్పటి వరకు 52 డెంగీ కేసులు నమోదు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

వైరల్ వర్రీ





కరీంనగర్‌టౌన్:

వాతావరణంలో నెలకొన్న మార్పులతో జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. డెంగీ, వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయి. నగరంతో పాటు పల్లెల్లో జ్వరాలవ్యాప్తి అధికంగా ఉంది. ప్రతీఇంట్లో ఒకరిచొప్పున మంచం పట్టారు. కొందరు పీహెచ్‌సీలకు వెళ్తుండగా, మరికొందరు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాసుపత్రి (జీజీహెచ్), ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇంకొందరు ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

జిల్లాలో డెంగీ కేసులు ఇలా

జిల్లావ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ వివరాల ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 52 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే డెంగీ కేసులతో కలిపితే సంఖ్య మూడింతలు ఉండే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. వైరల్ జ్వరాల బారిన పడినవారు వేలసంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది.

అంతటా జ్వరపీడితులు

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో జ్వర పీడితులు అధికంగా నమోదవుతున్నారు. వాతావరణ మార్పులు ఇందుకు కారణంగా వైద్యులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన జోరువానలతో దోమలు వృద్ధిచెంది, జ్వర బాధితులు పెరుగుతున్నారు. రెండుమూడు రోజుల కన్నా ఎక్కువగా జ్వరం ఉన్నవారు జీజీహెచ్‌కు వచ్చి వైద్యం పొందుతున్నారు. వీరంతా వైరల్‌జ్వరాలతోనే వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

భయపెడుతున్న ప్లేట్‌లెట్ల సంఖ్య

డెంగీ, వైరల్ జ్వరాల బారిన పడిన వారికి ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోతున్నాయి. 50వేలకు తగ్గిపోగానే హడలిపోయి ఆస్పత్రులకు పరుగు తీస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్న రోగులకు బిల్లులు తడిసిమోపెడవుతున్నాయి. రెండు మూడు రోజుల పాటు అడ్మిట్ ఉంటే రోజుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. వారం రోజులకే రూ.లక్ష వరకు బిల్లు వేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ఆసుపత్రులు కిటకిట

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర పీడితులతో నిండిపోతున్నాయి. జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు 350 వరకు ఉన్నాయి. ప్రభుత్వ ప్రధానాసుపత్రితో పాటు 18 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 6 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 కమ్యూనిటీ ఆసుపత్రులు, రెండు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. ఓపీలో కొందరు చికిత్స పొందుతుండగా, మరికొందరు ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు.

చికిత్స అందిస్తున్నాం



సీజనల్ వ్యాధులతో జిల్లాలో జ్వరపీడితుల సంఖ్య అధికమవుతోంది. రెండు మూడు రోజుల పాటు జ్వరం తగ్గకపోవడంతో ఆసుపత్రికి వస్తున్నారు. పరిస్థితిని బట్టి చేర్చుకొని చికిత్స అందిస్తున్నాం. ఆసుపత్రిలో మందులు, వైద్యులకు కొరత లేదు. ప్రైవేటుకు వెళ్లి జేబులు గుల్లచేసుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి నాణ్యమైన వైద్యం పొందాలి.

– డాక్టర్ వీరారెడ్డి, జీజీహెచ్, సూపరింటెండెంట్, కరీంనగర్

నిరీక్షణ.. నిరసన



శంకరపట్నం మండలం గద్దపాక సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన మహిళలు

- యూరియా కోసం రైతుల ఆందోళన
- అధికారుల వైఖరిపై చెర్లభూత్కూర్‌లో ధర్నా
- నగునూరులో ఆగ్రోస్ కేంద్రం ఎదుట పాసు పుస్తకాల వరుస
- గన్నేరువరంలో పోలీసు పహారాలో పంపిణీ
- గద్దపాకలో బారులు తీరిన మహిళా రైతులు

కరీంనగర్‌రూరల్/గన్నేరువరం/శంకరపట్నం: యూరియా కోసం రైతుల కష్టాలు కొనసాగుతున్నాయి. యూరియా కోసం ఉదయం నుంచి నిరీక్షించిన రైతులు ఓపిక నశించి అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ధర్నా చేపట్టారు. పోలీసు బందోబస్తుతో యూరియా పంపిణీ చేశారు. దుర్శేడ్ సహకార సంఘం, తీగలగుట్టపల్లిలోని డీసీఎంఎస్, నగునూరులోని ఆగ్రోస్ కేంద్రం, చెర్లభూత్కూర్‌లోని ఎరువుల గోదాం వద్ద యూరియా కోసం శనివారం ఉదయం 7గంటల నుంచే రైతులు తరలివచ్చారు. గతంలో ఉదయం 8గంటల నుంచే పంపిణీ చేయగా శనివారం 10గంటల నుంచి ఏఈఓలు మాత్రమే యూరియా పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దుకాణాలు తీయకముందే నగునూరు ఆగ్రోస్ కేంద్రం ఎదుట పాసు పుస్తకాలు వరుసలో పెట్టారు. అధికారుల నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ చెర్లభూత్కూర్‌లో గోదాం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. శనివారం పాసు పుస్తకాల జిరాక్సులు ఇచ్చిన రైతులకు ఆది, సోమవారాల్లో యూరియా పంపిణీ చేస్తామని ఏవో సత్యం తెలిపారు. గన్నేరువరం సహకార సంఘం ఎరువుల దుకాణం ఎదుట రైతులు బారులు తీరారు. పోలీసుల పహారా మధ్య ఒక్కో రైతుకు రెండు బస్తాలు అందించారు. శంకరపట్నం మండలం గద్దపాక సహకార సంఘం వద్ద శనివారం వేకువజాము నుంచే మహిళా రైతులు ఇంటి పనులు పక్కన పెట్టి బారులు తీరారు. గద్దపాక, తాడికల్ సహకార సంఘాలకు శనివారం 350 బస్తాల చొప్పున యూరియా వచ్చింది. రైతులు వందలాదిగా సహకార సంఘాలకు చేరుకున్నారు. గద్దపాకలో మహిళా రైతులకు కూపన్లు జారీచేసి యూరియా పంపిణీ చేశారు. ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు రెండు, తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఒక్కోబస్తా చొప్పున అందించారు. యూరియా దక్కని రైతులు సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు.



దుర్శేడ్‌లో పోలీసు పహారాలో యూరియా కోసం వరుసలో నిల్చున్న రైతులు



కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు



గన్నేరువరంలో తరలివచ్చిన రైతులు

వృద్ధులకు భరోసా.. బాలికలకు భవిత

- కొత్త మహిళా సంఘాల ఏర్పాటుకు సర్కారు ఆదేశం
- ప్రత్యేక కార్యాచరణతో రూపకల్పన



కరీంనగర్ అర్బన్: స్వయం సహాయక సంఘాల బలోపేతంతో మహిళలకు ఆర్థిక తోడ్పాటును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని అమలు చేస్తోంది. ఎక్కడా సభ్యత్వం లేని మహిళలు, కౌమార బాలికలు, వృద్ధులతో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే కార్యాచరణ మొదలవగా ఈ నెలాఖరు వరకు కొనసాగించనున్నారు.

వేర్వేరుగా సంఘాల ఏర్పాటు

అరవై ఏళ్లు దాటిన వృద్ధులను గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలోని సంఘాల నిర్వాహకులు వయసు రీత్యా సభ్యత్వం నుంచి పక్కన పెడుతున్నారు. ప్రస్తుత కార్యాచరణలో భాగంగా అలా తొలగించిన వారిని గుర్తించి ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేస్తారు. వారికి చిరువ్యాపారాలు, ఇతర మార్గాల్లో ఆర్థిక ఊతమిస్తారన్న మాట. 15 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలతో సంఘాలను ఏర్పాటు చేసి పొదుపు ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తారు. దీంతో ఆర్థిక లావాదేవీల గురించి తెలిసొస్తుంది. విద్య ప్రాధాన్యం, ఉద్యోగావకాశాల గురించి సమావేశాల్లో వివరిస్తారు. సమాజంలో వేధింపులు, సామాజిక మాధ్యమాల మోసాలు, అత్యాచారాలు, ఇతర మహిళా వ్యతిరేక నేరాల నియంత్రణపై చైతన్యపరుస్తున్నారు. దివ్యాంగుల సంఘాలు ఇప్పటికే కొనసాగుతుండగా ఇంకా ఎక్కడైనా ఒకే ప్రాంతంలో 12 మంది ఉంటే కొత్తగా సభ్యత్వం కల్పిస్తారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు వీటి వేదికగా అందేలా చూస్తారు. బ్యాంక్ లింకేజీ రుణాలిచ్చి వర్గాల వారు సంఘాల ఏర్పాటుకు ముందుకొచ్చేలా చూడాలని సెర్ప్ సిబ్బంది, మండల సమాఖ్యల బాధ్యులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

ప్రత్యేక కార్యాచరణతో ప్రక్రియ

గ్రామాల్లో ఏ సంఘాల్లో లేని మహిళలు, దివ్యాంగులు, కౌమార బాలికలను డీపీఎంలు, సీసీలు, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో గుర్తిస్తున్నారు. గ్రామాలవారీ జాబితాను రూపొందిస్తున్నారు. కొత్త సంఘాల్లో చేరితే కలిగే ప్రయోజనాల గురించి వివరించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సంఘాల ఆర్థిక విజయాలు చెప్పడమే కాకుండా, ఆయా సభ్యుల అనుభవాలను, నిబంధనలను పరిచయం చేస్తారు. ఈ నెల 15 నుంచి 30వరకు ముందుకు వచ్చిన సభ్యులతో సంఘాలను ఏర్పాటు చేసి, వారితో బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరిపిస్తారు. వివరాలు 'సెర్ప్' వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్షిత వర్గాల మహిళలతో సంఘాలు ఏర్పాటు చేయిస్తున్నామని, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు చేయిస్తామని డీఆర్డీవో వర్గాలు తెలిపాయి.

తల్లిదండ్రులకు అండగా ఉండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి




మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌కల్చరల్: వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టాన్ని అనుసరించి ట్రిబ్యునల్ ఉత్తర్వులను పాటిస్తోందని, లేనిది పర్యవేక్షించాలని, తద్వారా వృద్ధులు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం 2007 అమలు తీరు, ట్రిబ్యునల్ ఉత్తర్వులు, అమలుపై వృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యులు, అధికారులు, సీపీ గౌస్ ఆలంతో కలిసి కలెక్టరేట్‌లో సమావేశం అయ్యారు. తల్లిదండ్రుల బాగోగులు చూడడం లేదని, శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని, బలవంతంగా ఆస్తిపత్రాలపై సంతకాలు చేయించుకుంటున్నారని రెవెన్యూ డివిజనల్ అధికారి ట్రిబ్యునల్‌కు చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ట్రిబ్యునల్ తీర్పులను పలువురు బేఖాతరు చేస్తున్నారన్నారు. దీంతో సదరు వృద్ధులు కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. వయోవృద్ధుల కేసులకు సంబంధించి ప్రతీ శనివారం నిర్వహించే విచారణలో ఒక పోలీస్ అధికారికి విధులు కేటాయించాలని సీపీకి సూచించారు. ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీసీపీ వెంకటేశ్వర్, డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్ ఉన్నారు.

గ్రీన్‌సిటీగా మార్చడమే లక్ష్యం

- నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కలెక్టరేట్‌లో మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్‌ను గ్రీన్‌సిటీగా మార్చడమే లక్ష్యమని నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో మరిన్ని మొక్కలు నాటాలని సూచించారు. గ్రీన్‌సిటీగా మార్చేందుకు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నామని తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నామని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. యాదాద్రి, మియావాకీ, పట్టణ ప్రకృతి వనం, రాశివనాల పేరిట మొక్కలు పెంచుతున్నామన్నారు. నగరవాసులు తమ ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో పూలు, పండ్లు, ఔషధ మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు.

ప్రజా మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

నగరంలోని ప్రజా మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శనివారం నగరంలోని శాతవాహన యూనివర్సిటీ రోడ్డులోని ప్రజామరుగుదొడ్డిని, నైట్‌ఫుడ్ కోర్ట్, 38,39 వార్డు కార్యాలయాలను పరిశీలించారు. మరుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. నైట్‌ఫుడ్‌కోర్టు ప్రాంతంలో చెత్త లేకుండా చూడాలని అన్నారు. నైట్ ఫుడ్‌కోర్టులోని వ్యాపారులతో మాట్లాడి, సదుపాయాలు, సమస్యలపై ఆరా తీశారు. డిప్యూటీ కమిషనర్లు వేణుమాధవ్, ఖాదర్ మొహియొద్దీన్, పర్యావరణ ఇంజినీర్ స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం తాగుతూ యువకుడి మృతి


రాకేశ్ (ఫైల్)

సిరిసిల్లక్రైం: స్నేహితులతో కలిసి మద్యం సేవి స్తూ కుప్పకూలి యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన దూస రా కేశ్ స్థానికంగా ఓ మెడికల్ షాప్‌లో పనిచేస్తుండేవాడు. తన స్నేహితుడితో ఇంటి పరిసరాల్లో శుక్రవారం మద్యం సేవించడానికి వెళ్లాడు. అదే రోజు అర్ధరాత్రి మద్యం సేవిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో పక్కనే ఉన్న స్నేహితుడు రాకేశ్ కుటుంబీకులకు సమాచారం అందించాడు. వారు హుటాహుటిన సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతుని భార్య శ్రీలేఖ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మృతునికి మూడేళ్ల కుమారుడు, ఏడాది కూతురు ఉన్నట్లు తెలిపారు.

వాగులో గుర్తుతెలియని మృతదేహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి శివారు మానేరునది తీరానికి గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. మెడలో గవ్వలదండతో క్షీణించుకుపోయిన మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, వైద్యుల బృందం నమూనాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఖననం చేశారు. మానేరునదికి ఎగువ గ్రామాల్లో చనిపోయిన వ్యక్తిని పూడ్చిపెట్టగా వరదనీటి ఉధృతికి కొట్టుకొచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


లావణ్య మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన వివాహిత ఎలగందుల లావణ్య(35) శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. రాచర్లగొల్లపల్లికి చెందిన లావణ్య–భాస్కర్ దంపతులకు కూతురు సాన్వి(12), కుమారుడు రోషిత్(10) ఉన్నారు. మృతురాలి భర్త భాస్కర్ ఓ ట్రేడింగ్ కంపెనీలో భాగస్వామి. పిల్లలు పాఠశాలకు వెళ్లగా, భాస్కర్ ట్రేడింగ్ కంపెనీకి వెళ్లాడు. ఈ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న లావణ్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పిల్లలు పాఠశాల నుంచి వచ్చేసరికి ఇంటి గడియ బిగించి ఉండగా అనుమానంతో తండ్రితో పాటు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టి చూడగా లావణ్య ఉరివేసుకుంది. ఎస్సై రాహుల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ కలహాలతోనే అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులు ప్రస్తుతం లావణ్య మృతిని అనుమానాస్పద మృతిగా భావిస్తున్నారు. విచారణ చేపడుతున్నట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు.

చికిత.. 'అగ్రశ్రేణి బంగారం'

- కెనడా వేదికగా అండర్ – 21 పోటీల్లో ఘనవిజయం
- భారత తొలి మహిళా కాంపౌండ్ ఆర్చర్‌గా గుర్తింపు
- 'తానిపర్తి'ని ప్రశంసించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష


చికితను అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: తానిపర్తి చికిత.. అంతర్జాతీయ ఆర్చరీ క్రీడా పోటీల్లో అగ్రశ్రేణి క్రీడాకారులను కెనడాలోని విన్నిపెగ్ –2025 వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్ అండర్– 21 పోటీల్లో మట్టి కరిపించి స్వర్ణవిజేతగా నిలిచింది. మనదేశ తొలిమహిళా కాంపౌండ్ అర్చర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించింది.

కలెక్టర్ ప్రోత్సాహంతో..

ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికితకు ఆర్చరీపై ఉన్న ఆసక్తిని తెలుసుకున్న కలెక్టర్ శ్రీహర్ష.. అవసరమైన క్రీడా పరికరాలను కొనుగోలు చేసి చికితకు అందించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు గుర్తింపు తేవాలని ప్రోత్సహించారు. 2023లో అప్పటి కలెక్టర్ సంగీత రూ.6లక్షలతో క్రీడాపరికరాలను కొనుగోలు చేసి అందించగా.. ప్రస్తుత కలెక్టర్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన రవాణా ఖర్చులకోసం రూ.5లక్షలను అందించారు. కలెక్టర్ ఆశయాల మేరకు కెనడాలో చికిత స్వర్ణపతకాన్ని సాధించింది. ఆమెకు హైదరాబాద్ విమానాశ్రయంలో మంత్రి శ్రీహరితోపాటు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు ఘనస్వాగతం పలికారు.

కలెక్టరేట్‌లో సత్కారం..

ఆర్చరీ అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణపతకం సాధించిన చికితను కలెక్టర్ శ్రీహర్ష శనివారం తన కార్యాలయంలో శాలువా కప్పి సత్కరించారు. ఆమె విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. జిల్లా క్రీడల శాఖ అధికారి సురేశ్, ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు రవీందర్, తిరుపతి, కుమార్, సుల్తాన్‌పూర్‌వాసులు చికితను అభినందించారు.

చికిత సాధించిన విజయాలెన్నో..

చికిత టెన్త్ వరకు నగునూర్, ఇంటర్ గర్రెపల్లి గురుకులం, డిగ్రీ పంజాబ్‌లో పూర్తి చేసింది. 2019 నుంచి అర్చరీపై ఆసక్తితో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అనేక బంగారు పతకాలు సాధించింది. 2020లో కర్ణాటకలోని బెంగళూరులో జరిగిన పోటీల్లో బంగారు పతకం దక్కించుకుంది. ఈ ఏడాది ఆగస్టు 20నుంచి 24వరకు కెనడాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ స్వర్ణవిజేతగా నిలిచింది.

అక్కబాటలో తమ్ముడు..

చికిత ప్రతిభను చూసిన ఆమె తమ్ముడు తానిపర్తి యశ్వంత్ సైతం ఆర్చరీలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నాడు. తనకు ఆర్చరీలో ఆసక్తి ఉందని కలెక్టర్ శ్రీహర్ష దృష్టికితేగా.. క్రీడా పరికరాలను సైతం కొనుగోలు చేసి ఇచ్చారు. గతేడాది టెన్త్ పూర్తి చేసిన యశ్వంత్.. ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించుకున్నాడు.

మాజీ గవర్నర్ దత్తాత్రేయ అభినందన..

స్వర్ణవిజేత చికితతో ఫోన్‌లో మాట్లాడిన హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ.. ఆమెను అభినందించారు. అంతర్జాతీయ అగ్రశ్రేణి క్రీడాకారులను ఓడించి స్వర్ణపతకం సాధించి దేశకీర్తిని ఇనుమడింపజేశావని ప్రశంసించారు.

చికితకు స్వగ్రామంలో ఘనస్వాగతం..

ఎలిగేడు(పెద్దపల్లి): గోల్డ్‌మెడల్ సాధించి శనివారం స్వగ్రామం సుల్తాన్‌పూర్ చేరుకున్న చికితకు ప్రాథమిక, ఉన్నతపాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఎంఈవో నరేంద్రచారి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, పీఎస్ హెచ్‌ఎం సంతోష్‌రెడ్డి తదితరులు చికితను అభినందించారు. కరీంనగర్ వెలమ సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు.


చికితకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ఒలింపిక్స్‌లో రాణించాలన్నదే లక్ష్యం



భవిష్యత్తులో ఒలింపిక్స్‌లోనూ ఆర్చరీ పోటీల్లో రాణించి దేశానికి మంచి పేరు తేవాలన్నదే నా లక్ష్యం. ఆర్చరీలో నాకున్న ఆసక్తిని గుర్తించిన కలెక్టర్ శ్రీహర్ష.. అన్నివిధాలా అండగా నిలిచారు. కలెక్టర్‌కు కృతజ్ఞతలు.
– తానిపర్తి చికిత, అంతర్జాతీయ ఆర్చరీ స్వర్ణవిజేత

ఇంకా దొరకని శ్రీకర్ ఆచూకీ

- మూడురోజులుగా వెదుకుతున్న బంధువులు
- ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- వినాయక చవితి రోజు ఘటన


కాటిపెల్లి శ్రీకర్‌రెడ్డి(ఫైల్)

కోరుట్ల: వినాయక చవితి రోజు మెట్‌పల్లి మండలం రామారావుపల్లె సమీపంలో ఎస్సారెస్పీ కాలువలో గల్లంతయిన మెట్‌పల్లి మాజీ జెడ్పీటీసీ కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు శ్రీకర్‌రెడ్డి (32) కోసం కాలువలో ప్రత్యేక బృందాలు జల్లెడ పడుతున్నాయి. అయినా శ్రీకర్‌రెడ్డి జాడ తెలియరాలేదు. రామారావుపల్లెకు వెళ్లే బ్రిడ్జికి సుమారు అర కిలోమీటర్ దూరంలో ట్రాక్టర్ ఎస్సారెస్పీ కాలువలో పడిపోయింది. ట్రాక్టర్‌పై నుంచి డ్రైవర్, మరో ఇద్దరు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. ట్రాక్టర్ ఇంజిన్, ట్రాలీ మధ్య ఉన్న శ్రీకర్‌రెడ్డి మాత్రం కెనాల్‌లో పడి గల్లంతయినట్లు భావిస్తున్నారు. ట్రాక్టర్ కెనాల్‌లో పడిన పది నిమిషాల్లోనే శ్రీకర్‌రెడ్డి బంధువులు నీటిలోకి దూకి వెతకడం ప్రారంభించారు. ప్రమాదం జరిగిన పరిసర ప్రాంతాల్లో ఆచూకీ దొరకలేదు. ఈ దుర్ఘటన విషయాన్ని తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు జీవన్‌రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్ శ్రీకర్‌రెడ్డి ఆచూకీ తెలుసుకోవాలని ఇరిగేషన్, పోలీసు యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారు. అప్పటినుంచే ఎస్సారెస్పీ కాలువలో నీటి విడుదల నిలిపేశారు. ప్రమాద స్థలం నుంచి సుమారు 20 కిలోమీటర్ల మేర ఎస్సారెస్పీ కెనాల్‌లో ప్రత్యేక బృందాలు, పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నా.. శ్రీకర్‌రెడ్డి ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తే ప్రవాహం ఉధృతికి శ్రీకర్ ఆచూకీ దొరికే అవకాశం ఉందన్న యోచనతో శనివారం సాయంత్రం కాలువకు నీటిని వదిలినట్లు సమాచారం.


కోరుట్ల మండలం సంగెం సైఫన్ వద్ద వెతుకుతున్న ప్రత్యేక బృందాలు

బిడ్డా పైలం.. అని చెప్పేలోపే..

'మా రైస్‌మిల్లులో ఓ గణపతిని పెట్టారు.. మరో గణపతి విగ్రహాన్ని రామరావుపల్లె సమీపంలో పెట్టాలని చెప్పి ముగ్గురు దోస్తులతో కలిసి నా కొడుకు నా కళ్లముందే ట్రాక్టర్ ఎక్కాడు. ఇంజిన్, ట్రాలీ మధ్య నిలబడ్డాడు. బిడ్డా పైలం అని చెప్పేలోపే ట్రాక్టర్ కదిలింది. ఐదు నిమిషాల్లోనే మెయిన్ కెనాల్‌లో ట్రాక్టర్ పడిందని తెలిసి పరుగెత్తికెళ్లి వెదికించినా ఫలితం దక్కలేదు. మూడు రోజులు గడిచాయి. నా కొడుకు ఆచూకీ ఇప్పటికీ దొరకడం లేదు.. అంటూ కన్నీరుమున్నీరయ్యాడు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి. శ్రీకర్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాన్న ఎక్కడున్నాడని ఆరేళ్లలోపు పిల్లలు ఏడుస్తున్న తీరు అందరిని కలిచివేస్తోంది.

వేదన విని.. అండగా నిలిచి

- చిన్నారి వైద్యానికి కలెక్టర్ ఆర్థిక చేయూత
- క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం


చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం చెక్కు అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: బాధితుల వేదన విని రాజన్నసిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా స్పందించారు. అనారోగ్యంతో ఉన్న చిన్నారి వైద్యానికి చేయూతనందించారు. జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన వేముల మధు దంపతులకు కవలపిల్లలు(కొడుకు, కూతురు) జన్మించారు. అనారోగ్య సమస్యలతో కూతురు ఆస్పత్రిలో మరణించింది. కొడుకు హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. తమ కొడుకు వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని మధు కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఆ చిన్నారి వైద్యానికి రూ.50వేల చెక్కును అందించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం

సిరిసిల్లకు చెందిన బోనాల వెంకటేశ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. తన వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కోరారు. స్పందించిన కలెక్టర్ బాధితుడు బోనాల వెంకటేశ్ వైద్యానికి రూ.1.25 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. తమ బాధను అర్థం చేసుకొని ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు చిన్నారి, క్యాన్సర్ రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం


మిషన్ భగీరథ పైపును ఢీకొని ఆగిపోయిన బస్సు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రంలోని ఆసునూరిగూడెం సమీపంలో ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి కల్వర్టుపై ఉన్న మిషన్‌భగీరథ పైప్‌లైన్ ఢీకొని ఆగిపోయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. జగిత్యాల నుంచి బీర్‌పూర్ మండలం కొల్వాయి వెలుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారుకు సైడ్ ఇవ్వబోయి బస్సు పక్కన ఉన్న మిషన్‌భగీరథ పైప్‌లైన్ పైపులకు ఢీకొని ఆగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదమూ జరగలేదని ప్రయాణికులు తెలిపారు.

మహిళ ప్రాణాలను కాపాడిన బ్లూకోల్ట్స్


మహిళను కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది

ధర్మపురి: కుటుంబ కలహాలతో గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళను బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ రణధీర్ కాపాడి స్టేషన్‌లో అప్పగించారు. చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన ముప్పిడి అనిత (50) శనివారం ఉదయం ఇంట్లో గొడవలు జరగడంతో మనస్తాపానికి గురై రాయపట్నం గోదావరి వంతెన వద్దకు చేరింది. గోదావరిలో దూకేందుకు ప్రయత్నం చేస్తుండగా.. అక్కడే ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ ఆమెను కాపాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చినట్లు చెప్పడంతో కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పెద్దపల్లికి మొండిచెయ్యి

రామగుండం: సికింద్రాబాద్–నాగపూర్ మధ్య నడిచే వందేభారత్ రైలు(నంబరు 20101/02)కు పెద్దపల్లి జంక్షన్‌లో హాల్టింగ్ ఇవ్వకుండా మంచిర్యాల లో హాల్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్ ఉత్తర్వులు జారీచేసింది. ఎంపీ వంశీకృష్ణ చొరవతోనే మంచిర్యాలలో హాల్టింగ్ కల్పించినట్లు అంటున్నారు. పెద్దపల్లి జిల్లాలోనే రెండు రైల్వేస్టేషన్లకు హాల్టింగ్ కల్పిస్తే సాంకేతిక సమస్యలు వచ్చే అవకాశమున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, కొమురం భీం జిల్లాలోని కాగజ్‌నగర్‌లో వందేభారత్‌కు హాల్టింగ్ కల్పించినట్లు సమాచారం.

కొదురుపాకలో చోరీ


- చోరీకి గురైన 15 గ్రాముల బంగారు ప్రతిమ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాకకు చెందిన మైలారం శ్రీనివాస్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తుల చోరీకి పాల్పడి 15 గ్రాముల సత్యనారాయణస్వామి బంగారు విగ్రహాన్ని ఎత్తుకెళ్లినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్న శ్రీనివాస్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

కొదురుపాకలో విద్యుత్ వైరు చోరీ

మండలంలోని కొదురుపాక కేడీసీసీ బ్యాంకు వెనకాల 1700 మీటర్ల విద్యుత్ వైరు చోరీకి గురైనట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. విద్యుత్ వైరు చోరీ జరిగినట్లు సెస్ ఇన్‌చార్జి ఏఏఈ రాకేశ్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో కోర్టు ఉద్యోగికి తీవ్ర గాయాలు


గాయపడ్డ రేవతి

కోరుట్ల: కోరుట్లలోని ప్రధాన రోడ్డుపై కారు, స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో కోరుట్ల కోర్టు ఉద్యోగి రేవతి(32) తీవ్రంగా గాయపడ్డారు. రేవతి తన భర్త గణేశ్‌తో కలిసి స్కూటీపై ఆదర్శనగర్‌కు వెళ్లే క్రమంలో మెయిన్ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేవతి కాలు విరిగింది. దవడకు తీవ్రగాయాలయ్యాయి. గణేశ్ చేయి విరిగింది. స్థానికులు రేవతి, గణేశ్‌ను జగిత్యాల ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఒడిశా టు గోదావరిఖని

- గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్, ఐదుగురు పరార్
- రూ.15 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, పక్కన సీఐ, ఎస్సై

వాజేడు: ఒడిశా నుంచి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేయగా ఐదుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.15 లక్షల విలువైన 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వివరాలు వెల్లడించారు. గోదావరి ఖనిలోని 8 ఇంక్‌లైన్ కాలనీకి చెందిన తొగరి విష్ణువర్ధన్, జెంజర్ల రేవంత్, మేకల మహేందర్, అజయ్, జెంజర్ల రోహిత్, జెజర్ల బాలాజీ, రుత్విక్ స్నేహితులు. వీరు గంజాయి సేవించడంతో పాటు గోదావరిఖని చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కువ డబ్బులకు అమ్ముతూ జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 18న ఒడిశాకు వెళ్లి అక్కడ ఓ వ్యక్తి వద్ద రూ 15 లక్షల విలువైన 30 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. సరుకును బ్యాగుల్లో సర్దుకుని నాలుగు బైక్‌లపై శనివారం వెంకటాపురం(కె) వైపు నుంచి ఏటూరు నాగారం వైపు వస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు హైవేపై వాజేడు ఎస్సై సతీశ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో నాలుగు బైక్‌లు అక్కడికి రావడంతో పోలీసులకు అనుమానం వచ్చి మొదటి బైక్‌పై ఉన్న ఇద్దరిని పట్టుకున్నారు. దీనిని వెనుక మూడు బైక్‌లపై ఉన్న వారు గమనించి తమ వద్ద ఉన్న బ్యాగులను పడేసి పరారయ్యారు. ఆ బ్యాకులను తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో తొగరి విష్ణువర్ధన్, జెంజర్ల రేవంత్‌ను అరెస్ట్ చేయగా మేకల మహేందర్, కొల్లి అజయ్, జెంజర్ల బాలాజీ, రుత్విక్ , జెంజర్ల రోహిత్ పరారైనట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో వెంకటాపురం(కె) సీఐ ముత్యం రమేశ్, వాజేడు ఎస్సై జక్కుల సతీశ్ ఉన్నారు.

విగ్రహం ఏర్పాటుపై వివాదం

- మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో ఘటన
- గ్రామస్తులను సముదాయించిన అధికారులు


గ్రామస్తులతో సమావేశమైన అధికారులు

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో విగ్రహం ఏర్పాటు విషయంలో వివాదం తలెత్తింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని సంస్థాన్ గడి లోపల.. పంచాయతీ కార్యాలయం సమీపంలో అంబేడ్కర్ విగ్రహం ఉంది. గడిముందు భాగంలో మరో విగ్రహం ఏర్పాటు చేసేందుకు మాదిగ సామాజికవర్గానికి చెందిన పలువురు శుక్రవారం రాత్రి ఏర్పాట్లు చేశారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గడి లోపల ఒక విగ్రహం ఉందని, మరో విగ్రహం ఎందుకని, వేరేచోట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికి వారు ససేమిరా అన్నారు. ఈ క్రమంలో మిగిలిన కులాల వారు కొందరు తమ కులాల ఉన్నతికి పోరాడిన వారి విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటామని జేసీబీ సహాయంతో గుంతలు తీయించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి తహసీల్దార్ నీత, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సంఘటనస్థలానికి చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. విగ్రహాల ఏర్పాటుపై వివాదం వద్దన్నారు. సమస్య ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని తెలిపారు.

గర్భిణి దారుణ హత్య


తిరుమల(ఫైల్)

ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తికి చెందిన గర్భిణి ముద్రవేణ తిరుమల(34) ఇంట్లో దారుణ హత్యకు గురైంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన తిరుమలను టేకుర్తికి చెందిన ముద్రవేణ రాములు 8 ఏళ్ల క్రితం ప్రేమించి రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటికే రాములుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి కత్తితో ఆమె మెడపై తీవ్రంగా దాడి చేసి పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తిరుమల 7 నెలల గర్భిణి. రాములు తిరుమలతో ఉండడం మొదటి భార్య కుటుంబానికి ఇష్టం లేదు. గతంలో గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. కానీ కొలిక్కి రాలేదు. గ్రామంలో 2 కాపురాలు వేరువేరుగా పెట్టాడు. ఆమె గర్భం దాల్చిన నుంచి ఆమెపై పగ పెంచుకున్నారని, ఆమెకు శిశువు పుడితే ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని, దీంతో ఆమె అడ్డు తొలగించాలని నిర్ణయించుకొని మర్డర్ చేశారని పోలీసులు అనుమానిస్తున్నారు. రాములు ఒగ్గు కథలు చెప్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై క్రాంతికుమార్, క్లూస్ టీం చేరుకొని పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసిక సమస్య.. యువకుడి ఆత్మహత్య

గోదావరిఖని: స్థానిక గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ అజిత్‌పాషా(32) శనివారం ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ముందురోజు కుమారునికి జ్వరం రావడంతో అజిత్‌పాషా తన భార్యతో కలిసి ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. తర్వాత భార్య ఆస్పత్రిలో ఉండగా, అజిత్‌పాషా ఇంటికి చేరుకున్నాడు. శనివారం ఉదయం భార్య ఎంతసేపూ ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో పక్కింటి వారికి ఫోన్ చేసింది. ఈక్రమంలో తలుపులు పగులగొట్టి చూడగా బెడ్‌రూంలో ఫ్యాన్‌హుక్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని మృతి చెందాడు. కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడని, దీంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఆయేషాజబీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ధర్మపురిలో పట్టపగలు చోరీ

ధర్మపురి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు చొరబడి ఇంట్లో ఉన్న బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించుకుపోయిన ఘటన ధర్మపురిలో శనివారం సాయంత్రం వెలుగు చూసింది. బాధితుడి వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన కోలేటి మల్లికార్జున్ పట్టణంలో కొన్నేళ్లుగా రెడీమేడ్ దుస్తుల దుకాణం నడిపిస్తున్నాడు. శనివారం ఉదయం తన భార్య రజినీ ఆమె తండ్రికి ఆపరేషన్ అయ్యిందంటూ హైదరాబాద్ వెళ్లింది. మల్లికార్జున్ దుకాణానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని ఆభరణాల డబ్బా మరోచోట పడేసి ఉంది. 7తులాల బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడి సమాచారం మేరకు ఎస్సై ఉదయ్‌కుమార్ తన సిబ్బందితో చేరుకుని అన్ని కోణాల్లో పరిశీలించారు. సీసీపుటేజీ ఆధారంగా ఇంటిముందు బాలుడు ఉన్నట్లు గుర్తించారు. క్లూస్ టీంను రప్పించి దర్యాప్తు ముమ్మరం చేశారు. జరిగిన సంఘటనపై ఎస్సైని వివరణ కోరగా చోరీ ఎంత జరిగిందో బాధితుడు ఫిర్యాదు చేయలేదన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కొత్తపల్లి(కరీంనగర్): చింతకుంట శివారులోని ఎస్సారెస్పీ కాలువలో మూడు రోజుల క్రితం చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభించినట్లు కొత్తపల్లి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సంత్‌కబీర్ జిల్లా గిరిధర్‌పూర్ గ్రామానికి చెందిన సమదుర్ రహమాన్(21) కరీంనగర్‌లోని కాశ్మీర్‌గడ్డలో నివసిస్తూ జీవనోపాధి కోసం టైల్స్, మార్బుల్ పనులు చేస్తున్నాడని అన్నారు. ఈనెల 28న ఇజాజ్ అహ్మద్, మహమ్మద్ హుస్సేన్, ఎండీ సాజిద్, ఎండీ సవాద్‌లతో కలిసి చింతకుంట శివారులోని ఎస్సారెస్పీ కాలువలో చేపలు పడుతున్న క్రమంలో నీటి ప్రవాహానికి రహమాన్ కొట్టుకుపోయాడని తెలిపారు. గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైందని, మృతుడి తండ్రి అబ్దుల్ సలాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

పచ్చనిహారం



కనుచూపు మేరలో పచ్చదనం. భూమికి పచ్చని రంగేసినట్లు పంట పొలాలు పుడమికి నిండుదనాన్ని తీసుకొచ్చాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మిడ్‌మానేరు ప్రాజెక్టు దిగువ ప్రాంతంలోని మానువాడ శివారులో పంటపొలాలు పచ్చరంగు అద్దినట్లు ఉన్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

క్లుప్తంగా

అత్యుత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు



శ్రీమతిని సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వ రంగంలో అత్యుత్తమ సేవలు అందించినప్పుడే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఐసీడీఎస్ కరీంనగర్‌రూరల్ ప్రాజెక్టు సీడీపీవోగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన చింతపల్లి శ్రీమతి సన్మాన కార్యక్రమం శనివారం మినీ పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో సీడీపీవోగా విధులు నిర్వహించిన శ్రీమతి మహిళలతో మమేకమై అంకితభావంతో పనిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సన్మానిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: ఉద్యోగ విరమణ పొందిన అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. కరీంనగర్ సీసీఎస్, ఎస్బీ, గంగాధర పీఎస్‌లలో ఎస్సైలుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జె.రాజయ్య, ఎంఏ మజీద్, పి.బాపులను శనివారం కమిషనరేట్‌లో సన్మానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సురేందర్ పాల్గొన్నారు.

పాట పోస్టర్ ఆవిష్కరణ



పాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు

కొత్తపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి కిట్ల చరణ్ (7వ తరగతి) ఆలపించి నటించిన 'ఎలుక మీద రావయ్యా ఓ గణపయ్య' అనే పాట పోస్టర్‌ను శనివారం ఆ విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు ఆవిష్కరించారు. పాఠశాల డైరెక్టర్లు టీఎస్‌వీ రమణ, హన్మంత రావు, విద్యార్థి తండ్రి కిట్ల శ్రీనివాస్, పీడీ రామానంద తీర్థ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డు ఉద్యమం




పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ కార్పొరేషన్: ఓటు చోరీకి వ్యతిరేకంగా ఎన్ఎస్‌యూఐ శనివారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టింది. నగరంలోని పలు కళాశాలల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా పోస్టుకార్డులు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకుడు మహమ్మద్ ఇమ్రాన్, సుఫియాన్, అయాన్, విక్రమ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందులలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ) బాలికల పాఠశాలలో 6,7,8వ తరగతులకు తెలుగు, ఫిజికల్ సైన్స్ బోధించేందుకు తాత్కాలిక పద్ధతిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి బి.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల మహిళా అభ్యర్థులు ఆదివారం లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తాత్కాలిక పద్ధతిన రెమ్యూనరేషన్ అందించే ఈ పోస్టులపై మరిన్ని వివరాల కోసం 8500832934 నంబర్‌లో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గ్రంథాలయ వాచ్‌మెన్ ఐలయ్యను శనివారం గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం సన్మానించి జ్ఞాపిక అందజేశారు.కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లేశ్ దంపతులు



పూజలో పాల్గొన్న రాజేందర్‌రావు

విఘ్నేశ్వరునికి విశిష్ట పూజలు



దీపారాధనలో మహిళలు

కరీంనగర్‌కల్చరల్/కొత్తపల్లి/విద్యానగర్: వినాయక నవరాత్రోత్సవాలు పురస్కరించుకొని నగరంలోని పలు మండపాల్లో కొలువుదీరిన గణపతుల వద్ద శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, దీపరాధనలు జరిపారు. కట్టరాంపూలోని రాంపూర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుడి వద్ద దీపారాధన నిర్వహించారు. సీతారాంపూర్ సూర్యనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ దంపతులు పూజలు చేశారు. భగత్‌నగర్ మాజీ మేయర్ సునీల్‌రావు కార్యాలయంలో నిమజ్జనోత్సవం పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. నగరంలోని పలు మండపాల్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు పూజలు చేశారు. అశోక్‌నగర్‌లో అశోక్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కుంకుమ పూజలు జరిగాయి.



అశోక్‌నగర్‌లో కుంకుమ పూజలు



పూజలు చేస్తున్న మాజీ మేయర్ సునీల్‌రావు



భగత్‌నగర్‌లో చిన్నారుల నృత్యం

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సంజీవరావు

కరీంనగర్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీవో ఆకుల సంజీవరావు కోరారు. శనివారం ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్‌లో భాగంగా కరీంనగర్ మండలంలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. కరీంనగర్ మండలంలోని 14 గ్రామపంచాయతీల్లోని ఓటర్లు, వార్డుల వివరాలను ఎంపీడీవో వివరించారు. ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి అభ్యంతరాలను తెలిపితే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి, టీడీపీ నాయకుడు ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫేషియల్ రికగ్నిషన్ పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈవో రవీందర్

కరీంనగర్‌రూరల్: ఉపాధ్యాయుల, విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో రవీందర్ అన్నారు. శనివారం కరీంనగర్ ఎమ్మార్సీ భవన్‌లో ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ కోసం పాఠశాలలన్నీ పోటీపడాలని అన్నారు. అనంతరం పదోన్నతిపై కరీంనగర్ మండలానికి వచ్చిన ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో దుర్శేడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రఘురాంతో పాటు పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

కరీంనగర్‌టౌన్: ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ జిల్లా శాఖ, కరీంనగర్ అసెంబ్లీ శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ సునీల్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ ప్రధాని మోదీ తల్లి గురించి అసభ్యకర వ్యాఖ్యలు, దూషణలతో కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాల స్థాయికి చేరుకుందని విమర్శించారు. రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బేతాళుడు' జానపద చిత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: శ్రీవివన్ క్రియేషన్స్ బ్యానర్‌పై అయిలు రమేశ్ దర్శకత్వంలో ఆశిర్ చెల్క నిర్మించిన 'బేతాళుడు' జానపద లఘు చిత్ర పోస్టర్‌ను శనివారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆవిష్కరించారు. షార్ట్ ఫిలిమ్స్ నిర్మాణంలో రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. నటులు శివరాం, నటీమణులు కీర్తి, అంజలి, ఎడిటర్ భాస్కర్ పాల్గొన్నారు.

పీసీసీ సాంస్కృతిక సేన ఉపాధ్యక్షుడిగా కుమార్



నియామకపత్రం అందుకుంటున్న కుమార్

కరీంనగర్ కార్పొరేషన్: పీసీసీ సాంస్కృతిక సేన జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉద్యమ కవి గసికంటి కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం సాంస్కృతిక సేన అధ్యక్షుడు రఘు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోనెల సమ్మన్న, గుమ్మడి జలపతి, తాటిపల్లి జంపన్న, గాజుల రాజ్‌కుమార్, మొలుగూరి మధు, మురళి తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లు బహూకరణ



సైకిళ్లు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందించడమే లక్ష్యంగా ప్రముఖ సైకిల్ కంపెనీ బిఎస్ఏ హర్కులేస్ సౌజన్యంతో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ప్రతిభ కనబర్చిన ఎం.ఆరాధ్య, బి.అక్షిత్‌కు సైకిళ్లు, మరో 20 మందికి ప్రోత్సాహక బహుమతులను సైకిల్ కంపెనీ ప్రతినిధి శంకర్‌తో కలిసి అందజేశారు. విద్యార్థులకు సైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

చిగురుమామిడి పోలీస్ స్టేషన్ తనిఖీ



స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ

చిగురుమామిడి: చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఇటీవల కొత్తగా వచ్చిన పీసీలు సీనియర్ల సహాయంతో రికార్డుల నిర్వహణ నేర్చుకోవాలన్నారు. స్టేషన్‌లోని సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఎస్ఐ సాయికృష్ణ పనితీరును సీపీ అభినందించారు. తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ ఉన్నారు.

తెలంగాణకు రూ.వేయి కోట్లు కేటాయించాలి



ఇవీ శ్రీనివాస్

కొత్తపల్లి: భారీ వర్షాలతో అతలాకుతలమైన తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.వేయి కోట్లు కేటాయించి ఆదుకోవాలని హైకోర్టు న్యాయవాది ఇవీ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి శనివారం లేఖ రాసినట్లు తెలిపారు. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని పలు గ్రామాలు, పట్టణాలు ముంపునకు గురై భారీ నష్టం జరిగిందన్నారు. మనుషులు, పశువులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబాల్లో విషాదం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మానవత దృక్పథంతో ముందుకు వచ్చి నిధులు కేటాయించాలని కోరారు. ఇలాంటి విపత్తులు భవిష్యత్‌లో వస్తే ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇద్దరి బైండోవర్

కరీంనగర్‌రూరల్: మద్యం తాగి ప్రజలకు ఇబ్బంది కలిగించిన ఇద్దరు వ్యక్తులను శనివారం తహసీల్దార్ రాజేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ శివారులో రెండురోజుల క్రితం వాంఖడే మోహన్, అర్జున్‌లు దారిలోనే మద్యం తాగి ప్రజలను ఇబ్బందులకు గురి చేసినట్లు వివరించారు. మరోసారి ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా తహసీల్దార్ ఎదుట ఇద్దరిని బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

అద్దె ప్రాతిపదికన వాహనం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ జిల్లా మహిళా సాధికారత కేంద్రం కార్యాలయానికి అద్దె ప్రాతిపదికన వాహనం (వ్యాన్) నడిపించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాటు, తమ దరఖాస్తులను సీల్డ్ కవర్‌లో పెట్టి సెప్టెంబర్ 4వ తేదీ సాయంత్రం 5గంటల లోపు జిల్లా మహిళా సాధికారత కేంద్రం కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సెప్టెంబర్ 1 చీకటి దినం

గన్నేరువరం: సెప్టెంబర్ 1 సీపీఎస్ ఉద్యోగులకు చీకటి దినమని టీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుప్పాల కృష్ణకుమార్, హన్మండ్ల భాస్కర్ అన్నారు. శనివారం గుండ్లపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ విధానం ఉద్యోగులకు శాపంగా మారిందని, 2004 సెప్టెంబర్ 1న సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం

చిగురుమామిడి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను నిరంతరం కొనసాగిస్తుందని మండల అధ్యక్షుడు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం నవాబుపేట్ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి ప్రజా సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇల్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, రేషన్ కార్డులకు దరఖాస్తు పెట్టుకున్న ప్రతీ కుటుంబానికి కార్డులు కూడా జారీ అయ్యాయన్నారు. ఠాకూర్ నరేందర్‌సింగ్, లచ్చిరెడ్డి, వేణుగోపాల్, పర్శరాములు, షాబుద్దీన్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

కరీంనగర్‌రూరల్: రాజీవ్ రహదారిలోని ఇరుకుల్ల వంతెనపై శనివారం ఇసుక ట్రాక్టర్ బోల్తా పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కరీంనగర్‌రూరల్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన రాజశేఖర్ ట్రాక్టర్‌లో ఇసుకను నింపుకుని కరీంనగర్‌కు వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ ఇరుకుల్ల వంతెనపై అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్‌ను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని కాపువాడ మారుతినగర్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. సీసీ రోడ్లు వేయకపోవడంతో వర్షాకాలం మట్టిరోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. పైగా చాంబర్లు వేసి వదిలేయడంతో రోడ్డుకు ఎత్తుగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. హనుమాన్ ఆలయం పక్క రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారి వర్షం పడితే నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. అధికారులు చర్యలు తీసుకొని సీసీ రోడ్డు నిర్మించాలి. ఆలోగా రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– శ్రీధర్, మారుతినగర్, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వెంకటేశ్వర్లు, డీఈ, సెల్ నం.89199 23123

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 94400 77555

ఉత్తమ విధులతోనే అధికారులకు గుర్తింపు



ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్: విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలతోనే అధికారులకు గుర్తింపు లభిస్తుందని ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, ఉద్యోగులు యూనస్, ధర్మరాజులను సన్మానించారు. డిప్యూటీ డైరెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన లింగారెడ్డి, ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో పదోన్నతి పొందిన జోయల్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆడిట్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, ఈజేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్, గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి అరవింద్ రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘ నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, నాల్గో తరగతి సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, నాయకులు గిరిధర్ రావు, కమలాకర్, హరిప్రియ, విజయలక్ష్మి, అభిషేక్ రెడ్డి, పోచయ్య, రాజిరెడ్డి, అల్లె శ్రీనివాస్, వంశీ, తిలక్, రాజేశ్వరరావు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలోని తప్పులను సవరించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌రూరల్: ఓటరు జాబితాలోని తప్పులను సవరించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అన్ని గ్రామాల్లోని ఓటర్ల జాబితాలో మృతి చెందిన ఓటర్ల పేర్లున్నాయని, ఒక్కో వ్యక్తికి రెండేసి ఓట్లున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సంతోష్‌కుమార్ తెలిపారు. మహిళలకు పుట్టింట్లో, అత్తింట్లో ఓట్లున్నాయని, ఒకే కుటుంబం ఓట్లు ఒకే వార్డులో లేవని తెలిపారు. ఓటరు జాబితాలోని తప్పులపై వచ్చిన అభ్యంతరాలను వెంటనే పరిశీలించి తప్పులు లేని జాబితాను ప్రచురించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాండ్ల గోపాల్, దూడం శ్రీనివాస్, దామరపల్లి శివారెడ్డి, సాయిల్ల మహేందర్, కస్తూరి రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రేగుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుకు చర్యలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్ల సమ్మక్క గద్దెల వద్ద వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును మరమ్మతు చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు హామీ ఇచ్చారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి రోడ్డును పరిశీలించారు. నేషనల్ హైవే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే రోడ్డు కోతకు గురైందని, రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని రైతులు తెలిపారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి కాంట్రాక్టర్‌తో రోడ్డు మరమ్మతు చేయించేందుకు కృషి చేస్తానని రాజేందర్‌రావు తెలిపారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు బుర్ర బాబు, కాశిపాక రాకేశ్ తదితరులున్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

జమ్మికుంట: నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు మండలంలోని గ్రామాల్లో మున్నూరు కాపు కుల పెద్దలతో సమన్వయం చేసుకుంటూ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నగంటి మల్లయ్య అన్నారు. శనివారం పట్టణంలో పట్టణ అధ్యక్షుడు ఏబూషి శ్రీనివాస్ అధ్యక్షతన కాపు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదు పుస్తకాలను నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పిడి సునీల్‌కు అందజేశారు. వీణవంక, హుజూరాబాద్, ఇల్లందకుంట మండల అధ్యక్షులు పురంశెట్టి చేరాలు, ఆకుల సదానందం, అప్పాల రమేశ్, సీనియర్ నాయకులు ఆకుల రాజేందర్, సాయిని రవి, రవికుమార్, తిరుపతి, విష్ణు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత రుసుముతో వీఎండీలో ప్రకటనల ప్రదర్శన

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని ప్రధాన కూడళ్లతో పాటు పలుచోట్ల ఏర్పాటు చేసిన వేరియబుల్ మెసేజ్ డిస్‌ప్లే (వీఎండీ) బోర్డుల్లో నిర్ణీత ఫీజుతో ప్రకటనలు ప్రదర్శించడం జరుగుతుందని నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ ప్రకటనలు, ప్రైవేట్ ప్రకటనలు, ఇతరత్రా ఎలాంటి ప్రకటనలైనా వీఎండీలలో ప్రదర్శించేందుకు నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను సంప్రదించాలన్నారు. ప్రదర్శించే ప్రకటనల సైజు, సమయం ఆధారంగా ఫీజు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

వసతిగృహాలు తనిఖీ

రామడుగు: మోడల్ స్కూల్, బీసీ బాలికల వసతిగృహాలను తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో రాజేశ్వరి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనం, వంటలను పరిశీలించారు. వంట గదిలో సామగ్రితోపాటు వంటలకు ఉపయోగిస్తున్న పప్పులు, నూనెలు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనమందించాలని సూచించారు.

పౌర హక్కుల దినోత్సవం

ఇల్లందకుంట: పౌర హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రాజమల్లు అన్నారు. శనివారం బూజునూర్‌లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. పౌరులు తమ హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఎస్సై క్రాంతికుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అప్పుడు లేని సంప్రదాయం ఇప్పుడెలా?

- బీఆర్ఎస్‌కు సభలో పీపీటీ అవకాశంపై డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ఇచ్చే సంప్రదాయం లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీపీటీ ఇచ్చే అవకాశం ఇవ్వాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేఖ రాసినా అవకాశం ఇవ్వలేదని శనివారం అసెంబ్లీలో మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ చెప్పారు. అప్పుడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా అప్పులు, వడ్డీల కింద రూ.6,500 కోట్లు కట్టడం లేదన్న బీఆర్ఎస్ వాదన సరికాదని అన్నారు. ప్రభుత్వం కట్టకపోతే బీఆర్ఎస్ నేతలు వడ్డీలు కడుతున్నారా? అని ప్రశ్నించారు.

కేసీఆర్ వస్తారని అనుకుంటున్నాం..

- రాకపోతే తప్పు ఒప్పుకున్నట్టే: మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆదివారం అసెంబ్లీలో జరిగే చర్చకు ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరుకావాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఆయన వస్తారనే అనుకుంటున్నామని, ఒకవేళ రాకపోతే కేసీఆర్ తాను చేసిన తప్పును ఒప్పుకున్నట్టేనని వ్యాఖ్యానించారు. శనివారం కేబినెట్ భేటీ అనంతరం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడంలో అన్నీ తానేనని గొప్పలు చెప్పుకున్న కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు విషయంలో మంచిపేరున్న న్యాయమూర్తితో విచారణ జరిపించిన నివేదికను అసెంబ్లీ ముందు పెడుతున్నామని, ఆ నివేదిక తప్పు అని కేసీఆర్ భావిస్తే అదే విషయాన్ని అసెంబ్లీకి వచ్చి చెప్పాలన్నారు. ప్రతిపక్ష నేతగా జీత భత్యాలు తీసుకుంటున్నందున ఆ బాధ్యత కూడా కేసీఆర్‌పై ఉంటుందని తెలిపారు.

కాళేశ్వరంపై చర్చకు అంత భయమెందుకు?

- బీఆర్ఎస్‌కు మంత్రి సీతక్క ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై చర్చ అంటే బీఆర్ఎస్‌కు ఎందుకంత భయం అని పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క ప్రశ్నించారు. ఈ నివేదికను ప్రభుత్వపరంగా సభలో ప్రవేశ పెట్టకుండా ఉండేందుకు బీఆర్ఎస్ శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. శుక్రవారం శాసనసభ ఆవరణలో మీడియా ప్రతినిధులతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కాళేశ్వరంపై చర్చ జరగకుండా ఉండేందుకు యూరియా పేరుతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరంపై కోర్టులో ఏమీ తేలకపోవడంతో యూరియా అంశాన్ని బీఆర్ఎస్ తెరపైకి తెచ్చిందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని సీతక్క తెలిపారు.

అసెంబ్లీలో చట్టం చేశాకే ప్రత్యేక జీవోను తీసుకురావాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేసిన తర్వాతనే ప్రత్యేక జీవోను తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ చేయబోయే చట్టంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు బేషరతుగా మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో రాజకీయం చేస్తే ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టానికి మద్దతు ఇవ్వని రాజకీయ పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తామన్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాత రెండోసారి గవర్నర్‌కు ఆపే అధికారం లేదని, గవర్నర్ ఆమోదించకుంటే బీజేపీ బాధ్యత వహించాల్సి ఉంటుందని జాజుల తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీలు రత్నాకర్, రంగారెడ్డి మృతికి మండలి సంతాపం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఇద్దరు సభ్యుల మృతి పట్ల తొలిరోజు శాసనమండలి సంతాపం తెలిపింది. ఉమ్మడి రాష్ట్రంలో సభ్యులుగా కొనసాగిన టి.రత్నాకర్, ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ పరిషత్‌లో సభ్యులుగా కొనసాగిన మాగం రంగారెడ్డి మృతి పట్ల మండలి సంతాపం తెలుపుతూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. ఈ సందర్భంగా చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయా సభ్యులు వారితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు.

అనూహ్యం.. గెలుపే వ్యూహం

- జూబ్లీహిల్స్ అభ్యర్థి అవుతాడనుకున్న అజారుద్దీన్‌కు ఢిల్లీ సిఫారసుతో ఎమ్మెల్సీ హోదా
- కేబినెట్‌లో సైతం అవకాశం? అమేర్ అలీఖాన్‌కు ప్రభుత్వ పదవి
- జూబ్లీహిల్స్ టికెట్ రేసులో బొంతు రామ్మోహన్, నవీన్ యాదవ్



బొంతు రామ్మోహన్



నవీన్ యాదవ్

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా మాజీ క్రికెటర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజారుద్దీన్‌ను రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేయడంతో, పార్టీ పరంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనూహ్య మలుపు తీసుకుంది. ఈ ఎన్నికలో అధికార కాంగ్రెస్ అభ్యర్థిగా అజారుద్దీన్ పేరు దాదాపు ఖరారైందనే వార్తల నేపథ్యంలో..అనూహ్యంగా ఆయన్ను ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం చర్చనీయాంశమవుతోంది. అయితే ఈ నిర్ణయం వెనుక ఢిల్లీ పెద్దల సిఫారసు ఉందని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ఆలోచించి నియోజకవర్గంలో గెలుపే ధ్యేయంగా నిర్ణయం తీసుకుందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. అజారుద్దీన్ రేసు నుంచి వైదొలగడంతో ఆ స్థానంలో పలు పేర్లు తెరపైకి వస్తున్నాయి. సర్వేలతో పాటు సామాజిక సమీకరణలు, ఎన్నికల నాటికి స్థానిక పరిస్థితుల ఆధారంగా కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది ఖరారు చేస్తారని సమాచారం.

అన్ని అంశాలూ పరిగణనలోకి...!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పలు పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో జీహెచ్ఎంసీ మాజీ మేయర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు వి.నవీన్‌యాదవ్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇద్దరూ బలమైన బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు కావడంతో పాటు ఇతర సమీకరణలను కూడా పరిగణనలోకి తీసుకుని ఆ ఇద్దరి పేర్లను పీసీసీ తీవ్రంగా పరిశీలిస్తోంది. రేసులో స్థానిక కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కూడా ఉన్నారు. కమ్మ సామాజిక వర్గం నుంచి టికెట్ ఇవ్వాలనుకుంటే పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తున్నట్టు సమాచారం. అయితే చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిని బరిలోకి దింపాలని కాంగ్రెస్ పెద్దలు యోచించినా ఆయన పోటీకి విముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మున్నూరు కాపు, యాదవ (భార్య కులం) సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు హైదరాబాద్ మేయర్‌గా పనిచేసిన అనుభవం, సౌమ్యుడనే పేరు, బీజేపీ, బీఆర్ఎస్ నేతలతో కూడా గతంలో సంబంధాలు కలిగిన బొంతు రామ్మోహన్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు స్థానికుడైన యాదవ సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్ కూడా టికెట్ కోసం గట్టిగా పట్టు పడుతున్నట్లు సమాచారం. వీరే కాక చివరి నిమిషంలో అన్ని హంగులున్న మరో ప్రముఖ వ్యక్తి కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉందని, అయితే ఆ వ్యక్తి పేరును ఇప్పుడే బహిర్గతం చేయలేమని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

ఆయనకు మంత్రి.. ఈయనకు మంచి పదవి

ఎమ్మెల్సీగా నామినేట్ అయిన అజారుద్దీన్‌కు భవిష్యత్తులో కేబినెట్‌లో కూడా స్థానం లభించనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జిల్లాతో పాటు మైనార్టీ కోటాలో అజారుద్దీన్ మంత్రి అవుతారని, ఈయనకు హైకమాండ్ ఆశీస్సులు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ఎమ్మెల్సీగా మొన్నటివరకు పనిచేసిన మరో మైనార్టీ నేత అమేర్ అలీఖాన్‌కు కూడా ప్రభుత్వ పదవి ఇస్తారని అంటున్నారు. ఆయనను కీలక కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

గణపతి బప్పా మోరియా.. యూరియా కావాలయ్యా

- అసెంబ్లీ సమావేశాల తొలిరోజు బీఆర్ఎస్ నిరసన
- గన్‌పార్కు వద్ద యూరియా సంచులు, ప్లకార్డుల ప్రదర్శన
- వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ధర్నా
- సచివాలయం ఎదుట బైఠాయింపునకు యత్నం
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



యూరియా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజున రాష్ట్రంలో యూరియా కొరతపై బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో నిరసన గళం వినిపించింది. శనివారం దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం తెలిపిన తర్వాత సభ వాయిదా పడింది. అనంతరం యూరియా కొరతపై అసెంబ్లీ బయట గులాబీ పార్టీ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. ఉదయం అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని తెలంగాణ అమర వీరుల స్తూపానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఖాళీ యూరియా సంచులు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. 'గణపతి బప్పా మోరియా.. కావాలయ్యా యూరియా', 'రేవంత్ ద్రోహం.. రైతన్నకు మోసం' అంటూ నినాదాలు చేశారు.

కమిషనర్ కార్యాలయంలో ధర్నా

అసెంబ్లీ వాయిదా అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ కాలినడకన ఎల్బీ స్టేడియంకు ఎదురుగా ఉన్న వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. యూరియా, ఇతర ఎరువుల లభ్యతపై సమీక్ష జరిపి వెంటనే సరఫరా చేయాలని కోరుతూ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. సమస్యకు పరిష్కారం చూపేంత వరకు కదిలేది లేదని ధర్నాకు దిగారు. అయితే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు.

సచివాలయంలోకి చొచ్చుకుపోయేందుకు యత్నం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తెలంగాణ భవన్‌కు తరలించే క్రమంలో సచివాలయం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనం ఆగడంతో అందులో నుంచి దిగిన మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు ధర్నాకు దిగారు. బారికేడ్లు దూకి సచివాలయంలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించడంతో పోలీసులు గేట్లు మూసి వేశారు. అయితే పోలీసులు వారిని తిరిగి అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడారు.

సభను అనుకూలంగా నడుపుకునే ప్రయత్నం: కేటీఆర్

'రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీని తమకు అనుకూలంగా నడుపుకునే ప్రయత్నం చేస్తూ రైతుల సమస్యలు, ఎరువుల కొరత తదితరాలపై మాట్లాడటం లేదు. ప్రభుత్వం కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు పెడితే వ్యవసాయ రంగం, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సహా అన్ని అంశాలపైనా చర్చించేందుకు సిద్ధం. కాళేశ్వరంపై కాంగ్రెస్ వేసిన 'పీసీసీ ఘోష్ కమిషన్' పైనా చర్చించేందుకు సిద్ధం. వ్యవసాయ రంగం కోసం కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల కోసం రైతులు పండుగ రోజు, వర్షాల్లోనూ తమ చెప్పులు, ఆధార్ కార్డులను పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. వర్షాల మూలంగా జరిగిన నష్టం, రైతుల ఆత్మహత్యలు, రైతాంగానికి కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలపై చర్చ జరగాలి. కానీ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాలపైనే మాట్లాడే ప్రయత్నం చేస్తోంది..' అని కేటీఆర్ విమర్శించారు.

రైతుల చెంప చెళ్లుమనిపిస్తారా..? : హరీశ్‌రావు

'యూరియా అడిగినందుకు రైతుల చెంప చెళ్లుమనిపించడమేనా కాంగ్రెస్ సోకాల్డ్ పాలన. మూటలు మోయడం, మాటలు మార్చడమే ముఖ్యమంత్రి రేవంత్‌కు తెలిసిన విద్య. రాష్ట్రంలో యూరియా కొరత లేదంటూ 'ఏఐ ఫోటోల'తో ప్రచారం చేశారు. లైన్లలో నిల్చున్నది రైతులే కాదని బీఆర్ఎస్ కార్యకర్తలని తొండి కూతలు కూశారు. చివరకు యూరియా కొరత నిజమేనని ఒప్పుకుని కేంద్ర ప్రభుత్వం కారణమన్నారు. కాంగ్రెస్ వల్లే యూరియా సంక్షోభం తలెత్తిందని రైతులకు అర్థమైంది. రేవంత్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలి..' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

క్లాస్‌గా కనిపించే మాస్ లీడర్..గోపీనాథ్

- ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారు
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి
- ప్రజల్లో పర్మనెంట్ కటౌట్‌గా గోపీనాథ్: కేటీఆర్
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి అసెంబ్లీ సంతాపం

సాక్షి, హైదరాబాద్: సౌమ్యుడు, మితభాషి అయిన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ క్లాస్‌గా కనిపించే మాస్ లీడర్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బస్తీల్లోని పేదలతో ఆయనకు ఎంతో అనుబంధం ఉండేదని గుర్తుచేశారు. శనివారం వర్షాకాల అసెంబ్లీ సమావేశాల ప్రారంభం తొలిరోజున స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అనుమతితో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'విద్యార్థి దశ నుంచే మాగంటి గోపీనాథ్ చురుకుగా ఉండేవారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1985 నుంచి 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. సినీ రంగంలోనూ గోపీనాథ్ నిర్మాతగా రాణించారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఘనత సాధించిన వారిలో ఆయన ఒకరు. గోపీనాథ్ అకాల మరణం ఎంతో బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నా. గోపీనాథ్ కుటుంబానికి అంతా అండగా ఉంటాం'అని తెలిపారు. మాగంటి గోపీనాథ్ అందరితో కలుపుగోలుగా ఉండేవారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, హైదరాబాద్ నగర రాజకీయాల్లో గోపీనాథ్ తనదైన ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచి గోపీనాథ్‌తో తనకు అనుబంధం ఉందని తెలిపారు.

ప్రజల గుండెల్లో పర్మనెంట్ కటౌట్ గోపీనాథ్: కేటీఆర్

తన అభిమాన నాయకుడు ఎన్టీ రామారావు కటౌట్ల ఏర్పాటుతో హైదరాబాద్‌కు కటౌట్ల కల్చర్ తెచ్చిన నాయకుడు మాగంటి గోపీనాథ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన సేవతో ప్రజల గుండెల్లో పర్మనెంట్ కటౌట్ ఏర్పర్చుకున్నారని కొనియాడారు. 'సభలో గోపీనాథ్‌కు సంతాపం తెలపాల్సి వస్తుందని నేను ఏనాడూ అనుకోలేదు. ఇది అత్యంత విషాదకరం. ఆయన అనారోగ్యం గురించి ఎప్పుడూ ఎవరికీ చెప్పుకోలేదు. కానీ, జూబ్లీహిల్స్ ప్రజల కోసం చివరిదాకా పాటుపడ్డారు. తెలంగాణ నుంచి టీడీపీ మాయం అయిన తర్వాత కేసీఆర్‌తో కలిసి నడిచేందుకు ముందుకు వచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు గోపన్న అని ప్రేమగా పిలుచుకునే గోపీనాథ్ ఎన్ని ఒత్తిడులు వచ్చినా మా పార్టీపై నమ్మకంతో, విధేయుడిగా ఉన్నారు. ఆయన మరణం మా పార్టీకి, ఆయన కుటుంబానికి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి తీరని లోటు'అని సంతాపం తెలిపారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ, యువకులుగా తామిద్దరం ఒకేసారి రాజకీయాల్లోకి వచ్చామని గుర్తు చేసుకున్నారు. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్ తదితరులు మాగంటి గోపీనాథ్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలపాటు సభలో మౌనం పాటించారు. అనంతరం అసెంబ్లీని ఆదివారం ఉదయం 9 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వండి

- జస్టిస్ ఘోష్ నివేదికపై మరోసారి హైకోర్టుకు కేసీఆర్, హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించినా.. చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్లు (ఐఏ) దాఖలు చేశారు. ఇప్పటికే తాము దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను న్యాయస్థానం అక్టోబర్ 7కు వాయిదా వేసిందని, విచారణ పెండింగ్‌లో ఉండగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 'ఈ నెల 31న జస్టిస్ ఘోష్ నివేదికను శాసనసభ ముందు ప్రవేశపెట్టి చర్చించిన తర్వాత, మాపై త్వరితగతిన చర్య తీసుకునే అవకాశం ఉంది. ఇది ప్రాథమికంగా విచారణ కమిషన్ల చట్టం 1952లోని సెక్షన్ 8 బీ, సెక్షన్ 8 సీలకు విరుద్ధం. ఇదే విషయాన్ని ప్రాథమిక విచారణలో కోర్టు ముందు ఉంచాం. జూలై 31న జస్టిస్ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై విచారణ ముగిసి కోర్టు తీర్పు ఇచ్చేవరకు తాత్కాలికంగా నిలిపివేయాలి'అని కోరారు. జస్టిస్ ఘోష్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, అమలు చేయకుండా ఉత్తర్వులు జారీ చేయాలని వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం.. విచారణను అక్టోబర్ 7కు వాయిదా వేసింది. అయితే అసెంబ్లీ సమావేశాల్లో నివేదికపై చర్చించే అవకాశమున్న నేపథ్యంలో ఇరువురు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. వీటిపై సెప్టెంబర్ 1న విచారణ చేపట్టే అవకాశం ఉంది.

అసెంబ్లీ నేడు ఒక్కరోజే

▶ మొదటి పేజీ తరువాయి

కమిషన్ పూర్తి నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు సమర్పిస్తారు. దీనిపై చర్చ అనంతరం పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులపై కూడా సభలో చర్చిస్తారు. స్థానిక సంస్థలతో పాటు మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లకు సంబంధించి ఉన్న గరిష్ట పరిమితిని ఎత్తివేస్తూ సవరణలు ప్రతిపాదిస్తారు. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 (ఎ)కు సవరణల ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పీపీటీకి బీఆర్ఎస్ పట్టు

పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తమకు అవకాశం ఇవ్వాలని బీఏసీ భేటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. ఈ విజ్ఞాపనను పరిశీలిస్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇక కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో జరిగే చర్చలో ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొనే అవకాశాలు కనిపించడం లేదు. అయితే సభలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ ఇప్పటికే దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. యూరియా కొరత, వరద బీభత్సం, విష జ్వరాలు, గురుకులాల్లో విద్యార్థుల మరణాలు తదితర ప్రజా సమస్యలపై చర్చించాలని బీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ శాసనసభా పక్షం నాయకుడు ఎ.మహేశ్వర్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. ఇక శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండలి బీఏసీ సమావేశంలో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుతో పాటు డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్ గౌడ్, నెల్లికంటి సత్యం, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు పాల్గొన్నారు.



బీఏసీ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దుద్దిళ్ల, పొన్నం, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తదితరులు

ఎమ్మెల్యే యెన్నంకు సీవీ ఆనంద్ క్షమాపణ!

అవమానించారని సభా హక్కుల నోటీసు ఇచ్చేందుకు సిద్ధమైన ఎమ్మెల్యే

- విషయం తెలిసి క్షమాపణ చెప్పిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్
- కీలక మంత్రి కలుగజేసుకోవటంతో సద్దుమణిగిన వివాదం



యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సీవీ ఆనంద్

సాక్షి, హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని హేళన చేసి మాట్లాడటంపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌పై సభా హక్కుల నోటీసు ఇవ్వడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిద్ధమవటం అధికార వర్గాల్లో కలకలం రేపింది. మెట్టుగూడలోని 2,000 చదరపు గజాల స్థల వివాదానికి సంబంధించి ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన శ్రీనివాస్‌రెడ్డితో సీవీ ఆనంద్.. 'నా దగ్గరకు ఎందుకు వచ్చావ్... ఎన్నిమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యావ్'అంటూ హేళనగా మాట్లాడారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శనివారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చెప్పారు. దీనిపై తాము సభా హక్కుల నోటీసు ఇవ్వాలని నిర్ణయించామని, ఆ విషయం తెలిసి సీవీ ఆనంద్ స్వయంగా శ్రీనివాస్‌రెడ్డి దగ్గరకు వెళ్లి క్షమాపణ చెప్పారని తెలిపారు. అయితే, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి సమక్షంలో క్షమాపణ చెబితే ఒప్పుకుంటామని తాము చెప్పినట్లు అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈలోగా మరో కీలక మంత్రి కలుగజేసుకుని విషయాన్ని ఇక్కడితో ముగించాలని కోరడంతో వివాదం సద్దుమణిగింది. తనకు సీవీ ఆనంద్ క్షమాపణ చెప్పిన విషయం వాస్తవమేనని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

'కాళేశ్వరం' చర్చను పక్కదారి పట్టించే కుట్ర

- యూరియా పేరుతో బీఆర్ఎస్ కపట నాటకం: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చ కోసం అసెంబ్లీని సమావేశపరిస్తే, ఆ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు యూరియా పేరుతో బీఆర్ఎస్ కపట నాటకం ఆడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు విమర్శించారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వం కోటా విడుదల చేయకపోవడం కారణమైతే, వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా ఎలా చేస్తారని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడంలో ఆంతర్యం ఏంటో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్‌కు గాను రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. ఏప్రిల్ నెల నుంచే కోత విధిస్తూ వచ్చిందని తెలిపారు. దీనిపై మే నెల నుంచే పోరాటం ప్రారంభించామని, రైతులకు అవసరమైన యూరియాను తెప్పించేందుకు తనతో పాటు ముఖ్యమంత్రి కూడా కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని తుమ్మల వివరించారు. ఏప్రిల్ నుంచి మొదలుపెట్టి కేంద్రానికి 8 సార్లు లేఖలు రాశామని, ఉన్నతాధికారులను పలుమార్లు ఢిల్లీకి పంపించామని చెప్పారు.

రైతులు ఇప్పుడు గుర్తుకొస్తున్నారా?

పార్లమెంటు ఆవరణలో ధర్నా చేసినప్పుడు బీఆర్ఎస్ ఎంపీలు కనీసం మద్దతు కూడా ప్రకటించలేదని, ఇప్పుడు ఏం చేయాలో తోచక కాళేశ్వరం నుంచి తప్పించుకునేందుకు తంటాలు పడుతున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించిన బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు రైతులు గుర్తుకొస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా దొంగ నాటకాలు, ఉత్తుత్తి ఆందోళనలు మాని, ప్రజల కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి అండగా నిలవాలని మంత్రి హితవు పలికారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

అసెంబ్లీని 15 రోజులు నిర్వహించాలి: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై చర్చించేందుకు కనీసం 15 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో కోరినట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన శనివారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన ప్రాణ, పంట నష్టం, యూరియా కొరతపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు దొంగ నాటకాలు ఆడి రైతులను ఇబ్బంది పెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాల్లో 100 మందికిపైగా విద్యార్థులు మరణించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఫోర్త్ సిటీలో సీఎం సోదరులపై వస్తున్న అరాచకాలపై చర్చిద్దామని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా సభ వాయిదా వేసుకుని పారిపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజల కష్టాల గురించి చర్చిద్దాం అంటే బురద రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు రోజులైనా సరే కాళేశ్వరం కమిషన్‌పై మాట్లాడదాం కానీ ముందు ప్రజలు కష్టాల గురించి చర్చిద్దామని కోరినట్లు వెల్లడించారు.

చర్చకు మేము సిద్ధం

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం

దేవాలయం వంటి అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు తాము సిద్ధమని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరంపై నివేదికతో బీఆర్ఎస్ బండారం బయట పడుతుందనే చర్చను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మరో వైపు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారని దుయ్యబట్టారు. నివేదికపై చర్చ ఆపాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

కాళేశ్వరంపై చర్చ అంటే భయం ఎందుకు?

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కాళేశ్వరంపై చర్చ అంటే మాజీ మంత్రి హరీశ్‌రావుకు భయం ఎందుకో చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై బీఆర్ఎస్ నేతలు పూటకో రకంగా స్పందిస్తున్నారని, దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారని ధ్వజమెత్తారు.

కాళేశ్వరంపై చర్చకు కేసీఆర్ రావాలి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనురుధ్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో జరిగే చర్చకు మాజీ సీఎం కేసీఆర్ రావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనురుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ ఫామ్ హౌస్‌లో కూర్చున్నారని, ఆయనకు ఎమ్మెల్యేగా ఉండే అర్హత లేదని విమర్శించారు. కేసీఆర్‌కు నిజంగా ఆరోగ్యం బాగాలేకపోతే వీల్‌చైర్‌పై కూడా వచ్చి చర్చలో పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రజా సమస్యలపై చర్చకు సహకరించాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే గండ్ర

బీసీలకు న్యాయం చేసేవిధంగా అసెంబ్లీలో చర్చ జరగబోతోందని, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై చర్చకు సహకరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. యూరియా కొరతకు బీజేపీ నేతలే కారణమని విమర్శించారు.

ప్రజా సమస్యలపై చర్చించే దమ్ము లేదు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించే దమ్ము లేక ప్రభుత్వం తప్పించుకుంటోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఒక్కరోజు మాత్రమే ఈ సమావేశాలు అని శ్రీధర్‌బాబు, భట్టి చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం 30 రోజులపాటు సభ నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. వరద ముంపు, యూరియా కొరతపై చర్చ లేకుండా సీఎం ఎందుకు తప్పించుకుంటున్నారని నిలదీశారు.

● ఫొటో కామెంట్



ఆశల బల్లకట్టు

ఆగస్టు 29న పంజాబ్ కపుర్థలా జిల్లాలో బియాస్ నది వరదలకు బల్లకట్టుపై గొడ్లను కాపాడుకుని తరలుతున్న రైతులు

ఓడించడానికి వరద వస్తుంది. మనిషిని ఓడగొట్టి చూద్దామని వరద వస్తుంది. వేయి చేతులతో లక్ష కాళ్లతో రాత్రికి రాత్రి... చీకటి దారిలో... దొంగదెబ్బ తీద్దామని వరద వస్తుంది. పగటి వేళ బందిపోటులా నీటితూటాల తుపాకీ పేలుస్తూ వరద వస్తుంది. అది ఇంటి పాదాల కిందుగా వస్తుంది. ఇంటి యజమాని తల మీదుగా వస్తుంది. చావిట్లోని ఎడ్ల కొమ్ముల మీద నుంచి, బరెగొడ్ల పొదుగుల మీద నుంచి, చంటి పిల్లల బెదురు ఏడుపుల మీద నుంచి, అమ్మ వెలిగించాల్సిన పొయ్యి మీద నుంచి, నాన్న జేబు మీద నుంచి భీతావహం చేస్తూ బీభత్సం సృష్టిస్తూ వస్తుంది. నేనెక్కువ అని ప్రకటించడానికి వస్తుంది. నెట్టుకుంటూ, తోసుకుంటూ, కూలగొడుతూ, పెళ్లగిస్తూ, కుళ్లగిస్తూ ప్రతాపం చూపించడానికి వస్తుంది.

ఈ దెబ్బతో మనిషి సఫా– అనుకుంటుంది అది. విర్రవీగుతుంది అది. ఉధృతంగా నవ్వుతుంది అది.

అప్పటికే మనిషి సిద్ధమైపోయి ఉంటాడు. సరే... కొన్నాళ్లు అని నిర్ణయం తీసుకుని ఉంటాడు. భార్యా బిడ్డలను ఒడ్డుకు బయల్దేరదీస్తూ ఉంటాడు. మిగిలిన నూకలను మూటగట్టుకుంటూ ఉంటాడు. గొడ్డూ గోదాను తీసుకెళ్లేందుకు బల్లకట్టును వెతుకుతూ ఉంటాడు. మధ్య మధ్య భార్యను కేకేసి 'ఇంటి ముందుకు నీళ్ల పిశాచి వచ్చింది... దానిక్కాస్త చీపురు చూపించు' అని పురమాయిస్తుంటాడు. ఎన్ని చూసి ఉంటాడతడు? తుఫాన్లు కొత్తా? కుంభవృష్టి కొత్తా? వడగండ్లు కొత్తా? వడగాడ్పులు కొత్తా? కరువు కొత్తా? బతుకు నెత్తిన పడేసే బరువు కొత్తా? రోగాలు.. రొష్టులు.. మహమ్మారులు.... పాలకుల నమ్మకద్రోహాలు... వ్యాపారుల నిలువు దోపిడీలు... డబ్బు రాజేసే పెను మంటలు... వరదకు భయపడతాడా?

మనిషి ఆగడు. జీవితాన్ని ఆగనివ్వడు. ఆశను చావనివ్వడు.

ఎన్నో వస్తుంటాయి పోతుంటాయి. నాలుగు రోజులు ఉండి వెళ్లే అతిథికి తగిన మర్యాదలు చేసి పంపడం అతనికి వచ్చు. కష్టాలను మెల్లగా సాగనంపడం వచ్చు. వాటిని వదిలిపెట్టడం వదుల్చుకోవడం వచ్చు. అందుకు సాటి మనిషిని తోడు చేసుకోవడమూ వచ్చు.

ఇది తెలియని వరద అతడిని జయించాలని చూసినప్పుడల్లా ఓడిపోయింది. మళ్లీ మళ్లీ ఓడిపోతూనే ఉంది. మహా అయితే సాధించగలిగేది కాసింత బురద జల్లి పోవడమే.

మనిషి సాగించే అనంత జీవన ప్రయాణంలో వరదది లిప్తపాటు కలకలం.

అతడు రేపో మర్నాడో మళ్లీ తన ఇల్లు చేరుతాడు. ఆరబెట్టిన వస్తువులు లోపల పెట్టుకుంటాడు.

తల స్నానం చేసి, పొడి బట్టలు కట్టుకుని, భార్య వండిన వేడి వేడి భోజనాన్ని పిల్లలతో పాటు భుజిస్తూ ఆశను ఊత చేసి సాగిపోతూనే ఉంటాడు.

● సోషల్ మీడియా

డ్రైవర్ అమ్మ!



కేరళకు చెందిన 72 సంవత్సరాల మణి అమ్మ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దుబాయ్‌లో రోల్స్–రాయిస్ ఘోస్ట్‌ను స్టైలిష్‌గా నడుపుతున్న ఈ వీడియోను చూసి 'వావ్' అంటున్నారు నెటిజనులు.

'డ్రైవర్ అమ్మ'గా పాపులర్ అయిన మణి అమ్మకు ట్రక్ నుంచి క్రేన్ వరకు 11 రకాల వాహనాల లైసెన్స్ ఉంది.

వీడియోలో తన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్‌ను చూపిస్తూ దాని అవసరం ఏమిటో చెప్పింది.

మణి అమ్మ కేరళలో డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తోంది.

డ్రైవింగ్ అంటే చచ్చేంత భయపడేవాళ్లను కూడా ఆ భయాన్ని తొలగించి, డ్రైవింగ్ అంటే చచ్చేంత ఇష్టం అయ్యేలా చేయడంలో మణి అమ్మ నిపుణురాలు.

దుబాయ్‌లోని ట్రాఫిక్‌లో ధైర్యంగా, అవలీలగా ఆమె డ్రైవింగ్ చేస్తున్న తీరును చూసి నెటిజనులు 'ది రియల్ పవర్‌హౌజ్' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

● సమ్‌థింగ్ స్పెషల్

చెట్టు నుంచి డబ్బులు కురుస్తాయి!



'డబ్బులు చెట్లకు కాస్తాయా!' అంటుంటారు. 'కాయక పోయినా వర్షంలా కురుస్తాయి' అని ఈ వీడియోను చూస్తూ బేషుగ్గా చెప్ప వచ్చు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఔరైయా పట్టణంలో ఒక కోతి చేష్టల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

రోహిత్ చంద్ర అనే స్కూల్ టీచర్ బ్యాంక్‌లో నుంచి రూ.80 వేల రూపాయలు తీసుకొని, ఆ డబ్బును బ్యాగులో పెట్టుకొని బైక్ స్టార్ట్ చేస్తున్నప్పుడు ఎటు నుంచి వచ్చిందో ఒక కోతి వచ్చి ఆ బ్యాగ్‌ను ఎత్తుకెళ్లి చెట్టెక్కింది.

అంతటితో ఊరుకుందా?

లేదు.

సంచిలో నుంచి అయిదు వందల రూపాయల నోట్లను కింద వేయడం మొదలు పెట్టింది. దీంతో దారిన పోయే దానయ్యలు ఆ నోట్లను పట్టుకోవడంలో పోటీ పడ్డారు. అయితే వారిలో చాలామంది తమకు దొరికిన నోట్లను రోహిత్ చంద్రకు తిరిగి ఇచ్చారు. అయినప్పటికీ అతడు రూ.28,000 నష్టపోయాడు.

'అయ్యో పాపం!' అంటున్నారు నెటిజనులు.

● బ్యూటిప్స్

అందమైన పెదవుల కోసం...



- ప్రతిరోజు రాత్రి పడుకోబోయే ముందు బీట్‌రూట్ జ్యూస్‌ని అప్లై చేసి పడుకుంటే పెదవులు పగడాల్లా కాంతులీనుతాయి.
- పడుకునే గంట ముందు కొబ్బరి నూనెతో పెదవులను మసాజ్ చేస్తే మరింత నునుపుతేలతాయి.
- వెన్నతో పెదవులను సుతిమెత్తగా మసాజ్ చేస్తే అవి గులాబి రంగులోకి మారడమే కాకుండా మృదువుగా మారుతాయి.
- ఒక టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ నిమ్మ రసం, కొన్ని చుక్కల గ్లిజరిన్‌ని కలిపిన మిశ్రమాన్ని పది నిమిషాలపాటు మసాజ్ చేస్తే పెదవులు నునుపు తేలడమే కాకుండా వాటిపై సన్నని గీతలు మటుమాయమవుతాయి.
- కొత్తిమీర జ్యూస్‌తో పెదవులని నాజూగ్గా మసాజ్ చేస్తే గులాబీ పెదవులు మీ సొంతమవుతాయి.
- నేతిలో గులాబీ రేకులను మెదిపిన మిశ్రమంతో మసాజ్ చేస్తే పెదవులపై ఉండే గరుకుదనాన్ని తొలగించవచ్చు.
- నిమ్మ చెక్కలతో పెదవులపై మసాజ్ చేస్తే వాటిపై ఉండే నలుపు క్రమంగా మటుమాయమవుతుంది.
- డ్రైగా ఉన్న పెదవులపై, పాల మీగడలో గులాబి రేకులను రంగరించి మర్దన చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

● కిచెన్ టిప్స్




- చపాతీగాని, పరోటాగాని, మెత్తగా ఉండాలంటే ఒక స్పూన్ మైదా, ఒక స్పూన్ పెరుగుని గోధుమ పిండిలో వేసి తడిపితే మెత్తగా వస్తాయి.
- చిటికెడు సోడా వేసి గోధుమపిండిని తడిపితే పూరి మెత్తగా, రుచిగా ఉంటుంది.
- పచ్చకూరలు వండేటప్పుడు చిటికెడు సోడా వేసి వండితే చూడ్డానికి కంటికి మంచి ఇంపుగా కనబడ్డమే కాకుండా రుచిగా ఉంటాయి.

హెల్త్

ఈ జబ్బులకు లింగ వివక్ష?

అదేమిటో గానీ... కొన్ని జబ్బులు కక్ష పట్టినట్టుగా మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి. వాళ్లపైనే తమ దుష్ప్రభావాలు ఎక్కువగా చూపిస్తాయి. ముఖ్యంగా ఆర్థ్రైటిస్‌కు చెందిన రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, సోరియాటిక్ ఆర్థ్రైటిస్, జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థ్రైటిస్, సిస్టమిక్ లూపస్ అరిథమెటోసిస్ (ఎస్ఎల్ఈ), మయోసైటిస్ వంటివి. అవి వాళ్లలోనే ఎందుకలా వస్తాయన్న విషయాన్ని అనన్య అనే ఓ అమ్మాయి వృత్తాంతంతో డాక్టర్లు వివరిస్తున్నారు. అనన్య కథేమిటో చూద్దామా!



ఓ అనన్య కథ

అనన్య 24 ఏళ్ల ఓ అమ్మాయి. పెదవుల మీద చెరగని చిర్నవ్వు... ఎల్లప్పుడూ చకచకా కదులుతూ ఉండే చురుకుదనం... కళ్లనిండా భవిష్యత్తు మీద ఆశ!

మొన్ననే కాలేజీ చదువులు పూర్తి చేసిన ఆ అమ్మాయి ఇటీవలే ఓ ఐటీ కంపెనీలో చేరింది. అలా చదువైపోయిందో లేదో ఇలా ఉద్యోగం వచ్చిందన్న సంతోషం ఈమధ్య అంతగా ఉండటం లేదు. కారణం... ఆమె ఉదయాలు కష్టంగా మారాయి. వేళ్ల కణుపుల వద్ద వాపు బ్రష్ చేయనివ్వడం లేదు. ఆఫీసులో కీబోర్డు మీద టైప్ కూడా చేయనివ్వడం లేదు. మెట్లెక్కే సమయంలో మోకాళ్లలో నొప్పి.

ఆమె మొదట్లో ఈ బాధను కాస్త తేలిగ్గా తీసుకుంది. సిస్టమ్ ముందు ఎక్కువసేపు కూర్చోవడం వల్లనో లేదా పని ఒత్తిడి కారణంగాలో ఇలా జరుగుతోందని అనుకుంది. పోనుపోనూ ఈ నొప్పి... తొలుత అసౌకర్యంగా... తర్వాత ఇబ్బందికరంగా... ఇప్పుడు బాధాకరంగా మారింది. తన రోజువారీ పనుల మీద తీవ్ర ప్రభావం చూపడం మొదలైంది.

మొదట్లో కుటుంబ సభ్యులు ఆమెను తమ ఫ్యామిలీ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లారు. తనను పరీక్షించిన డాక్టర్ ఆమెను రుమటాలజిస్ట్ దగ్గరికి పంపారు. జాయింట్ల పరిశీలనా, రక్తపరీక్షలూ అయ్యాక ఆమెకు రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ అని నిర్ధారణ అయ్యింది. ఆర్థ్రైటిస్‌లో అదోరకం.

అనన్య జీవితంలో అదో అతిపెద్ద షాక్!! ''ఆర్థ్రైటిసా? ఈ వయసులోనా? సాధారణంగా అది వృద్ధాప్యంలో వచ్చే వ్యాధి కదా'' అనుకుంది. ఆమె మనసులో ఎన్నో ప్రశ్నలు. ''నేనిక పని చేయగలనా? పెళ్లి మాటేమిటి? నేనెప్పటికీ ఈ నొప్పులతోనే బతకాలా? ఈ మందులు సురక్షితమేనా? వాటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవా? ఆ దుష్ప్రభావాలతో ఇక సహజీవనం తప్పదా???

ఆమె మనసులో మెదిలే అనేక ప్రశ్నలకు సమాధానమే ఈ కథనం. డాక్టర్ చెప్పినట్టుగా పురుషులతో పోలిస్తే ఈ తరహా ఆర్థ్రైటిస్‌ల వ్యాప్తి, దుష్ప్రభావాలు మహిళల్లోనే ఎందుకు ఎక్కువ, వాటిని అధిగమించడమెలాగో, ఆ వివరాలేమిటో తెలుసుకుందాం.

● ● ●

అసలు ఆటోఇమ్యూన్ రుమాటిక్ వ్యాధులు అంటే ఏమిటి?

మన శరీర రక్షణ వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమ్) ఎల్లప్పుడూ మనల్ని వైరస్‌లూ, బ్యాక్టీరియా బారి నుంచి కాపాడుతూ ఉంటుంది. బయటి వ్యాధి కారకాలు ఏవైనా మనలోకి ప్రవేశించిన వెంటనే మన వ్యాధి నిరోధక వ్యవస్థ అప్రమత్తమై, వాటితో పోరాడటానికి తన రక్షణ కణాలను పంపుతుంది. అయితే ఈ క్రమంలో మన వ్యాధి నిరోధక కణాలు... ఒక్కోసారి తమ ఒంట్లోని సొంత కణాలనే శత్రు కణాలుగా పొరబడతాయి. వాటితో తలబడతాయి. అలా మన సొంత వ్యాధి నిరోధక వ్యవస్థ తన సొంత కణాలపైనే దాడి చేయడం వల్ల వచ్చే వ్యాధులనే 'ఆటో ఇమ్యూన్ డిజార్డర్స్'గా చెబుతారు. ఇలా దాడి చేసే క్రమంలో అవి మన కీళ్ల (జాయింట్లు), కండరాలు (మజిల్స్), చర్మం, కొన్ని సందర్భాల్లో ఒంట్లోని కీలక అవయవాలపై తీవ్రంగా దాడి చేసి, బాధిస్తాయి.

ఈ తరహా వ్యాధులు యువతులు / మహిళల్లో తమ 20 నుంచి 40 ఏళ్ల వయసులో ఎక్కువగా వస్తుంటాయి. దాంతో వాళ్ల చదువులూ, కెరియర్, కుటుంబ జీవితంపై ప్రభావం చూపడటంతో భావోద్వేగాల పరంగా కూడా వీళ్లు ఎక్కువగా ప్రభావితమవుతుంటారు.

కొన్ని ప్రధానమైన జబ్బులివి...

- **రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ (ఆర్ఏ) :** ఇది రెండు చేతులూ, మోకాళ్లలోని కీళ్లను (జాయింట్స్)ను ప్రభావితం చేస్తుంది.
- **యాంకలైజింగ్ స్పాండిలైటిస్ :** మెడ, వెన్నెముకలను ప్రభావితం చేస్తుంది.
- **సోరియాటిక్ ఆర్థ్రైటిస్ :** సోరియాసిస్‌లో లాగా జుట్టు నుంచి వెండిరంగులో ఉండే చర్మం పొలుసులు రాలడంతో పాటు కీళ్లవాపు, తీవ్రమైన కీళ్ల నొప్పులు కనిపిస్తాయి.
- **జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థ్రైటిస్ :** చిన్న పిల్లలూ, టీనేజీలో ఉండే కౌమార వయసులో ఉండే పిల్లల్లో కనిపించే ఎముకల, కీళ్ల వ్యాధి ఇది.

ఎక్కువగా మహిళల్లోనే... ఎందుకిలా?

అనేక గణాంకాల నుంచి లభ్యమైన వివరాల ప్రకారం ఆటోఇమ్యూన్ వ్యాధులతో బాధపడేవారిలో దాదాపు 75 శాతం మంది మహిళలే. ఇవి వాళ్లలోనే ఎక్కువగా కనిపించడానికి కారణాలు...

- **హార్మోన్ల ప్రభావం:** ఈస్ట్రోజెన్ అనే హార్మోన్ ప్రధానంగా మహిళల్లోనే ఎక్కువగా స్రవిస్తుంది. ఈ హార్మోన్ ఇమ్యూన్ వ్యవస్థపై చూపే ప్రభావం ఇందుకు ఒక కారణం.
- **జన్యుపరమైన అంశాలు:** మహిళల్లో ఉండే కొన్ని రకాల జన్యువులు (జీన్స్) ఈ తరహా వ్యాధులను ప్రేరేపించడం.
- **ఇమ్యూన్ వ్యవస్థలో తేడాలు:** స్వాభావికంగా పురుషులతో పోలిస్తే మహిళల వ్యాధి నిరోధక (ఇమ్యూన్) వ్యవస్థ చాలా బలంగా, శక్తిమంతంగా ఉంటుంది. అదే కారణం చేత... ఒకవేళ ఆ ఇమ్యూన్ వ్యవస్థ తన సొంత కణాలపై పనిచేసేటప్పుడు కూడా ఆ ప్రతిచర్యలూ (రియాక్షన్స్) అంతే బలంగా ఉండటం.

ఏం చేయాలి, ఏయే పరీక్షలూ, చికిత్సలూ చేయించుకోవాలంటే...



డాక్టర్ విజయ ప్రసన్న పరిమి
సీనియర్ రుమటాలజిస్ట్

- ఈ జబ్బుల తాలూకు లక్షణాలు కనిపించిన వెంటనే నిపుణులైన రుమటాలజిస్టులను సంప్రదించాలి. ఎందుకంటే ఈ లక్షణాలు మామూలుగా చాలామందిలో చాలా సాధారణంగా కనిపించేవి కావడంతో సాధారణ డాక్టర్లు వెంటనే వాటిని గుర్తించలేకపోవచ్చు. దాంతో చికిత్స ఆలస్యమయ్యే కొద్దీ దుష్ప్రభావాలూ, కీళ్ల దెబ్బతినడం కూడా పెరగడం జరగవచ్చు. రుమటాలజిస్టులను కలిస్తే వారు కొన్ని పరీక్షలు చేయిస్తారు. అవి...
- ఈఎస్ఆర్, సీఆర్‌పీ, రుమటాయిడ్ ఫ్యాక్టర్, ఏఎన్ఏ, యాంటీ సీసీపీ, కీళ్ల (జాయింట్ల) ఎక్స్–రే, అల్ట్రా సౌండ్ పరీక్షల వంటివి.
- వ్యాధి నిర్ధారణ జరిగిన వెంటనే రుమటాలజిస్టులు డీఎమ్ఏఆర్‌డీ (డిసీజ్ మాడిఫైయింగ్ యాంటీ రుమాటిక్ డ్రగ్స్) అని పిలిచే మెథోట్రెక్సేట్, హైడ్రాక్సీక్లోరోక్విన్, సల్ఫాసలాజీన్ వంటి మందులను సూచిస్తారు. వీటిని ఎంత త్వరగా మొదలుపెడితే... జరగబోయే నష్టాలు అంతగా నివారితమవుతాయి.
- చికిత్సలు మొదలయ్యాక క్రమం తప్పకుండా ఫాలో అప్‌లకు వెళ్తుండాలి. అప్పుడు డాక్టర్లు మందుల ప్రభావాన్ని తరచూ పరీక్షిస్తూ మోతాదులను సవరిస్తుంటారు.

ఈ జబ్బుల తాలూకు మందుల పట్ల ఉండే భయాలివి...

ఈ జబ్బుల్లో సాధారణంగా కొన్నింటికి మందుల వల్ల కొన్ని రకాల భయాలూ, ఆందోళనలూ ఉంటాయి. కారణం కొన్ని సందర్భాల్లో సైడ్‌ఎఫెక్ట్స్ ఎక్కువగా కనిపిస్తుండటమే. అయితే గుర్తుంచుకోవాల్సిందేమిటంటే... ఈ సైడ్‌ఎఫెక్ట్స్ తాత్కాలికమే. ఈ మందులన్నీ చాలావరకు సురక్షితమే. ఇటీవల బయాలజిక్స్ అనే కొత్తరకం మందులు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ మందులతో అంతగా ప్రభావం కనిపించనివాళ్లలో డాక్టర్లు ఈ కొత్తరకం మందులైన బయాలజిక్స్‌నూ వాడుతుంటారు.

చికిత్స తీసుకోకపోతే... చాలా కేసుల్లో ఈ లక్షణాలు చాలామందిలో ఏదో ఒక సమయంలో కనిపించే చాలా సాధారణ లక్షణాలనే కలిగి ఉండటంతో చాలామంది మొదట్లో నిర్లక్ష్యం చేస్తారు. అయితే ఈ తరహా వ్యాధుల్లో ఎంత నిర్లక్ష్యం చేస్తే అంత ప్రమాదం జరుగుతుంది. కొందరిలో శాశ్వత వైకల్యమూ కలగవచ్చు. అందుకే వీటిని నిర్లక్ష్యం చేయకూడదు.

ఈ వ్యాధితో సాధారణ ప్రజల్లాగే జీవించడానికి...

- పొగతాగడం, మద్యం అలవాట్లకు దూరంగా ఉండాలి. పూర్తిగా మానేయడం మంచిది.
- యోగా, ఈత, నడక వంటి తేలికపాటి వ్యాయామాలను నిత్యం చేస్తుండటం.
- కీళ్ల జబ్బులు కనిపించగానే డాక్టర్లు సూచించిన సహాయక పరికరాలను వాడుతుండటం.
- ధ్యానం, మంచి హాబీలతో, రిలాక్సేషన్ టెక్నిక్స్‌తో ఒత్తిడిని అదుపులో పెట్టుకోవడం.
- ఎముకల ఆరోగ్యం కోసం డాక్టర్లు సూచించిన విధంగా క్యాల్షియమ్, విటమిన్–డి సప్లిమెంట్లు తీసుకోవడం.

● ● ●

చివరగా...

''నేను మళ్లీ మామూలుగా జీవించడం సాధ్యమవుతుందా?'' అడిగింది అనన్య.

''పూర్తిగా సాధ్యమే. ఇది కలలకు ముగింపు కాదు. కొద్దిపాటి జాగ్రత్తలతో పూర్తిస్థాయిలో మామూలు జీవితం గడపవచ్చు. కెరియర్, పిల్లలూ, ప్రయాణాలూ... ఇవన్నీ మామూలుగానే జరుగుతాయి. కాకపోతే డాక్టర్లు సూచించిన మందులూ, జాగ్రత్తలూ పాటించాలి. ఇక ముందుగానే గుర్తించడం, అవగాహన కలిగి ఉండటం, నిరంతర పర్యవేక్షణ... ఇవీ మనకు అవసరమైన తారక మంత్రాలు'' అంటున్న డాక్టర్ల మాటలు ఈ తరహా ఆర్థ్రైటిస్ వ్యాధులతో బాధపడే మహిళల జీవితాలకు ఒక మంచి భరోసా.

– యాసీన్

డయాబెటిస్

స్త్రీ పురుషుల మధ్యన తేడా ఇది!

యాభై ఏళ్లలోపు పురుషుల్లో టైప్–2 డయాబెటిస్ అనేది టైప్–1 కంటే తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతుంది. అదే మహిళల విషయానికి వస్తే వాళ్లలో టైప్–1 డయాబెటిస్ అనేదే ఎక్కువ దుష్ప్రభావాలు చూపుతుందని తేలింది. దాదాపు నాలుగు లక్షలమందికి పైగా పేషెంట్లపై స్వీడన్‌కు చెందిన పరిశోధకులు నిర్వహించిన ఓ అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వివరాల్లోకి వెళ్తే...

కాస్తంత చిన్నవయసు పురుషుల్లో అంటే 50 ఏళ్లలోపు పురుషుల్లో టైప్–1 డయాబెటిస్ కంటే టైప్–2 డయాబెటిస్ తీవ్రమైన దుష్ప్రభావాలను కలగజేస్తుంది. ఉదాహరణకు టైప్–2 డయాబెటిస్‌తో బాధపడుతున్న పురుషుల్లో 51 శాతానికి పైగా వ్యక్తుల్లో గుండెజబ్బుల (కార్డియోవాస్క్యులార్ డిసీజెస్) ముప్పు ఉంటుంది. దాంతోపాటుగా హార్ట్ ఫెయిల్యూర్ లేదా గుండెపోటు రిస్క్ కూడా వాళ్లలో రెట్టింపు ఉంటుంది. దీనికి కారణాలు ఆ వయసులో పురుషుల్లో ఊబకాయం, హైబీపీ జబ్బులతో పాటు వారి జీవనశైలి కాస్త అస్తవ్యవస్తంగా ఉండటంతో అది టైప్–2 డయాబెటిస్ తాలూకు దుష్ప్రభావాలను మరింతగా ప్రేరేపిస్తుంది.

అయితే పురుషుల వయసు పెరుగుతున్నకొద్దీ ఈ ముప్పు క్రమంగా కాస్త తగ్గుతూ పోతుంది. అంటే వాళ్ల వయసు 60కి చేరేనాటికి వాళ్లలో టైప్–1 డయాబెటిస్‌తో వచ్చే ముప్పు కంటే టైప్–2 డయాబెటిస్‌తో వచ్చే ముప్పులు కాస్త తగ్గుతాయని చెప్పవచ్చు. ఇక వాళ్ల వయసు 70కి చేరేనాటికి టైప్–1 డయాబెటిస్‌తో ఉన్నవారిలో వచ్చే గుండెపోట్ల కంటే టైప్–2 డయాబెటిస్‌తో ఉన్నవారిలో గుండెపోటు వచ్చే ముప్పు 26 శాతం తక్కువ.



ఇక మహిళల విషయానికి వస్తే వాళ్లలో టైప్–1 డయాబెటిస్‌తో ముప్పు ఎక్కువ. అందునా అది ఏ వయసువారిలోనైనా ఎక్కువే. ఇలా టైప్–1 డయాబెటిస్‌తో బాధపడే యువతులూ, మహిళల్లో గుండెజబ్బులూ, గుండెపోట్లు వచ్చే ముప్పు టైప్–2 డయాబెటిస్‌తో బాధపడే మహిళల కంటే ఎక్కువే.

అదే మహిళల వయసు 50 దాటాక... టైప్–1 డయాబెటిస్ బాధపడేవాళ్లతో పోలిస్తే టైప్ – 2 డయాబెటిస్‌తో బాధపడేవారిలో గుండెజబ్బులూ, గుండెపోట్లు వచ్చే ముప్పు 25 నుంచి 47 శాతం తక్కువ. ఇక అన్ని రకాల గుండెజబ్బుల ముప్పులనూ పరిగణనలోకి తీసుకుంటే టైప్ –2 డయాబెటిస్‌తో బాధపడే మహిళల్లో గుండెజబ్బులతో మృతిచెందడానికి ఉన్న అవకాశాలు టైప్ – 1 మహిళల కంటే 19 శాతం తక్కువ.

దీన్ని బట్టి తేలిసేదేమిటంటే... టైప్ –1 అలాగే టైప్ –2 డయాబెటిస్‌ల ముప్పులు ఇటు మహిళలూ, అటు పురుషుల్లో వేర్వేరు దుష్ప్రభావాలను చూపుతుంటాయని ఈ స్వీడిష్ అధ్యయనంలో వెల్లడైంది.



ఆసియా కప్ రా. 8:00 నుంచి...

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీ మ్యాచ్‌ల సమయంలో స్వల్ప మార్పు జరిగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఉన్న తీవ్ర ఎండల కారణంగా గతంలో ప్రకటించిన సమయంకంటే అరగంట ఆలస్యంగా నిర్వహించనున్నారు. మారిన షెడ్యూల్ ప్రకారం భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలనుంచి (సా.6.30 యూఏఈ సమయం) మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. టోర్నీలో మొత్తం 19 మ్యాచ్‌లు జరగనుండగా...18 మ్యాచ్‌లకు ఇదే సమయం వర్తిస్తుంది. యూఏఈ-ఒమన్ మధ్య జరిగే మ్యాచ్ (డే) మాత్రం అక్కడి సమయం ప్రకారం సా.4 గంటలకు మొదలవుతుంది. సెప్టెంబర్ 9న ఆసియా కప్ ప్రారంభం అవుతుంది. మరో వైపు ఆసియా కప్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో భారత వన్డే కెప్టెన్ రోహిత్, టెస్టు కెప్టెన్ గిల్ ఫిట్‌నెస్ టెస్టుకు హాజరు కానున్నారు. వీరిద్దరు ఇప్పటికే బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఉన్నారు. ఆదివారం సాయంత్రం వరకు వీరి ఫిట్‌నెస్ టెస్టులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఐపీఎల్ తర్వాత రోహిత్ ఇప్పటి వరకు మైదానంలోకి దిగలేదు. ఇంగ్లండ్‌తో సుదీర్ఘ టెస్టు తర్వాత గిల్...నార్త్ జోన్ తరఫున దులీప్ ట్రోఫీ మ్యాచ్ ఆడాల్సి ఉండగా, ఆఖరి నిమిషంలో జ్వరం కారణంగా తప్పుకోవాల్సి వచ్చింది. సెప్టెంబర్ 4న భారత ఆటగాళ్లంతా దుబాయ్‌కు చేరుకోవాల్సి ఉంది.



రాజస్తాన్ రాయల్స్‌కు ద్రవిడ్ గుడ్‌బై

- హెడ్ కోచ్ పదవినుంచి తప్పుకున్న దిగ్గజం
- యాజమాన్యంతో విభేదాలే కారణం!

జైపూర్: ఐపీఎల్ టీమ్ రాజస్తాన్ రాయల్స్‌తో రాహుల్ ద్రవిడ్ బంధం ముగిసింది. 2025 సీజన్‌లో టీమ్ హెడ్ కోచ్‌గా వ్యవహరించిన ద్రవిడ్ ఆ బాధ్యతలనుంచి తప్పుకున్నాడు. ద్రవిడ్‌కు మరింత పెద్ద బాధ్యతలు అప్పగించాలని తాము భావించగా...దానికి అతను అంగీకరించలేదని రాయల్స్ యాజమాన్యం వెల్లడించింది. 'ఐపీఎల్ 2026కు ముందు ద్రవిడ్ పదవీకాలం ముగిసింది. సుదీర్ఘ కాలంగా రాయల్స్ ప్రయాణంలో ద్రవిడ్ ప్రధాన కేంద్రంగా ఉన్నారు. తన నాయకత్వ బాధ్యతలతో జట్టును తీర్చిదిద్దిన అయన ఆటగాళ్లపై ఎంతో ప్రభావం చూపించారు. టీమ్ మార్పుచేర్పుల్లో భాగంగా ద్రవిడ్‌కు మరో బాధ్యత ఇవ్వాలనుకున్నాం. అయితే ఆయన దీనికి ఇష్టపడలేదు. ఫ్రాంచైజీకి సేవలు అందించిన ద్రవిడ్‌కు మా తరఫున కృతజ్ఞతలు' అని మేనేజ్‌మెంట్ ప్రకటించింది. 2011 ఐపీఎల్‌లో తొలిసారి రాజస్తాన్ జట్టు తరఫున ఆడిన ద్రవిడ్ 2012, 2013లలో రెండేళ్లు కెప్టెన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించాడు. తర్వాతి రెండు సీజన్లలో అతను టీమ్‌కు డైరెక్టర్, మెంటార్‌గా వ్యవహరించాడు. కొన్నేళ్ల విరామం, భారత కోచ్‌గా పదవీకాలం ముగిసిన తర్వాత గత సీజన్‌లో అతను మళ్లీ టీమ్‌కు కోచ్‌గా వచ్చాడు. అయితే 2025 సీజన్‌లో రాయల్స్ పేలవ ప్రదర్శన కనబర్చింది. 14 మ్యాచ్‌లలో 4 మాత్రమే గెలిచి 9వ స్థానంతో ముగించింది. ప్రస్తుతం ఈ టీమ్‌కు సంగక్కర డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్నాడు.

ప్రాధాన్యత తగ్గించడంతో...

ద్రవిడ్‌ను హెడ్ కోచ్‌గా ప్రకటించినప్పుడు ఇది ఒక్క ఏడాదికే పరిమితం కాదని మేనేజ్‌మెంట్ స్పష్టంగా చెప్పింది. కానీ వాస్తవంలో అదే జరిగింది. 'ఐపీఎల్ ఫ్రాంచైజీలు పెద్ద బాధ్యతతో ప్రమోషన్ ఇస్తున్నాయని అంటే దానర్థం ప్రధానమైన కోచింగ్ బృందంలో మీ ప్రాధాన్యతను తగ్గిస్తున్నట్లే. రోజువారీ మ్యాచ్‌ల వ్యూహాలు, ప్రణాళికల్లో మీ మాటకు విలువుండదు. ఆటగాళ్లతో బంధం ముగిసిపోతుంది' అని గతంలో ఐపీఎల్‌లో వేర్వేరు జట్లతో పని చేసిన ఒక కోచ్ తాజా పరిణామంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ద్రవిడ్ కూడా ఇదే ఆలోచనతో తప్పుకొని ఉండవచ్చు. నిజానికి 2025 సీజన్‌లో పలు నిర్ణయాలు ద్రవిడ్‌ను అసంతృప్తికి గురి చేసినట్లు సమాచారం. తాను అండగా నిలిచే సామ్సన్‌ను కీలక సమయాల్లో పక్కన పెట్టడం, అతను గాయపడినప్పుడు రియాన్ పరాగ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడం కూడా ద్రవిడ్‌కు నచ్చలేదు. టీమిండియాలో ప్రధాన ఆటగాడిగా ఎదిగిన యశస్వి జైస్వాల్, టెస్టు జట్టులో సభ్యుడైన జురేల్‌ను కాదని పరాగ్‌కు సారథ్యం అప్పగించడంవంటివి ద్రవిడ్‌కు నచ్చలేదు. ఇప్పటికే సామ్సన్ కూడా తనను జట్టునుంచి విడుదల చేయాలంటూ చెప్పగా, ఇదే క్రమంలో ద్రవిడ్ కూడా రాయల్స్‌కు దూరమైనట్లు తెలుస్తోంది.

సాత్విక్ జోడీకి పతకం ఖాయం



ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

పారిస్: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పతకం ఖాయం చేసుకుంది. 2022లో ఈ టోర్నీలో కాంస్య పతకం నెగ్గిన సాత్విక్ జోడీ... ఇప్పుడు రెండో పతకం కైవసం చేసుకోనుంది. తద్వారా 2011 నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ల పతకాల పరంపర దిగ్విజయవంతంగా కొనసాగుతోంది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జంట 21-12, 21-19తో ఆరోన్ చియా-సోహ్ వూయ్‌యిక్ (మలేసియా) ద్వయంపై విజయం సాధించింది. 43 నిమిషాల్లో ముగిసిన పోరులో రెండు సార్లు ఒలింపిక్ పతకాలు సాధించిన మలేసియా జోడీపై భారత జంట సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో మలేసియా షట్లర్ల చేతిలోనే ఓడి పతకానికి దూరమైన భారత ప్లేయర్లు... ఈ సారి ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయారు. 'చాలా ఆనందంగా ఉంది. ఒలింపిక్స్‌లో పరాజయం తర్వాత ఏడాది అనంతరం ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మలేసియా జోడీపై నెగ్గడం సంతోషం. ఆరోన్ జంటతో ఆడటం ఎప్పుడూ సవాల్‌తో కూడుకున్నదే. మా మధ్య ఎన్నో రసవత్తర పోరాటాలు జరిగాయి. ఇప్పటి వరకు తలపడ్డ ప్రతీసారి వరుస గేమ్‌ల్లోనే ఫలితం వచ్చింది. అయినా వాటిలో ఉండే ఉత్కంఠ వేరే. ఈ విజయంతో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం ఖాయం కావడంతో మరింత ఆనందంగా ఉంది, రెండో గేమ్ సమయంలో నియంత్రణలో ఉండాలని అనుకున్నాం. పాయింట్ల కోసం తొందరపడకుండా... ఒక్కో అడుగు ముందుకు వేయాలని భావించాం. దాన్నే ఆచరణలో చూపాం' అని మ్యాచ్ అనంతరం సాత్విక్-చిరాగ్ పేర్కొన్నారు. మ్యాచ్ ఆరంభంలోనే 59 షాట్‌ల సుదీర్ఘ ర్యాలీ ఆడిన భారత జంట... ఆ తర్వాత కూడా సుదీర్ఘ ర్యాలీలతో కట్టిపడేసింది. చిరాగ్ నెట్ వద్ద తన ప్రతిభ కనబర్చగా... సాత్విక్ సర్వీస్‌తో ఆకట్టుకున్నాడు.



నిజార్ సిక్సర్ల జోరు

తిరువనంతపురం: కేరళ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో సల్మాన్ నిజార్ సంచలన ప్రదర్శనతో అదరగొట్టాడు. శనివారం త్రివేండ్రం రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కాలికట్ గ్లోబ్‌స్టార్స్ బ్యాటర్ నిజార్ 26 బంతుల్లోనే 12 సిక్సర్లతో 86 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. తాను ఆడిన 26 బంతుల్లో అతను వరుసగా 1, 0, 1, 1, 6, 1, 0, 1, 1, 1, 2, 1, 1, 6, 6, 6, 6, 6, 1, 6, 2, 6, 6, 6, 6, 6 బాదాడు. నిజార్ 72 పరుగులు సిక్సర్ల ద్వారానే వచ్చాయి. బాసిల్ థంపి వేసిన 19వ ఓవర్లో తొలి ఐదు బంతుల్లో వరుసగా 6, 6, 6, 6, 6 కొట్టిన అతను చివరి బంతికి సింగిల్ తీసి మళ్లీ స్ట్రైకింగ్‌కు వచ్చాడు. అభిజిత్ ప్రవీణ్ వేసిన ఆఖరి ఓవర్లో తొలి బంతికి సిక్స్ బాదగా, తర్వాతి బంతి వైడ్ అయింది. దాంతో అదనపు బంతికి 2 పరుగులు సాధించిన నిజార్...తర్వాతి ఐదు బంతుల్లో మళ్లీ వరుసగా 6, 6, 6, 6, 6 కొట్టి ముగించాడు. ఈ మ్యాచ్‌లో కాలికట్ 13 పరుగులతో త్రివేండ్రంను ఓడించింది.

సాధన జోరుగా...

సాక్షి, విశాఖపట్నం: సొంతగడ్డపై తొలి సారి వన్డే వరల్డ్ కప్ గెలుచుకోవాలని ఆశిస్తున్న భారత మహిళల క్రికెట్ జట్టు తమ ప్రాక్టీస్‌కు పదును పెట్టింది. ఈ క్రమంలో వైజాగ్‌లోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో టీమ్ ప్రత్యేక 'స్కిల్ బేస్డ్' శిక్షణా శిబిరం కొనసాగుతోంది. వరల్డ్ కప్‌కు ఎంపికైన 15 మంది సభ్యుల హర్మన్‌ప్రీత్ కౌర్ బృందంతో పాటు రిజర్వ్ ప్లేయర్లు, అండర్-19 ప్లేయర్లు కూడా ఈ క్యాంప్‌లో పాల్గొంటున్నారు. తమ సాధనలో భాగంగా ఐదు రోజుల పాటు నెట్స్‌లో శ్రమించిన భారత జట్టు రెండు ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల ద్వారా తమలోని స్వల్ప లోపాలను సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టినట్లు జట్టు హెడ్ కోచ్ అమోల్ మజుందార్ వెల్లడించాడు. ఈ క్యాంప్‌లో తమ సాధన పూర్తి సంతృప్తినిచ్చినట్లు అతను చెప్పాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

తెలుగు టైటాన్స్‌కు మరో పరాజయం

- యూ ముంబా చేతిలో ఓటమి
- ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్



సాక్షి, విశాఖపట్నం: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ పరాజయం పాలైంది. సీజన్ ఆరంభ పోరులో తమిళ్ తలైవాస్ చేతిలో ఓడిన టైటాన్స్... తాజాగా యూపీ యోధాస్ చేతిలో కూడా పరాజయం పాలైంది. శనివారం తెలుగు టైటాన్స్ 35-40 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్ చేతిలో ఓడింది. గత సీజన్‌లో పేలవ ప్రదర్శనతో పట్టికలో ఏడోస్థానానికి పరిమితమైన టైటాన్స్... ఈ సీజన్ ఆరంభంలో విశాఖ తీరంలో జరుగుతున్న మ్యాచ్‌ల్లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోతోంది. తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్ 14 పాయింట్లతో ఒంటరి పోరాటం చేయగా... అతడికి సహచరుల నుంచి సరైన సహకారం అందలేదు. చేతన్ సాహు 4, భరత్ 3 పాయింట్లు సాధించారు. విజయ్ ఈ సీజన్‌లో తొలి సూపర్-10 ఖాతాలో వేసుకున్నాడు. యూపీ యోధాస్ తరఫున గగన్ గౌడ 14 పాయింట్లతో విజృంభించగా... కెప్టెన్ సుమిత్ సాంగ్వాన్ (8 పాయింట్లు), గుమాన్ సింగ్ (7 పాయింట్లు) అతడికి అండగా నిలిచారు. యూ ముంబా, గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్ నిర్ణీత సమయంలో 29-29 పాయింట్లతో 'టై'కాగా... ఆ తర్వాత నిర్వహించిన సూపర్ రెయిడ్స్‌లో యూ ముంబా 6-5 పాయింట్ల తేడాతో గెలుపొందింది. నిర్ణీత సమయంలో యూ ముంబా జట్టు తరఫున రోహిత్ రాఘవ్ 7, అజిత్ చౌహాన్ 6 పాయింట్లు సాధించారు. గుజరాత్ టైటాన్స్ తరఫున హిమాన్షు సింగ్ 7 పాయింట్లు, రాకేశ్ 5 పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో యూ ముంబా (రాత్రి 8 గంటలకు), బెంగాల్ వారియర్స్‌తో హర్యానా స్టీలర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

సాక్షి సినిమా

అల్లు కనకరత్నమ్మ ఇకలేరు



● అల్లు కనకరత్నమ్మ

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుటుంబంలో విషాదం నెలకొంది. ఆయన తల్లి, దివంగత నటులు అల్లు రామలింగయ్య భార్య అల్లు కనకరత్నమ్మ (94) ఇక లేరు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. అల్లు రామలింగయ్య, కనకరత్నం దంపతులకు నలుగురు సంతానం. వారిలో కుమారుడు అల్లు అరవింద్, కుమార్తెలు నవ భారతి, సురేఖ(చిరంజీవి సతీమణి), వసంత లక్ష్మి ఉన్నారు. 2004 జూలై 31న అల్లు రామలింగయ్య మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన సతీమణి కనకరత్నం దాదాపు మీడియా ముందుకి రారు. అల్లు రామలింగయ్య శత జయంతి ఉత్సవాల్లో మాత్రమే ఆమె కనిపించారు. కనకరత్నం మృతి విషయాన్ని తెలుసుకున్న హీరోలు అల్లు అర్జున్ ముంబై నుంచి, రామ్‌చరణ్ మైసూర్ నుంచి తమ చిత్రాల షూటింగ్‌లు నిలిపివేసి హైదరాబాద్ చేరుకున్నారు. చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ అల్లు అరవింద్ ఇంటికి చేరుకుని, కనకరత్నం పార్థివ దేహానికి నివాళులర్పించారు. అలాగే వెంకటేష్, నాగచైతన్య, మురళీ మోహన్, త్రివిక్రమ్, ఆది శేషగిరి రావు, సురేశ్ బాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, వరుణ్ తేజ్, బోయపాటి శీను, వశిష్ఠ, శ్రీనువైట్ల, మెహర్ రమేష్, జీవిత, నాగవంశీ, శ్యామలా దేవి, గోపీచంద్ మలినేని, రావు రమేశ్, మాదాల రవి, బీవీఎస్ రవి వంటి పలువురు సినీ ప్రముఖులు, పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా వంటివారు కనకరత్నమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. హైదరాబాద్ సమీపంలోని కోకాపేటలో కనకరత్నమ్మ అంత్యక్రియలు ముగిశాయి. ''మా అత్తయ్యగారు తన మరణానంతరం తన కళ్లను చిరంజీవి ఐ బ్యాంక్‌కి ఇవ్వాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె కళ్లను అల్లు అరవింద్ కుటుంబం దానం చేసింది'' అంటూ చిరంజీవి తెలిపారు.



● సురేఖ, అల్లు అరవింద్, రామ్‌చరణ్, చిరంజీవి, అల్లు అర్జున్, అయాన్

ఇలాంటి సినిమాలు అరుదు

- సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్



● ఏఆర్ రెహమాన్, జి.అశోక్

''ఉఫ్ యే సియాపా' చిత్రానికి పని చేయడం సవాలుతో కూడుకున్నది. కానీ పనిలో స్వేచ్ఛ దొరికింది. చాలా సినిమాల్లో సంభాషణలకు ప్రాధాన్యం ఉండి, సంగీతం ఒక అడుగు వెనక్కి వెళ్తుంటుంది. కానీ ఇక్కడ సంగీతం కూడా కథనంలో ఒక భాగం. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కథనాన్ని నడిపించే ఇలాంటి అవకాశాలు చాలా అరుదు. సంగీతంలో కొత్త శైలితో ప్రయోగాలు చేయడాన్ని నిజంగా ఆనందించాను'' అని ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ పేర్కొన్నారు. సోహమ్ షా, నుష్రత్, నోరా ఫతేహి ప్రధాన పాత్రధారులుగా జి. అశోక్ దర్శకత్వంలో లవ్ రంజన్, అంకుర్ గార్గ్ నిర్మించిన కామెడీ థ్రిల్లర్ చిత్రం 'ఉఫ్ యే సియాపా'. సంభాషణలు లేకుండా నటీనటుల హావభావాలతో రూపొందిన ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఓ పార్సిల్ డెలివరీ వల్ల కేసరి లాల్ సింగ్ (సోహమ్ షా) జీవితం గందరగోళంలో పడుతుంది. తమ పొరుగింటి కామినితో తన భర్త కేసరి లాల్ సరసాలాడుతున్నాడని అనుమానించి, పుష్ప (నుష్రత్) పుట్టింటికి వెళ్తుంది. ఆ తర్వాత కేసరి లాల్ జీవితంలో ఏం జరిగింది? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని చిత్రబృందం పేర్కొంది.

ఆఫ్రికాలో అడ్వెంచర్?



● మహేశ్ బాబు

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఆఫ్రికా లొకేషన్స్‌లోనే జరుగుతోందనే ప్రచారం సాగుతోంది. దానికి కారణం ప్రియాంకా చోప్రా తాజాగా షేర్ చేసిన కొన్ని ఫొటోలు ప్రధానంగా ఫారెస్ట్ లొకేషన్స్‌కు సంబంధించినవి కావడమే. దీంతో ఆమె ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్నారని, ఆమె అక్కడికి వెళ్లింది మహేశ్‌బాబు సినిమా కోసమే అనే టాక్ తెరపైకి వచ్చింది. మరో వైపు మహేశ్‌బాబు భార్య నమ్రత వినాయక చవితి పండగ జరుపుకున్న ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేసి, మహేశ్‌బాబును మిస్ అవుతున్నట్లుగా పేర్కొన్నారు. సో... మహేశ్‌బాబు కూడా రాజమౌళి సినిమా షూటింగ్ కోసం ఆఫ్రికా వెళ్లారనే ఊహాగానాలు నెలకొన్నాయి. ఇక ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబుపై ఓ భారీ యాక్షన్ అడ్వెంచరస్ సీక్వెన్స్ చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట రాజమౌళి. ఇక కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాకి ఓ హాలీవుడ్ నిర్మాణ సంస్థ కూడా నిర్మాణంలో భాగస్వామి కానుందనే ప్రచారం జరుగుతోంది.

భాష సవాల్‌గా అనిపించింది

- విక్రమ్ ప్రభు



''తెలుగు సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. కానీ నా జీవితంలో ఏదీ ప్లాన్ ప్రకారం జరగలేదు. నేను దర్శకుడిని అవుదామనుకుంటే నటుణ్ణి అయ్యాను. చిరంజీవి, నాగార్జునగార్లకు నేను పెద్ద అభిమానిని. వాళ్ల సినిమాలను ఎన్నోసార్లు థియేటర్స్‌లో చూశాను. నా అభిమాన హీరోలు ఉన్న టాలీవుడ్‌లో నేను డైరెక్ట్‌గా 'ఘాటీ' వంటి తెలుగు సినిమా చేయడం ఎగ్జైటింగ్‌గా అనిపిస్తోంది'' అని అన్నారు నటుడు విక్రమ్ ప్రభు. అనుష్కా శెట్టి ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ డ్రామా 'ఘాటీ'. ఈ చిత్రంలో విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేశారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో విక్రమ్ ప్రభు మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో దేశీరాజు అనే పాత్రలో నటించాను. ఈ చిత్రంలో నేను మాట్లాడే భాష నాకు సవాల్‌గా అనిపించింది. అనుష్కగారికి నేను పెద్ద అభిమానిని. ఆమె తన కళ్లతోనే అన్ని హావభావాలు పలికించగలరు. నిజానికి అనుష్కగారి 'రుద్రమదేవి' సినిమాలోని గోన గన్నారెడ్డి పాత్రను నేనే చేయాల్సింది. కానీ కుదర్లేదు. క్రిష్‌గారు నా గత సినిమాల్లోని చాలా సన్నివేశాల గురించి చెబుతూ, నన్ను దృష్టిలో పెట్టుకునే దేశీరాజు క్యారెక్టర్‌ను రాసుకున్నానని చెప్పిన మాటలు నాకెంతో సంతోషాన్నిచ్చాయి. ఈ సినిమాలోని యాక్షన్ సీన్స్‌ని ఎంజాయ్ చేశాను. మా నాన్నతో (తమిళ నటుడు ప్రభు) స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది. కానీ, ఇరికించినట్టుగా ఉండకూడదు. మంచి కథ కుదిరితే చేస్తాం'' అని అన్నారు.

రాణి రాక షురూ



● కంగనా రనౌత్

బాలీవుడ్ సూపర్ హిట్ ఫిల్మ్ 'క్వీన్' రెండో భాగం రానుంది. కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో, రాజ్‌కుమార్ రావు కీలక పాత్రలో నటించిన తొలి భాగం 2014లో విడుదలైంది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన సీక్వెల్ సన్నాహాలు ఊపందుకున్నాయని బాలీవుడ్ సమాచారం. 'క్వీన్' చిత్రానికి దర్శకత్వం వహించిన వికాస్ 'క్వీన్ 2' సినిమానూ డైరెక్ట్ చేయనున్నారని, ఆల్రెడీ స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని టాక్. అంతే కాదు... ఈ 'క్వీన్ 2' చిత్రీకరణకు వికాశ్ లొకేషన్స్‌ను పరిశీలిస్తున్నారట. 'క్వీన్' సినిమా మాదిరిగానే, 'క్వీన్ 2' చిత్రీకరణ కూడా కొంత ఇండియాలో, ఎక్కువ శాతం విదేశాల్లో జరుగుతుందనే టాక్ వినిపిస్తోంది. నవంబరులో ఈ సినిమా షూటింగ్‌లో కంగనా రనౌత్ పాల్గొంటారట. ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేసి, వచ్చే వేసవిలో రిలీజ్ చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోందని సమాచారం. మరి... అనుకున్నట్లుగానే పదేళ్ల తర్వాత 'క్వీన్' సీక్వెల్ తెరకెక్కుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక మరో రెండు రోజుల్లో రాణి (కంగన) పెళ్లి అనగా, పెళ్లికొడుకు రాణితో పెళ్లిని వద్దనుకుంటాడు. ఆ తర్వాత రాణి తనను తాను బలమైన అమ్మాయిగా మలచుకుని, జీవితంలో ఎలా రాణించింది? రాణిని వద్దనుకున్న అబ్బాయే, ఆమెను మళ్లీ ఎలా వివాహం చేసుకున్నాడు? అనే కోణంలో 'క్వీన్' కథ సాగుతుంది.

గప్ చుప్ గణేశా



● రోహన్

రోహన్, రిదా జంటగా సూరి ఎస్ దర్శకత్వం వహించిన చిత్రం 'గప్ చుప్ గణేశా'. కేఎస్ హేమ్రాజ్ నటించి, నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, ట్రైలర్‌ని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ లాంచ్ చేసి, ''టైటిల్ చాలా బాగుంది. ఇటువంటి చిన్న సినిమాలు మంచి విజయం సాధించాలి'' అని తెలిపారు. ''మొహమాటం వల్ల ఓ యువకుడు ఎలాంటి ఇబ్బందులు పడతాడో వినోదాత్మకంగా చూపిస్తున్న మా చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. త్వరలో ఒక ఓటీటీ ద్వారా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుంది'' అని కేఎస్ హేమ్రాజ్, సూరి ఎస్ చెప్పారు. ''ఆడియన్స్ మా చిత్రాన్ని ఆదరించి, మమ్మల్ని ఆశీర్వదించాలి'' అన్నారు రోహన్. ఈ చిత్రానికి కెమెరా: అంగత్ కుమార్, సంగీతం: శ్రీ తరుణ్.

జోడీ కుదిరిందా?





● లోకేశ్, రచిత

దర్శకుడిగా 'కూలీ' సినిమాతో ఇటీవలే సూపర్‌హిట్ అందుకున్నారు లోకేశ్ కనగరాజ్. ఈ చిత్రానికి ముందు 'ఖైదీ, మాస్టర్, విక్రమ్' వంటి హిట్ చిత్రాలు తెరకెక్కించిన లోకేశ్ కాస్త డైరెక్షన్ మార్చి, హీరోగా ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా చేయనున్నారు. తమిళంలో 'రాకీ, కెప్టెన్ మిల్లర్' వంటి చిత్రాలను తెరకెక్కించిన అరుణ్ మాథేశ్వరన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. అయితే ఈ చిత్రంలో హీరోయిన్‌గా రచితా రామ్‌ను తీసుకునే ఆలోచనలో ఉన్నారట. లోకేశ్ డైరెక్షన్‌లో వచ్చిన 'కూలీ' సినిమాలో రచితా రామ్ నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. రచితా యాక్టింగ్ పట్ల లోకేశ్ కనగరాజ్ కూడా ఇంప్రెస్ అయ్యారు. దీంతో తాను హీరోగా నటిస్తున్న తొలి సినిమాలో రచితాకు చాన్స్ ఇవ్వాలని లోకేశ్ భావించారట. మరి... ఈ జోడీ కుదిరిందా? లేదా అనే విషయంపై త్వరలోనే ఓ అధికారిక ప్రకటన రానుందని కోలీవుడ్ టాక్. ఇక రచితా రామ్ తెలుగులోనూ సినిమాలు చేశారు. కల్యాణ్ దేవ్ హీరోగా నటించిన 'సూపర్ మచ్చి' (2022) చిత్రంలో రచిత హీరోయిన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



37 సం. గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు నో డౌరీ. Ph: 6301943220 [H-783421]

బెస్త, గంగపుత్ర/M.Tech/ C.Govt. Asst. ఇంజినీర్/ ఎలక్ట్రికల్ Dept./ 12 Lakhs PA/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16074]

కుమ్మరి/కట్నం ప్రసక్తిలేదు/M.Tech, IIT/ C.Govt. Exq. ఇంజినీర్/NTPC/ 15 Lakhs PA/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-16074]

రజక/కట్నం ప్రసక్తిలేదు/M.Tech/ C.Govt. Asst. ఇంజినీర్/ రైల్వే/ 80,000/-PM/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9550166072 [HA-16074]

పద్మశాలి/M.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/BDL/ 90,000/-PM/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-16074]

ముదిరాజ్/కట్నం ప్రసక్తిలేదు/ B.Tech/ Govt. డిప్యూటీ తహసీల్దార్/ రెవెన్యూ Dept./ 52,000/-PM/ 6' ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16074]

SC హిందుమాదిగ/కట్నం ప్రసక్తిలేదు/ B.Tech/ Govt. టెక్నికల్ ఆఫీసర్/ ఇరిగేషన్ Dept./ 65,000/-PM/ 5'11" ఎత్తు/ 30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-16074]

రజక/ కట్నం ప్రసక్తి లేదు / B.Tech / C. Govt. బ్యాంక్ మేనేజర్ / SBI/ 90,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16082]

గౌడ/కట్నం ప్రసక్తి లేదు/M.Tech/ Govt. సివిల్ ఇంజినీర్/రైల్వే/ 80,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 7075953400, 8897459038 [HA-16082]

రజక/కట్నం ప్రసక్తి లేదు/CA/ అకౌంటెంట్ /80,000/-PM / 5'10"ఎత్తు /29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 7075953400, 8897459038 [HA-16082]

బ్రాహ్మణ:29 Yrs/ 5'.6"/ MBA/40,000 సన్నగా ఆరోగ్యంగా వున్న వరునికి బ్రాహ్మణ వధువు కావలెను. సంప్రదించండి: 90303 38483 (డైరెక్ట్). [T-1946]

కాపు /63/5'7"/M.Sc/Govt. Job. Gazzited (Retaired) / 1L-PM గల వరుడికి తగిన రెండవ పెళ్లి వధువు కావలెను Direct Contact : 95503 95951 [SCA25007089]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel - kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Industrialist/ B.Tech /1982 / 5'8" / 250Cr. * Cont: K.C. Reddy-Marriage Bureau Pvt Ltd - Hyd. Ph : 9347807015 / 9849321309

Reddy/Business / B.Tech / MBA / 1994 / 6' / 400Cr. * Cont: K.C. Reddy-Mar Bureau Pvt Ltd - Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy / B.Tech / SWE / 1994 / 5'11"/ 25L/yr / 100Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Pvt Ltd. Ph: 9347807015 / 9849321309

Reddy/MS / H1 / USA / 1990 / 5'7" / 140K / 20Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Pvt Ltd-Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy / Business / B.Tech / MS / 1998 / 6'/400Cr. * Cont: K.C. Reddy- Mar-Bureau Pvt Ltd- Hyd- Ph: 9347807015 / 9849321309

Reddy/Catholic / B.Tech/MS / H1/ USA /1994/5'8"/110K/5Cr. * Cont: K.C.Reddy-Mar-Bureau- Pvt- Ltd-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy / Business / B.Tech / 1997 / 6' / 100Cr. * Cont: K.C. Reddy-Mariage-Bureau Pvt Ltd-Hyd. Ph: 9347807015 / 9849321309

Reddy/Divorcee / MBBS / MD / 1994 / 5'9 / 50Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Pvt Ltd-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Catholic / Divorcee/ B.Tech/ MBA/SWE-Hyd/30L/yr/1987/5'11"/ Rich & Royal Family. * Cont: K.C. Reddy-Hyd. Ph : 9347807015 / 9849321309

Reddy/Divorcee/Rich Family/ B.Tech / 1981/5'8"/1500Cr *86/5'5"/1000Cr/ MD *88/5'9"/80Cr * 79/ 5'8"/300Cr. * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015 [D-578]

వరుడు కావలెను

Reddy / MBBS / 1992 / 5'1" / 10Cr/ Needs any well settled India or Abroad. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/Divorcee/B.Tech/MBA/ 8L/ yr/10Cr-Needs India or Abroad / Good alliance. * Cont: K.C. Reddy -Hyd - Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / MS / USA / Own Business /1995 /5'5"/60L/yr/50Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau Pvt Ltd-Hyd-Ph: 9347807015/9849321309

Reddy / BA / M.Sc / 2000 / 5'5"/ 100Cr . * Cont: K.C. Reddy-Mar-Burea - Pvt Ltd - Hyd - Ph: 9849321309/ 9347807015

Reddy/Rich Family/B.Tech/MBBS/ 2000/ 5'6"/100Cr *93/5'3"/1000Cr *95/5'5"/ 100Cr *97/5'4"/150Cr *97/5'6"/500Cr *94/5'3"/ 300Cr. * Cont: K.C.Reddy- 9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1998/5'3"/30Cr *97/5'4"/100Cr *96/5'3"/30Cr *89/5'6"/30Cr *98/5'4"/10Cr *99/5'5"/100Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015 / 9849321309

Reddy/Divorcee/Rich Family *B.Tech /MBBS/1994/5'2"/75Cr *86/5'6"/50Cr. *93/ 5'8"/40Cr *93/5'6"/50Cr *85/5'5"/ 400Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/MBBS/PG/Rich Family *1998/ 5'5"/ 50Cr *98/5'7"/75Cr *97/5'6"/600Cr *96/5'8/ 40Cr *94/5'10"/50Cr *90/5'6"/200Cr. * Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd-Ph: 9849321309

Reddy/IIT/BITS/2000/5'3"/6Cr *97/ 5'4"/ 35L/yr/6Cr *2000/5'7"/45L/yr/10Cr *99/ 5'5"/100Cr *96/5'7" *94/5'4"/10Cr. * Cont : K.C. Reddy - Hyd- Ph: 9347807015

Reddy/Divorcee/USA /1991/ 5'3"/ 150K / 25Cr *85/5'6"/90K *95/5'5"/8Cr *94/ 5'2"/ 10Cr/150K *92/5'6"/110K. * Cont: K.C. Reddy -Hyd- Ph: 9849321309

రెడ్డి : Reddy Groom / Divorced / MBBS / MD / Own Practice / 1994 / 5'9"/ Rich. Seeks Reddy/ Preferably PG Doctors / Rich. Contact : 9148780607. Brokers Excuse. [M-13870]

★

SC-Mala - Hindu / 2nd Marriage 40y/5'10"/PG/SWE/1,60,000/-PM Wants Good Hindu Bride only. Ph: 8187861989. Direct. No Brokers. [H-821054]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు. మా వద్ద 1 కోటి నుండి 50 కోట్ల ప్రాపర్టీ గల 21 సం. నుండి 50 సం. గల సాంప్రదాయ అందమైన వధువులు కలరు. ఇల్లరికం OK. ముఖాముఖి కల్పించి త్వరగా కుదుర్చబడును. 9676096314 [H-783639]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి Business, BE, 29, 6', 200 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 33, 5' 7", Director, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 27, 5' 10", SWE, H1, 50 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, 26, 5' 10", 14 L P/A, 15 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, Analytic Consultant, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 30, 5' 10", Doctor, 70 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia, BE, MS, 28, 5' 6", Manager, 80 K, 6 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Business, MBA, 5' 3", Hyderabad, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE MTech (BITS), 27, 5' 7", Engineer, 20 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 8", SWE, USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 4", SWE, 25 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, 24, 5' 8", SWE, 12 L P/A, 5 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 27, 5' 3", Doctor, 60 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 8", 65 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి విడో/కుల, ఆస్తి పట్టింపు లేదు/32Yrs/5'4"/10Cr Property గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st & 2nd సంబంధాలు మా వద్ద కలవు. Ph: 8143226625 [H-783639]

రెడ్డి 2nd మ్యారేజ్/ కుల, ఆస్తి పట్టింపు లేదు. Age: 32. డిగ్రీ (Own Propertys-Business) వెల్ సెటిల్డ్ గల వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st-2nd సంబంధాలు కలవు. Ph: 9100147176 [H-783639]

రెడ్డి 2nd విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 34/Qly: B.Com. Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) 1st&2nd అన్ని కులాల వారికి వివాహాలు చూడబడును. Ph: 8074131208 [H-783639]

వెలమ/2nd, 48y/C.Govt.జాబ్ 90 ఫ్యామిలీ పెన్షన్ PM/Granite బిజినెస్/ఫైనాన్స్/6 Lak PM/30ఎ పొలాలు/80 కోట్ల ప్రాపర్టీ ఫుల్ ఫ్యామిలీ కోల్పోయిన వధువుకు వరుడు కావలెను/ఇల్లరికం/పిల్లలు ఉన్నా ఓకే. 8106967428 [H-783639]

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో (Since 25 Years)

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో గత 25 సంవత్సరాలుగా అన్ని ప్రాంతాలవారికి కేవలం రెడ్డి సంబంధాలు మాత్రమే చూస్తూ 4 బ్రాంచీలు కలిగి ఉన్నటువంటి ఏకైక అగ్రగామి సంస్థ మీ నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో Timings 10.30 AM to 6.30 PM

వధువు కావలెను

రెడ్డి / 1995 / 5'8" / B.Tech / Sr. SWE / 27 Lakhs PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1992 / 6' / B.Tech / MS / Net Work Engineer / 35 Lakhs PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1998 / 5'11" / B.Tech & MS / Business / 7 Cr PA. Income Rich Family సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1997 / 5'11" / MBBS / MS General Surgery / 400Cr Property. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1995 / 5'10"/ B.Tech / MS / Data Engineer / USA / 120Cr Property. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1993 / 5'7" / MBBS / Residency 1st Year. USA/Rental Income / 24 L PA. Hyderabad. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1997 / 5'11" / B.Tech / NIT / Sr. Software Engineer/ 200K PA + Shars. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1992 / 5'7"/ B.Tech / MS / 180K /H1B / I-140. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1998 / 6' / BE (BITS) / MS USA / 400K PA. H1 B. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1999 / 5'9" / B.Tech & MS / SWE Amazon/250 K PA/ H1B. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

వరుడు కావలెను

రెడ్డి / 1999 / 5'6" / B.Tech / MS /US Fair & Rich. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1997 / 5'4" / Accenture Full Time Job US Citizen. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1998 / 5'6"/ B.Tech / NIT / MBA (IIM) / 20L PA / Fair. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1997 / 5'6"/ B.Tech / SWE / 20L PA / Hyd. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1999 / 5'4"/ B.Tech & MS Network Engineer / Hyderabad/ Very Fair. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 2000 / 5'1" / B.Tech & M.Tech (IIT Banglore) / 33Lakhs PA / Software Developer. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 2001 / 5'4"/ BS / USA Citizen / Rental Income. 5 Lakhs PM. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 8885559579 / 9848221166

రెడ్డి / 1997 / 5'3" / B.Tech / MS / USA / Ever Bank 110 K PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1998 / 5'4"/ B.Tech/MS/ Amazon / SWE / 200K PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 2001/ 5'7"/ B.Tech & MS / Data Analyust. USA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

LETTER

బ్రాహ్మణ స్త్రీ/48y/విడో/Own Function Hall/Hydలో సొంత ఇల్లు & ల్యాండ్స్ /2L/-PM/ 8 కోట్ల ప్రాపర్టీ గల వధువుకి OC/BC వరుడు కావలెను. 9542445581 [H-821209]

కులప్రసక్తి లేదు/విడో/50y/Fair/ కరీంనగర్/ Govt Job/Own House (Rents) పిల్లలు లేని ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. 8519803423 [H-821209]

వైశ్య/49y /5'4"/ Govt.Teacher /80000/-PM/ 2 సొంత ఇల్లు/కోచింగ్ సెంటర్/1L/-PM/ఎవరూ లేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 8121487795 [H-821209]

రెడ్డి/విడో/50/Govt (HM)/V.Fair / సొంత అపార్ట్‌మెంట్స్ / 25 ఎకరాల వంద్ల తోటలు పొలాలు/రైస్ ఫ్యాక్టరీ/4L/-PM కలిగిన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 9030200295 [H-821209]

పద్మశాలి/50y/విడో/ 5'4"/ Nurse / 4 ఎకరాల పంట పొలం / సొంత ఇల్లు/ కుల ప్రసక్తి లేని వధువుకి మధ్య తరగతి వరుడు కావలెను. 6281849287 [H-821209]

గౌడ/MBBS, MD/ C. Govt. మెడికల్ ఆఫీసర్ / 12 Lakhs PA / 5'5" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16074]

యాదవ/M.Com/ Govt. స్టాటిస్టికల్ ఆఫీసర్/ MRO ఆఫీస్/ 62000/-PM/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-16074]

వడ్డెర/B.Tech / Govt. Asst. ఇంజినీర్ /R&B/ 60,000/-PM/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16074]

క్రిస్టియన్ మాదిగ/M.Sc/ Govt. Asst. ఇంజినీర్/ ట్రాన్స్‌కో/ 9 Lakhs PA/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-16074]

SC మాల/ B.Tech / C.Govt. ట్యాక్స్ ఆఫీసర్/ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept/80,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16082]

యాదవ/ఏకైక కుమార్తె/B.Tech/C.Govt. డిప్యూటీ మేనేజర్/85000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529, 9676995093 [HA-16082]

SC మాల & క్రిస్టియన్/B.Tech/C.Govt. Asst.మేనేజర్/కెనరా బ్యాంక్/55000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-16082]

యాదవ/ B.Tech / Govt. బ్యాంక్ మేనేజర్/SBI/70,000/-PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400, 8897459038 [HA-16082]

కుల పట్టింపు లేదు/21y &22y&24y& 25y& 26y&27y&28y&29y&30y&31y&33y&34y&36y&37y &39y&40y&41y&42y&43y&45y&47y & 48y & 49y& 50y/ "మా సేవ" (Since:1998) Ph: 9291503949 [HA-16082]

క్రిస్టియన్ మాల/27/5'5"/MDS/MNC/ అందమైన వధువుకు తగిన Any మెడికల్/ Govt /డాక్టర్ /వరుడు కావలెను. Ph: 8919759359 [HA-16082]

S.C మాదిగ /1993 / 5'3" / MBA - Pune / సాఫ్ట్‌వేర్ జాబ్ / 12 L. PA / చెన్నై / ఫెయిర్ / సంప్రదించండి ✆ 63024 82279, 77948 10469 [B-1170276]

కాపు, 54y, 5'2" లేట్ మ్యారేజ్, చదువు, స్థిరాస్తి కలిగిన వధువుకు, కాపు, కమ్మ, రెడ్డి, జాబ్, స్థిరాస్తి గల వరుడు కావలెను. ✆ 94928 43114. [SCA25007672]

వేదికలు



అనుబంధం మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వధూవరులకు మంచి సంబంధాలు కుదుర్చబడును. సంప్ర : శ్రీనివాస్. 9059638498 [H-783422]

కమ్మ, కాపు, రెడ్డి & అన్ని ఇతర కులాల దేశ, విదేశ, డాక్టర్, సాఫ్ట్‌వేర్ & హై. రిచ్, 1వ, 2వ, లేటు, వధువు, వరుల కొరకు సంప్ర : గద్దిపాటి ప్రభాకర రావు, BE, హైదరాబాద్. Ph: 7893841849 [HA-16082]

కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజస్ డైవర్సీస్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులములవారికి సంబంధములు త్వరగా చూపబడును (స్త్రీలకు ఫ్రీ). Ph: 7702526428 [H-821053]

ఆల్ క్యాస్ట్, 2nd, లేట్ మ్యారేజెస్, క్యాస్ట్ నోబార్ మ్యారేజెస్ & Govt. ఎంప్లాయీస్, బిజినెస్ Brides & Grooms వెల్ సెటిల్డ్ కలవు.సంప్రదించండి సెల్: 91214 44957 [B-1099]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1703]

విశ్వబ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం (Online) 24/Aug/2025న Free Register bhavanimatrimony.com, Hyd. 9704656103, 9533608887 [HA-1659]

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 (3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి)

AP+TS+Metros: 1800/- for 4 Lines (Chennai+ Bengaluru +Delhi + Mumbai) 465/- Extra Line	Telangana (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line
Andhra Pradesh: 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line	
* Color 25% Extra	గమనిక: ప్రకటనలపై 5% GST అదనం

హైదరాబాద్ : 9912225453 | వరంగల్ : 9705748198 | మెదక్ : 9912225456 | నల్గొండ : 9505508382 | నిజామాబాద్ : 9912220764 | మహబూబ్‌నగర్ : 9553955603 | కరీంనగర్ : 9951602934 | ఖమ్మం : 9912220600

Cell : 9912225453, email2sakshi.ads@sakshi.com

చంద్రబాబు వెన్నుపోటుకు థర్టీ ఇయర్స్



2009 అసెంబ్లీ ఎన్నికల్లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని ఎదుర్కోవడానికి మళ్లీ చంద్రబాబుకు మళ్లీ ఎన్టీఆర్ కుటుంబం అవసరమైంది. ఆ ఎన్నికల్లో జూనియర్ ఎన్టీఆర్‌ని పార్టీ ప్రచారానికి వాడుకున్నారు. అవసరం తీరిపోయాక తన కుమారుడు నారా లోకేశ్‌కు పోటీ వస్తాడేమోనని తన ఎల్లో మీడియాలో నీచపు కథనాలు ప్రసారం చేయించారు. అంతేకాకుండా ఇటీవల అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో జూనియర్ ఎన్టీఆర్ తల్లిపై అసభ్య వ్యాఖ్యలు చేయించారు. ఇలా చివరకు జూనియర్ ఎన్టీఆర్‌ను కూడా తన కుట్రపూరిత రాజకీయాలకు చంద్రబాబు బలిపెడుతున్నారు.

ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ టార్గెట్‌గా మళ్లీ కుట్రలు..

1995లో సెప్టెంబర్ 1న మామ ఎన్టీఆర్‌ని పదవీచ్యుతుడిని చేసి సీఎం పీఠం లాక్కొన్న చంద్రబాబు

పార్టీ, పార్టీ ఆస్తులు కూడా స్వాధీనం చేసుకుని నిర్దాక్షిణ్యంగా గెంటివేత

సాక్షి, అమరావతి: 'చంద్రబాబు మోసగాడు.. నయవంచకుడు.. తండ్రిని జైల్లో పెట్టి, అన్నల్ని చంపించిన ఔరంగజేబు కంటే నీచుడు. నా కుమార్తెని ఇచ్చి పెళ్లి చేస్తే తండ్రిలాంటి వాణ్ని నిలువునా మోసం చేశాడు. అతడిలో మానవత్వం ఏమైనా ఉంటుందేమో అని పరీక్షించాను. మనిషిని కాదు.. పశువుని, నమ్మిన వాళ్లకు ద్రోహం చేస్తా, నమ్మిన వాళ్ల గొంతు కోస్తా అని చెప్పి నిరూపించుకున్న ఘాతకుడు.. చంద్రబాబు. దీన్ని చరిత్ర మరువదు. మొఘల్ సామ్రాజ్యంలో ఔరంగజేబు తండ్రిని జైల్లో పెట్టి, అన్నల్ని చంపించాడు అని విన్నాం. అదేవిధంగా కేవలం పదవి కోసం తండ్రి లాంటి నాకు ద్రోహం చేశాడు. చంద్రబాబు ఏవిధంగా ఆత్మను అమ్ముకున్నాడో, ఏవిధంగా మానవత్వాన్ని చంపుకున్నాడో ఇదే నిదర్శనం. ఇది శాశ్వతంగా ఉంటుంది. మనిషి పోతాడేమో.. ప్రజల మనసుల్లో పోదు, ఆలోచన పోదు, రికార్డు పోదు, అది శాశ్వతం'.. ఇవి తన అల్లుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎలాంటి వాడో వివరిస్తూ విఖ్యాత సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఒక ఇంటర్వ్యూలో అన్న మాటలు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశ రాజకీయాల్లోనే ఎవరూ ఒడిగట్టని రాజకీయ మహాపాతకం.. 'వెన్నుపోటు'కు చంద్రబాబు శ్రీకారం చుట్టి సోమవారానికి 30 ఏళ్లు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించడంతో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచే ఆ పదవి కోసం గోతి కాడ గుంటనక్కలాగా చంద్రబాబు మాటు వేశారు. తనకు బాకా ఊదే ఎల్లో మీడియాలో ఎన్టీఆర్ వ్యక్తిగత జీవితంపై నీచపు రాతలు రాయించారు. మందు, విందు, పొందు.. ఇలా తనకు మాత్రమే సాధ్యమైన ప్రలోభాలతో ఎమ్మెల్యేలకు ఎరవేసి వారిని తనవైపునకు తిప్పుకున్నారు. 1995 సెప్టెంబర్ 1న ముఖ్యమంత్రిగా ఉన్న తన సొంత మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి సీఎం పదవిని గుంజుకున్నారు. అంతేకాకుండా ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని, పార్టీ ఆస్తులను కూడా లాక్కొని ఎన్టీఆర్‌ను నిర్దాక్షిణ్యంగా పార్టీ నుంచి, ప్రభుత్వం నుంచి గెంటేశారు. కుటుంబ సభ్యులనూ దూరం చేసి ఎన్టీఆర్‌ను తీవ్ర క్షోభకు గురిచేశారు. అయినా కసితీరక ప్రజాస్వామ్యాన్ని బ్రతికించమని ఎమ్మెల్యేలను అభ్యర్థించడానికి హైదరాబాద్‌లోని వైస్రాయ్ హోటల్ వద్దకు వచ్చిన ఎన్టీఆర్‌పై తన అనుంగు ఎమ్మెల్యేలతో చంద్రబాబు చెప్పులదాడి చేయించారు. ఇలా అప్పటివరకు భారతదేశ రాజకీయ చరిత్ర ఎరుగని మహాకిరాతకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తన సొంత అల్లుడు చేసిన కుట్ర, వెన్నుపోటు, దారుణ అవమానాలను తట్టుకోలేక ఎన్టీఆర్ కొద్ది కాలానికే 1996, జనవరి 18న తీవ్రమైన గుండెపోటుతో కన్నుమూశారు. చంద్రబాబు చేసిన ఆ మహాకిరాతకం తెలుగు నేలపై ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంది.

కపటత్వంతో ఎన్టీఆర్ పంచన చేరి..

1983 అసెంబ్లీ ఎన్నికల్లో తన మామ ఎన్టీఆర్‌నే ఓడిస్తానని భీషణ ప్రతిజ్ఞ చేసి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి చిత్తుగా ఓడారు.. చంద్రబాబు. ఆ తర్వాత తనను మంత్రిని చేసిన కాంగ్రెస్ పార్టీకి మొదటి వెన్నుపోటు పొడిచారు. ఆ పార్టీని వదిలేసి మామ ఎన్టీఆర్ పంచన చేరారు. తద్వారా తనకు ఎలాంటి విలువలూ లేవని.. అధికారం, డబ్బే ముఖ్యమని చంద్రబాబు చాటుకున్నారు. ఆయనకు ఎన్టీఆర్ తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తే.. చంద్రబాబు మాత్రం కృతజ్ఞత మరిచి తన మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచారు. ఎన్టీఆర్‌కు 70 ఏళ్ల వయసులో కుటుంబం అండగా నిలవకుండా చేశారు. నందమూరి కుటుంబాన్ని మాయమాటలతో లొంగదీసుకుని తన వెన్నుపోటుకు వారిని పావులుగా వాడుకున్నారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని, గుర్తును, పార్టీ ఆస్తులను కుట్రపూరితంగా సొంతం చేసుకున్నారు. ఎన్టీఆర్ బ్యాంకు ఖాతాను స్తంభింపజేశారు. ఎమ్మెల్యేలంతా చంద్రబాబు ప్రలోభాల వలలో పడ్డారని గ్రహించిన ఎన్టీఆర్.. వారికి నిజం చెప్పడానికి వైస్రాయ్ హోటల్‌కు వెళితే ఎన్టీఆర్‌పై చెప్పులతో దాడి చేయించారు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం నినాదాలతో పార్టీ పెట్టిన ఎన్టీఆర్ ఈ దారుణమైన అవమానాన్ని తట్టుకోలేక కుంగిపోయారు. ఇంత చేసినా కసి తీరని చంద్రబాబు అసెంబ్లీలోనూ ఎన్టీఆర్‌కు మాట్లాడే అవకాశం కల్పించకుండా అడ్డుకున్నారు. అటు సినిమాల్లో, ఇటు రాజకీయాల్లో చరిత్రను తిరగరాసిన ఎన్టీఆర్.. చంద్రబాబు కుట్రలకు కంటతడి పెట్టుకున్నారు. అదే క్షోభతో గుండెపోటుతో కన్నుమూశారు. తాను జీవించి ఉండగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చంద్రబాబుని జామాత (అల్లుడు) దశమ గ్రహంగా తూర్పారబట్టారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్

వెన్నుపోట్లు, మోసం, నయవంచన, కపటత్వం, కుటిలత్వం, హత్యా రాజకీయాలనే తన ఎదుగుదలకు మెట్లుగా మార్చుకున్న చంద్రబాబు తనను ఒక విజనరీగా చూపించుకునేందుకు ఎల్లో మీడియాను ఉపయోగించుకున్నారు. చంద్రబాబు చెప్పుచేతల్లో ఉండే ఈ మీడియా ఆయనను అభివృద్ధి ప్రదాతగా కీర్తిస్తూ నిత్యం ప్రజలను ఏమారుస్తూనే ఉంది. అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, ఆ తర్వాత ప్రజలను నిలువునా ముంచడం చంద్రబాబుకు వెన్నుపోటుతో పెట్టిన విద్య. వెన్నుపోటుకు చంద్రబాబును బ్రాండ్ అంబాసిడర్‌గా చెబుతారు. 30 ఏళ్ల క్రితం సొంత మామకు వెన్నుపోటు పొడిచి సీఎం అయిన బాబు ఆ తర్వాత ప్రతి ఎన్నికల్లోనూ హామీల పేరుతో ప్రజలను నిలువునా వంచిస్తూనే ఉన్నారు. తన రాజకీయ పీఠాన్ని, తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి తెలుగు రాజకీయాలనే భ్రష్టు పట్టించిన వ్యక్తిగా రాజకీయ విశ్లేషకులు చంద్రబాబును చూపుతారు. రాజకీయాలను హత్యలు, డబ్బు మయం చేసి, కుట్రలు, కుతంత్రాలతో అపర చాణక్యుడిగా ఎల్లో మీడియా నీరాజనాలు అందుకుంటున్నారు.

చంద్రబాబుపై దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ వ్యాఖ్యల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఎన్టీఆర్ పథకాలకూ తిలోదకాలు..

వెన్నుపోటుతో ఎన్టీఆర్ మరణానికి కారకుడైన చంద్రబాబు తాను రాజకీయంగా తెరమరుగవుతున్న ప్రతిసారీ ఎన్టీఆర్ జపం చేశారు. ఎన్టీఆర్ మరణానంతరం ఎక్కడా, ఎందులోనూ ఆయన ఆనవాళ్లు లేకుండా చేశారు. ఎన్టీఆర్ తెచ్చిన మద్య నిషేధం, రెండు రూపాయల బియ్యం తదితర పథకాలను ఎత్తేశారు. అటు పార్టీలోనూ ఎన్టీఆర్ జ్ఞాపకాలు లేకుండా చెరిపేశారు. ఇప్పుడు రాజకీయ అవసరాలకు మాత్రం ఎన్టీఆర్ పేరు, బొమ్మను వాడుకుంటున్నారు. ఎన్టీఆర్‌ను పొగుడుతూ ఆయన గొప్పతనం గురించి చెబుతూ ఆయనను మించిన మహానటుడి పాత్ర పోషిస్తుండటంతో చంద్రబాబులో ఇంత మంచి నటుడు ఉన్నాడా అని టీడీపీ నేతలే నివ్వెరపోతున్నారు.

ఎన్టీఆర్‌కే కాదు కుటుంబ సభ్యులకూ వెన్నుపోటే

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఆయన కుటుంబ సభ్యులనూ వదల్లేదు. బావమరిది హరికృష్ణ, తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు వంటి వారిని ఆ తర్వాత పార్టీలో లేకుండా చేశారు. దగ్గుబాటి, ఆయన భార్య పురందేశ్వరి కాంగ్రెస్‌లో చేరిపోయారు. హరికృష్ణ కూడా చంద్రబాబు కుట్ర రాజకీయాలను అర్థం చేసుకుని అన్న తెలుగుదేశం పేరుతో పార్టీని ఏర్పాటు చేశారు.

ఔరంగజేబును గుర్తు చేసిన చంద్రబాబు



ఆధునిక భారత రాజకీయాల్లో వెన్నుపోటు అంకానికి తెరలేపి ఔరంగజేబును చంద్రబాబు గుర్తు చేశారు. ఈ దారుణమైన అంశం చర్చకు రాకుండా బాబు అనుకూల మీడియా తొక్కేసింది. తద్వారా నైతిక విలువలను దిగజార్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా అఖండ మెజారిటీతో ఎన్నికైన ఎన్టీఆర్‌ను కూలదోయడంలో బాబు అనుకూల మీడియా కీలక పాత్ర వహించింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంది. సత్యం ముందుకు రాకుండా అసత్యాలను, పచారం చేస్తున్నాయి.

– విజయబాబు, ఆర్టీఐ మాజీ కమిషనర్, మాజీ సంపాదకులు

సీఎం పదవి కోసమే ఎన్టీఆర్‌ను దించేశారు



చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాలనే కోరికతోనే 1995లో ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించేశారు. పార్టీని నిలబెట్టుకునేందుకే అలా చేశామని చెప్పుకుంటున్నా అది వాస్తవం కాదు. కేవలం తన కోసమే చంద్రబాబు ఇదంతా చేయించారు. ఆ సమయంలో ఎన్టీఆర్ ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్నారు. చంద్రబాబు ఆయన్ను వదిలేసి మధ్యలోనే హైదరాబాద్ వెళ్లిపోయి వైస్రాయ్ హోటల్‌లో మకాం వేశారు. అప్పట్లో మీడియాను మేనేజ్ చేసి తమ వద్దకు 40 మంది ఎమ్మెల్యేలు వచ్చారని, 50 మంది.. 60 మంది వచ్చారని ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రచారాన్ని చూసి చాలామంది ఎమ్మెల్యేలు అక్కడికి వెళ్లారు తప్ప నిజంగా అంతమంది ఎమ్మెల్యేలు అక్కడ లేరు. ఈ వ్యవహారంలో న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘాన్ని చంద్రబాబు తనకు అనుకూలంగా వినియోగించుకున్నారనే ఆరోపణలున్నాయి.

– దారా గోపి, సీనియర్ జర్నలిస్టు, విజయవాడ

ఎల్లో మీడియాలో ఎన్టీఆర్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయించి..



ఎన్టీఆర్ కేబినెట్‌లో ఉంటూనే తనకు అనుకూలంగా పత్రికల్లో కథనాలు వచ్చేలా, ఎన్టీఆర్ వ్యవహారాలపై లీకులు ఇస్తూ ఆయన ఇమేజీని చంద్రబాబు డ్యామేజీ చేసేవారు. ప్రభుత్వ పాలన సరైన దిశలో నడవడం లేదంటూ, లక్ష్మీపార్వతిని బూచిగా చూపించారు. ఎన్టీఆర్ అసెంబ్లీని రద్దు చేస్తారంటూ విస్తృతంగా ప్రచారంలోకి తీసుకుని వచ్చి.. ఎమ్మెల్యేలను భయభ్రాంతులకు గురిచేశారు. ఎన్టీఆర్ కేబినెట్ అసెంబ్లీ రద్దుకు సిఫారసు చేస్తే.. అప్పటి రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్ సహకారంతో ఆ తీర్మానాన్ని అడ్డుకున్నారు. స్పీకర్ యనమల రామకృష్ణుడు ఎలాగూ తన మనిషే కావడం చంద్రబాబుకు కలిసి వచ్చింది. అదే సమయంలో పోలీసు ఉన్నతాధికారులను కూడా చంద్రబాబు మచ్చిక చేసుకున్నారు.

– కొమ్మినేని శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టు



బరువెక్కిన మేఘం.. తరుముకొస్తుంటే..

పశువులను మేతకోసం అడవికి తీసుకెళ్లిన కాపరి.. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకోవడాన్ని చూసి, మేఘం తరుముకొస్తోందంటూ.. పశువులతో ఇంటిబాట పట్టాడు. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ బూడిద చెరువుపై శనివారం సాయంత్రం ఈ సుందర దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా...

7న యాదగిరిగుట్ట ఆలయం మూసివేత



యాదగిరిగుట్ట: చంద్ర గ్రహణం నేపథ్యంలో సెప్టెంబర్ 7న మధ్యాహ్నం 12 గంటల నుంచి 8వ తేదీ ఉదయం 3.30 గంటల వరకు యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ ఈవో వెంకట్రావ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్ర గ్రహణం 7న రాత్రి 9.56 గంటల నుంచి అర్ధరాత్రి 1.26 గంటల వరకు ఉంటుందని, ఈ సమయంలో ప్రధానాలయం, ఉప ఆలయాలు, అనుబంధ దేవాలయాలను మూసివేస్తామని ఈవో పేర్కొన్నారు. ప్రధానాలయంతో పాటు ఉప ఆలయాలు, అనుబంధ ఆలయాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిత్య కైంకర్యాలు ఉంటాయని, మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆలయాన్ని మూసివేయడం ద్వారా ధర్మ దర్శనాలు, వీఐపీ దర్శనాలు, బ్రేక్ దర్శనాలు, ఊరేగింపు సేవలు, అర్చన, ఆరాధన, శయనోత్సవం వంటి పూజలను రద్దు చేస్తున్నట్లు ఈవో వెల్లడించారు. 8వ తేదీ వేకువ జామున 3.30 గంటలకు ఆలయాన్ని తెరచి సంప్రోక్షణ చేపట్టిన అనంతరం యథావిధిగా నిత్య కైంకర్యాలను నిర్వహిస్తామని తెలిపారు.

యాదగిరిగుట్ట దేవాలయం పూర్తిస్థాయి ఈఓగా వెంకట్రావు



సాక్షి, హైదరాబాద్: యాదగిరిగుట్ట దేవాలయం పూర్తిస్థాయి కార్యనిర్వహణాధికారిగా ఐఏఎస్ అధికారి వెంకట్రావును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం దేవాదాయ శాఖ కమిషనర్‌గా ఉన్న ఆయన ఇంతకాలం ఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఈనెలాఖరుతో ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో వెంకట్రావు సేవలను కొనసాగించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఆయన్ను యాదగిరిగుట్ట కార్యనిర్వహణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. దాంతోపాటు నగరంలోని శిల్పారామం ప్రత్యేకాధికారిగా కూడా ఆయన వ్యవహరిస్తారని ఉత్తర్వులో పేర్కొంది. ప్రస్తుతం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కిషన్‌రావు ఇంతకాలం ఆ బాధ్యతలు పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆయన యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌చైర్మన్‌గా కూడా ఉన్న విషయం తెలిసిందే.

పలువురు అధికారుల పదవీ విరమణ



సచివాలయంలో అదనపు కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన బండి యాదగిరిని సన్మానిస్తున్న సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి రఘునందన్ రావు..

సాక్షి హైదరాబాద్: డా.బి.ఆర్.అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది శనివారం పదవీ విరమణ చేశారు. సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో పనిచేస్తున్న అదనపు కార్యదర్శులు బండి యాదగిరి, నిర్మల, అరుణ్ కుమార్, ఏఎస్‌వో అశోక్ కుమార్, జమేదార్ అబ్దుల్లా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, సంయుక్త కార్యదర్శి శివలింగయ్య (ప్రొటోకాల్) వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన అధికారులు అంకితభావంతో పనిచేశారని ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి, అత్యున్నత సేవలు అందించారని అన్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది కూడా వారిని ఆదర్శంగా తీసుకొని సేవా దృష్టితో విధులు నిర్వహించాలని సూచించారు.

ఏ వంట నూనె మంచిది?

పామాయిల్, సన్‌ఫ్లవర్, నువ్వుల నూనె, వేరుశనగ నూనె, రైస్‌బ్రాన్ ఆయిల్, కొబ్బరినూనె.. ఇలా ఎన్నో వంట నూనెలు. వీటిలో ఏది మంచిది? అనే ప్రశ్నలు తరచూ చర్చకు వస్తూనే ఉన్నాయి. మనం ఏ నూనెలు వాడాలి? మనకు ఆహార మార్గదర్శకాలను సూచించే భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ఏమంటోంది?

- సాక్షి, సాగుబడి

ఇటీవల కొందరు ఆన్‌లైన్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఫిట్నెస్ గురూలు పామాయిల్ ఆరోగ్యానికి మంచిది కాదని చెప్పడం ప్రజలను గందరగోళపరుస్తోంది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఫుడ్ అండ్ బేవరేజ్ అసోసియేషన్ (ఐఎఫ్‌బీఏ) స్పష్టత ఇచ్చింది. 'ఆహారోత్పత్తులపై 'పామాయిల్ వాడలేదు' అనే ముద్ర ఇటీవల కనిపిస్తోంది. ఇది కొందరు తమ ఉత్పత్తులు అమ్ముకోవటానికి చెబుతున్న మాటే తప్ప, పామాయిల్ చెడ్డది కాదు' అని తేల్చి చెప్పింది.

కొన్ని నూనెలను కలిపి వాడుకోవడం ఉత్తమం

- రోజుకు 20-50 గ్రాములకు మించకూడదు
- పామాయిల్ కూడా ఆరోగ్యానికి మంచిదే
- కొబ్బరి నూనెతో అనేక ప్రయోజనాలు



ఒకే నూనె కాకుండా.. కొన్ని నూనెలను కలిపి వాడుకుంటే మేలని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) అనుబంధ సంస్థ జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) స్పష్టం చేస్తోంది. ప్రతి వ్యక్తి రోజుకు 20 నుంచి 50 గ్రాముల (4 నుంచి 10 చెంచాల)కు మించకుండా మిశ్రమ వంట నూనెలు వాడుకోవాలి. నీడపట్టున కూర్చొని పనిచేసేవారు 20–30 గ్రాములు తీసుకుంటే మేలు.

ఎన్‌ఐఎన్ ఏమంటోంది?

కొబ్బరి నూనె.. గుండెకు రక్షణ!

'కొబ్బరి నూనెలోని శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ గుండెకు హాని కలిగిస్తాయంటారు. కానీ, అది నిజం కాదు. కొలెస్ట్రాల్–రక్తపోటు వల్ల గుండెకు హాని కలగకుండా కొబ్బరి నూనెలోని లారిక్ యాసిడ్ రక్షణనిస్తుంది. ఇందులోని షార్ట్, మీడియం చెయిన్ ఫ్యాటీ ఆమ్లాలు అధిక బరువును తగ్గిస్తాయి. పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోకుండా ఉంటుంది. కొబ్బరి నూనె స్మోకింగ్ పాయింట్ 350 ఫారిన్‌హీట్ కాబట్టి దీంతో వేపుళ్లు కూడా వండుకోవచ్చు' అని కొబ్బరి అభివృద్ధి బోర్డు స్పష్టం చేసింది.

ఏ కొవ్వులు మంచివి?

అన్ని రకాల వంట నూనెల్లోనూ మూడు రకాల కొవ్వు ఆమ్లాలు కలిసి ఉంటాయి. వీటి పాళ్లను బట్టి వాటి స్వభావ, ప్రభావాలు ఆధారపడి ఉంటాయి.

1. శాచ్యురేటెడ్ ఫ్యాటీ ఆసిడ్‌లు (ఎస్ఎఫ్ఏ)
2. మోనో–అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ ఆసిడ్‌లు (ఎంయూఎఫ్ఏ)
3. పోలీ–అన్‌శాచ్యురేటెడ్ ఆసిడ్‌లు (పీయూఎఫ్ఏ)

ఎస్ఎఫ్ఏలు ఎక్కువగా ఉండే నూనెలు చెడ్డవని.. ఎంయూఎఫ్ఏలు, పీయూఎఫ్ఏలు ఎక్కువ ఉన్న నూనెలు మంచివన్న అభిప్రాయాన్ని ఎన్ఐఎన్ మార్గదర్శకాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థ 'కొబ్బరి అభివృద్ధి బోర్డు'.. ఎస్ఎఫ్ఏలు ఎక్కువగా ఉన్నప్పటికీ కొబ్బరి నూనె ఆరోగ్య దాయకమైనదని చెబుతోంది.

బరువు నియంత్రణలో..



ఆరోగ్యకరమైన వంట నూనెల్లో కొబ్బరి నూనె చాలా శ్రేష్ఠం. తల్లి పాలలో ఉండే మీడియం చైన్ ట్రిగ్లిజరైడ్స్ కొబ్బరి నూనెలో మాత్రమే ఉంటాయి. ఇవి పొట్టలో నుంచి నేరుగా కాలేయంలోకి వెళ్లి కీటోన్ బాడీస్‌గా మారి మనలో ఉన్న అన్ని రకాల మెటబాలిజం సమస్యలను సరిదిద్దుతాయి. ఇందులో ఎక్కువగా ఉండే ఎస్ఎఫ్ఏలు ఆకలిని మందగించేలా చేస్తాయి. శరీర బరువు ఎక్కువ ఉంటే తగ్గించటం, తక్కువ ఉంటే సరిచేయటం ద్వారా తగుమాత్రంగా ఉండేలా చేయటంలో ఇవి ఉపయోగపడతాయి. కేన్సర్, అల్జీమర్స్‌ను అరికట్టే సుగుణాలు కూడా కొబ్బరి నూనెకు ఉన్నాయి.

- డా. పీవీ సత్యనారాయణ, ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్

2023-24లో దేశంలో వంట నూనెల వినియోగం తీరుతెన్నులు

నూనె రకం	పరిమాణం (మిలియన్ మెట్రిక్ టన్నులు)	% వాటా
పామాయిల్	9.4	37.6
సోయా	5.3	21.2
ఆవ	3.4	13.6
సన్‌ఫ్లవర్	2.9	11.6
వరి తవుడు (రైస్‌బ్రాన్)	1.2	4.8
పత్తి గింజలు (కాటన్ సీడ్)	1.1	4.4
వేరుశనగ	0.8	3.2
నువ్వులు, కుసుమ, కొబ్బరి, ఆలివ్ తదితర నూనెలు	0.9	3.6

పామాయిల్ చెడ్డది కాదు!



ఎస్ఎఫ్ఏలు, ఎంయూఎఫ్ఏలు, పీయూఎఫ్ఏలు.. ఈ మూడూ మనకు సమపాళ్లలో అవసరం. కానీ ఈ మూడింటినీ సమపాళ్లలో ఇవ్వగలిగిన నూనెలు లేవు. అందుకే.. ఒకే రకం కాకుండా రొటేషన్ పద్ధతిలో అనేక రకాల నూనెలు వాడమని లేదా కొన్ని రకాలు కలిపి వాడమని ఐసీఎంఆర్ చెబుతోంది. పామాయిల్‌కి ఆక్సిడేటివ్ స్టెబిలిటీ ఉండటం వల్ల కన్ఫెక్షనరీ, బేకరీ పరిశ్రమల్లో 80% దీన్నే వాడుతున్నారు. మన దేశంలో ఏటా 2.6 కోట్ల టన్నుల వంట నూనె వాడుతుంటే ఇందులో 90 లక్షల టన్నులు పామాయిలే. ట్రాన్స్‌ఫ్యాటీ ఆసిడ్స్ చాలా హానికరమైనవి. వనస్పతిలో ఇవి ఎక్కువ. ట్రాన్స్‌ఫ్యాటీ యాసిడ్స్‌తో పోల్చితే ఎస్ఎఫ్ఏ మెరుగైనవి. ఇవి పామాయిల్‌లో 40% ఉన్నప్పటికీ అందులో నుంచి 13% మాత్రమే మన దేహం తీసుకుంటుంది. కొబ్బరి నూనెలోని లారిక్ యాసిడ్ వ్యాధి నిరోధకతను పెంచుతుంది.

- డాక్టర్ ఆర్.బి.ఎన్. ప్రసాద్, మాజీ చీఫ్ సైంటిస్ట్ అండ్ హెడ్, సెంటర్ ఫర్ లిపిడ్ రీసెర్చ్, సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, హైదరాబాద్

వేపుళ్ల నూనె.. ప్రమాదకరం..: వడలు, పూరీల వంటి వేపుడు వంటకాల కోసం ఒకసారి అధిక ఉష్ణోగ్రత దగ్గర వేడి చేసిన నూనెను రెండోసారి మళ్లీ అంతలా వేడి చేయకూడదు. దాన్ని సాధారణ తాలింపుల్లో, అది కూడా ఒకట్రెండు రోజుల్లో వాడేసుకోవాలి అని ఎన్ఐఎన్ చెబుతోంది. ఒకటికన్నా ఎక్కువ సార్లు వేపుళ్లకు వాడితే ఆ నూనెలు గుండెజబ్బులు, కేన్సర్లకు దారితీసే ప్రమాదం ఉంది.

కేంద్ర వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం.. మనదేశంలో 2019-20లో తలసరి వార్షిక వంటనూనె వినియోగం 19.8 కిలోలు. 2023-24 నాటికి ఇది 21.8 కిలోలకు పెరిగింది.

ఆర్టీసీ బస్ బాడీ యూనిట్ ఔట్

- మియాపూర్ నుంచి తొలగించి ఉప్పల్ వర్క్‌షాపులో విలీనం
- ఉప్పల్ వర్క్‌షాపు కరీంనగర్ వర్క్‌షాపులో విలీనం
- సిటీ ఆర్టీసీ ప్రైవేట్ పరం కానుండటంతో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మియాపూర్‌లోని బస్‌బాడీ యూనిట్ కథ కంచికి చేరబోతోంది. ఇప్పటికే పూర్తి స్థాయిలో బస్సులకు బాడీలు నిర్మించకుండా నామమాత్రంగా మారిన నేపథ్యంలో, ఈ యూనిట్‌ను అక్కడి నుంచి తొలగించి ఉప్పల్‌లో ఉన్న వర్క్‌షాపులో విలీనం చేసే దిశగా సంస్థ అడుగులేస్తోంది. కొత్తగా కొంటున్న బస్సులకు బాడీలు నిర్మించే పనిని ఇప్పటికే ప్రైవేటు సంస్థలకు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇక ఉప్పల్‌లో 16 ఎకరాల్లో ఉన్న అతి పెద్ద వర్క్‌షాపును కరీంనగర్‌లో ఉన్న జోనల్ వర్క్‌షాపులో విలీనం చేయాలని ఆర్టీసీ భావిస్తోంది. ఈ మేరకు తుది నిర్ణయం తీసుకునేందుకు ఐదుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. దాని సూచనల మేరకు త్వరలో ఈ విలీనం ప్రక్రియ ప్రారంభించనుంది. ఇదే జరిగితే నగరంలో ఆర్టీసీకి ఉన్న రెండు ప్రతిష్టాత్మక యూనిట్లు శాశ్వతంగా తెరమరుగుకానున్నాయి.

ప్రైవేటు సంస్థలకు నగర ప్రజా రవాణా నేపథ్యంలో..

హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను మాత్రమే నడపాలన్న దిశలో సాగుతున్న ఆర్టీసీ, దాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కీలక మార్పు చేర్పులకు ఉపక్రమిస్తోంది. ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రం రాయితీతో బ్యాటరీ బస్సులు ఇచ్చేందుకు ప్రారంభించిన పీఎం ఈ–డ్రైవ్ పథకం కింద ఆర్టీసీ బస్సుల కోసం సంస్థ దరఖాస్తు చేసుకుంది. ఇందులో 2,500 బస్సులు మంజూరయ్యాయి. అవి దశల వారీగా సరఫరా అవుతాయి. వాస్తవానికి రాయితీ పద్ధతిలో వచ్చే ఆ బస్సులను టెండర్ల ద్వారా ప్రైవేటు సంస్థలు తీసుకుని, సొంతంగా తయారు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇస్తాయి. నిర్వహణ బాధ్యతను సైతం పూర్తిగా అవే నిర్వర్తిస్తాయి. అప్పుడు నగరంలో ఆర్టీసీకి సొంత బస్సులంటూ ఉండవు. అందువల్ల బస్‌బాడీ యూనిట్, వర్క్‌షాపుల అవసరం ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఆర్టీసీ వాటిని తొలగించాలనే నిర్ణయానికి వచ్చింది. అయితే తొలగిస్తున్నట్టు ప్రకటిస్తే విమర్శలు వచ్చే అవకాశం ఉన్నందున విలీనం చేయబోతోంది. అయితే నల్లగొండ, మహబూబ్‌నగర్ మార్గాల్లో ఉన్న డిపోలకు సంబంధించిన బస్సులు వర్క్‌షాపు పనులకు కరీంనగర్ వరకు వెళ్లటం కష్టమైనందున, వాటి కోసం ఉప్పల్‌లో ఓ యూనిట్‌ను అందుబాటులో ఉంచనుంది. కరీంనగర్ యూనిట్ ఆ సమీప జిల్లాలకు అందుబాటులో ఉంటుంది.

విలువైన స్థలం లీజుకు..

మియాపూర్‌లోని బస్‌బాడీ యూనిట్ 18 ఎకరాల విశాలమైన ప్రాంగణంలో కొనసాగుతోంది. దాన్ని అక్కడి నుంచి తరలిస్తే, అత్యంత విలువైన ఆ స్థలాన్ని లీజుకు ఇవ్వనుంది. తద్వారా భారీ ఆదాయం సమకూర్చుకుంటుంది. అయితే లీజు వరకే పరిమితమవుతుందా? లేక గృహనిర్మాణ మండలి, స్వగృహ స్థలాలను ప్రభుత్వం విక్రయించిన తరహాలో నిర్ణయం తీసుకుంటుందా అన్నది వేచి చూడాల్సి ఉంది.

కుక్కకాటుకు బాలుడు బలి



సారంగాపూర్: కుక్క కాటుకు మూడేళ్ల బాలుడు బలయ్యాడు. ఈ సంఘటన జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం తుంగూర్‌లో చోటుచేసుకుంది. తుంగూర్‌కు చెందిన ఇంద్రాల శిరీష, చంద్రయ్యకు రక్షిత్ మూడో కుమారుడు. రెండు నెలల క్రితం రక్షిత్ ఇంటిబయట ఆడుకుంటుండగా కుక్క వెంబడించింది. భయపడిన బాలుడు పక్కనే ఉన్న మురికికాలువలో పడిపోయాడు. కంటిపై గాయం కావడంతో తల్లిదండ్రులు బండరాయి తగిలిందని భావించారు. గాయానికి ప్రాథమిక చికిత్స జరిపించారుగానీ కుక్క కరిచిందని అనుకోలేదు. గాయం నయం కాగానే రక్షిత్ ఆరోగ్యం కుదుటపడింది. అయితే నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షంలో రక్షిత్ ఇంటిముందు ఆడుకుంటూ తడిసిపోయాడు. ఆ సమయంలో రక్షిత్ నోటినుంచి లాలా జలం తీవ్రంగా వచ్చింది. దీంతో తల్లిదండ్రులు బాబును నిశితంగా పరిశీలించగా.. కుక్కలా చేష్టలు చేయడంతో అనుమానం వచ్చి, చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించిందని చెప్పడంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యంలో సిద్దిపేట వద్ద రక్షిత్ మృతిచెందాడు. బాలుడికి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్క కాటు వల్ల రక్షిత్ శరీరం పూర్తి విషపూరితంగా మారిందని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. శనివారం సాయంత్రం బాలుడి మృతదేహాన్ని తుంగూర్‌లో ఖననం చేశారు.

ఒకే ఉపాధ్యాయుడు.. 54 మంది విద్యార్థులు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం హల్యానాయక్

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి గాంధీపురం ప్రభుత్వ పాఠశాలలో 54 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. ఇంతకుముందు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా ఇటీవల పదోన్నతిపై నలుగురు ఇతర పాఠశాలలకు వెళ్లారు. మిగిలిన ఒక్క ఎస్జీటీ కమ్ హెచ్‌ఎం హల్యానాయక్ సెలవు పెడితే పాఠశాలను మూసివేయాల్సిందే. బదిలీపై వెళ్లిన వారి స్థానంలో ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను డిప్యుటేషన్ చేయాలని, లేకపోతే పిల్లల చదువు ఆగమవుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

అంతిమయాత్రకు దారేది?

మోకాలి లోతు బురదలో మృతదేహం తరలింపు



బురదలో అంతిమ యాత్ర నిర్వహిస్తున్న బంధువులు

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఎలకేశ్వరం గ్రామంలో ఓ రైతు అంతిమయాత్రకు బంధువులు, గ్రామస్తులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. గ్రామానికి చెందిన సూరం లచ్చిరెడ్డి శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. దహన సంస్కారాలు నిర్వహించేందుకు శ్మశానవాటికకు వెళ్లే దారి సక్రమంగా లేకపోవడంతో మృతదేహం తరలించడంలో అవస్థలు పడ్డారు. భీమారం మండలం ఆరెపల్లి ఎక్స్ రోడ్డు నుంచి ఎలకేశ్వరం వరకు మట్టి రోడ్డు ఉండటంతో గ్రామస్తులు ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. లచ్చిరెడ్డి అంత్యక్రియలకు ఇదే దారి గుండా వెళ్లాల్సి ఉంటుంది. దీంతో మోకాలి లోతు బురద నుంచి శవయాత్ర జరిపేందుకు తిప్పలు పడ్డారు. మార్గమధ్యలో మంచినీళ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో, అతికష్టంగా దాటి చివరికి శ్మశాన వాటిక వద్దకు చేరుకుని అంత్యక్రియలు నిర్వహించారు. అనేక ఏళ్లుగా రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



జలపాత సోయగం..

కనువిందు చేస్తున్న మల్లన్నగండి

చుట్టూ ప్రకృతి సిద్ధమైన గుట్టలు...నడుమ మల్లన్నగండి రిజర్వాయర్... శ్రీశైలాన్ని తలపించే ఘాట్ రోడ్డు. ఈ మనోహరమైన దృశ్యం మరెక్కడో కాదు... జనగామ జిల్లా నర్మెట మండలంలోని మల్లన్నగండి రిజర్వాయర్ గోదారి జలాలతో నిండుకుండలా మారగా ఇటీవల కురిసిన వర్షాలకు గుట్టలపైనుంచి జాలువారే నయనానందకరమైన జలపాతం చూపరులను కట్టిపడేస్తోంది. సందర్శకుల రాకతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనగామ

ఏడేళ్లు కనిపించకుండాపోతే మృతి చెందినట్లే

వారసులకు ప్రయోజనాలు కల్పించాలని బ్యాంకుకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: చట్టప్రకారం ఏడేళ్లపాటు ఓ వ్యక్తి కనిపించకపోతే మృతిచెందినట్లేనని భావించాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. అలాంటి వ్యక్తి వారసులకు ఉద్యోగ సంబంధ ఆర్థిక ప్రయోజనాలు, కారుణ్య నియామకం కోరే హక్కు ఉంటుందని ఓ కేసు విచారణలో తేల్చిచెప్పింది. 1991లో ఇండియన్ బ్యాంక్‌లో చేరిన వి.ఫ్రాన్సిస్ అనే వ్యక్తి 2004లో అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన కొన్ని నెలల తర్వాత కనిపించకుండాపోయారు. పోలీసులు ఎంత గాలించినా జాడ తెలియకపోవడంతో బ్యాంకు చార్జిషీట్ జారీ చేసి ఆయన్ను సర్వీస్ నుంచి రిటైర్ చేసింది. మరోవైపు కోర్టు ద్వారా చట్టబద్ధమైన వారసత్వ సర్టిఫికెట్ పొందిన ఆయన కుటుంబీకులు.. టెర్మినల్ (తొలగింపు) బెనిఫిట్స్, కారుణ్య నియామకం కోసం 2012లో ఇండియన్ బ్యాంకుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఏళ్లు గడిచినా బ్యాంకు స్పందించకపోవడంతో ఫ్రాన్సిస్ భార్య సుగుణకుమారి 2018లో హైకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 108 ప్రకారం ఏడేళ్లకుపైగా తప్పిపోయిన వ్యక్తిని మృతిచెందినట్లుగా భావిస్తారని.. అందువల్ల ఈ కేసుకు ఆ సెక్షన్ వర్తిస్తుందన్నారు. కేన్సర్ రోగి అయిన పిటిషనర్ వైద్య పరిస్థితి దృష్ట్యా ఆమె పిల్లల్లో ఒకరికి కారుణ్య నియామకం అందించడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని.. 8 వారాల్లోగా అన్ని టెర్మినల్, ఇతర ప్రయోజనాలను అందజేయాలని బ్యాంకును ఆదేశించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
ఆదివారం । 31-8-2025



మర్రిచెట్టుకు వినాయకుడి రూపం!

మర్రి చెట్టు వినాయకుడి రూపును దాల్చి భక్తుల పూజలు అందుకుంటోంది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని మధ్యగేట్ సమీపాన ఆంజనేయ స్వామి గుడిలో పురాతన కాలం నాటి మర్రిచెట్టు ఉంది. ఈ చెట్టులో కొద్ది భాగానికి వినాయకుడి రూపం రావడంతో 50 ఏళ్లుగా పూజలు చేస్తున్నారు. ఇటీవల ఆ ఆకారానికి ఇత్తడి తొడుగు అలంకరించగా పూర్తిస్థాయి గణనాథుడి రూపం వచ్చినట్లయింది. ప్రస్తుతం వినాయక చవితి నవరాత్రోత్సవాల సందర్భంగా భక్తులు ప్రతీరోజు పూజలు చేస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

ప్రమాదాలపై పోస్ట్‌మార్టం

రక్షణ చర్యలపై దిశానిర్దేశం

- ఉత్తమ గనులకు రోలింగ్ షీల్డ్‌లు
- నేడు సింగరేణి స్థాయి రక్షణ త్రైపాక్షిక సమావేశం



కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల్లో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు నివారించదగినవే అయినా.. చిన్న తప్పిదాలతో భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. జాగ్రత్తలు, రక్షణ చర్యలు పాటిస్తే వీటిని నివారించవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రక్షణే ప్రథమం.. రక్షణే చివరకు.. రక్షణే ఎల్లప్పుడు..

రక్షణే ప్రథమం, రక్షణే చివరకు, రక్షణే ఎల్లప్పుడు నినాదంతో ముందుకు సాగుతున్న సింగరేణి ఏటా రక్షణ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తోంది. గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలపై సమీక్షించి, భవిష్యత్‌లో అనుసరించాల్సిన పద్ధతులపై దిశానిర్దేశం చేస్తోంది. ఈక్రమంలోనే మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో ఆదివారం సింగరేణి స్థాయి రక్షణ త్రైపాక్షిక సమావేశం నిర్వహించనుంది. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తోంది. ప్రమాదాల్లేని సింగరేణి లక్ష్యంగా యాజమాన్యం ప్రణాళిక రూపొందించింది.

సీఎండీ, డీజీఎంఎస్ హాజరు

సింగరేణిలోని 19 ఓసీపీలు, 23 భూగర్భ గనుల్లో రక్షణ చర్యలపై సమీక్షించేందుకు సీఎండీ బలరాం, డీజీఎంఎస్ ఉజ్వల్‌తాహ ఈ సమావేశానికి హాజరుకానున్నారు. 55వ రక్షణ త్రైపాక్షిక సమావేశం ఉదయం వివిధ అంశాలపై సమీక్షిస్తుంది. సాయంత్రం రక్షణ చర్యలు పాటించిన ఉత్తమ అధికారులు, గనులకు అవార్డులు, రోలింగ్ షీల్డ్‌లు అందిస్తుంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాట్లు చేస్తున్నారు. భారీవర్షాల నేపథ్యంలో ఏరియాలో కాకుండా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంఎన్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈక్రమంలో ఇప్పటికే 11 ఏరియాల్లో ఏరియా లెవల్ రక్షణ త్రైపాక్షిక సమావేశాలను నిర్వహించింది. అక్కడ జరిగిన ప్రమాదాలపై సమీక్షించింది. ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రాబోయే రోజుల్లో ఏర్పాటు చేసే సాంకేతికతకు అనుగుణంగా రక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

గత ఏడేళ్లలో జరిగిన ప్రమాదాలు

ఏడాది	మృతులు	తీవ్రగాయాలు	సాధారణ గాయాలు
2018	7	191	347
2019	8	138	217
2020	12	102	108
2021	13	122	107
2022	05	96	122
2023	05	68	70
2024	07	88	79
2025	03	53	35



సేఫ్టీ స్లోగన్స్‌తో ఉన్న క్వారీ హాలేజీ రోడ్డు

గనులు, ఏరియాలకు రోలింగ్ షీల్డ్‌లు

రక్షణ పక్షోత్సవాల సందర్భంగా రక్షణ చర్యలు పాటించిన గనులు, డిపార్ట్‌మెంట్లు, సీహెచ్‌పీలు, ఓసీపీలతోపాటు ఏరియాలకు కూడా ప్రత్యేక రోలింగ్ షీల్డ్‌లు అందజేయనున్నారు. దీనికి సంబంధించిన షీల్డ్ కవర్‌లో ఆయా గనుల జాబితా సిద్ధం చేశారు. అన్ని ఏరియాల జీఎంలు, రక్షణ అధికారులు, ప్రాజెక్టు అధికారులు, మేనేజర్లు హాజరుకానున్నారు.

ధర్నా చేయాల్సింది ఢిల్లీలో... ఇక్కడ కాదు

బీఆర్‌ఎస్ నాయకులకు అన్వేష్‌రెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: రైతుల పట్ల బీఆర్‌ఎస్ నేతలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలోగానీ, బీజేపీ కార్యాలయం ముందుగానీ ధర్నా చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగాన్ని కేంద్రం నిండా ముంచిందని, రాష్ట్రానికి ఈ సీజన్‌లో కేటాయించిన యూరియా కోటాలో 60 శాతం కూడా సరఫరా చేయలేదని ఆయన శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రామగుండం ఎరువుల కర్మాగారం రెండు నెలల నుంచి మూతపడితే ఇప్పటివరకు పట్టించుకోలేదని, ఈ పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో బీజేపీ కార్యాలయం వద్ద ధర్నా చేయాలని హితవు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రైతులను ఇబ్బందులు పెడుతుంటే, బీజేపీతో బీఆర్‌ఎస్‌కు ఎంత స్నేహం ఉన్నా, ఆ పార్టీని వెనకేసుకువచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందిస్తారా అని ఆయన నిలదీశారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక అసెంబ్లీకి వస్తున్న నేపథ్యంలో ప్రజల మైండ్ డైవర్ట్ చేయడానికి యూరియా కొరత పేరుతో నాటకాలు ఆడుతున్నారని అర్థమవుతోందని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా యూరియా కష్టాలు తప్పలేదని, సొంత జిల్లాలోని దుబ్బాకలో యూరియా అందక 65 ఏళ్ల రైతు క్యూలైన్‌లోనే మరణిస్తే కనీసం సానుభూతి తెలపని హరీశ్‌రావు ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారని అన్వేష్‌రెడ్డి విమర్శించారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

కామారెడ్డిలో ప్రాణనష్టం జరగలేదు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, మదన్‌మోహన్‌రావు





కామారెడ్డిలో కురిసిన భారీ వర్షాలపై అధికారులకు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టారని, దాంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, మదన్‌మోహన్‌రావు తెలిపారు. పోచారం ప్రాజెక్టు దెబ్బతిన్న విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించినట్లు చెప్పారు. ప్రాజెక్టు రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రైతులను మభ్యపెట్టేందుకే

కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



రాష్ట్రంలో యూరియా కొరత ఉందని ప్రతిపక్షాలు రైతులను గందరగోళపర్చేందుకు ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే యూరియా సమస్య వచ్చిందని, దీనికి బీజేపీ కేంద్ర మంత్రులు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతులకు భరోసా ఇచ్చే ఒక్క మాట కూడా లేదు

బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి





భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు భరోసా ఇచ్చే విధంగా ఒక్క మాట కూడా రాలేదని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి విమర్శించారు. పగ ఉంటే ప్రతిపక్ష పార్టీలపై తీర్చుకోండి కానీ.. ప్రజలపై కాదని సూచించారు. దెబ్బతిన్న పంటలకు పత్తికి ఎకరాకు రూ.50 వేలు, కందికి రూ.50 వేలు, సోయాకు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్ర వలసలు... అసంఘటిత కార్మికులు!

దేశంలో 31.03 కోట్లకు చేరిన వలస, అసంఘటిత కార్మికులు

మొదటి, రెండు స్థానాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్

- తర్వాత పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలు
- తెలంగాణలో 45,53,547 మంది....
- హైదరాబాద్, రంగారెడ్డిల తర్వాత ఖమ్మం, నల్లగొండలలో అధికం
- 'ఈశ్రమ్ పోర్టల్'లో పెరుగుతున్న నమోదు
- ప్రధానంగా ఐదురంగాల ద్వారానే ఉపాధి.. ఆచరణకు దూరంగా కార్మిక చట్టాలు

దేశవ్యాప్తంగా ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికులు: **31,03,24,308**

29.08.2025న ఒక్కరోజే నమోదైన వారి సంఖ్య: **29,378**



మధ్యప్రదేశ్ నుంచి ఉపాధి కోసం వరంగల్‌కు వచ్చి నివాసం కోసం తాత్కాలిక పాకలు ఏర్పాటు చేసుకున్న వలస కార్మికులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఉపాధి కోసం దేశంలోని ఒక రాష్ట్రంనుంచి మరో రాష్ట్రానికి వెళ్లిన కార్మికుల సంఖ్య 31.03 కోట్లకు చేరింది. దేశవ్యాప్తంగా సుమారుగా 145 కోట్ల జనాభా ఉండగా.. అంతర్రాష్ట్ర వలస కార్మికుల సంఖ్య 31,03,24,308లకు చేరడం ఆందోళన కలిగించే పరిణామం. మొదటి, రెండు, మూడు స్థానాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్‌లు ఉండగా.. ఆ తర్వాత స్థానంలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్, ఒడిశా, గుజరాత్‌లు ఉన్నాయి. తెలంగాణలో ఆ సంఖ్య 45,53,547లు కాగా.. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 3,57,864, రంగారెడ్డిలో 3,29,714లు ఉన్నారు. ఖమ్మంలో 2,23,071, నల్లగొండలో 2,09,894లు కాగా, మిగతా వాళ్లు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్లు 'ఈశ్రమ్ పోర్టల్', కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ వెల్లడించిన నివేదికలు చెబుతున్నాయి.

టాప్ 5లో ఉన్న ఐదు రాష్ట్రాలు....

రాష్ట్రం	అసంఘటిత కార్మికులు
ఉత్తరప్రదేశ్	8,40,34,808
బిహార్	3,00,87,436
పశ్చిమ బెంగాల్	2,64,94,539
మధ్యప్రదేశ్	1,89,73,349
మహారాష్ట్ర	1,79,06,733

పనిచేస్తున్న ఐదు ప్రధాన రంగాలు... కార్మికుల సంఖ్య

వ్యవసాయం	16,11,34,241
గృహ కార్మికులు	2,90,59,023
నిర్మాణరంగం	2,89,90,238
దుస్తుల రంగం	2,03,52,524
ఇతర రంగాలు	1,41,28,298

అగని అంతర్రాష్ట్ర వలసలు... ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు...

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆగస్టు 26, 2021న అసంఘటిత కార్మికుల జాతీయ డేటాబేస్ అయిన ఈశ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఈశ్రమ్ పోర్టల్ ప్రధాన లక్ష్యం ఆధార్‌తో సీడ్ చేసిన వలస కార్మికులతో సహా అసంఘటిత కార్మికుల జాతీయ డేటాబేస్‌ను సృష్టించడం. అటువంటి కార్మికులకు ఇప్పటికే ఉన్న సామాజిక భద్రత, సంక్షేమ పథకాల కింద డెలివరీని సులభతరం చేయడం. ఇది అసంఘటిత కార్మికుడు స్వీయ-ప్రకటన ప్రాతిపదికన పోర్టల్‌లో తనను తాను నమోదు చేసుకోవడానికి అనుమతిస్తుంది. ఇలా నమోదైన వివరాలను కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి ఆగస్టు 11న దేశంలోని అంతర్రాష్ట్ర వలస కార్మికుల వివరాలు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీగా ప్రకటించారు. ఏ రాష్ట్రం నుంచి ఏయే రాష్ట్రాలకు వెళ్లారన్న సంఖ్యను కూడా వెల్లడించారు. ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికులతో సహా రాష్ట్రాల వారీగా అసంఘటిత కార్మికుల సంఖ్యను చేర్చారు. ఆ రోజు వరకు 30,98,43,824లుగా ఉండగా... ఈ నెల 29 నాటికి ఆ సంఖ్య 31,03,24,308లకు పెరిగిందని ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదైంది. 18 రోజుల్లో అంతర్రాష్ట్ర వలస కార్మికుల సంఖ్య 4,80,484లు పెరగ్గా.. 29వ తేదీన ఒక్కరోజే 29,378 మంది గుర్తింపు పొందారు.

ప్రకటనకే పరిమితం.. పథకాలు దూరం...

వలస కార్మికులు సహా అసంఘటిత కార్మికులు వివిధ సామాజిక భద్రతా పథకాలను పొందేందుకు 'వన్-స్టాప్-సొల్యూషన్'గా ఈశ్రమ్‌ను అభివృద్ధి చేయడంపై 2024-25 బడ్జెట్‌లో ప్రకటన చేసింది. అందుకు అనుగుణంగా, కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 21 అక్టోబర్ 2024న 'ఈశ్రమ్-వన్-స్టాప్-సొల్యూషన్'ను ప్రారంభించింది.

ఈశ్రమ్-'వన్-స్టాప్-సొల్యూషన్'అనేది ఒకే పోర్టల్ అంటే ఈశ్రమ్ లో వివిధ సామాజిక భద్రత/సంక్షేమ పథకాలను ఏకీకృతం చేస్తుంది. ఇది ఈశ్రమ్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికులు సహా అసంఘటిత కార్మికులు సామాజిక భద్రతా పథకాలను యాక్సెస్ చేయడానికి వీలు కల్పించింది. ఇప్పటివరకు, ప్రధాన మంత్రి వీధి విక్రేతల ఆత్మనిర్భర్ నిధి, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీ యోజన)తో సహా ఈశ్రమ్ కార్డ్ హోల్డర్‌లకు ప్రయోజనాలు, సామాజిక భద్రత, బీమా తదితర 14 పథకాలను ఇప్పటికే ఈశ్రమ్‌తో అనుసంధానం చేసినట్లు ప్రకటించారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ (ఎన్‌ఎఫ్‌బీఎస్), మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్), ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ (పీఎంఏవై, జీ) ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ,పీఎంజేఏవై, ప్రధాన మంత్రి మాత వందన యోజన (పీఎంఎంవీవై)లతో అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఇవన్నీ అసంఘటిత కార్మికులకు అందడం లేదని, వలస కార్మికుల ప్రయోజనాలను కాపాడటానికి ఏర్పాటు చేసిన పార్లమెంటు అంతర్-రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1979 పటిష్టంగా అమలు చేయాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.



భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న దీప్‌కుమార్‌ది బిహార్ రాష్ట్రం పాట్నా. బతుకుదెరువు కోసం వరంగల్ నగరానికి రెండేళ్ల కిందట వచ్చాడు. ఓ భవన నిర్మాణ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజువారీగా రూ.1,200 కూలీతో నెలకు రూ.30 వేలకు పైగా సంపాదిస్తున్నాడు. సంపాదించిన డబ్బులలో రూ.25 వేలు తల్లిదండ్రులకు బ్యాంక్ అకౌంట్ ద్వారా పంపించి మిగతావి సొంత ఖర్చులకు వాడుకుంటున్నాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఛోటూ.. మధ్యప్రదేశ్ నుంచి వరంగల్‌కు వలస వచ్చాడు. బతుకుదెరువు కోసం తన అన్నతోపాటు వరంగల్ నగరంలోని ఓ టీ, టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. హోటల్ నిర్వాహకులు రెండు పూటలా భోజనం పెట్టి నెలకు రూ.18 వేల జీతం ఇస్తున్నారు. నెలకు రూ.15 వేలు పొదుపు చేస్తూ మూడు వేల రూపాయిలు చేతి ఖర్చులకు ఉంచుకుంటున్నానని, రెండేళ్లకు ఒక్కసారి సొంత గ్రామానికి వెళ్లి వస్తుంటామని ఛోటూ చెప్పాడు.

క్లుప్తంగా...

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నిరాశ

ఉక్కునగరం: నెలాఖరున జీతాలు చెల్లించక పోవడంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు నిరాశ చెందారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతం కష్టాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి 50 శాతం, 35 శాతం, 75 శాతం ఇలా ఒక్కో నెల ఒక్కో విధంగా జీతాలు చెల్లించడం ప్రారంభించారు. అప్పటి నుంచి గత నెలాఖరు వరకు ఉద్యోగులకు 330 శాతం పెండింగ్‌లో పెట్టారు. గత మూడు నెలలుగా నెలాఖరుకు 75 శాతం చెల్లించడం ప్రారంభించారు. అదే విధంగా ఈనెల కూడా శనివారం బ్యాంకులకు చివరి వర్కింగ్ కావడంతో జీతాలు చెల్లిస్తారని ఎదురు చూశారు. సాయంత్రానికి కూడా జీతం చెల్లించక పోవడంతో ఉద్యోగులు అసంతృప్తి చెందారు.

అక్టోబర్ 15న ఏయూ స్నాతకోత్సవం

మద్దిలపాలెం(విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయం 91, 92వ సంయుక్త స్నాతకోత్సవం అక్టోబర్ 15వ తేదీ జరగనుంది. ఉదయం 11 గంటలకు కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం(కాన్వొకేషన్ హాల్) వేదికగా ఇది జరగనుంది. స్నాతకోత్సవానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్నాతకోత్సవం రోజున ఉదయం 9 గంటలకు తమకు కేటాయించిన స్థానాల్లో కూర్చోవాలని సూచిస్తూ రిజిస్ట్రార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ హాజరవుతారు.

ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం: ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి పరవళ్ళు తొక్కుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. శనివారం ఉదయం నుంచి క్రమేపి పెరుగుతూ రాత్రి 8.35గంటలకు 11.75అడుగులకు నీటి మట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. దీంతో ఇరిగేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాటన్ బ్యారేజ్‌లోని మొత్తం 175గేట్లను పైకి లేపి 10,01,410క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఆదివారం కాటన్ బ్యారేజ్ వద్ద నీటి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువజామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కనుల పండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు ఉభయ దేవేరులతో కలసి తిరుచ్చిపై ఆశీనులై మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

శనీశ్వరునికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అనింద్యుడిపై జనవంద్యుడు

కాణిపాకం: ప్రేమ నయన.. వాత్సల్య పవన.. దయా సాగర.. సకల శుభంకర..మూషిక వాహనదారి.. కరుణా కావేరి! వందే వినాయకం..పరమ పావనం..మురిసెను సకల భక్త జనం.. నిజ నిదర్శనం.. నీ దర్శనం! కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం స్వామివారు వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, కర్పూర హారతులు, భజన, నృత్య, వాద్య, బృందాల ప్రదర్శనల నడుమ మూషిక వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈసేవకు కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకం పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చిన కాంపల్లె గ్రామస్తుల విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.

అలరించిన 'శ్రుతిలయలు'

తిరుపతి కల్చరల్ : విశిష్ట దర్శకులు కె.విశ్వనాథ్, బాపును స్మరిస్తూ తిరుపతి ఫిలిం సొసైటీ వారు శనివారం మహతి కళాక్షేత్రంలో శ్రుతిలయలు పేరిట సంగీత విభావరి నిర్వహించారు. విశ్వనాథ్, బాపు చిత్రాల్లోని అద్భుతమైన పాటలను గాయనీ గాయకులు రామ్‌చరణ్, కీర్తి, జయరాం ఆలపించి అలరించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా యూనియన్ బ్యాంక్ డీజీఎం సూర్యప్రకాశరావు, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు, ఎస్‌పీడీసీఎల్ ఇంజినీర్ కృష్ణారెడ్డి హాజరయ్యారు. సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్.బాబు, కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు, కోశాధికారి యు.ప్రసాదరావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబు, అనసూయ, మధుసూదన్‌రెడ్డి, స్వరాజ్యలక్ష్మి, శమంతకమణి, గుల్జార్, శాంతావాణి పాల్గొన్నారు.

తమిళ జాలర్ల దోపిడీ

ఇరవై ఏళ్లుగా ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల మధ్య సముద్రంపై వేట పెద్ద సమస్యగా మారింది. తరచూ ఇరురాష్ట్రాల మధ్య ఒప్పందాలు కుదుర్చినా తమిళ జాలర్లు వాటిని లెక్కచేయక హద్దులు దాటి తిరుపతి జిల్లా తీరంలో వేట సాగిస్తున్నారు. దీంతో జిల్లా మత్స్యకారులకు తీరని నష్టం వాటిల్లుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వేట చేస్తూ మత్స్య సంపదను పొరుగు రాష్ట్రం జాలర్లు కొల్లగొడుతున్నారు.



కొండూరుపాళెం వద్ద సముద్రం తీరానికి వచ్చి వేట సాగిస్తున్న తమిళ జాలర్ల స్పీడు బోటు

హద్దులు దాటి సంపదను దోచుకుపోతున్న తమిళ జాలర్లు

- పొరుగు రాష్ట్రంతో సమస్యగా మారిన వేట
- నష్టపోతున్న తిరుపతి జిల్లా మత్స్యకారులు

వాకాడు : ఆంధ్రా సరిహద్దుల్లో తమిళ జాలర్లు వేట చేయకూడదని రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందాలు జరిగినా హద్దులు దాటి మత్స్య సంపదను తమిళ జాలర్లు దోచుకుపోతున్నారు. ఈ క్రమంలోనే రెండు నెలలుగా తిరుపతి జిల్లా తీరం వెంట తమిళ జాలర్లు తమ స్పీడ్ బోట్లతో నిబంధనలకు విరుద్ధంగా సముద్రంపై జల్లెడ పట్టి సముద్రంలోని మత్స్య సంపదను దోచుకుపోతున్నారు. దీంతో జిల్లాలోని 5 తీర ప్రాంత మండలాల మత్స్యకారులు విలవిలలాడుతున్నారు.

స్పీడ్ బోట్లతో..

ఏటా జిల్లా మత్స్యకారులకు దక్కాల్సిన సుమారు 15 వేల టన్నుల మత్స్యసంపదను పొరుగు రాష్ట్రాల జాలర్లు ఎత్తుకెళ్లిపోతున్నారు. పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పెద్ద బోట్లు 250 హెచ్‌పీ నుంచి 500 హెచ్‌పీ మెకనైజ్డ్ బోట్లతో ఎంఎఫ్ఆర్ఏ యాక్ట్ నిబంధనలకు వ్యతిరేకంగా ఆంధ్రా జలాలపై తీర ప్రాంతం దగ్గరగా వేట చేయడమే కాకుండా స్థానిక మత్స్యకారులపై దాడులు చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల కరైకల్, కడలూరు, నాగపట్నం, పాండిచ్చేరి జిల్లాలకు చెందిన 5 స్పీడు బోట్లు వివరాలను ఆయా మత్స్యశాఖ ఉన్నత స్థాయి అధికారులకు మన జిల్లా అధికారులు తెలియజేసి వారిపై చర్యలు తీసుకున్నారు.



స్థానిక మత్స్యకారుల అదుపులో తమిళ జాలర్ల బోటు (ఫైల్)

రెండు నెలలుగా జీవన భృతి లేక

తిరుపతి జిల్లాలో 79 కిలో మీటర్ల సముద్ర తీరం విస్తరించి ఉంది. 5 తీర ప్రాంత మండలాల్లో 38 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. అందులో దాదాపు 9 వేల మంది మత్స్యకారులు, 1200 వరకు ఇంజిన్ బోట్లు ఉన్నాయి. రెండు నెలలుగా పొరుగు రాష్ట్రాల జాలర్ల దెబ్బకు స్థానిక మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. చేపల వేటే జీవనాధారంగా జీవించే మత్స్యకారులు రెండు నెలలుగా జీవన భృతిని కోల్పోయారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి వాగులు, వంకలు, నదులపై ప్రవహించి వరద సముద్రంలో కలిసింది. ఆ మేరకు మత్స్య సంపద పుష్కలంగా దొరుకుతున్న సమయంలో తమిళనాడు, కడూరు, నాగూరు నాగపట్నం, తూత్‌కుడి, తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు స్పీడు బోట్లుతో మత్స్య సంపదను దోచుకుపోతున్నారు.



చేపలు దొరక్క నిరాశతో వెను తిరిగి వస్తున్న స్థానిక మత్స్యకారులు

నిబంధనలకు విరుద్ధంగా వేట

సాధారణంగా సముద్రంపై వేట చేసే మత్స్యకారులు 4 అంగులాల పైన రంధ్రాలు కలిగిన వలలను మాత్రమే వేటకు ఉపయోగించాలి. అలా కాకుండా తమిళ జాలర్లు నిబంధనలకు విరుద్ధంగా ఒక ఇంచి సైజు రంధ్రాలతో తయారు చేసిన 100 మీటర్ల వలలతో వేట చేయడంతో చిన్న చిన్న నలక చేపలతో పాటు పెద్ద చేపలు సైతం వలలో చిక్కుకుని జిల్లా మత్స్య సంపద పొరుగు రాష్టాలకు తరలిపోతోంది. వాస్తవానికి స్పీడు బోట్ల జాలర్లు సముద్రంపై అలలు లేని ప్రదేశంలో అంటే 8 నాటికల్ మైళ్ల దూరం పైన వేట సాగించాలి. అయితే అధికార నిబంధనలను భేఖాతరు చేసి 3 నాటికల్ మైళ్ల దూరంలో ఎగసి పడుతున్న అలలు సైతం లెక్క చేయకుండా వేట చేసి మత్స్య సంపదను దోచుకుపోవడంతో స్థానిక మత్స్యకారులు నష్టపోతున్నారు.

చర్చలు జరిగినా ఫలితం లేదు



పొరుగు రాష్ట్రాలకు చెందిన జాలర్లు స్పీడు బోట్లుతో తమ పరిధిలో అక్రమంగా వేట చేయడమే కాకుండా తమపై దాడులు చేసి గాయపరుస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఇరు రాష్ట్రాల అధికారులు చర్చలు జరిగినా ఫలితం కనిపించలేదు. ఇకనైనా పొరుగు రాష్ట్రాల స్పీడు బోట్లు దాడుల నుంచి స్థానిక మత్స్యకారులను కాపాడాలి.

– పోలయ్య మత్స్యకారుడు, కొండూరుపాళెం

అధికారులు చొరవ చూపాలి



నిబంధనలను ఉల్లంఘించి తమిళ జాలర్లు మత్స్యసంపదను దోచుకుపోతున్నారు. దీంతో తాము రోజంతా వేట చేసినా ఒక్క చేప దొరక్క పస్తులు ఉండాల్సి వస్తోంది. అధికారులు చొరవ చూపాలి. లేకపోతే జిల్లా మత్స్యకారులకు జీవన భృతి లేకుండా పోతుంది.

– మునిస్వామి, మత్స్యకారుడు, ఓడపాళెం



- ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయం
- మార్కులు, ర్యాంకుల పేరుతో నరకం చూపిస్తున్న యాజమాన్యాలు
- తల్లిదండ్రుల ఆశలే ఆసరాగా విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- ఒత్తిళ్లతో మానసిక రోగులుగా మారుతున్న భావి భారతం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు, వైద్య నిపుణులు

ఒత్తిడితో విలవిల!



- తిరుపతి నగరంలో పేరొందిన ఓ ప్రైవేటు పాఠశాలలో వెంకటగిరికి చెందిన ఓ విద్యార్థినిని తల్లిందడ్రులు ఈ ఏడాది జూన్‌లో 3వ తరగతిలో చేర్పించారు. ఆ పాఠశాలలోనే హాస్టల్‌లో చేర్పించి ఫీజులు లక్షల్లో చెల్లించుకున్నారు. ఆగష్టు 10వ తేదీన ఆ విద్యార్థి సరిగా స్పందించలేదని, ఆహారం సైతం సరిగా తీసుకోవడం లేదని తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం సమాచారం ఇచ్చింది. దీంతో హుటాహుటిన తల్లిదండ్రులు పాఠశాల వసతి గృహానికి చేరుకొని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మానసికంగా ఒత్తిడికి గురైందని కనీసం మూడేళ్ల పాటు తగిన వైద్యం అందించాలని తెలియజేశారు.
- ఓ ప్రముఖ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి తలనొప్పితో బాధపడుతోందని తిరుపతి జిల్లా చంద్రగిరి గ్రామీణ ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు తమ వద్దకు తీసుకొచ్చినట్లు నగరంలో ఓ ప్రైవేటు వైద్యశాల డాక్టర్ తెలియజేశారు. విద్యార్థిని పరీక్షించిన వైద్యులు ఒత్తిడితో మానసికంగా ఇబ్బంది పడుతోందని వైద్యులు తేల్చేశారు. దీంతో ఏకైక కుమారుడైన తమ బిడ్డకు ఇలాంటి పరిస్థితి రావడం దారుణమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంచుకుని వైద్యం అందిస్తున్నారు.

తిరుపతి సిటీ : తిరుపతి జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. ఎంతో మంది విద్యార్థులు యాజమాన్యాల ఒత్తిడిని తట్టుకోలేక మానసిక రోగులవుతున్న విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు సంస్థలు దాచడం సంచలనం సృష్టిస్తోంది. తల్లిదండ్రులు సైతం ఇందులో బాధ్యులు కావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రధానంగా 5 ఏళ్ల వయస్సు పిల్లల నుంచి 15 ఏళ్లలోపు వారు మానసిక రోగులుగా మారుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగులుగా ఉండటం, పిల్లలు సెల్‌ఫోన్‌కు అడిక్ట్ అవడంతో ఒకటో తరగతి పిల్లలను సైతం ప్రైవేటు పాఠశాలలో చేర్పించి అక్కడే హాస్టల్స్‌లో ఉంచడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.

మాయమాటలు చెప్పి..

జిల్లాలో సుమారు 689 ప్రైవేటు కళాశాలలు ఉండగా అందులో సుమారు 356 ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. తల్లిదండ్రులకు ఆశలు రేపి మీ పిల్లలను స్టేట్ ర్యాంకర్లుగా తీర్చిదిద్దుతామని మాయమాటలు చెప్పి కోట్లలో వ్యాపారం చేసుకుంటూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఎంతో మంది ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు తల్లిదండ్రుల ఆప్యాయతకు దూరమవుతున్నారు. దీంతో శారీరక రుగ్మతలకు గురవడంతో పాటు మానసిక ఒత్తిడికి గురై మానసిక రోగులుగా మారుతూ తల్లిదండ్రులకు గుండె కోతను మిగులుస్తున్నారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



ప్రైవేటు యాజమాన్యాల ఊకదంపుడు ప్రచారాలకు ఆకర్షితులై ప్రైవేటు విద్యా సంస్థల్లో పిల్లలను చేర్పించడం దారుణం. దీంతో తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోక.. ప్రైవేటు యాజమాన్యాల టార్చర్ భరించలేక మానసిక రోగులవుతున్నారు. ఇది భావి భారతానికి ప్రమాదకరం. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ఆలోచించాలి.

– సుబ్బిరామిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు, తిరుపతి

మానసికంగా కుంగిపోతున్నారు



పసికందుల జీవితాలతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ఆడుకుంటున్నాయి. ఇది చాలా ప్రమాదకరం, పాఠశాల యాజమాన్యాలు వ్యాపారంలో భాగంగా పిల్లల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి వారిని స్కూల్‌తో పాటు వారు నిర్వహిస్తున్న వసతిగృహాల్లో చేర్పించుకుని నరకం చూపిస్తున్నారు. దీంతో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

– రవిశంకర్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ విశ్రాంత అధ్యాపకులు, తిరుపతి

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణ ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,717 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,445 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.39 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

ద్వారకాతిరుమలకు పోటెత్తిన భక్తులు



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయ ప్రాంగణం, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, కల్యాణ కట్ట తదితర విభాగాలు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

నిజం నీళ్లకేం తెలుసు?



బైరెడ్డిపల్లి మండలం తీర్థం వద్ద నదిలోని రాళ్లపై నుంచి ఊడిన సిమెంట్ పెచ్చులు

నాసిరకంగా హంద్రీ-నీవా కాలువ పనులు

- రాళ్లున్న చోట సిమెంట్ పాలీష్
- రాళ్లపై నుంచి ఊడిపోతున్న సిమెంట్
- అండర్ పైప్‌లైన్ మార్గాల్లో తప్పని వాటర్ లీకేజీ
- చెరువులకు మళ్లించే చోట దెబ్బతిన్న సిమెంట్ పనులు


పలమనేరు: కూటమి అబద్ధపు హామీలు.. గారడీ మాటలకు హంద్రీ–నీవా బలైపోతోంది. నాణ్యత లేని పనులు.. నాసిరక నిర్మాణాలతో తనలో ప్రవహించే కృష్ణమ్మను కాపాడలేక అల్లాడిపోతోంది. ఎక్కడ చూసినా లీకేజీలు.. ఏ పక్క చూసినా సీఫేజీలే కనిపిస్తుండడం సర్వసాధారణమైపోయింది. తమ సొంత కంపెనీలకు దోచిపెట్టి.. కుప్పానికి నీళ్ల తెప్పిస్తున్నామంటూ సంకలెగరేయడం విమర్శలకు తావిస్తోంది.

గత ప్రభుత్వంలో లైనింగ్ లేకనే!

కుప్పానికి కృష్ణమ్మను అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో అడుగులేసింది. చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని పశపత్తూరు, వీకోట మండలంలోని కృష్ణాపురం, రామకుప్పం మండలంలోని ఆదినేపల్లి వద్ద పంప్‌హౌస్‌లు నిర్మించింది. పశపత్తూరు వద్ద 750 కిలోవాట్స్ సామర్థ్యం గల నాలుగు మోటార్ల ద్వారా గంటకు 5,400 క్యూసెక్‌ల నీటిని పంపే 5 వేల కేవీ మోటార్లను ఏర్పాటు చేసింది. దీంతో పాటు నీరు వేగంగా వెళ్లేలా భారీ కంప్రెషర్లు సమకూర్చింది. అప్పట్లోనే పెండింగ్ కాలువ నిర్మాణాలు, స్ట్రక్చర్ నిర్మాణాలు, 8 వేల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు, 40 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, మూడు చోట్ల లిఫ్ట్ పనులను పూర్తిచేసింది. కృష్ణా జలాలు కుప్పానికి చేరేలా చర్యలు చేపట్టింది.



తాతిరెడ్డిపల్లి వద్ద బెబ్బతిన్న సిమెంట్ పనులు



ఖాజీపేట వద్ద ఇప్పటికీ సాగుతున్న పనులు

గొప్పలు.. కూటమికి తిప్పలు?

కూటమి ప్రభుత్వం గత టీడీపీ హయాంలో పనులు చేపట్టిన సీఎం రమేష్‌కు చెందిన కంపెనీకి అంచనాలను పెంచి లైనింగ్ పనులను కేటాయించింది. ఆ మేరకు కుప్పం బ్రాంచి కెనాల్ లైనింగ్ పనులు రూ.161.78 కోట్లు, పుంగనూరు ఉపకాలువ లైనింగ్ కోసం రూ.480 కోట్లను కేటాయించింది. ఈ పనులు దక్కించుకున్న సంస్థ నాసిరకంగానే పనులు చేపట్టింది. కనీసం క్వాలిటీ కంట్రోల్ శాఖ కూడా పట్టించుకోలేదు. దీంతో లైనింగ్ పనులు ఎన్నాళ్లుంటాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.



పోతనపల్లి అడవిలోని కాలువలో అండర్‌పైప్ నుంచి లీకవుతున్న నీరు

రాళ్లున్న చోట నాసిరకం పనులు

కుప్పం ఉప కాలువకు సంబంధించి పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లె నుంచి 143.9 కి.మీ పొడవుతో కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువు దాకా పీబీసీ లైనింగ్ జరిగింది. ఇందులో బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం నుంచి రామనపల్లి కాలువ మార్గంలో రాళ్లున్న చోట సిమెంట్‌ను చల్లి వదిలేశారు. ఆ రాళ్లపై నుంచి సిమెంట్ కిందికి రాలుతోంది. ఇదే మార్గంలో కొన్నిచోట్ల ఓవర్ బ్రిడ్జీలపై నిర్మించిన పైప్‌లైన్లలో నీటి లీకేజీలు కనిపిస్తున్నాయి. తాతిరెడ్డిపల్లి వద్ద ఇంకా లైనింగ్ పనులు సాగుతున్నాయి. కాలువ మార్గంలో చెరువుకు నీరు మళ్లించే చోట్ల బయట వైపు నిర్మించిన సిమెంట్ పనులు దెబ్బతిన్నాయి. వీ.కోట మండలంలోని పోతనపల్లి వద్ద అటవీ మార్గంలో భూమిలోపల అమర్చిన పైప్‌లైన్లపై గాలి వెళ్లేందుకు వాల్వులు ఏర్పాటు చేశారు. ఇక్కడి అటవీ ప్రాంతంలో నీరు లీకవుతోంది. కాలువ లైనింగ్ పనులు అటవీ మార్గంలో ఎలాసాగుతాయో నేరుగా చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది.

నన్ను క్షమించండి..

- వాట్సాప్ మెసేజ్ పెట్టి జేఎన్‌టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకుడి ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణం
- భార్య, ఆమె బంధువులైన కూటమి నేతల ఒత్తిడితో పోలీసుల కౌన్సెలింగ్
- మనస్తాపం చెంది, రైలు కింద పడి ఆత్మహత్య

తొండంగి: మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అతడు కష్టపడి ఉన్నత చదువులు చదివాడు. అధ్యాపకుడిగా జీవితంలో స్థిరపడ్డాడు. అయితే కుటుంబ కలహాలు, కూటమి నేతల ఒత్తిడి మేరకు పోలీసుల చేసిన కౌన్సెలింగ్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా తొండంగి మండలం రావికంపాడుకు చెందిన మట్ల గంగారావు, గంగమ్మ దంపతుల కుమారుడు మట్ల శ్రీనివాస్ (35) జేఎన్‌టీయూకేలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. అతడికి సుమారు 12 ఏళ్ల కిత్రం వివాహం కాగా, భార్య దివ్యతో కలిసి కాకినాడలో నివసిస్తున్నాడు. వీరికి గంగ సాన్విత, సాయి గంగాధర అవినాష్ అనే పిల్లలు ఉన్నారు. కాగా.. కొంత కాలంగా శ్రీనివాస్‌కు అతడి భార్యతో మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె కొద్ది రోజుల క్రితం తన బంధువులైన కూటమి నేతల ఒత్తిడితో నాలుగు రోజుల క్రితం అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు శ్రీనివాస్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మనస్తాపంతో..

ఈ ఘటనలో మనస్తాపం చెందిన శ్రీనివాస్ శుక్రవారం తన స్వగ్రామమైన రావికంపాడుకు వచ్చాడు. తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం బయటకు వచ్చి స్థానిక రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందుగా తన ఆత్మహత్యకు వీరే కారణమంటూ కొందరి పేర్లను ప్రస్తావించాడు. అలాగే నన్ను క్షమించండి అంటూ పిల్లల పేర్లు, అమ్మ నాన్న అని టైప్ చేసి వాట్సాప్ స్టేటస్ పెట్టాడు. కాగా.. రైల్వేట్రాక్‌పై శ్రీనివాస్ మృతదేహాన్ని శనివారం గుర్తించామని, పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తుని రైల్వే ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి తండ్రి గంగారావు దివ్యాంగుడు, తల్లి కీళ్ల వ్యాధితో నడవలేని స్థితిలో ఉంది. ఈ పరిస్థితిలో కుమారుడిని కోల్పోయిన ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



● చిరంజీవి ● నాగార్జున ● ప్రభాస్ ● మహేశ్‌బాబు ● అఖిల్ ● వరుణ్‌తేజ్ ● అల్లు అర్జున్ ● ఎన్టీఆర్ ● శర్వానంద్



● నిఖిల్

గతంలో హీరోలు వరుసగా సినిమాలు చేసేవారు. ఏడాదికి రెండు మూడు లేదంటే కనీసం ఒక్క సినిమా అయినా విడుదల చేసేవారు. అయితే ప్రస్తుతం దాదాపు చాలా మంది హీరోల నుంచి వరుస పెట్టి సినిమాలు రావడం లేదు. ఒక్కొక్కరు రెండు మూడేళ్లకు ఓ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఏడాదికి ఓ సినిమాని ఆడియన్స్ ముందుకి తీసుకొచ్చే వాళ్లను వేళ్లల్లో లెక్క పెట్టొచ్చు. పైగా ప్రస్తుతం తెలుగు సినిమా స్థాయి ప్రపంచవ్యాప్తంగా పెరిగింది. అందుకే ఇప్పుడు అందరూ భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా సినిమాలవైపు మొగ్గు చూపుతున్నారు. లేట్ అయినా భారీ హిట్ ఇవ్వాలనే ఆలోచనలతో ఇటు హీరోలు, అటు దర్శక-నిర్మాతలు కథ, షూటింగ్, క్వాలిటీ, విజువల్ ఎఫెక్ట్స్ కోసం బాగా సమయం తీసుకుని, ఆచి తూచి ఎంతో జాగ్రత్తగా సినిమాలు చేస్తున్నారు. ఈ కారణంగా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్‌కే చాలా ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. ఈ కారణంగా చిరంజీవి, నాగార్జున, ప్రభాస్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్, ఎన్టీఆర్, అఖిల్, నిఖిల్, వరుణ్ తేజ్, శర్వానంద్... ఇలా పలువురు హీరోలు 2025ని మిస్ అవుతున్నారు. ఈ ఏడాది వారు సోలో హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఏమాత్రం లేవు. అలా 2025ని మిస్ అవుతున్న కథానాయకులెవరో చూద్దాం.

2025 మిస్

రెండేళ్లుగా వెయిటింగ్

తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని స్టార్ హీరోల్లో చిరంజీవి ఒకరు. ఆయన సినిమా ఎప్పుడొస్తుందా? అని మెగా అభిమానులు రెండేళ్లకు పైగా వెయిటింగ్‌లో ఉన్నారు. చిరంజీవి హీరోగా వచ్చిన చివరి చిత్రం 'భోళా శంకర్'. మెహర్ రమేశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2023 ఆగస్టు 11న విడుదలైంది. ఈ చిత్రం తర్వాత చిరంజీవి నటించిన సినిమా 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ మూవీలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో నిర్మించారు. ఈ సినిమాని 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. అందుకు తగ్గట్టే షూటింగ్ కూడా శరవేగంగా జరిగింది. అయితే చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ హీరోగా నటించిన 'గేమ్ ఛేంజర్' చిత్రం కోసం 'విశ్వంభర' విడుదలను వాయిదా వేశారు మేకర్స్. ఆ తర్వాత ఈ సినిమా రిలీజ్‌పై రకరకాల వార్తలొచ్చాయి. కానీ, ఈ ఏడాది కూడా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావడం లేదు. వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ కారణంగా ఈ సినిమాని 2026 వేసవిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఇదిలా ఉంటే చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్‌లైన్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో వరుసగా 2024, 2025ని మిస్ అయ్యారు చిరంజీవి. అయితే వచ్చే ఏడాది రెండు సినిమాల్లో కనిపించి, అలరించనున్నారు.

సోలో హీరోగా గ్యాప్

టాలీవుడ్ టాప్ ఫోర్ సీనియర్ హీరోల్లో నాగార్జున కూడా ఒకరు. ఆయన సోలో హీరోగా వచ్చిన చివరి చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2024 సంక్రాంతి కానుకగా జనవరి 14న రిలీజైంది. అయితే ఆ తర్వాత ఆయన సోలో హీరోగా ఏ చిత్రంలోనూ నటించలేదు. కానీ 'కుబేర, కూలీ' సినిమాల ద్వారా తమిళ-తెలుగు ప్రేక్షకులను పలకరించారాయన. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర' సినిమాలో ధనుష్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నారు నాగార్జున. ఈ సినిమా జూన్ 20న విడుదలైంది. అలాగే రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'కూలీ' సినిమాలో విలన్ పాత్రలో మెప్పించారు నాగార్జున. ప్రతి నాయకుడిగా ఆయనకు ఇదే మొదటి చిత్రం. ఇక నాగార్జున సోలో హీరోగా రూపొందనున్న వందో చిత్రానికి తమిళ డైరెక్టర్ కార్తీక్ దర్శకత్వం వహించనున్నారు. తన కెరీర్‌లోని ఈ మైలురాయి చిత్రంలో హీరోగా నటించడంతో పాటు అన్నపూర్ణ స్టూడియోస్‌పై స్వయంగా నిర్మించనున్నారు నాగార్జున. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే లాక్ అయింది. ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ప్రకటన ఉంటుందని అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూశారు. కానీ, ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో వారు నిరాశ చెందారు. ఈ సినిమా ఈ ఏడాది సెట్స్‌పైకి వెళ్లినా విడుదలయ్యేది మాత్రం 2026లోనే. ఆ రకంగా సోలో హీరోగా 2025ని నాగార్జున కూడా మిస్ అయినట్టే.

అభిమానులకు నిరాశే

వరుస పాన్ ఇండియా చిత్రాలతో ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్నారు హీరో ప్రభాస్. ప్రస్తుతం ఆయన చేతిలో నాలుగైదు సినిమాలున్నాయి. ప్రభాస్ సోలో హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం 2024 జూన్ 27న విడుదలైంది. ఆ తర్వాత ఆయన కథానాయకుడిగా రూపొందుతోన్న సినిమా 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. దీంతో ఈ సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ నెలకొంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడ్డ ఈ సినిమాని డిసెంబరు 5న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే టాకీ పార్ట్ పూర్తయినా కొన్ని పాటల చిత్రీకరణ బ్యాలెన్స్ ఉండటం, వీఎఫ్ఎక్స్ వల్ల డిసెంబరు 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయలేకపోతున్నట్లు నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఇటీవల ప్రకటించారు. దీంతో ప్రభాస్ అభిమానులు నిరాశపడ్డారు. ''ది రాజా సాబ్' సంక్రాంతికి వస్తే బాగుంటుందని ప్రభాస్ అభిమానులు కోరుకుంటున్నారు. తెలుగు బిజినెస్ సర్కిల్ వారు కూడా ఈ సినిమాని జనవరి 9న విడుదల చేయాలని చెబుతున్నారు. కానీ, హిందీ ఆడియన్స్ మాత్రం డిసెంబర్ 5న రిలీజ్ చేయాలని కోరుతున్నారు'' అంటూ టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. అయితే తెలుగువారికి పెద్ద పండగైన సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ రకంగా సోలో హీరోగా 2025ని ప్రభాస్ మిస్ అయినట్టే. అయితే విష్ణు మంచు హీరోగా నటించిన 'కన్నప్ప'లో రుద్రగా ప్రభాస్ అతిథి పాత్రలో కనిపించి, అలరించారు. ఈ చిత్రం జూన్ 27న విడుదలైంది.

నిరీక్షణ తప్పదు

మహేశ్‌బాబు హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్). 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన 'గుంటూరు కారం' చిత్రం 2024 సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైన సంగతి తెలిసిందే. ఆ సినిమా తర్వాత రాజమౌళి సినిమా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కమిట్ అయ్యారు మహేశ్. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఇప్పటివరకూ చేయని వైవిధ్యమైన పాత్రలో కనిపించనున్నారు మహేశ్. ఇందుకోసం పొడవాటి జుట్టు, గడ్డంతో మేకోవర్ అయ్యారాయన. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే ఇండియానా జోన్స్ స్టైల్ కథతో ఈ సినిమా రూపొందుతోందనే వార్తలు గత కొన్నాళ్లుగా వినిపిస్తున్నాయి. రాజమౌళి సినిమా అంటే కనీసం రెండేళ్లకు పైగా చిత్రీకరణకు సమయం పడుతుంది. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్‌కి కూడా ఎక్కువ టైమ్ తీసుకుంటారాయన. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమా 2026లో విడుదలయ్యే అవకాశాలు లేవని ఫిల్మ్‌నగర్ టాక్. 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. ఈ రకంగా చూస్తే 2025 కాదు... 2026ని కూడా మహేశ్ మిస్ అయ్యే అవకాశాలున్నాయి. అప్పటి వరకూ ఆయన అభిమానులకు నిరీక్షణ తప్పదు.

రెండేళ్లు గ్యాప్?

ఎన్టీఆర్ సోలో హీరోగా నటించిన చిత్రం 'దేవర: పార్ట్ 1'. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2024 సెప్టెంబరు 27న విడుదలైంది. ఆ సినిమా తర్వాత ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటోంది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉందని ఫిల్మ్‌నగర్ టాక్. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ తొలుత ప్రకటించింది. అయితే రిలీజ్ డేట్‌లో మార్పు చేసుకుంది. జనవరి 9న కాకుండా జూన్ 25న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొన్న విషయం తెలిసిందే. అంటే... సోలో హీరోగా దాదాపు రెండేళ్లు గ్యాప్ వచ్చినట్లు అవుతుంది ఎన్టీఆర్‌కి. ఇదిలా ఉంటే... హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటించిన హిందీ చిత్రం 'వార్ 2'. ఈ చిత్రం ద్వారా ఎన్టీఆర్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. ఈ సినిమా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 14న విడుదల అయింది. అయితే ఎన్టీఆర్ సోలో హీరోగా నటించిన ఏ సినిమా కూడా 2025లో రిలీజ్ కాలేదు.. అలా ఈ ఏడాదిని ఆయన మిస్ అయినట్లే అని చెప్పొచ్చు.

గ్యాప్ ఇవ్వలేదు... వచ్చింది

'గ్యాప్ ఇవ్వలేదు.. వచ్చింది..' అంటూ 'అల వైకుంఠపురములో...' సినిమాలో అల్లు అర్జున్ ఓ డైలాగ్ చెబుతారు. అలా 'పుష్ప 1, 2' సినిమాల తర్వాత ఆయనకు 2025లో గ్యాప్ వచ్చినట్లే. సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప: ది రైజ్', 'పుష్ప: ది రూల్' సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులను అలరించారు హీరో అల్లు అర్జున్. 'పుష్ప: ది రూల్' 2024 డిసెంబరు 5న విడుదలై, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1800 కోట్ల రూపాయల వసూళ్లు సాధించింది. ఆ సినిమా తర్వాత తమిళ డైరెక్టర్ అట్లీతో సినిమా చేస్తున్నారు అల్లు అర్జున్. 'ఏఏ22 ఏ6' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ పాన్ ఇండియా చిత్రంలో బాలీవుడ్ నటి దీపికా పదుకోన్ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారు. కళానిధి మారన్ సమర్పణలో సన్‌పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోంది. 'అవతార్', 'డ్యూన్', 'బార్బీ' వంటి హాలీవుడ్ చిత్రాలకు పని చేసిన కన్నెక్ట్ మాబ్ సీన్ అనే ప్రముఖ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తోంది. 'పుష్ప: ది రూల్' తర్వాత వస్తున్న ఈ సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. 'ఏఏ22 ఏ6' చిత్రం 2026 చివర లేదా 2027 సంక్రాంతికి విడుదల కానుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అలా 2025ని అల్లు అర్జున్ కూడా మిస్ అయ్యారు.

ఇంకా...

● అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై నాగార్జున, నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అఖిల్ నటించిన చివరి చిత్రం 'ఏజెంట్'. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2023 ఏప్రిల్ 28న విడుదలైంది. ఆ తర్వాత ఆయన నటిస్తున్న చిత్రం 'లెనిన్'. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీ 2026లో ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన వరుసగా 2024, 2025ని అఖిల్ మిస్సయ్యారు.

● వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'వీటీ 15' (వర్కింగ్ టైటిల్). మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. గత ఏడాది నవంబరు 14న 'మట్కా' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చారు వరుణ్. తాజాగా ఆయన నటిస్తున్న 'వీటీ 15' సినిమా ఈ ఏడాది నవంబరులో విడుదల కానుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ చిత్రం కూడా 2026లోనే రిలీజ్ కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. దీంతో వరుణ్ తేజ్ కూడా 2025ని మిస్ అయినట్లే.

● నిఖిల్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశం లేదు. నిఖిల్ నటించిన 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' చిత్రం గత ఏడాది నవంబరు 8న విడుదలైంది. సో... 'స్వయంభు' 2026లో రిలీజ్ కానుండటంతో 2025ని నిఖిల్ మిస్సయ్యారని చెప్పొచ్చు.

● శర్వానంద్ హీరోగా నటించిన 'మనమే' చిత్రం 2024 జూన్ 7న విడుదలైంది. ఈ సినిమా తర్వాత ఆయన నటిస్తున్న చిత్రాల్లో 'నారి నారి నడుమ మురారి' ఒకటి. సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది విడుదల కావాల్సి ఉన్నా రిలీజ్ డేట్‌పై స్పష్టత లేదు. అదే విధంగా శర్వానంద్, మాళవికా నాయర్ జోడీగా నటిస్తున్న చిత్రం 'శర్వా 36' (వర్కింగ్ టైటిల్). అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ రెండు చిత్రాలు కూడా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశాలు లేవు. ఈ కారణంగా శర్వానంద్ కూడా 2025ని మిస్ అయినట్లే.

పైన చెప్పిన హీరోలే కాదు. ఇంకా పలువురు కథానాయకులు 2025ని మిస్ అయ్యారు. 2025ని మిస్ అయినప్పటికీ 2026లో మాత్రం తమ జోరు చూపిస్తామంటున్నారు.

- దేరంగుల జగన్ మోహన్

ఆస్కార్ వస్తది చూడు!

'90స్ మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటించిన లవ్‌స్టోరీ 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ పతాకంపై సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 5న థియేటర్స్‌లో విడుదల కానుంది. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాను థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నారు. శనివారం ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రంలో అఖిల్ పాత్రలో మౌళి, కాత్యాయనిగా శివాని నటించారు. ''మన హీరో సైనిక్‌పురిలో చదువు రానివాడు', 'మన హీరోయిన్ వాయుపురిలో చదువు రానిది', 'ఈ చదువు రాని ఇద్దరు చదువు ఎగ్గొట్టి మరీ లవ్ చేసుకుంటారు', 'ఈ చదువు రాని పిల్లల హృదయాల మధ్య జరిగే సంఘర్షణే ఈ కథ', 'హిట్టవుతదరా... ఈ సినిమా', 'నాకు డౌటే...', 'పక్కా హిట్టే... ఆస్కార్ వస్తది చూడు..' వంటి డైలాగ్స్ ఈ సినిమా ట్రైలర్‌లో ఉన్నాయి.



● శివానీ నాగరం, మౌళి తనుజ్

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో సెబీ 'నివేశక్ శివిర్' కార్యక్రమం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్లెయిమ్ చేయని డివిడెండ్లు, షేర్లను పొందడంలో ఇన్వెస్టర్లకు అవసరమయ్యే సహాయాన్ని అందించే దిశగా హైదరాబాద్‌లో 'నివేశక్ శివిర్' కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చొరవతో, కార్పొరేట్ వ్యవహారాల శాఖలో భాగమైన ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐఈపీఎఫ్ఏ) దీన్ని నిర్వహించింది. సీడీఎస్ఎల్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్, బీఎస్ఈ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్, ఎన్ఎస్ఈ, కేఫిన్ టెక్నాలజీస్ మొదలైనవి ఇందులో పాలుపంచుకున్నాయి. ఇన్వెస్టర్లకు కావాల్సిన సహాయాన్ని అందించేందుకు ప్రత్యేకంగా 23 సర్వీస్ డెస్కులను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 360 మంది పైగా ఇన్వెస్టర్లు, క్లెయిమెంట్లు ఇందులో పాల్గొన్నారు. ఐఈపీఎఫ్ఏ సీఈవో అనితా షా ఆకెళ్ల, సెబీ ఈడీలు జీవన్ సోన్‌పరోటే, సునీల్ జయవంత్ కదమ్ తదితరులు దీనికి హాజరయ్యారు.

ఏఎఫ్‌డీతో ఎస్‌బీఐ ఒప్పందం

న్యూఢిల్లీ: పర్యావరణహిత ప్రాజెక్టులకు రుణాలందించే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), గుజరాత్ గిఫ్ట్ సిటీలోని 'ఏజెన్సీ ఫ్రాంకైస్ డి డెవలప్‌మెంట్'(ఏఎఫ్‌డీ)తో 100 మిలియన్ యూరోల లైన్ ఆఫ్ క్రెడిట్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కాలుష్యకారక ఉద్గారాలను, గ్లోబల్ వార్మింగ్‌ను, వాతావరణంపై ప్రతికూల ప్రభావాలను తగ్గించే దిశగా ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొంది. 2030 నాటికి మొత్తం రుణాల పోర్ట్‌ఫోలియోలో గ్రీన్ ఫైనాన్సింగ్ విభాగం వాటాను 7.5–10 శాతానికి పెంచుకోవాలన్న లక్ష్యానికి ఇది దోహదపడుతుందని ఎస్‌బీఐ తెలిపింది.

దేశీయంగా తొలి టెంపర్డ్ గ్లాస్ ఫ్యాక్టరీ

నోయిడాలో ప్రారంభించిన కేంద్ర మంత్రి వైష్ణవ్



నోయిడా: దేశీయంగా తొలి టెంపర్డ్ గ్లాస్ ఫ్యాక్టరీని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం నోయిడాలో ప్రారంభించారు. అమెరికాకు చెందిన మెటీరియల్ టెక్నాలజీ సంస్థ కార్నింగ్‌తో కలిసి ఆప్టిమస్ ఇన్‌ఫ్రాకామ్ సంస్థ దీన్ని ఏర్పాటు చేసింది. ప్రాథమికంగా రూ. 70 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన ఈ ప్లాంటు వార్షిక స్థాపిత సామర్థ్యం 2.5 కోట్ల యూనిట్లుగా ఉంటుంది. దీనితో 600 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు కీలకంగా ఉంటాయి కాబట్టి రీసెర్చ్ బృందం పరిమాణాన్ని 40 నుంచి 400 మంది సిబ్బందికి పెంచుకునే అవకాశాన్ని పరిశీలించాలని ఆప్టిమస్‌కి వైష్ణవ్ సూచించారు. వచ్చే ఏడాది వ్యవధిలో రెండో దశ కింద అదనంగా రూ. 800 కోట్ల పెట్టుబడులతో వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 20 కోట్లకు పెంచుకోనున్నట్లు ఆప్టిమస్ చైర్మన్ అశోక్ కుమార్ గుప్తా తెలిపారు. దీనితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 16,000 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రైనోటెక్ బ్రాండ్ పేరిట మేడిన్ ఇండియా టెంపర్డ్ గ్లాస్‌లను సెప్టెంబర్ నుంచి విక్రయించనున్నట్లు గుప్తా తెలిపారు. అపరిమిత రిప్లేస్‌మెంట్‌తో ఏడాది వారంటీ అందించనున్నట్లు వివరించారు.

ఐవోసీ రూ.1.66 లక్షల కోట్ల పెట్టుబడులు

చైర్మన్ అర్విందర్ సింగ్ సాహ్నీ వెల్లడి

న్యూఢిల్లీ: వ్యాపార ప్రణాళికల్లో భాగంగా వచ్చే అయిదేళ్లలో రూ.1.66 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) చైర్మన్ అర్విందర్ సింగ్ సాహ్నీ తెలిపారు. చమురు శుద్ధి, ఇంధన మార్కెటింగ్ విస్తరణతో పాటు పెట్రో కెమికల్స్, రెన్యూవల్ ఎనర్జీ వ్యాపారాలు చేపట్టేందుకు ఈ పెట్టుబడులు వినియోగిస్తామన్నారు. ప్రస్తుతం కంపెనీ రిఫైనింగ్ వార్షిక సామర్థ్యం 80.75 మిలియన్ టన్నులుగా ఉందని షేర్‌హోల్డర్ల సమావేశంలో ఆయన చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-8-2025

విశాఖ	560-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

ఎగుమతులకు ప్రత్యేక వ్యూహాల బూస్ట్..

స్వల్ప-దీర్ఘకాలిక ప్రణాళికలపై కేంద్రం కసరత్తు
- సెజ్‌ల నిబంధనలను సరళతరం చేసే యోచన
- ఎగుమతిదార్లకు తక్షణం ఊరటనిచ్చేలా చర్యలు



న్యూఢిల్లీ: భారత ఎగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించిన నేపథ్యంలో ఎగుమతిదార్లకు తోడ్పాటు అందించడంపై కేంద్రం మరింతగా దృష్టి పెడుతోంది. ఇందుకోసం బహుళ వ్యూహాలపై వాణిజ్య శాఖ కసరత్తు చేస్తోంది. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తోంది. అలాగే ప్రత్యేక ఆర్థిక మండళ్లకు (సెజ్) సంబంధించిన పలు నిబంధనలను కూడా సరళతరం చేయడాన్ని కూడా పరిశీలిస్తోందని సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. సరళతరమైన రిటర్నుల నిబంధనలతో ఈ-కామర్స్ ఎగుమతి హబ్‌లను ప్రోత్సహించే అంశాన్ని పరిశీలిస్తోందని వివరించారు. ఎగుమతిదార్లకు ద్రవ్యలభ్యతపరంగా తక్షణం ఊరట కల్పించడం, బలహీనంగా ఉన్న రంగాల్లో ఆర్డర్లు .. ఉద్యోగాలు తగ్గిపోకుండా చూడటం, సంస్కరణలతో సరఫరా వ్యవస్థను పటిష్టం చేయడం, కొత్త మార్కెట్లలో అవకాశాలను అందిపుచ్చుకుంటూనే, ప్రస్తుత వాణిజ్య ఒప్పందాల నుంచి గరిష్టంగా ప్రయోజనాలను రాబట్టేందుకు ప్రయతించడంలాంటి విషయాలపై కార్యాచరణ ప్రణాళికలో ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు అధికారి చెప్పారు. ఇందుకోసం వాణిజ్య శాఖ మరో ద్విముఖ వ్యూహం కూడా రూపొందించింది. యూరోపియన్ యూనియన్, బ్రిటన్‌లాంటి ప్రస్తుత మార్కెట్లకు ఎగుమతులను పెంచడంతో పాటు లాటిన్ అమెరికా, ఆఫ్రికా, తూర్పు ఆసియా, తూర్పు యూరప్‌లోని కొత్త మార్కెట్లలోకి ప్రవేశించడం ఇందులో ఉన్నాయి.

పరిశీలనలో ఉన్న మరిన్ని ప్రతిపాదనలు..

- బ్రాండింగ్‌పరంగా తోడ్పాటు అందించడం. నిబంధనలు, లాజిస్టిక్స్ వ్యయాల భారాన్ని తగ్గించడం. ఎగుమతులతో పాటు దేశీయంగా వినియోగానికి కూడా ఊతమివ్వడం.
- స్వల్పకాలిక ప్రణాళికల్లో భాగంగా .. లిక్విడిటీ సమస్యలను తగ్గించడానికి, దివాలా పరిస్థితులను నివారించడానికి, సెజ్‌లలో యూనిట్లకు నిబంధనలను మరింత సరళతరం చేయడానికి, నిర్దిష్ట దిగుమతులకు ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడానికి తగు చర్యలు తీసుకోవడం.
- మధ్యకాలికంగా పరిశీలిస్తున్న అంశాల్లో వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో (ఎఫ్‌టీఏ) గరిష్టంగా ప్రయోజనాలను రాబట్టడం, దేశ-విదేశాల్లో కొనుగోలుదారులు-విక్రేతలను మరింతగా అనుసంధానించేందుకు ఎగ్జిబిషన్లలాంటివి నిర్వహించడం, పోటీతత్వాన్ని పెంచేలా జీఎస్‌టీ సంస్కరణలను పటిష్టం చేయడం ఉన్నాయి. చాలా మటుకు చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) నిర్దిష్ట దేశాలతో టారిఫ్‌లపరమైన ప్రయోజనాల గురించి అంతగా తెలియకపోవడంతో ఎఫ్‌టీఏలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనేది మరో ప్రతిపాదన. ఇటీవలి కాలంలో ఆస్ట్రేలియా, యూఏఈ, జపాన్, కొరియాతో పాటు డజను పైగా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో పొందడంపై వాటి ప్రయోజనాలను పొందడంపై భారత్ దృష్టి పెట్టనుంది. కొనుగోలుదారులను నేరుగా కలిసేందుకు దుస్తుల రంగానికి సంబంధించి ఆస్ట్రేలియాకు, రత్నాల విషయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి, తోలు ఉత్పత్తుల అంశంపై బ్రిటన్‌కు ఎగుమతిదార్ల ప్రతినిధి బృందాలను పంపించే అవకాశాలు పరిశీలించనుంది.
- ఇక దీర్ఘకాలికంగా చూస్తే.. మన ఎగుమతులకు ఆటంకాలు ఉండని మార్కెట్లపై దృష్టి పెట్టడం, తదనుగుణంగా ఎగుమతుల ప్రోత్సాహక మిషన్‌ను (ఈపీఎం) బలపేతం చేసుకోవడం, సెజ్ నిబంధనలను సంస్కరించడం, సరఫరా వ్యవస్థను పటిష్టం చేసుకోవడంలాంటి అంశాలు ఉన్నాయి.
- టారిఫ్‌ల వల్ల పలు ఎగుమతిదార్లకు రావాల్సిన బాకీలు ఆలస్యం కావడం, ఆర్డర్లు రద్దు కావడం లాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీని వల్ల ఎగుమతిదార్లకు నిర్వహణ మూలధనం కొరతలాంటి సమస్యలు తలెత్తకుండా చూసేందుకు, ఉద్యోగాలను కాపాడేందుకు పలు చర్యలపై ప్రభుత్వం ఫోకస్ చేస్తోంది. ప్రతిపాదిత జీఎస్‌టీ క్రమబద్ధీకరణతో దేశీయంగా వినియోగానికి ఊతం లభిస్తుందని, డిమాండ్‌కి తగ్గట్లుగా ఇక్కడి మార్కెట్లో మరింతగా విక్రయించుకోవడానికి ఎగుమతిదార్లకు అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు.

గ్లోబల్ ఎగ్జిబిషన్లకు నిధులు కేటాయించాలి: జీటీఆర్ఐ

ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన కార్యక్రమాలకు నిధులు తగ్గిపోవడంపై మేధావుల సంఘం గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) ఆందోళన వ్యక్తం చేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో మార్కెట్ యాక్సెస్ ఇనీషియేటివ్ (ఎంఏఐ) కింద గ్లోబల్ ఎగ్జిబిషన్లలో ఎగుమతిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు వీలుగా రూ. 2,500 కోట్లు కేటాయించడాన్ని పరిశీలించాలని సూచించింది. ఎంఏఐకి ఈసారి అస్సలు నిధులే విడుదల చేయకపోవడంతో, సరైన అవకాశాలు లేకపోవడం వల్ల ఏప్రిల్, ఆగస్టుల్లో విదేశీ ఎగ్జిబిషన్లలో ఎగుమతిదార్లు పాల్గొనలేకపోయారని పేర్కొంది. '440 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేసే ఎకానమీ గత అనేక సంవత్సరాలుగా రూ. 250 కోట్ల స్కీముతో నెట్టుకొస్తోంది. దీన్ని ఏటా రూ. 2,500 కోట్లకు పెంచాలి. కనీసం ఏడాది ముందుగా ఆ నిధులను విడుదల చేస్తే, అత్యంత ప్రయోజనకరంగా ఉండే గ్లోబల్ ఎగ్జిబిషన్లలో మన సంస్థలు పాల్గొనేందుకు వీలవుతుంది' అని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. వడ్డీ రాయితీ పథకాన్ని (ఐఈఎస్) పునరుద్ధరించాలని, ఈ-కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్‌లను తక్షణం పూర్తిస్థాయిలో విస్తరించాలని సూచించారు. 2025 ఏప్రిల్‌లో ఐఈఎస్‌ను నిలిపివేయడం వల్ల అధిక వడ్డీల భారంతో ఎంఎస్‌ఎంఈలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల కార్మిక శక్తి ఎక్కువగా ఉండే టెక్స్‌టైల్స్, తోలు, హస్తకళలు, ఇంజినీరింగ్ ఉత్పత్తుల్లాంటి రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని శ్రీవాస్తవ చెప్పారు.

ప్రభుత్వం ఓవర్‌టైమ్ పనిచేస్తోంది: సీఈఏ

ఎగుమతి రంగాలను టారిఫ్‌ల ప్రభావాల నుంచి కాపాడేందుకు తగిన వ్యూహాలను రూపొందించడానికి ఆర్థిక శాఖ, ఇతరత్రా శాఖలు మరింతగా పని చేస్తున్నాయని ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) అనంత నాగేశ్వరన్ తెలిపారు. టారిఫ్‌లు అమల్లోకి వచ్చాక గత మూడు, నాలుగు రోజుల నుంచి పరిశ్రమ ప్రతినిధులతో సమాలోచనలు జరుగుతున్నాయని పరిశ్రమల సమాఖ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా పేర్కొన్నారు. సంక్షోభాలు చిన్నవైనా, పెద్దవైనా, సాధారణంగా వాయిదా వేసుకునే ప్రణాళికలను సత్వరం అమలు చేసేలా దృష్టి పెట్టేందుకు సమాజంలోని అన్ని వర్గాలను (ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, కుటుంబాలు) ప్రేరేపిస్తాయని పేర్కొన్నారు. ప్రభావిత ఎగుమతి రంగాలు, యూనిట్లకు ఆర్థికంగా, సమయంపరంగా కాస్త వెసులుబాటు లభించేలా చూడాలనేది తక్షణ లక్ష్యంగా ఉందని నాగేశ్వరన్ చెప్పారు.

అందుబాటు ధరల ఇళ్ల కొరత

94 లక్షల యూనిట్ల లోటు
- విక్రయాలతో పోలిస్తే తగ్గిన ఆవిష్కరణలు
- నరెడ్కో-నైట్‌ఫ్రాంక్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా టాప్-8 నగరాల్లో అందుబాటు ధరల విభాగంలో (రూ.50 లక్షల్లోపు) 94 లక్షల యూనిట్ల ఇళ్ల కొరత నెలకొంది. కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణ మొదటి ఆరు నెలల్లో (జనవరి – జూన్) తగ్గుముఖం పట్టిందని.. ఈ కాలంలో అందుబాటు ధరల ఇళ్ల యూనిట్ల విక్రయాలతో పోల్చితే కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణ నిష్పత్తి 0.36 శాతంగా ఉన్నట్టు నరెడ్కో-నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. 2019 మొదటి ఆరు నెలల్లో ఇది 1.05గా ఉంటే, 2020 మొదటి ఆరు నెలల్లో 1.30గా ఉన్నట్టు తెలిపింది. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా ఈ నివేదికను నరెడ్కో, నైట్ ఫ్రాంక్ సంయుక్తంగా విడుదల చేశాయి. అందుబాటు ధరల ఇళ్ల విభాగంలో సరఫరాపరంగా సవాళ్లు నెలకొన్నట్టు ఈ నివేదిక తెలిపింది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), పుణె, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్ గణాంకాలు ఇందులో ఉన్నాయి.

ప్రభుత్వ మద్దతు అవసరం..

అందుబాటు ధరల ఇళ్లు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ నివేదిక తెలియజేస్తుందని నరెడ్కో ప్రెసిడెంట్ జి.హరిబాబు పేర్కొన్నారు. ఈ విభాగంలో 94 లక్షల యూనిట్ల కొరత ఉందంటూ.. 2030 నాటికి 3 కోట్ల యూనిట్లకు పెరుగుతుందన్నారు. ''ఈ విభాగంలో కొత్త సరఫరా గణనీయంగా తగ్గింది. అదే సమయంలో డిమాండ్ పెరుగుతుండడం ఆందోళనకరం. ప్రైవేటు రంగం పెట్టుబడులు పరిమితంగానే ఉండడం ఈ అంతరాన్ని మరింత పెంచుతోంది. కనుక సరఫరాను పెంచేందుకు సంస్కరణలు అవసరం. ఇళ్ల నిర్మాణానికి వీలుగా ప్రభుత్వ భూములను అందుబాటులోకి తీసుకురావాలి. ఎఫ్ఎస్ఐ నిబంధనలను క్రమబద్ధీకరించాలి. నిర్మాణ కోసం రుణాలను రాయితీపై అందించాలి''అని హరిబాబు కోరారు. డిమాండ్ పెంచేందుకు విధానపరమైన మద్దతు ప్రశంసనీయమేనని, అదే సమయంలో సరఫరాపరంగా ఉన్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని నైట్‌ఫ్రాంక్ ఇండియా చైర్మన్, ఎండీ శిశిర్ బైజాల్ కోరారు. అందుబాటు ధరల ఇళ్ల విభాగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు.

ఈ ఏడాది పబ్లిక్‌కు కనీస వాటా

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎండీ, సీఈవో సక్సేనా వెల్లడి



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా నిబంధనను అమలు చేయగలమని పీఎస్‌యూ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎండీ, సీఈవో నిధు సక్సేనా పేర్కొన్నారు. ఈ ఏడాది మరోసారి నిధుల సమీకరణ చేపట్టడం ద్వారా నిబంధన అమలుకు తెరతీయనున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వ వాటా తగ్గడంతోపాటు.. బ్యాంక్ కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) మెరుగుపడగలదని ఫిక్కీ, ఐబీఏ నిర్వహించిన 2025 ఎఫ్ఐబీఏసీ సందర్భంగా తెలియజేశారు. 2026 ఆగస్ట్1కల్లా పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా కల్పించమంటూ 5 ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆర్థిక శాఖ ఆదేశించిన సంగతి తెలిసిందే. సెబీ నిబంధనలకు అనుగుణంగా జారీ చేసిన ఈ ఆదేశాల ప్రకారం పీఎస్‌యూ బ్యాంకులు వచ్చే ఆగస్ట్‌లోగా ప్రభుత్వ వాటాను తగ్గించుకోవలసి ఉంటుంది. తద్వారా పబ్లిక్‌కు కనీస వాటాను సైతం సాధించవలసి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 79.6 శాతం వాటా కలిగి ఉంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ. 2,000–2,500 కోట్ల సమీకరణ ద్వారా ప్రభుత్వ వాటాను 75 శాతం దిగువకు చేర్చుకోవచ్చని సక్సేనా వివరించారు. ఇప్పటికే రుణాలు, ఈక్విటీ ద్వారా రూ. 7,500 కోట్లు సమీకరించేందుకు బ్యాంక్ అనుమతి పొందినట్లు ప్రస్తావించారు. గత అక్టోబర్‌లో బ్యాంక్ క్విప్ ద్వారా రూ. 3,500 కోట్లు సమకూర్చుకుంది. దీంతో పబ్లిక్ వాటా 13.5 శాతం నుంచి 20.4 శాతానికి బలపడింది.

లీప్ ఇండియా రూ.2,400 కోట్ల ఐపీఓ

సెబీకి ప్రాథమిక పత్రాలు దాఖలు



న్యూఢిల్లీ: సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రొవైడర్ లీప్ ఇండియా తొలి పబ్లిక్ ఇష్యూకి (ఐపీఓ) రాబోతోంది. ఈ ఇష్యూ ద్వారా రూ.2,400 కోట్లు సమీకరించాలని సంస్థ భావిస్తోంది. ఇందుకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.400 కోట్ల విలువైన షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌సీ) కింద ప్రమోటర్లు రూ.2,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో రూ.300 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన మొత్తాన్ని ఇతర కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, జేఎం ఫైనాన్షియల్, యూబీఎస్ సెక్యూరిటీస్ ఇండియా, అవెండస్ క్యాపిటల్ సంస్థలు ఈ ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. సప్లై చైన్ రంగ సంస్థలకు అవసరమైన కంటైనర్లు, క్రేట్స్‌లాంటి అసెట్స్‌ను లీజుకు అందించే లీప్ ఇండియా 2013లో ఏర్పాటైంది. దేశవ్యాప్తంగా 7,747 కస్టమర్ టచ్‌పాయింట్లు, 30 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఉన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.485 కోట్ల ఆదాయం, రూ.37.5 కోట్లు నికర లాభాన్ని ప్రకటించింది. పానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా, మారికో, హైయర్ అప్లయిన్సెస్, డైకిన్, డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ తదితర 900 పైగా కంపెనీలు, క్లయింట్లుగా ఉన్నాయి.

ఆల్‌టైమ్ గరిష్టానికి క్రెడిట్ కార్డు వ్యయాలు

జూలైలో రూ.1.93 లక్షల కోట్లు
- చెలామణిలో 11.16 కోట్ల కార్డులు
- ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడి



ముంబై: దేశీయంగా క్రెడిట్ కార్డు ద్వారా చేస్తున్న వ్యయాలు 2025 జూలైలో జీవితకాల గరిష్టానికి చేరాయి. ఒకే నెలలో ఏకంగా రూ.1.93 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అంతకు ముందు జూన్‌లో నమోదైన రూ.1.83 లక్షల కోట్లతో పోలిస్తే 6% పెరిగాయి. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం ... పాయింట్ ఆఫ్ సేల్(పీఓఎస్) ద్వారా క్రెడిట్ కార్డ్ లావాదేవీలు జూలైలో 4.3 శాతం పెరిగి రూ.70,380 కోట్లకు చేరాయి. అంతర్జాతీయ లావాదేవీలు పరిశీలిస్తే.. మొత్తం వ్యయాలు రూ.7,467 కోట్లుగా నమోదయ్యాయి. అంతకు ముందు నెల జూన్‌లో నమోదైన రూ.8,251 కోట్లతో పోలిస్తే 9.5% మేర తగ్గాయి. పలు దేశీయ రుణ సంస్థలు లక్షల సంఖ్యలో కొత్త కార్డులు జారీ చేయడంతో ఈ ఏడాది జూలై ఆఖరు నాటికి చెలామణీలో ఉన్న క్రెడిట్ కార్డుల సంఖ్య 11.16 కోట్లకు చేరింది. డెబిట్ కార్డుల సంఖ్య 101 కోట్లుగా ఉంది. పండుగ సీజన్ ప్రారంభం నేపథ్యంలో కార్డుల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

మరిన్ని విశేషాలు..

- డెబిట్ కార్డుల వ్యయాలు జూలైలో రూ.2,247 కోట్లుగా, జూన్‌లో రూ.2,182 కోట్లుగా ఉన్నాయి.
- మొత్తం యూపీఐ లావాదేవీలు రూ.25 లక్షల కోట్లు చేరాయి. జూన్‌లో నమోదైన రూ.24.03 లక్షల కోట్లతో పోలిస్తే 4% పెరిగాయి. 2024 జూలైలో రూ.20.64 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి.
- మోసపూరిత లావాదేవీల సంఖ్య పెరిగింది. 2025 జూలైలో ఈ తరహా లావాదేవీల మొత్తం విలువ రూ.440 కోట్లుకి చేరింది. జూన్‌లో ఇది రూ. 303 కోట్లుగా ఉంది. ప్రతి 81,444 లావాదేవీల్లో ఒకటి మోసపూరితమైనదిగా గుర్తించారు.
- క్రెడిట్ కార్డుల విషయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అగ్రస్థానంలో ఉంది. 3.15 లక్షల కొత్త కార్డులు జారీ చేయడంతో జూలై ఆఖరు నాటికి బ్యాంకు క్రెడిట్ కార్డుల సంఖ్య 2.48 కోట్లకు చేరింది.
- 66,640 కొత్త కార్డుల జారీ చేయడం ద్వారా 2.12 కోట్ల క్రెడిట్ కార్డులతో ఎస్‌బీఐ రెండో స్థానంలో ఉంది.
- ఐసీఐసీఐ బ్యాంకు 67,664, యాక్సిస్ బ్యాంకు 1.22 లక్షల కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేశాయి.

ట్యాబ్లెట్ పీసీల మార్కెట్ డౌన్

- ప్రథమార్ధంలో 32.3 శాతం క్షీణత
- మార్కెట్ లీడరుగా శాంసంగ్
- ఐడీసీ నివేదికలో వెల్లడి




న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాది ప్రథమార్ధంలో దేశీయంగా ట్యాబ్లెట్ పీసీల మార్కెట్ 21.5 లక్షల యూనిట్లకు పరిమితమైంది. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 32.3 శాతం క్షీణించింది. మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) రూపొందించిన వరల్డ్‌వైడ్ క్వార్టర్లీ పర్సనల్ కంప్యూటింగ్ డివైజ్ ట్రాకర్ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అమ్మకాలు నెమ్మదించినప్పటికీ 41.3 శాతం మార్కెట్ వాటాతో శాంసంగ్ అగ్రస్థానంలో కొనసాగగా, 12.3 శాతంతో లెనొవొ రెండో స్థానంలో నిలిచింది. 11.8 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ మూడో స్థానంలో ఉంది. ''భారత్‌లో ట్యాబ్లెట్ మార్కెట్ (డిటాచబుల్, స్లేట్ ట్యాబ్లెట్స్ కలిపి) 2025 ప్రథమార్ధంలో 21.5 లక్షల యూనిట్లుగా నమోదైంది. వార్షికంగా చూస్తే 32.3 శాతం తగ్గింది. 2025 రెండో త్రైమాసికంలో మార్కెట్ గణనీయంగా నెమ్మదించింది. వార్షిక ప్రాతిపదికన 42.1 శాతం క్షీణించింది. 2025 తొలి త్రైమాసికంలో 18.4 శాతం నెమ్మదించింది'' అని ఐడీసీ నివేదిక తెలిపింది. డిటాచబుల్ ట్యాబ్లెట్ సెగ్మెంట్ వార్షికంగా 18.9 శాతం పెరగ్గా, స్లేట్ ట్యాబ్లెట్ విభాగం గణనీయంగా 44.4 శాతం క్షీణించడంతో మొత్తం అమ్మకాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. కమర్షియల్ సెగ్మెంట్‌లో 47.9 శాతం, వినియోగదారుల సెగ్మెంట్‌లో 37.6 శాతం వాటాతో శాంసంగ్ అగ్రస్థానంలో నిల్చింది. ప్రభుత్వ రంగానికి సంబంధించిన విద్యా ప్రాజెక్టులతో పాటు ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా దూకుడుగా విక్రయ వ్యూహాలు అమలు చేయడం ఇందుకు తోడ్పడింది. 2025 రెండో త్రైమాసికంలోనూ 40.8 శాతం మార్కెట్ వాటాతో శాంసంగ్ ఆధిపత్యం కొనసాగించింది.

యాపిల్‌కు కొత్త మోడల్స్ దన్ను

కమర్షియల్ సెగ్మెంట్‌లో ఇటు చిన్న, మధ్య తరహా సంస్థలతో పాటు అటు కంపెనీల విభాగంలోనూ లెనొవొ మెరుగ్గా రాణించింది. మొత్తం మార్కెట్లో 12.3 శాతం వాటా దక్కించుకుంది. ఇక 11.8 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ మూడో స్థానంలో నిల్చిందని ఐడీసీ నివేదిక తెలిపింది. కన్జూమర్ సెగ్మెంట్‌లో యాపిల్ వాటా 14.4 శాతంగా నిల్చింది. కొత్త ఐప్యాడ్ మోడల్స్, విద్యార్థులకు డిస్కౌంట్ ప్రోగ్రాంలు ఇందుకు తోడ్పడ్డాయి. కమర్షియల్ సెగ్మెంట్లో కంపెనీ వాటా 7.3 శాతానికి పెరిగింది. అటు ఐడీసీ అంచనాల ప్రకారం షావోమీ, ఏసర్ మార్కెట్ వాటాలు వరుసగా 11.4 శాతం, 9.1 శాతంగా ఉన్నాయి. ట్యాబ్లెట్ పీసీ సెగ్మెంట్లో ఏసర్ అత్యధికంగా నష్టపోయింది. అమ్మకాలు 73 శాతం క్షీణించాయి.

ఈసారి ఫార్మా ఎగుమతులు @ 50 బిలియన్ డాలర్లు

ఫార్మెక్సిల్ అంచనాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తికి (జీడీపీ) మించి ఫార్మా ఎగుమతులు వృద్ధి చెందాయని ఔషధ ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఫార్మెక్సిల్ తెలిపింది. జీడీపీ వృద్ధి 7.8 శాతంగా ఉండగా ఫార్మా ఎగుమతులు 11 శాతం పెరిగాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో 2026 ఆర్థిక సంవత్సరంలో ఫార్మా ఎగుమతులు 50 బిలియన్ డాలర్ల స్థాయికి చేరతాయని ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషి ధీమా వ్యక్తం చేశారు. జనరిక్స్, యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్ (ఏపీఐ), బయోసిమిలర్లు మొదలైనవి ఇందుకు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఫార్మా పరిశ్రమకు .. ఎగుమతులు మూలస్తంభంగా నిలుస్తున్నాయని చెప్పారు. దేశీ తయారీ సామర్థ్యాలను, ప్రపంచానికి చాటి చెబుతూ, అంతర్జాతీయ హెల్త్‌కేర్ విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. గ్లోబల్ జనరిక్ ఔషధ అమ్మకాల్లో 40 శాతం వాటా మనదే ఉంటోందని చెప్పారు. హెచ్ఐవీ, క్యాన్సర్ ఔషధాల విషయంలో అంతర్జాతీయంగా మనకు 90 శాతం పైగా వాటా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఫార్మా ఎగుమతులు 10 శాతం పెరగ్గా, ఇందులో అతి పెద్ద మార్కెట్ అయిన అమెరికా వాటా 25 శాతం వరకు ఉందని జోషి తెలిపారు. జనరిక్స్‌కి అమెరికా, యూరోపియన్ యూనియన్, ఆఫ్రికా ప్రధాన మార్కెట్లుగాను, ఏపీఐలకు చైనా, యూరప్ పెద్ద మార్కెట్లుగాను ఉంటున్నాయని చెప్పారు.


సబలెంకా

ప్రిక్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్, సబలెంకా

ఫ్రిట్జ్, గాఫ్ ముందంజ • యూఎస్ ఓపెన్

న్యూయార్క్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఆశిస్తున్న సెర్బియా దిగ్గజ క్రీడాకారులు నొవాక్ జొకోవిచ్ యూఎస్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. శనివారం తెల్లవారుజామున జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-4, 6-7 (4/7), 6-2, 6-3తో కామెరాన్ నోరీ (యూకే)పై విజయం సాధించాడు. ప్రపంచ 35వ ర్యాంకర్ నోరీనుంచి కాస్త ప్రతిఘటన ఎదురైనా...చివరకు జొకోవిచ్ పైచేయి సాధించాడు. మ్యాచ్ మధ్యలో వెన్నునొప్పితో కొంత ఇబ్బంది పడిన జొకోవిచ్ 1991 (జిమ్మీ కానర్స్) తర్వాత యూఎస్ ఓపెన్‌లో నాలుగో రౌండ్‌కు చేరిన అతి పెద్ద (38) వయస్కుడిగా గుర్తింపు పొందాడు. 2 గంటల 50 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో జొకో 18 ఏస్‌లు సంధించడం విశేషం. అమెరికాకు చెందిన నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ కూడా ప్రిక్వార్టర్స్ చేరాడు. మూడో రౌండ్‌లో ఫ్రిట్జ్ 7-6 (7/3), 6-7 (9/11), 6-4, 6-4తో జెరోమ్ కిమ్ (స్విట్జర్లాండ్)ను ఓడించాడు. మరో మూడో రౌండ్ మ్యాచ్‌లో లోరెంజో ముసెట్టి (ఇటలీ) 6-3, 6-2, 2-0తో ఆధిక్యంలో ఉన్న దశలో ఫ్లావియో కొబొలి (ఇటలీ) గాయంతో తప్పుకోవడంతో ముసెట్టి నాలుగో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు.


జొకోవిచ్

పావొలిని పరాజయం...

మహిళల విభాగంలో టాప్ సీడ్ సబలెంకా (బెలారస్) జోరు కొనసాగుతోంది. మూడో రౌండ్‌లో 6-3, 7-6 (7/2)తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)ను ఓడించి సబలెంకా ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. నాలుగో సీడ్ పెగులా (యూఎస్) కూడా 6-1, 7-5తో అజరెంకా (రష్యా)ను చిత్తు చేసి ముందంజ వేసింది. వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 7-6 (7/4), 6-1తో ఏడో సీడ్ పావొలిని (ఇటలీ)పై సంచలన విజయం సాధించి నాలుగో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. మూడో సీడ్, అమెరికాకు చెందిన కోకో గాఫ్ కూడా ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టింది. మూడో రౌండ్‌లో గాఫ్ 6-3, 6-1 స్కోరుతో మాగ్దలీనా ఫ్రెంచ్‌ను చిత్తు చేసింది.

పురుషుల డబుల్స్‌లో భారత జోడి అనిరుధ్ చంద్రశేఖర్ - విజయ్ ప్రశాంత్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి రౌండ్ మ్యాచ్‌లో చంద్రశేఖర్ - ప్రశాంత్ 3-6, 6-3, 6-4 స్కోరుతో అమెరికా ద్వయం, ఎనిమిదో సీడ్ హారిసన్ - కింగ్‌పై విజయం సాధించారు. అయితే మరో భారత జోడీ ఎన్.బాలాజీ - రిత్విక్ బొల్లిపల్లికి మొదటి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. వాసిల్ కిర్కోవ్(అమెరికా) - బార్ట్ స్టీవెన్స్ (నెదర్లాండ్స్) ద్వయం 3-6, 7-6 (10/8), 6-4 తేడాతో బాలాజీ - రిత్విక్‌ను ఓడించింది.

అంకిత్, యశ్ సెంచరీలు


అంకిత్

నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 388/2 • ఈస్ట్ జోన్‌తో దులీప్ ట్రోఫీ మ్యాచ్

బెంగళూరు: బ్యాటర్లు విజృంభించడంతో నార్త్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీ సెమీఫైనల్‌కు చేరువైంది. ఈస్ట్‌జోన్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 388 పరుగులు చేసింది. కెప్టెన్ అంకిత్ కుమార్ (264 బంతుల్లో 168 బ్యాటింగ్; 16 ఫోర్లు, 1 సిక్స్), యశ్ ధుల్ (157 బంతుల్లో 133; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలతో కదం తొక్కారు. తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగుల ఆధిక్యం దక్కించుకున్న నార్త్ జోన్... రెండో ఇన్నింగ్స్‌లోనూ దుమ్ము రేపింది. ఓపెనర్ శుభమ్ ఖజురియా (21) త్వరగానే అవుటైనా... అంకిత్, ధుల్ రెండో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. వీరిద్దరూ 290 బంతుల్లోనే 240 పరుగులు జోడించడంతో... నార్త్ జోన్ కొండంత స్కోరు చేయగలిగింది. ఆయుశ్ బదోని (78 బంతుల్లో 56; 3 ఫోర్లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో టీమిండియా పేసర్ మొహమ్మద్ షమీ ఒక్కడే పొదుపుగా బౌలింగ్ చేయగా... తక్కిన వాళ్లంతా భారీగా పరుగులు సమర్పించుకున్నారు. షమీ 11 ఓవర్లలో 36 పరుగులిచ్చి వికెట్ పడగొట్టలేకపోయాడు. సూరజ్ జైస్వాల్, రియాన్ పరాగ్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 405 పరుగులు చేయగా... ఈస్ట్ జోన్ 230 పరుగులు చేసింది. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా... చేతిలో 8 వికెట్లు ఉన్న నార్త్ జోన్ జట్టు ఓవరాల్‌గా 563 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంకిత్ కుమార్‌తో పాటు ఆయుశ్ బదోని క్రీజులో ఉన్నాడు.


యశ్ ధుల్


పాటీదార్
శుభమ్

నార్త్ ఈస్ట్ లక్ష్యం 678

మరో క్వార్టర్ ఫైనల్లో సెంట్రల్ జోన్ విజయానికి చేరువైంది. నార్త్ ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న పోరులో సెంట్రల్ జోన్ ప్రత్యర్థికి 678 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 80.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 331 పరుగులు చేసింది. అదే స్కోరు వద్ద సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. శుభమ్ శర్మ (215 బంతుల్లో 122; 17 ఫోర్లు) శతకం నమోదు చేసుకోగా... కెప్టెన్ రజత్ పాటీదార్ (72 బంతుల్లో 66; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), యశ్ రాథోడ్ (83 బంతుల్లో 78; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. నార్త్ ఈస్ట్ జోన్‌బౌలర్లలో ఆకాశ్ చౌదరీ, బిష్వోర్జిత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు సెంట్రల్ జోన్ 532/4 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... ఓవర్‌నైట్ స్కోరు 168/7తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన నార్త్ ఈస్ట్ జోన్ చివరకు 69.3 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది.ఆదిత్య ఠాకరే 3 వికెట్లు పడగొట్టగా... ఖలీల్ అహ్మద్, హర్ష్ దూబే చెరో రెండు వికెట్లు తీశారు. నేడు ఆటకు చివరి రోజు కాగా... ఓవరాల్‌గా సెంట్రల్ జోన్ 678 పరుగుల ఆధిక్యం సాధించింది. ఈ టోర్నీలో ఇప్పటికే వెస్ట్ జోన్, సౌత్ జోన్ జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి.

మెహక్‌కు రజత పతకం

- లవ్‌ప్రీత్ సింగ్‌కు కాంస్యం
- కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్


మెహక్

అహ్మదాబాద్: కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత లిఫ్టర్ మెహక్ శర్మ రజత పతకంతో మెరిసింది. మహిళల ప్లస్ 86 కేజీల విభాగంలో మెహక్ మొత్తంగా 253 కేజీ (స్నాచ్‌లో 110 కేజీలు + క్లీన్ అండ్ జెర్క్‌లో 143 కేజీలు)ల బరువెత్తి రెండో స్థానంలో నిలిచింది. సమోవాకు చెందిన యునిరా సిపాయా (261 కేజీలు), మేరీ టైవో ఒసిజో (231 కేజీలు; నైజీరియా) వరుసగా స్వర్ణ, రజతాలు గెలుచుకున్నారు. పురుషుల ప్లస్ 110 కేజీల విభాగంలో లవ్‌ప్రీత్ సింగ్ కాంస్యం నెగ్గాడు. లవ్‌ప్రీత్ మొత్తం 380 కేజీ (స్నాచ్‌లో 175 కేజీలు + క్లీన్ అండ్ జెర్క్‌లో 205 కేజీలు)ల బరువెత్తి మూడో స్థానంలో నిలిచాడు. డేవిడ్ లిటి (397 కేజీలు; న్యూజిలాండ్), సానెల్ మావో (401 కేజీలు; సమోవా) వరుసగా స్వర్ణ, రజతాలు సాధించారు. ఈ టోర్నమెంట్ సీనియర్ విభాగంలో భారత లిఫ్టర్లు 13 పతకాలు సాధించారు. అందులో 3 స్వర్ణాలు, 7 రజతాలు, 3 కాంస్యాలు ఉన్నాయి.


లవ్‌ప్రీత్

ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున...

పరిహారం ప్రకటించిన ఆర్‌సీబీ



బెంగళూరు: దాదాపు మూడు నెలల క్రితం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన 11 మంది అభిమానుల కుటుంబాలకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ప్రకటించింది. 'ఆర్‌సీబీ కేర్స్' అంటూ కొత్త పథకం ద్వారా ఒక్కొక్కరి కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఇస్తున్నట్లు వెల్లడించింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025లో విజేతగా నిలిచిన తర్వాత బెంగళూరులో భారీ ఎత్తున విజయోత్సవ సంబరాలు జరిగాయి. అయితే చిన్నస్వామి స్టేడియంలో వద్ద భారీ సంఖ్యలో వచ్చిన ఫ్యాన్స్‌ను నియంత్రించడం సాధ్యం కాలేదు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించారు. దాంతో ఆర్‌సీబీ యాజమాన్యంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మృతి చెందినవారి కుటుంబాలకు అప్పటికప్పుడు రూ.10 లక్షల చొప్పున సహాయాన్ని టీమ్ యాజమాన్యం ప్రకటించింది. అయితే అనంతరం పరిణామాల్లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన దర్యాప్తు బృందం కూడా ఆర్‌సీబీని తప్పు పట్టింది. ఈ నేపథ్యంలో తమ వంతుగా ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు సిద్ధమైంది. 'నాటి ఘటనలో మేం ఆర్‌సీబీ కుటుంబ సభ్యులను కోల్పోయాం. మా జ్ఞాపకాల్లో వారు ఎప్పటికీ ఉంటారు. ఎంత డబ్బు ఇచ్చినా చనిపోయినవారి లోటును తీర్చలేం అని తెలుసు. అయితే వారి కుటుంబాలను ఆదుకోవడం మా బాధ్యతగా భావించి మేం తోడుగా ఉన్నామనే ధైర్యాన్ని అందిస్తున్నాం. ఆర్‌సీబీ కేర్స్ పథకం ఇక ముందు కూడా కొనసాగుతుంది' అని ఒక ప్రకటనలో పేర్కొంది.

పియాస్ట్రికి పోల్ పొజిషన్

జాండ్‌వోర్ట్ (నెదర్లాండ్స్): ఫార్ములావన్ సీజన్ 15వ రేసు డచ్ గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం హోరాహోరీగా సాగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో పియాస్ట్రి... మెక్‌లారెన్ జట్టుకే చెందిన లాండో నోరిస్‌ను సెకన్‌లో వందో వంతు తేడాతో వెనక్కి నెట్టి అగ్ర స్థానంలో నిలిచాడు. పియాస్ట్రి అందరికంటే వేగంగా 1 నిమిషం 8.662 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి పోల్ పొజిషన్ దక్కించుకోగా... నోరిస్ 1 నిమిషం 8.674 సెకన్లతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును పియాస్ట్రి పోల్ పొజిషన్ నుంచి ప్రారంభించనున్నాడు. ఈ సీజన్‌లో పియాస్ట్రికి ఇది ఐదో పోల్ పొజిషన్ కాగా... ఆరు రేసుల తర్వాత ఇదే మొదటిది. డిఫెండింగ్ చాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ 1 నిమిషం 8.925 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఇసాక్ హద్జర్ (1 నిమిషం 9.208 సెకన్లు; రేసింగ్ బుల్స్), రసెల్ (1 నిమిషం 9.255 సెకన్లు; మెర్సిడెస్) వరుసగా నాలుగో, ఐదో స్థానాలు దక్కించుకున్నారు. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 14 రేసులు ముగియగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో మెక్‌లారెన్ డ్రైవర్ల ఆధిపత్యం కొనసాగుతోంది. పియాస్ట్రి 284 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... నోరిస్ 275 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు.



మెరిసిన సల్మాన్, రవూఫ్

• అఫ్గానిస్తాన్‌పై పాకిస్తాన్ విజయం • ముక్కోణపు టి20 టోర్నమెంట్



షార్జా: ఆసియాకప్ టి20 టోర్నమెంట్ సన్నాహకాల్లో భాగంగా జరుగుతున్న ముక్కోణపు టోర్నీలో పాకిస్తాన్ శుభారంభం చేసింది. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాల్గొంటున్న ఈ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ 39 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ సల్మాన్ ఆగా (36 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. సాహిబ్‌జాదా ఫర్హాన్ (21; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ఫఖర్ జమాన్ (20; 1 ఫోర్, 1 సిక్స్), మొహమ్మద్ నవాజ్ (21; 1 ఫోర్, 2 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో ఫరీద్ అహ్మద్ 2 వికెట్లు పడగొట్టగా... రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ, అజ్మతుల్లా, ముజీబ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గానిస్తాన్ జట్టు 19.5 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రషీద్ ఖాన్ (16 బంతుల్లో 39; 1 ఫోర్, 5 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... రహ్మనుల్లా గుర్బాజ్ (27 బంతుల్లో 38; 3 ఫోర్లు, 1 సిక్స్) కాస్త పోరాడాడు. మొహమ్మద్ నబీ (3), అజ్మతుల్లా (0), కరీమ్ జనత్ (0), ఇబ్రహీమ్ జద్రాన్ (9) విఫలమవడంతో అఫ్గాన్‌కు పరాజయం తప్పలేదు. ఒక దశలో 97 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన జట్టును రషీద్ ఆదుకున్నాడు. ఎడాపెడా సిక్స్‌లు బాదుతూ ప్రత్యర్థిని భయపెట్టాడు. పాక్ బౌలర్లలో హారిస్ రవూఫ్ 4 వికెట్లు పడగొట్టగా... షాహీన్ షా అఫ్రిది, మొహమ్మద్ నవాజ్, ముఖీమ్ తలా రెండు వికెట్లు తీశారు.

బంగ్లాదేశ్ భారీ విజయం

- 8-3 గోల్స్ తేడాతో చైనీస్ తైపీపై గెలుపు
- నేడు జపాన్‌తో భారత్ ఢీ
- ఆసియాకప్ పురుషుల హాకీ టోర్నమెంట్



రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ జట్టు భారీ విజయం సాధించింది. పూల్ 'బి'లో భాగంగా శనివారం జరిగిన పోరులో బంగ్లాదేశ్ 8-3 గోల్స్ తేడాతో చైనీస్ తైపీపై విజయం సాధించింది. బంగ్లాదేశ్ తరఫున మొహమ్మద్ అబ్దుల్లా (4వ, 26వ నిమిషాల్లో), రకీబుల్ హసన్ (42వ, 43వ నిమిషాల్లో), అష్రఫుల్ ఇస్లామ్ (45వ, 48వ నిమిషాల్లో) డబుల్ గోల్స్ సాధించగా... సోహనుర్ సోబుజ్ (36వ నిమిషంలో), రిజావుల్ బాబు (56వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. చైనీస్ తైపీ జట్టు తరఫున సుంగ్ యూ (10వ, 18వ నిమిషాల్లో) డబుల్ గోల్స్ చేయగా... సుంగ్ జెన్ షిహ్ (60వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. తొలి పోరులో మలేసియా చేతిలో ఓడిన బంగ్లాదేశ్... ఈ మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం కనబర్చింది. మరో మ్యాచ్‌లో మలేసియా 4-1 గోల్స్ తేడాతో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియాపై గెలిచింది. మ్యాచ్ ఆరంభమైన రెండో నిమిషంలోనే గెనెహో జిన్ గోల్‌తో ఖాతా తెరిచిన ఐదుసార్లు చాంపియన్ దక్షిణ కొరియా... చివరి వరకు అదే జోరు కొనసాగించలేకపోయింది. మలేసియా తరఫున అఖీముల్లా అన్వర్ (29వ, 34వ, 58వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో అదరగొట్టాడు. అష్రాన్ హమ్సాని (33వ నిమిషంలో) ఒక గోల్ కొట్టాడు. పూల్ 'ఎ'లో భాగంగా ఆదివారం జపాన్‌తో భారత్, కజకిస్తాన్‌తో చైనా తలపడనున్నాయి.

తస్కీన్ తడాఖా

నెదర్లాండ్స్‌పై బంగ్లాదేశ్ గెలుపు

సిల్హెట్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన బంగ్లాదేశ్ జట్టు... సొంతగడ్డపై నెదర్లాండ్స్‌తో జరిగిన తొలి టి20లో ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన తొలి టి20లో బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. నెదర్లాండ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆటగాడు తేజ నిడమనూరు (26 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... మ్యాక్స్ ఓ డౌడ్ (23; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తస్కీన్ అహ్మద్ 4 వికెట్లు పడగొట్టగా... సైఫ్ హుసేన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ జట్టు దంచికొట్టింది. 13.3 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 138 పరుగులు చేసి గెలుపొందింది. లిటన్ దాస్ (29 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా... సైఫ్ హుసేన్ (19 బంతుల్లో 36; 1 ఫోర్, 3 సిక్స్‌లు) వేగంగా ఆడటంతో మరో 39 బంతులు మిగిలుండగానే బంగ్లా విజయం సాధించింది. సైఫ్ అటు బౌలింగ్‌లో 2 వికెట్లు తీయడంతో పాటు బ్యాటింగ్‌లో జోరు కనబర్చాడు. తన్జీద్ హసన్ (29; 2 ఫోర్లు) రాణించాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో ఆర్యన్ దత్, టిమ్ ప్రింగిల్ చెరో వికెట్ తీశారు. ఇరు జట్ల మధ్య సోమవారం రెండో టి20 జరగనుంది.


తస్కీన్





తియాంజిన్‌లో హోటల్ వద్ద భారతీయ సంతతి చిన్నారులతో మోదీ

తియాంజిన్ ఎయిర్‌పోర్ట్‌లో కళాకారుల నృత్య ప్రదర్శన నడుమ మోదీకి రెడ్ కార్పెట్‌తో స్వాగతం







కళాకారులను అభినందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

అమెరికన్లపై ధరల పిడుగు

ట్రంప్ నిర్ణయాలతో ఎగసిన వస్తూత్పత్తుల రేట్లు

- సగటు అమెరికన్ వినియోగదారుని జేబుకు చిల్లు
- మరికొద్ది నెలల్లో మరింత పెరగనున్న అత్యధిక రేట్ల కష్టాలు

వాషింగ్టన్: అమెరికాను మళ్లీ గొప్పగా మార్చుతా(మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్) నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ తర్వాత అవలంభిస్తున్న వివాదాస్పద విదేశాంగ విధానాలతో సగటు అమెరికా పౌరుని జేబుకు భారీ చిల్లు పడుతోంది. దిగుమతి సుంకాలను ఎడాపెడా వాయించడంతో విదేశీ సరకులను అధిక ధరలకు కొనలేక అమెరికాలో సామాన్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ధరలను నేలకు దించుతానని బీరాలు పలికినట్రంప్ చివరకు ధరలను ఆకాశానికి ఎత్తేసి పలు రకాల సరకులను కొనలేని దుస్థితికి తీసుకొచ్చాడని దేశవ్యాప్తంగా అమెరికన్లు ట్రంప్‌పై కారాలు మిరియాలు నూరుతున్నారు. విదేశీ సరకులపై ఇలాగే అధిక టారిఫ్‌ల భారం కొనసాగితే అంతకు మించిన ధరల భారం శాశ్వతంగా మోయాల్సి వస్తుందన్న భయాందోళనలు స్థానికంగా అధికమయ్యాయి. మార్కెట్‌రంగ నిపుణులు సైతం ఇదే పాటపాడటం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

తొలిరోజే తగ్గిస్తానని చెప్పి..

'అధికారంలోకి రాగానే తొలిరోజే ద్రవ్యోల్బణం తగ్గిస్తా. ధరలను కిందకు తీసుకొస్తా''అని ఎన్నికల ప్రచారంవేళ 2024 ఆగస్ట్‌ర్యాలీలో ట్రంప్ చేసి వాగ్దానాలు నీటిమూటలేనని ఇటీవల ప్రజలకు స్పష్టంగా తెలిసొచ్చింది. ''అమెరికా సరకులు అందుబాటు ధరల్లో''అనే నినాదం కాస్తా ''కొనలేనంత అధిక ధరలకు అమెరికా సరకులు''అనే పరిస్థితి దాపురించింది. దీనికి తాజా గణాంకాలే తార్కాణంగా నిలుస్తున్నాయి. జనవరిలో ట్రంప్ అధికారపగ్గాలు చేపట్టినప్పటి నుంచి లెక్కిస్తే ఆర్థిక డేటా, నిపుణుల విశ్లేషణల ప్రకారం గృహోపకరణ వస్తువులు మరీ ముఖ్యంగా నిత్యావసర సరకులు, విద్యుత్ ధరలు బాగా పెరిగిపోయాయి. ఇవి ఎప్పటికప్పుడు పెరుగుతూ లక్షలాది సగటు అమెరికన్లను మరింతగా ఆర్థిక కష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. ఈ ధరల మోతకు పరోక్షంగా 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'సైతం ఆజ్యంపోసిందని కొందరు ఆర్థికనిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇవిగాక 800 డాలర్ల విలువైన సరకులను ఎలాంటి టారిఫ్, సుంకాలు, డ్యూటీలు, ఫీజులు లేకుండా దిగుమతి చేసుకునే 'డీ మినిమిస్'నిబంధననూ ట్రంప్ సర్కార్ తొలగించింది. దీంతో హఠాత్తుగా డిమాండ్ పెరిగి, ఆన్‌లైన్‌లో దొరికే తక్కువ ధర ఉండే వస్తువుల రేట్లు సైతం పెరిగిపోయాయి.

పోస్టల్ సేవల నిరాకరణతో రేట్లు పైపైకి..

అమెరికాకు డెలివరీ చేసేందుకు వస్తువుల ఆర్డర్లను తీసుకోవడం భారత్‌లో 'ఇండియాపోస్ట్'ఆపేసింది. ఇండియాపోస్ట్ బాటలోనే 25 దేశాల్లోని



పోస్టల్ సంస్థలు నడుస్తున్నాయి. దీంతో ఆయా దేశాల నుంచి పోస్టల్ ద్వారా అమెరికాకు డెలివరీ కావాల్సిన సరకుల భట్వాడా పూర్తిగా ఆగిపోయింది. దీంతో ఆయా దేశాల్లోని సంస్థలు ఇతరత్రా కొత్త డెలివరీ సంస్థల సాయంతో అమెరికాలోకి వస్తువులను డెలివరీ చేస్తున్నాయి. కొత్త సంస్థలు కావడంతో డెలివరీ చార్జీల మోత తప్పట్లేదు. ఈ పెరుగుదల చివరకు అమెరికా వినియోగదారునిపై పడుతోంది.

పచారీ సామాను ధరలు..

అన్నింటికంటే ఎక్కువగా నిత్యావసర సరకుల ధరలు బాగా పెరిగాయి. జూన్-జులైలో అన్ని ఆహారాల వినియోగధరల సూచీ(సీపీఐ) కాస్తంత పెరిగింది. దీంతో రిటైల్ ధరలు అధికమయ్యాయి. గత 20 ఏళ్ల చరిత్రలో సగటున ఆహార ధరలు 2.9 శాతం పెరగ్గా తాజా అంచనాల ప్రకారం ఈ ఏడాది చివరికల్లా ఇది 3.4 శాతానికి చేరుకోనుందని విశ్లేషకులు చెప్పారు. పెరుగుతున్న ధరలకు స్థానిక పరిస్థితులు సైతం తోడయ్యాయి. ఏవియాన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ దెబ్బకు కోళ్ల పరిశ్రమ కునారిల్లింది. దీంతో గుడ్ల ధరలు పెరిగాయి. గొడ్డుమాంసం ధర సైతం హెచ్చింది. తాజా సర్వే ప్రకారం పెరిగిన ధరలతో సతమతమవుతున్నామని 30వేల డాలర్ల వార్షికాదాయం ఉన్న 64 శాతం మంది కుటుంబాలు చెప్పాయి.

కెనడా, మెక్సికో, చైనాలపై భారంతో..

చైనా, మెక్సికో, కెనడా ఆహారోత్పత్తులపై అమెరికన్లు బాగా ఆధారపడ్డారు. 2023లో 195.9 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయోత్పత్తులను అమెరికా దిగుమతి చేసుకుంటే అందులో 44 శాతం దిగుమతులు కేవలం చైనా, కెనడా, మెక్సికో నుంచే వచ్చాయి. ఇప్పుడీ మూడు దేశాలపై అధిక టారిఫ్ మోపడంతో ఆమేరకు దిగుమతి సుంకాల రూపంలో ధరలు పెరిగి అమెరికన్ వినియోగదారుల చిల్లుకు పేద్ద చిల్లుపడుతోందని 'యేల్ బడ్జెట్ ల్యాబ్'సంస్థ పేర్కొంది. హోల్‌సేల్, రిటైలర్లు ఈ టారిఫ్ భారాన్ని తాము భరించకుండా వినియోగదారులపై పడేయడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని 9ఐ క్యాపిటల్ గ్రూప్ సీఈఓ కెవిన్ థాంప్సన్ అన్నారు. అమెరికాలో వినియోగించే రొయ్యల్లో 94 శాతం విదేశాల నుంచి రావాల్సిందే. ముఖ్యంగా భారత్, ఈక్వెడార్, ఇండోనేసియా, వియత్నాం ఈ రొయ్యలను ఎగుమతిచేస్తున్నాయి. 55 శాతం తాజా పండ్లు, 32 శాతం కూరగాయలు సైతం దిగుమతిచేసుకోవాల్సిందే. ఇవన్నీ ఇప్పుడు ధరలు పెరిగిపోయి వినియోగదారుల నడ్డి విరుస్తున్నాయి. గ్వాటిమాలా నుంచి వచ్చే అరటిపండ్లు మొదలు విదేశాల నుంచి వచ్చే కాఫీ, చాక్లెట్, గింజలు, టెక్స్‌టైల్స్, కోకా, వెనిల్లా ధరలు సైతం పెరిగాయి.

అదే బాటలో విద్యుత్ చార్జీలు

విద్యుత్ చార్జీలు సైతం 2020 ఏడాది నుంచి చూస్తే 34 శాతం పెరిగాయి. 2024 మే నుంచి 2025 మే వరకు గృహవినియోగ విద్యుత్ చార్జీలు 6.5 శాతం పెంచేశారు. విద్యుత్‌రంగంలో వినియోగించే అల్యూమినియం, ఉక్కు, తదితరాలను అత్యధికంగా కెనడా, మెక్సికోల నుంచి దిగుమతి చేసుకుంటోంది. కొత్తగా వీటి దిగుమతి సుంకాలు పెంచేశారు. దీంతో విద్యుత్ గ్రిడ్‌లు, సబ్‌స్టేషన్లు, విద్యుత్ ప్లాంట్లలో వినియోగించే వస్తువుల ధరలు పెరిగాయి. దీంతో పరోక్షంగా పెరిగిన ఆ ధరల షాక్ విద్యుత్ వినియోగదారులకు తగలనుంది. మరో ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు 25 శాతం, మరో పదేళ్లలో 75 శాతం పెరుగుతాయని ఎనర్జీ ఇన్నోవేషన్ స్టడీస్ సంస్థ ఇప్పటికే అంచనావేసింది. ''టారిఫ్ పెంచడమంటే అది అమెరికా వ్యాపారులు, వినియోగదారులపై పన్నులను పెంచడమే. అది తుదకు ధరల పెరుగుదలకు అంతిమంగా అధిక ద్రవ్యోల్బణంకు దారితీస్తుంది''అని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి, ప్రస్తుత టైమ్ మ్యాగజైన్ ఎడిటర్ రిచర్డ్ స్టెన్‌గెల్ శుక్రవారం 'ఎక్స్'లో ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రతికూల ప్రభావంచూపుతున్న 'బ్యూటిఫుల్ బిల్'

వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు ద్వారా అమెరికన్లపై ఆదాయపన్ను భారాన్ని ట్రంప్ ప్రభుత్వం తగ్గించింది. తక్కువ పన్ను కట్టడం వల్ల పౌరుల వద్ద కొంత సొమ్ము ఆదా అవుతుంది. ఈ ఆదా అయిన సొమ్ముతో సరకుల్ని కొనగలరు అని ట్రంప్ వేసిన లెక్క తప్పు అని తాజా గణాంకాలు చాటుతున్నాయి. బ్యూటిఫుల్ బిల్లు అనేది అత్యధిక పన్నులు కట్టే వ్యాపారులు, సంపన్నులకు మాత్రమే లాభదాయకంగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. సంపన్న కుటుంబాలు, పెద్ద కంపెనీల పన్ను తర్వాతి ఆదాయం ఈ బిల్లు తర్వాత 2–3 శాతం పెరిగింది. మధ్య, దిగువ తరగతి అమెరికన్లకు ఈ బిల్లుతో కేవలం 1 శాతం మాత్రమే లాభం చేకూరింది. ''టారిఫ్‌లు, బ్యూటిపుల్ బిల్లు కారణంగా నిర్మాణ రంగం, విద్యుత్ రంగంలో నిర్వహణ వ్యయాలు పెరిగాయి. ఇవి చివరకు వినియోగదారుల సొమ్మును లాగేసుకున్నాయి. డేటా సెంటర్ల నుంచి విద్యుత్ డిమాండ్ మరో మూడేళ్లలో మూడు రెట్లు పెరగనుంది. ఇది కూడా ధరల ర్యాలీని కొనసాగిస్తుంది''అని బిజినెస్ మ్యాగజీన్ 'ఫోర్బ్స్'తెలిపింది.

అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం

సంస్థను వీడుతున్న ఉద్యోగి గ్రాట్యుటీ నిలిపివేతపై కలకత్తా హైకోర్టు వ్యాఖ్య

కోల్‌కతా: మెరుగైన వేతనం ఇచ్చే మరో సంస్థలోకి వెళ్తున్నాడనే సాకుతో ఉద్యోగికి బకాయిలు చెల్లించకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రత్యర్థి కంపెనీలో మెరుగైన జీతభత్యాలుండే ఉద్యోగం వెతుక్కోవడం అతడి ప్రాథమిక హక్కు అని, నైతిక నియమాల ఉల్లంఘన కిందికి రాదని స్పష్టం చేసింది. గొడవలు, క్రమశిక్షణారాహిత్యం, నైతిక ప్రవర్తనకు సంబంధించి ఆ ఉద్యోగి చర్యల కారణంగా నష్టం జరిగినట్లు పిటిషనర్‌గా ఉన్న సంస్థ ఎలాంటి ఆధారాలను చూపలేకపోయిందని ధర్మాసనం తెలిపింది. ప్రత్యర్థి కంపెనీతో కలిసి ఆ ఉద్యోగి కుట్ర పన్నినట్లు కూడా రుజువు చేయలేకపోయిందని పేర్కొంది. రూ.1.37 లక్షల గ్రాట్యుటీని ఏడాదికి 8శాతం చొప్పున వార్షిక వడ్డీని కలిపి వెంటనే అతడికి చెల్లించాలని ఆదేశించింది. గ్రాట్యుటీని నిలిపివేస్తూ సంస్థలోని క్రమశిక్షణ విభాగం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేసింది. ఈ విభాగం చేపట్టిన విచారణ అధికార దుర్వినియోగమే కాదు, సహజ సూత్రాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఉద్యోగికి వ్యతిరేకంగా నిర్దుష్టమైన ఎలాంటి ఆధారాలను సైతం చూపలేకపోయిందని ఈ విభాగాన్ని తప్పుబట్టింది. కంట్రోలింగ్ అథారిటీ, అప్పిలేట్ అధారిటీ ఇచ్చిన ఉత్తర్వులు సహేతుకంగా, న్యాయబద్ధంగా ఉన్నాయంటూ సమర్థిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. కొన్ని ప్రత్యేకతలున్న ఇన్సులేటర్ ఫిల్మ్‌ను తయారు చేసే బెంగాల్‌కు చెందిన కంపెనీలో సుదీప్ సమంతా 2012లో జాయినయ్యారు. ఆయన ప్రత్యర్థి సంస్థలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారనే నెపంతో ఆయన్ను 2022 అక్టోబర్‌లో తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రత్యర్థి కంపెనీతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలపై గ్రాట్యుటీని నిలిపివేసింది. దీనిపై సుదీప్ ట్రిబ్యునల్‌కు వెళ్లగా అనుకూలంగా తీర్పు వచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ కంపెనీ వేసిన పిటిషన్‌పై ఇటీవల కలకత్తా హైకోర్టు పైవిధంగా తీర్పు వెలువరించింది.

నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన
19 ఏళ్ల వలస కార్మికుడు

బరంపురం(ఒడిశా): వలస కూలీగా రోజంగా పనిచేసి అలసిపోయినాసరే తన లక్ష్యం కోసం అలుపెరగక పోరాడిన ఒక టీనేజర్ విజయగాథ ఇది. లక్షలాది మంది పోటీపడే నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఒడిశా కుర్రాడు తన 'ఎంబీబీఎస్' సీటు కలను నిజంచేసుకున్నాడు. ఖుర్దా జిల్లాలోని బానూపూర్ బ్లాక్‌లోని ముదులిద్దియా గ్రామానికి చెందిన 19 ఏళ్ల శుభమ్ సబర్‌ది నిరుపేద కుటుంబం. రెక్కాడితేకానీ డొక్కాడని దుస్థితి. దాంతో సబర్ వలసకూలీగా కర్ణాటక రాజధాని బెంగళూరుకు వచ్చి పనిచేసుకుని జీవిస్తున్నాడు. ఎలాగైనా డాక్టర్ కావాలనే తన కలను నెరవేర్చుకునేందుకు ఎంతో కష్టపడ్డాడు. పని పూర్తయ్యాక పుస్తకంతో కుస్తీపట్టాడు. ఎట్టకేలకు అనుకున్నది సాధించాడు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో గిరిజన తెగ కేటగిరీలో 18,212 ర్యాంక్ సాధించాడు. తాజాగా బరంపురంలోని ఎంకేసీజీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ తొలి సంవత్సరంలో చేరాడు. పనిచేస్తూ కష్టపడి చదివిన సబర్‌ను మీడియా పలకరించగా తాను పనికి, పరీక్షకు సంసిద్ధమైన తీరును వివరించాడు. '' ఐదుగురం ఉండే మా ఇంట్లో పూట గడవడం చాలా కష్టం. అందుకే చదువుకుంటూనే పనికి వెళ్లేవాడిని. ఇటీవల నీట్ పరీక్ష రాసిన తర్వాత సైతం కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండాలని బెంగళూరుకు వలసకూలీగా వచ్చా. ఇక్కడ నిర్మాణరంగంలో కార్మికునిగా చేరా. గత మూడు నెలల్లో రూ.45,000 సంపాదించా. ఖర్చులు పోను రూ.25,000 మిగిలాయి. పనిలో ఉన్నప్పుడు ఒడిశాలోని మా ఉపాధ్యాయుడు బాసుదేవ్ మొహరానా ఫోన్‌చేశారు. నీ తోటి కూలీలకు వెంటనే మిఠాయిలు పంచెయ్ అని చెప్పారు. వెంటనే అర్థంకాలేదు. నీకు నీట్‌లో మంచి ర్యాంక్ వచ్చింది ఎంబీబీఎస్ సీటు ఖాయం అని ఆయన అనగానే కన్నీళ్లు ఆగలేదు. నా కల నిజమైందని అనుకున్నా. పని ఇప్పించిన కాంట్రాక్టర్ నుంచి అనుమతి తీసుకుని తర్వాతి రోజు గ్రామానికి తిరిగొచ్చా. గతంలో పోలీస్ అధికారిని అవ్వాలని కలగన్నా. తర్వాత డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నా. డాక్టర్ అయ్యాక సొంత రాష్ట్ర ప్రజలకు సేవచేస్తా'' అని సబర్ చెప్పారు. సబర్‌కు సీటు రావడంతో అతని తల్లిదండ్రులు సహదేవ్, రాన్గీల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. '' ఎంబీబీఎస్ సీటొచ్చింది. డాక్టర్ చదువు పూర్తయ్యేదాకా ప్రభుత్వం ముందుకొస్తే మాకెంతో సాయంగా ఉంటుంది'' అని తల్లిదండ్రులు కోరారు. ''మావాడు చిన్నప్పట్నుంచి బాగా కష్టపడతాడు. చదువుతాడు. డాక్టర్ అవ్వాలన్న అతని కల నిజమైంది. అతని కష్టమే విజయంగా ఎదురొచ్చింది. రోజంతా మాతోపాటు అతని తోబుట్టువులు కష్టపడటం సబర్ కళ్లారా చూశాడు. అందుకే వాడికి అంతటి కసి'' అని తల్లి రాన్గీ నవ్వుతూ చెప్పారు.

దేశంలోనే తొలి మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ వ్యవస్థ

- కొత్త సాంకేతికత దిశగా ఎన్‌హెచ్‌ఏఐ మరో ముందడుగు
- మరో 25 టోల్‌ప్లాజాల్లో ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్ అమలుకు యోచన

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై ప్రయాణికులకు అడ్డంకులు లేకుండా టోల్ వసూలు చేసే కొత్త సాంకేతికత దిశగా ఎన్‌హెచ్‌ఏఐ మరో ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్) టోలింగ్ వ్యవస్థను అమలు చేయబోతోంది. ఇందుకోసం గుజరాత్‌లోని ఎన్‌హెచ్-48 చోర్యాసి టోల్ ప్లాజాలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐహెచ్‌ఎంసీఎల్) ఐసీఐసీఐ బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఫాస్టాగ్, వాహన రిజిస్ట్రేషన్ నంబర్ల ఆధారంగా వాహనాలను ఆపకుండానే టోల్ వసూలు చేసే ఈ ఆధునిక పద్ధతితో రద్దీ తగ్గి ప్రయాణ సమయం కలిసొస్తుంది. ఇంధనం ఆదా అవుతుంది. కాలుష్యం కూడా నియంత్రణలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. 'ఈ ఒప్పందం దేశంలో టోల్ విధానంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుంది. మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన టోల్ వ్యవస్థను రూపొందించడానికి ఇది కీలకంగా మారనుంది'అని ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్ తెలిపారు. హరియాణాలోని ఎన్‌హెచ్-44లోని ఘరౌండా టోల్‌ప్లాజాలో కూడా ఇదే విధానం అమలు చేయనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 25 టోల్‌ప్లాజాల్లో ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్ వ్యవస్థను అమలు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ యోచిస్తోంది.

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రిటైర్డు జడ్జి ఎందుకు?

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం

శివాజీనగర: దేశ ఉప రాష్ట్రపతి ఎన్నికలో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి పోటీ చేయడం సబబు కాదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. మంత్రి శనివారం బెంగళూరులో విధానసౌధలో మీడియాతో మాట్లాడారు. రిటైర్డు న్యాయమూర్తి ఎన్నికలో పోటీ చేయడం, కొందరు రిటైర్డ్ జడ్జీలు కేంద్ర మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా గళమెత్తడం మంచిది కాదన్నారు. హోం మంత్రికి విరుద్ధంగా సంతకాలను సేకరించి మాజీ న్యాయమూర్తి లేఖ రాయటం సరికాదని విమర్శించారు. ప్రధాని మోదీని ప్రతిపక్ష పార్టీల నాయకులు రాహుల్ గాంధీ, మహువా మొయిత్రాతో పాటుగా కొందరు ఎంపీలు దూషిస్తూ మాట్లాడటంపై ఆయన ధ్వజమెత్తారు. ప్రధానిని, ఆయన దివంగత తల్లిని దూషించడం దేశ భవిష్యత్‌కు మంచిది కాదని చెప్పారు. ప్రజలు ఓటు వేయకపోతే ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు చేయడం ఏమిటని కాంగ్రెస్‌ను, రాహుల్ గాంధీని ఎద్దేవా చేశారు. కేంద్రం తెచ్చిన 30 రోజుల జైలులో ఉంటే పదవి పోయే చట్టాన్ని ప్రస్తావిస్తూ, దేశ న్యాయ వ్యవస్థ తప్పు చేయని ఎవరికైనా కూడా భద్రత కల్పిస్తుందని తెలిపారు. 'దేశంలో న్యాయస్థానాలు లేవా? ఏ తప్పూ చేయకున్నా ఎవరైనా జైలుకు వెళతారా?'అని ప్రశ్నించారు.

2026 నాటికి కులశేఖర్ పట్నం రాకెట్ కేంద్రం సిద్ధం

ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ వెల్లడి

సూళ్లూరుపేట: దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా పెరుగుతున్న రాకెట్ ప్రయోగాల డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని 2026 ఆఖరుకు తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి సమీపంలో ఉన్న కులశేఖరపట్నంలో రాకెట్ కేంద్రాన్ని అందుబాటులోకి తేనున్నట్లు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ తెలిపారు. ఎస్ఎస్ఎల్‌వీ లాంచ్‌కాంప్లెక్స్ (ఎస్ఎల్‌సీ) వద్ద లాంచ్‌ప్యాడ్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఫిబ్రవరిలో ఈ స్పేస్ పోర్టుకు శంకుస్థాపన జరగ్గా ఇందులోని 33 ప్రధాన వసతులకుగాను 32 వసతుల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. మొబైల్ లాంచ్‌స్ట్రక్చర్ (ఎంఎల్ఎస్), బోగీలు, ప్లాట్‌ఫారమ్‌లు, జెట్ డిఫ్లెక్షన్ డక్ట్, వైబ్రేషన్ ఐసోలేషన్ సిస్టమ్స్ లాంటి ప్రధాన వ్యవస్థలను సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ రూపొందించిందని తెలిపారు. రాడార్లు, టెలీకమాండ్, టెలిమెట్రీ వంటి ప్రధానశ్రేణి వ్యవస్థలను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఇస్ట్రాక్, ఇండియన్ ఇనర్షియల్ సిస్టం యూనిట్ లాంటి ఇస్రో కేంద్రాల మద్దతుతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ప్రయోగాలు, చిన్న చిన్న ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఈ స్పేస్ పోర్టును వాడుకుంటామని తెలిపారు. ఎస్ఎస్ఎల్‌వీ ఎస్జీఈ రాకెట్‌ల ప్రయోగాలకు వీలుగా ఉంటుందని తెలిపారు. ఎగువ వాతావరణంలో అధ్యయనం, సాంకేతిక పరిజ్ఞానాల ప్రదర్శన కోసం సౌండింగ్ రాకెట్ల ప్రయోగాలను ఈ ఏడాది డిసెంబర్ నుంచే నిర్వహించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు.

నీట్ అభ్యర్థి ఆత్మహత్యాయత్నం.. భగ్నం చేసిన టీచర్

జైపూర్: కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ భవనం పైనుంచి దూకి బలవన్మరణానికి యత్నించిన నీట్ అభ్యర్థినిని ఓ టీచర్ సమయస్ఫూర్తి చూపి కాపాడారు. రాజస్తాన్‌లోని జైపూర్‌లో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. చురూకు చెందిన 19 ఏళ్ల విద్యార్థిని జైపూర్‌లోని మహేశ్ నగర్ ప్రాంతంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ నీట్‌కు ప్రిపేరవుతోంది. శుక్రవారం మధ్యాహ్నం ఆమె తల్లిదండ్రులు వచ్చి చదువు విషయం ఆరా తీశారు. ఈ విషయంలో మన స్తాపానికి గురైన విద్యార్థిని సాయంత్రం సమయంలో కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ మూడో అంతస్తు టెర్రస్‌పైకి ఎక్కింది. రోడ్డుపై వెళ్లే వారు ఇది చూసి అధ్యాపక సిబ్బందిని అలెర్ట్ చేశారు. టీచర్లంతాపైకి చేరుకున్నారు. ఒక టీచర్ మాత్రం సమయస్ఫూర్తి ప్రదర్శించారు. టెర్రస్ పైకి దూకి ఆమె చేయి పట్టుకుని పక్కకు లాగేశారు. ఆమె ప్రతిఘటించినా పట్టు వదల్లేదు. అందరూ కలిసి సురక్షితంగా కిందికి దించి, కౌన్సెలింగ్ చేశారు. ఇటీవల ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన కొన్ని పరీక్షల్లో ఆమె ఫెయిలవడం, తల్లిదండ్రులు మందలించడమే ఆమె తీవ్ర నిర్ణయానికి కారణమని చెబుతున్నారు.

రష్యాకు తగు సంకేతం ఇచ్చేందుకు భారత్ సిద్ధం

ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడానన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

తియాంజిన్(చైనా): తమ దేశంపై జరుగుతున్న రష్యా దాడులను ఆపే విషయంలో తగు సంకేతం అందించేందుకు భారత్ సంసిద్ధత తెలిపిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. శనివారం ఆయన చైనాలో ఉన్న భారత ప్రధాని మోదీతో ఫోన్‌లో సంభాషించారు. ఆగస్ట్ 18వ తేదీన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశం వివరాలను మోదీకి ఆయన వివరించారు. రష్యా నాయకత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ముందుగా తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు. ఈ విషయాన్ని జెలెన్‌స్కీ స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. సంక్షోభాన్ని ముగించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని మోదీ హామీ ఇచ్చారని, ఈ విషయంలో రష్యాకు తగు సంకేతం అందించేందుకు ముందుకు వచ్చారని వివరించారు. కాగా, ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికే దిశగా జరిగే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతుగా నిలుస్తుందని జెలెన్‌స్కీకి హామీ ఇచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం ప్రధాని మోదీ ఎస్‌సీవో శిఖరాగ్రం కోసం చైనాలోని తియాంజిన్ వెళ్లడం తెల్సిందే. సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఆయన జరిపే ముఖాముఖి చర్చల్లో ఉక్రెయిన్ సంక్షోభం సహా పలు అంశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే మోదీకి శనివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఫోన్ చేశారు. రష్యాతో కొనసాగుతున్న తీవ్ర సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కనుగొనాలన్న వైఖరికి భారత్ కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేసినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక భాగస్వామ్యం విషయంలో పురోగతిపై సమీక్ష జరిపారు. పరస్పర ప్రయోజనమున్న అన్ని అంశాల్లోనూ సహకారం మరింతగా పెంచుకోవాలని అంగీకారానికి వచ్చారు.

ఓటర్ అధికార్ యాత్ర ఉద్యమంగా మారింది: రాహుల్

ఆరా: బిహార్‌లో తాము ప్రారంభించిన ఓటర్ అధికార యాత్ర విప్లవంగా మారిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఒక్క ఓటు కూడా చోరీకి గురి కారాదన్న లక్ష్యంగా చేపట్టిన ఈ ఉద్యమం త్వరలోనే దేశ వ్యాప్తంగా విస్తరించనుందన్నారు. శనివారం ఆయన భోజ్‌పూర్ జిల్లా ఆరాలో జరిగిన ర్యాలీలో మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు పురుడుపోసుకున్న నేల బిహార్. ఓటర్ అధికార్ యాత్రతో మరో ఉద్యమం ఇక్కడే మొదలైంది. రానున్న రోజుల్లో ఈ ఉద్యమం దేశమంతటా విస్తరించనుంది'అని రాహుల్ పేర్కొన్నారు. 'బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రైవేటీకరణతో యువత గొంతునొక్కింది. వారికి ఉద్యోగావకాశాలు లేకుండా చేసింది'అని ఆరోపించారు. 'నిరుపేద యువత వాణిని దేశమంతటా ప్రతిధ్వనించేలా చేస్తాం. బిహార్ సహా ఎక్కడా ఒక్క ఓటు కూడా చోరీ కానివ్వం'అని స్పష్టం చేశారు. 'మీ ఓటు చోరీకి గురైందంటే మీకు భవిష్యత్తు లేనట్లేనన్న విషయం గుర్తుంచుకోండి. ఓటు హక్కును రాజ్యాంగం మీకు ఇచ్చింది. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ ఆదర్శాల ప్రతిరూపమైన ఓటు హక్కును మనం కాపాడుకుందాం'అని రాహుల్ పిలుపునిచ్చారు. ర్యాలీలో ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్, సీపీఐఎంఎల్ నేత దీపాంకర్ భట్టాచార్య పాల్గొన్నారు. బాబు కున్వర్ సింగ్ స్టేడియంలో జరిగిన ర్యాలీకి హాజరైన భారీ జనసందోహం వీడియోను రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తనకు మద్దతుగా నిలిచిన అఖిలేశ్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన ట్రేడ్‌మార్క్ టీ-షర్ట్, కార్గో ప్యాంట్స్ ధరించిన రాహుల్ జనంతో కలిసి ముందుకు సాగారు. సరన్ నుంచి ఆరాకు వాహనం నడుపుకుంటూ రాహుల్ వచ్చారు. ఆ సమయంలో పలువురు ఆయన ఓపెన్ టాప్ వాహనంలోకి ఎక్కేందుకు యత్నించగా భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. భుజం తడుతూ, కరచాలనం చేస్తూ కొందరిని రాహుల్ వారించారు. మరికొందరికి చాక్లెట్లు పంచి సంతృప్తి పరిచారు. గడిచిన రెండు వారాల్లో 25 జిల్లాల్లో ఈ యాత్ర వెయ్యి కిలోమీటర్ల మేర సాగింది.



జైన మతంలో గణాధారులు అంటే ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మతోద్యమాలు

1. భారతదేశంలో నూతన మతోద్యమాల కాలం ఏది?
ఎ) క్రీ.పూ. ఆరో శతాబ్దం
బి) క్రీ.పూ. అయిదో శతాబ్దం
సి) క్రీ.పూ. నాలుగో శతాబ్దం
డి) క్రీ.పూ. రెండో శతాబ్దం

2. అజీవక మత స్థాపకుడు ఎవరు?
ఎ) గోసాలపుత్త బి) అలరకలామ
సి) ఉద్దక రామపుత్త డి) పార్శ్వనాథ

3. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) జైనమతంలో మొత్తం తీర్థంకరుల సంఖ్య 24
బి) మొదటి తీర్థంకరుడు రుషభనాథుడు
సి)చివరి తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు
డి) పైవన్నీ

4. చార్వాక మత స్థాపకుడు ఎవరు?
ఎ) అలరకలామ బి) నేమినాథ
సి) అజితకేశకంబళిన్ డి) ఆదినాథ

5. జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. సల్లేఖన	i. జైనులు ఆచరించే వ్రతం
2. శాద్వాదం	ii. జైనతత్వం
3. విద్యాదేవి	iii. జైనులు ఆరాధించే స్త్రీ దేవత
4. అంగాలు	iv. జైనుల పవిత్ర గ్రంథాలు
5. దిగంబర, శ్వేతాంబర	v. జైనమత శాఖలు

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-iv, 2-v, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-i, 3-v, 4-iii, 5-iv
డి) 1-v, 2-iv, 3-i, 4-iii, 5-ii

6. బౌద్ధమతంలో తాంత్రిక శాఖ ఏది?
ఎ) హీనయానం బి) వజ్రయానం
సి) మహాయానం డి) ఏదీకాదు

7. బుద్ధుడి తొలి గురువు ఎవరు?
ఎ) అలరకలామ బి) ఉద్దక రామపుత్త
సి) ఎ, బి డి) ఎవరూకాదు

8. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) బుద్ధుడు ప్రతిపాదించిన సిద్ధాంతం – ప్రతీత్య సముత్పాద
బి) బౌద్ధమతం ఆచరించేవారు – ఉపాసికులు, భిక్షువులు
సి) బౌద్ధమత ముఖ్య శాఖలు – హీనయానం, మహాయానం
డి) పైవన్నీ

9. చారిత్రకంగా జైన మతాన్ని స్థాపించినవారు ఎవరు?
ఎ) పార్శ్వనాథ బి) సంభవనాథ
సి) రుషభనాథ డి) వర్ధమాన మహావీర

10. 'తీర్థంకరుడు' అంటే అర్థం ఏమిటి?
ఎ) మోక్షం ప్రసాదించేవాడు
బి) సంసార నావ దాటించేవాడు
సి) మార్గం చూపేవాడు డి) బి, సి

11. క్రీ.పూ. ఆరో శతాబ్దంలో నూతన మతాలు ఏర్పడటానికి కారణం?
ఎ) హిందూ మతం పవిత్రత కోల్పోవడం
బి) బ్రాహ్మణుల ఆధిపత్య ధోరణి
సి) కర్మకాండలకు ప్రాముఖ్యం ఇవ్వడం
డి) పైవన్నీ

12. మొదటి తీర్థంకరుడైన రుషభనాథుడిని నారాయణుడి అవతారంగా పేర్కొన్న పురాణం ఏది?
ఎ) విష్ణు పురాణం
బి) భాగవత పురాణం
సి) బ్రహ్మవైవర్త పురాణం
డి) ఎ, బి

13. జైనులను ప్రారంభంలో 'నిగ్రంధులు' అని పిలిచేవారు. నిగ్రంధులు అంటే అర్థం?
ఎ) మార్గం చూపేవారు
బి) మోక్షాన్ని ప్రసాదించేవారు
సి) బంధాల నుంచి బయటపడిన వారు
డి) ఏదీకాదు

14. తీర్థంకరులు, వారి చిహ్నాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. రుషభనాథ	i. సింహం
2. అజితనాథ	ii. పాము
3. అరిష్టనేమి	iii. శంఖం
4. పార్శ్వనాథ	iv. ఏనుగు
5. వర్ధమాన మహావీర	v. వృషభం

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-iv, 2-v, 3-i, 4-iii, 5-ii
డి) 1-iii, 2-ii, 3-v, 4-i, 5-iv

15. పార్శ్వనాథుడికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) కాశీ రాజ్యానికి చెందినవాడు
బి) వర్ధమానుడి కంటే 250 ఏళ్ల ముందు జీవించాడు
సి) పార్శ్వనాథుడి తల్లిదండ్రులు – అశ్వసేనుడు, వామలాదేవి
డి) పైవన్నీ

16. జైనమత పంచ సూత్రాల్లో నాలిగింటిని పార్శ్వనాథుడు రూపొందించగా, వాటికి బ్రహ్మచర్య సూత్రాన్ని చేర్చింది ఎవరు?
ఎ) వర్ధమాన మహావీరుడు
బి) నేమినాథ సి) సంభవనాథ
డి) అరిష్టనేమి

17. మహావీరుడు ఎవరి అనుమతితో సన్యాసం స్వీకరించాడు?
ఎ) తల్లి – త్రిసల బి) భార్య – యశోద
సి) అన్నయ్య – నందివర్ధన
డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు

18. వర్ధమానుడికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) బిరుదులు– జినుడు, మహావీర, కేవలి
బి) జ్ఞానోదయం పొందిన స్థలం– జృంభిక గ్రామం
సి) నిర్యాణం చెందిన ప్రాంతం– పావాపురి
డి) పైవన్నీ



19. జైన పంచ సూత్రాలను సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ – ఎ
1. అహింస
2. అసత్యం పలకరాదు
3. అస్తేయ
4. అపరిగ్రహ
5. బ్రహ్మచర్యం

గ్రూప్ – బి
i. హింసకు పాల్పడవద్దు
ii. సత్యం పలకాలి
iii. దొంగతనం చేయకూడదు
iv. ఆస్తులు కలిగి ఉండకూడదు
v. వివాహం చేసుకోవద్దు

ఎ) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
బి) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
సి) 1-iv, 2-v, 3-ii, 4-iii, 5-i
డి) 1-v, 2-ii, 3-i, 4-iii, 5-iv

20. గణాధారులు అంటే..?
ఎ) వర్ధమానుడి ప్రత్యక్ష శిష్యులు
బి) గౌతమ బుద్ధుడి శిష్యులు
సి) అజీవక మతాన్ని అవలంబించేవారు
డి) చార్వాక సిద్ధాంతాన్ని నమ్మినవారు

21. జైన సంఘం మొదటి థేర(అధ్యక్షుడు)ఎవరు?
ఎ) భద్రబాహు బి) స్థూల భద్ర
సి) ఆర్య సుదర్శన్ డి) జామాలి

22. ఆరో థేర అయిన భద్రబాహు మగధలో క్షామం వల్ల దక్షిణ భారతదేశానికి వలస వచ్చినట్లు తెలియజేస్తున్న గ్రంథం ఏది?
ఎ) గాథాకోశ బి) పరిశిష్టపర్వన్
సి) యశస్తిలక డి) వైరాగ్య తరంగం

23. జైనుల ప్రార్థనా మందిరాలను ఏమంటారు?
ఎ) బసది బి) విహారం
సి) చైత్యం డి) పైవేవీకాదు

24. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) మొదటి జైన సంగీతి స్థూలభద్రుడి అధ్యక్షతన పాటలీపుత్రంలో జరిగింది
బి) మొదటి జైన సంగీతిలో మహావీరుడి బోధనలను 12 అంగాలుగా అర్ధమాగధి భాషలో రచించారు
సి) రెండో జైన సంగీతి వల్లభి (గుజరాత్)లో దేవర్ధి క్షమశ్రమణుడి అధ్యక్షతన జరిగింది
డి) పైవన్నీ

25. దక్షిణ భారతదేశానికి వచ్చి సల్లేఖన వ్రతం ఆచరించిన ప్రముఖ మగధ పాలకుడు?
ఎ) అశోకుడు బి) చంద్రగుప్తమౌర్య
సి) ఉదయన డి) బిందుసార

26. జైన అశోకుడిగా పేరు పొందిన మౌర్య పాలకుడు ఎవరు?
ఎ) కునాల బి) బృహద్రథ
సి) సంప్రతి డి) తివర

27. చాముండరాయ నిర్మించిన గోమతేశ్వర/ బాహుబలి విగ్రహం కర్ణాటకలోని ఏప్రాంతంలో ఉంది?
ఎ) ఐహోల్ బి) శ్రావణ బెళగొళ
సి) పట్టడకల్ డి) హంపి

28. జైన మతాభిమాని అయిన ప్రముఖ కళింగ పాలకుడు ఎవరు?
ఎ) ఖారవేలుడు బి) ప్రతాపరుద్రుడు
సి) నరసింహదేవ డి) అనంతచోడగాంగ

29. జైనమతాన్ని అవలంబించిన రాష్ట్రకూట రాజు?
ఎ) అమోఘవర్షుడు బి) నాలుగో ఇంద్రుడు
సి) ఎ, బి డి) ఎవరూ కాదు

30. జతపరచండి.

గ్రూప్-ఎ
1. మాయాదేవి
2. ప్రజాపతి గౌతమి
3. యశోధర
4. కిసగౌతమి
5. సుజాత

గ్రూప్-బి
i. బుద్ధుడి తపస్సు సమయంలో అతడిని వృక్షదేవతగా ఆరాధించిన స్త్రీ
ii. బుద్ధుడి ద్వారా జనన మరణాల జ్ఞానం పొందిన మహిళ
iii. బుద్ధుడి భార్య
iv. బుద్ధుడిని పెంచిన తల్లి
v. బుద్ధుడికి జన్మనిచ్చిన తల్లి

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-iii, 3-iv, 4-i, 5-v
డి) 1-iii, 2-v, 3-ii, 4-i, 5-iv

31. బుద్ధుడికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) జ్ఞానోదయం కలిగిన గ్రామం ఉరువేలా
బి) జ్ఞానోదయం పొందిన రోజు వైశాఖ శుద్ధ పూర్ణిమ
సి) మహాపరినిర్యాణం చెందిన ప్రాంతం కుశినగరం
డి) పైవన్నీ

32. బుద్ధుడి కర్మకాండలను ఏ రాజ్యంలో నిర్వహించారు?
ఎ) వైశాలి బి) మల్ల
సి) గాంధార డి) విజ్జి

33. బుద్ధుడి జీవితంలో 5 ప్రధాన ఘట్టాలను పంచకల్యాణాలు అంటారు. ఆ సంఘటన వాటికి సంబంధించిన చిహ్నాలను జతపరచండి.

గ్రూప్-ఎ
1. జననం
2. మహాభినిష్క్రమణం
3. జ్ఞానోదయం
4. ధర్మచక్ర పరివర్తనం
5. మహాపరినిర్యాణం

గ్రూప్-బి
i. తామర పువ్వు
ii. గుర్రం
iii. రావిచెట్టు
iv. చక్రం
v. స్తూపం

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-iv, 3-v, 4-i, 5-iii
డి) 1-iii, 2-i, 3-iv, 4-v, 5-ii

34. ఆర్య సత్యాలు, అష్టాంగ మార్గాలను బోధించింది ఎవరు?
ఎ) వర్ధమాన మహావీరుడు
బి) బుద్ధుడు సి) పార్శ్వనాథుడు
డి) అజితనాథుడు

35. సంస్కృతం స్వీకరించక పూర్వం బౌద్ధమతస్థులు ఉపయోగించిన భాష ఏది?
ఎ) ప్రాకృతం బి) అర్ధమాగధి
సి) పాళీ డి) దేశీ

36. కింది వాటిలో సరైన జత?
ఎ) వినయ పీఠిక – ఉపాలి
బి) సుత్త పీఠిక – ఆనందుడు
సి) అభిదమ్మ పీఠిక– వసుబంధు
డి) పైవన్నీ

37. బుద్ధుడి పూర్వ జన్మలు తెలియజేసే జాతక కథలు ఏ పీఠికలో ఉన్నాయి?
ఎ) సుత్త పీఠిక బి) వినయ పీఠిక
సి) అభిదమ్మ పీఠిక డి) పైవేవీ కావు

38. బౌద్ధమతాన్ని స్వీకరించిన మొదటి మహిళ?
ఎ) యశోధర బి) కిసగౌతమి
సి) ప్రజాపతి గౌతమి డి) సుజాత

39. బౌద్ధమత ప్రార్థనా మందిరాలను ఏమంటారు?
ఎ) విహారం బి) చైత్యం
సి) స్తూపం డి) బసది

40. బౌద్ధ సంగీతులు, అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ – ఎ
1. మొదటి బౌద్ధ సంగీతి
2. రెండో బౌద్ధ సంగీతి
3. మూడో బౌద్ధ సంగీతి
4. నాలుగో బౌద్ధ సంగీతి

గ్రూప్ – బి
i. మహాకశ్యప
ii. సభాకామి
iii. మొగలిపుత్త తిస్య
iv. వసుమిత్రుడు

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv
బి) 1-iv, 2-iii, 3-ii, 4-i
సి) 1-ii, 2-i, 3-iv, 4-iii
డి) 1-iii, 2-iv, 3-i, 4-ii

41. బౌద్ధ సంగీతులు జరిగిన ప్రదేశాలు, నిర్వహించిన రాజులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ – ఎ	గ్రూప్ – బి
1. రాజగృహం	i. అజాతశత్రువు
2. వైశాలి	ii. కాలాశోకుడు
3. పాటలీపుత్రం	iii. అశోకుడు
4. కుందలవనం	iv. కనిష్కుడు

ఎ) 1-iv, 2-iii, 3-ii, 4-i
బి) 1-i, 2-ii, 3-iii, 4-iv
సి) 1-iii, 2-iv, 3-i, 4-ii
డి) 1-ii, 2-iii, 3-iv, 4-i

42. ఎన్నో బౌద్ధ సంగీతిలో బౌద్ధమతం హీనయాన, మహాయాన శాఖలుగా చీలిపోయింది?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4

43. అశోకుడు తన కుమార్తె సంఘమిత్ర, కుమారుడు మహేంద్రను బౌద్ధమత వ్యాప్తి కోసం ఏ దేశం పంపించాడు?
ఎ) శ్రీలంక బి) నేపాల్
సి) భూటాన్ డి) చైనా

44. శ్రీలంకకు చెందిన ప్రముఖ బౌద్ధ గ్రంథం?
ఎ) దీపవంశ బి) మహావంశ
సి) చుళవంశ డి) పైవన్నీ

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) డి; 4) సి; 5) ఎ; 6) బి; 7) సి; 8) డి; 9) ఎ; 10) డి; 11) డి; 12) డి; 13) సి; 14) బి; 15) డి; 16) ఎ; 17) సి; 18) డి; 19) బి; 20) ఎ; 21) సి; 22) బి; 23) ఎ; 24) డి; 25) బి; 26) సి; 27) బి; 28) ఎ; 29) సి; 30) బి; 31) డి; 32) బి; 33) ఎ; 34) బి; 35) సి; 36) డి; 37) ఎ; 38) సి; 39) బి; 40) ఎ; 41) బి; 42) డి; 43) ఎ; 44) డి.

'తోడా' అనే తెగలు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నాయి?

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కలను సేకరించడం తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అంటారు. దేశంలో తొలిసారిగా 1872లో జనాభా లెక్కల సేకరణ మొదలైంది. 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.

జనాభా

భారతదేశ జనాభాలో విభిన్న శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ప్రాచీన కాలం నుంచి వివిధ దేశాలకు చెందినవారు భారతదేశంలోకి ప్రవేశించి సాంఘికంగా, సాంస్కృతికంగా ఇక్కడి సమాజంలో కలిసిపోయారు. వీరు స్థానికులతో వివాహ సంబంధాలు ఏర్పర్చుకున్నారు. ఫలితంగా విభిన్న శారీరక లక్షణాలున్న సంతతి ఉద్భవించిందని ఆంత్రోపాలజిస్టుల అభిప్రాయం.

'రిస్లే' అనే ఆంత్రోపాలజిస్టు శారీరక లక్షణాల ఆధారంగా ప్రపంచ జనాభాను ఆరు జాతులుగా విభజించారు. ఏ దేశ జనాభాలోనైనా ఒక జాతి లేదా రెండు జాతుల లక్షణాలు ఉంటాయి. కానీ భారతదేశంలో మాత్రమే ప్రపంచంలోని ఆరు జాతుల లక్షణాలు కనిపిస్తాయి. అవి...

ఎ నీగ్రిటోలు

దేశంలోకి మొదటిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించే షోంపైన్స్, జార్వాస్, ఓంజెస్ లాంటి తెగలలో, కేరళలోని పులియాన్స్ తెగలలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.

బి ప్రొటో ఆస్ట్రలాయిడ్స్

మధ్య భారతదేశంలో నివసించే గోండులు, ముండాలు, భిల్లులు, ఒరేన్‌లు, సంతాలులు, చెంచులు, కురుంబాలు లాంటి గిరిజన తెగలలో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

సి మెడిటరేనియన్

వీరినే ద్రవిడులు అని కూడా పిలుస్తారు. దక్షిణ భారతదేశంలో నివసించే ప్రజలను ఈ జాతి సంతతిగా పేర్కొంటారు. వీరినే సింధూ నాగరికత ప్రజల సంతతిగా పేర్కొనవచ్చు. ద్రవిడ ప్రజల జీవన విధానంలో సింధూ నాగరికత ప్రజల సాంస్కృతిక లక్షణాలు ఇప్పటికీ కనిపిస్తాయి.

డి మంగోలాయిడ్స్

ఈశాన్య భారతదేశంలోని అసోం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజల్లో, అండమాన్‌లోని 'సెంటినీలీస్' అనే తెగలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి. ఈ జాతి ప్రజల శరీరంలో 'ఎపికాంతిక్ ఐలిడ్' అనే ప్రత్యేక లక్షణం కనిపిస్తుంది.

ఇ బ్రాకీ సెఫాలస్

వీరినే కాకసాయిడ్ జాతి ప్రజలుగా పేర్కొంటారు. ఈ జాతి వారిలో తల వెడల్పుగా ఉంటుంది. గుజరాత్,మహారాష్ట్రలోని మార్వాడీలు, పశ్చిమ బెంగాల్‌లోని నయనార్ క్షత్రియులు, నంబూద్రీ బ్రాహ్మణుల్లో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

ఎఫ్ నార్డిక్స్

వీరినే ఆర్యన్లు అని పిలుస్తారు. భారతదేశంలోకి చివరిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. ఈ జాతి లక్షణాలున్న సంతతి ప్రస్తుతం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని రాజపుత్రులు, జాట్‌లలో కనిపిస్తుంది.

జనాభా లెక్కల సేకరణ (2011)

ఒక నిర్దిష్ట ప్రాంతంలో తమలో తాము అంతః ప్రజననం జరుపుకునే, నిర్దిష్ట ఆవాసంలో నివసించే ప్రజా సమూహమే జనాభా. ఇంటింటి సర్వే ద్వారా శాస్త్రీయ పద్ధతిలో జనాభా, దాని అనుబంధ అంశాలను సేకరించే పద్ధతినే జనాభా లెక్కల సేకరణ అంటారు.

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కల సేకరణ తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అని అంటారు.

- ప్రపంచంలో మొదటిసారిగా 1841లో ఆధునిక జనాభా లెక్కల సేకరణ ఇంగ్లండ్‌లో ప్రారంభమైంది. 1872లో భారతదేశంలో జన గణన మొదలైంది. 1881 నుంచి పదేళ్లకు ఒకసారి క్రమం తప్పకుండా మన దేశంలో జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.
- 2011 జనాభా లెక్కల సేకరణ 15వది, స్వాతంత్ర్యం వచ్చాక ఏడోది. ఈ జనాభా లెక్కల సేకరణ 2010 ఏప్రిల్ 1న ప్రారంభమై 2011 మార్చిలో ముగిసింది. ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 17.5 శాతం. అత్యధిక జనాభా ఉన్న దేశాల జాబితాలో భారతదేశం తొలి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో వరసగా అమెరికా, ఇండోనేసియా, బ్రెజిల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి.
- 2011 మార్చి 1 నాటికి దేశ జనాభా 1.21 బిలియన్లు దాటింది. 2001 నాటికి దేశ జనాభా 1.02 బిలియన్లు ఉండేది. అంటే పదేళ్లలో దేశ జనాభా 18.196 కోట్లు పెరిగింది.
- 1991-2001 దశాబ్దంలో జనాభా వృద్ధిరేటు 21.54 శాతం. కాగా, 2001-11 మధ్యకాలంలో అది 17.7 శాతానికి తగ్గింది.
- 1991-2001 దశాబ్దంలో జనాభా వార్షిక వృద్ధిరేటు 1.9 శాతం కాగా 2001-11లో 1.64 శాతానికి తగ్గింది.
- జనసాంద్రత 2001లో చ.కి.మీ.కు 325 ఉంటే, అది 2011లో 382కు పెరిగింది.
- అక్షరాస్యత 2001 మార్చి 1 నాటికి 64.38 శాతం కాగా, 2011 మార్చి నాటికి 74.04 శాతానికి పెరిగింది.
- లింగనిష్పత్తి 2001 మార్చి 1 నాటికి 933 ఉంటే, 2011 మార్చి 1 నాటికి 943కి పెరిగింది. ప్రతి వెయ్యి మంది పురుషులకు ఉన్న స్త్రీల సంఖ్యను లింగనిష్పత్తి అంటారు. దేశంలోకెల్లా అత్యుత్తమంగా కేరళలో లింగనిష్పత్తి 1084:1000గా ఉంది.
- దేశంలో అత్యధిక జనాభా ఉన్న మొదటి ఐదు రాష్ట్రాలు... ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్).
- దేశంలో తక్కువ జనాభా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... సిక్కిం, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, గోవా.
- అత్యధిక జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... బిహార్, పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, సిక్కిం, నాగాలాండ్.
- అత్యధిక జనసాంద్రత ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు.. ఢిల్లీ, చండీగఢ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి రెండు కేంద్రపాలిత ప్రాంతాలు... అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలీ.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, జమ్మూ-కశ్మీర్.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు తక్కువగా ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... నాగాలాండ్, కేరళ, గోవా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... కేరళ, మిజోరాం.
- దేశంలో తక్కువ అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... బిహార్, అరుణాచల్‌ప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు జిల్లాలు మిజోరాంలో ఉన్నాయి. అవి.. సెర్‌చ్చిప్, ఐజ్వాల్.
- దేశంలో అక్షరాస్యత తక్కువ ఉన్న మొదటి రెండు జిల్లాలు... మధ్యప్రదేశ్‌లోని అలిరాజ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 10.43 కోట్ల(8.6 శాతం) మంది షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు.
- ఎస్టీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్, తక్కువగా ఉన్న రాష్ట్రం సిక్కిం.
- ఎస్టీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం మిజోరాం, తక్కువగా ఉన్న రాష్ట్రం గోవా.
- ఎస్టీ జనాభా లేని రాష్ట్రాలు... పంజాబ్, హర్యానా.
- 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) జనాభా శాతం 16.6. సంఖ్యాపరంగా 20.14 కోట్లు.
- ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. తక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరాం.
- ఎస్సీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం పంజాబ్, తక్కువగా ఉన్నది మిజోరాం.
- ఎస్సీ జనాభా లేని రాష్ట్రం నాగాలాండ్

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సంతాల్ జనాభా ఉన్న రాష్ట్రాలు ఏవి? (2011, A.S.O)
ఎ) మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
బి) కర్ణాటక, పశ్చిమబెంగాల్
సి) ఉత్తరప్రదేశ్, జార్ఖండ్
డి) జార్ఖండ్, పశ్చిమ బెంగాల్

2. మేఘాలయ ప్రత్యేకంగా గిరిజన రాష్ట్రం. ఆ రాష్ట్రంలో నివసించే గిరిజన తెగలేవి? (2001, J.L.)
ఎ) ఖాసీలు, ఉషరీలు, లఖీర్లు
బి) ఖాసీలు, జయంతియాలు, గారోలు
సి) జయంతియాలు, గారోలు, కుర్కిలు
డి) గారోలు, ఫాంగులు, హామ్‌రో

3. జనాభాపరంగా దేశంలో అతిచిన్న రాష్ట్రం ఏది? (2011, D.L.)
ఎ) నాగాలాండ్ బి) అసోం
సి) సిక్కిం డి) కేరళ

4. ఇండియాలో అత్యధిక అక్షరాస్యత ఉన్న జిల్లా ఏది? (2011, D.L.)
ఎ) సెర్‌చ్చిప్ బి) గుంటూరు
సి) మిడ్నాపూర్ డి) గాజామ్

5. 'తోడా' అనే తెగలు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నాయి? (2002, AEEs)
ఎ) రాజస్థాన్ బి) మధ్యప్రదేశ్
సి) అసోం డి) తమిళనాడు

6. భారతదేశంలోని గిరిజనుల్లో సంఖ్యాపరంగా ఎక్కువగా ఉన్నవారు? (2011, Gr-II)
ఎ) సంతాలులు బి) భిల్లులు
సి) ముండాలు డి) నాగాలు

సమాధానాలు

1) డి; 2) బి; 3) సి; 4) ఎ; 5) డి; 6) బి.

మాదిరి ప్రశ్నలు

1. 'మీనా' జాతికి చెందిన తెగల వారు ఏ రాష్ట్రంలో అధికంగా నివసిస్తున్నారు?
ఎ) గుజరాత్ బి) అసోం
సి) రాజస్థాన్ డి) మధ్యప్రదేశ్

2. 2011లో జరిగిన జన గణన స్వాతంత్ర్యానంతరం ఎన్నోది?
ఎ) 15 బి) 7 సి) 8 డి) 9

3. కింది వాటిలో అధిక జనాభా ఉన్న రాష్ట్రాల అవరోహణ క్రమాన్ని గుర్తించండి?
ఎ) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్
బి) మధ్యప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
సి) రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
డి) ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్

4. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభావృద్ధి రేటు అధికంగా ఉన్న రాష్ట్రం?
ఎ) అరుణాచల్ ప్రదేశ్
బి) మేఘాలయ సి) బిహార్
డి) జమ్మూ-కశ్మీర్

5. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో జనసాంద్రత ఎంత?
ఎ) 325 బి) 267
సి) 382 డి) 176

6. 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లా ఏది?
ఎ) దిబాంగ్ వ్యాలీ బి) యానాం
సి) అంజాన్ డి) నార్త్ ఈస్ట్ ఢిల్లీ

7. కిందివాటిలో అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించని తెగ ఏది?
ఎ) షోంపైన్స్ బి) జార్వాస్
సి) సెంటినీలీస్ డి) మోప్లాలు

8. జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఏ సంవత్సరాన్ని 'గొప్ప విభాజక సంవత్సరం'గా పేర్కొంటారు?
ఎ) 1911 బి) 1901
సి) 1921 డి) 1931

9. మానవ జనాభా 'గుణమధ్యమం'(జియోమెట్రిక్) రేటులో పెరుగుతుండగా, వనరులు మాత్రం 'అంకమధ్యమం' (అర్థమెటిక్) రేటులో పెరుగుతున్నాయని తెలిపిన శాస్త్రవేత్త ఎవరు?
ఎ) మాల్థస్ బి) కీన్స్
సి) రికార్డో డి) రొనాల్డ్ రాస్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) బి; 5) సి; 6) డి; 7) డి; 8) సి; 9) ఎ.

మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యూహం ఏమిటి?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

ప్రణాళికా వ్యూహాలు

వ్యూహం అనే విస్తృత భావనలో అభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన విధానపర చర్యలు ఇమిడి ఉంటాయి. భారతదేశంలో ప్రణాళికలకు సంబంధించిన వ్యూహాల్లో పేదరికం, అల్పాభివృద్ధి లాంటి సమస్యల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. పరిమాణం, పెట్టుబడుల పంపిణీ ప్రక్రియ, వనరుల సమీకరణ, ప్రభుత్వ రంగ పాత్ర తదితర అంశాలకు చెందిన విధానాలను ప్రణాళికల్లో అవలంబించారు.

భారత్‌లో ఆర్థిక ప్రణాళికల వ్యూహాన్ని ప్రభావితం చేసిన అంశాలు

1) మహలనోబిస్ వృద్ధి నమూనా
2) భారీ పరిశ్రమల వ్యూహం
3) ఉపాధి లక్ష్యం
4) సామాజిక లక్ష్యాలు; వృద్ధి, అసంతులిత వృద్ధి మధ్య వ్యూహం.

మొదటి పంచవర్ష ప్రణాళిక

విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, సాంఘిక పరిస్థితులను మెరుగుపరచడం లాంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని ఖరారు చేశారు.

రెండో పంచవర్ష ప్రణాళిక

రెండో పంచవర్ష ప్రణాళికలో భారీ పరిశ్రమల అభివృద్ధి, ప్రజలకు సాంఘిక సేవల కల్పనపై దృష్టి సారించారు. ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ రష్యా అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రెండో ప్రణాళికకు అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించారు.

రెండో ప్రణాళికలో అవలంబించిన వ్యూహంలోని ముఖ్యాంశాలు:

- మహలనోబిస్ ప్రకారం.. భారీ పరిశ్రమల్లో పెట్టుబడి పెంపు, సేవలపై వ్యయం పెంపు, కొనుగోలు శక్తి పెంపు ద్వారా నూతన డిమాండ్‌ను సృష్టించడం; చిన్న తరహా, గృహ పరిశ్రమల్లో పెట్టుబడి, ఉత్పత్తిని అధికం చేయడం ద్వారా నూతన డిమాండ్‌కు అనుగుణంగా వినియోగ వస్తువుల సరఫరా పెంచడం లాంటివి అభివృద్ధి వ్యూహంలో ప్రధాన అంశాలు.
- మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యమిచ్చారు.
- నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనా రెండో ప్రణాళిక రూపకల్పన సమయంలో వెలువడింది. ఇందులో అభివృద్ధికి సంబంధించి దీర్ఘ కాలిక లక్ష్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అధిక పెట్టుబడి రేటు సాధన కోసం పొదుపు రేటును పెంచడం, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వడం, నూతన పరిశ్రమల రక్షణకు 'రక్షిత విధానం' అవలంబించడం, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ, లక్షిత వర్గాల ప్రజలకు అవకాశాలను విస్తృతం చేయడం లాంటి అంశాలకు నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో ప్రాధాన్యం ఇచ్చారు.
- ఆధునిక యంత్రాలు, విద్యుచ్ఛక్తిని ఉపయోగించి వినియోగ వస్తువులు రూపొందించే కుటీర, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి నెహ్రూ - మహలనోబిస్ నమూనాలో తగిన ప్రోత్సాహం ఇచ్చారు.

మూడో పంచవర్ష ప్రణాళిక

మూడో పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాల మధ్య ఇంటర్‌డిపెండెన్స్ (పరస్పర ఆధారం) వృద్ధి చేయడంపై దృష్టి సారించారు. జాతీయ, ప్రాంతీయ అభివృద్ధి, స్వదేశీ, బహిర్గత ఆధారాల నుంచి వనరుల సమీకరణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో సాంకేతిక ప్రగతికి చర్యలు తీసుకోవడం, అధిక ఉత్పాదకత సాధించడం, జనాభా నియంత్రణ, ఉపాధి, సామాజిక మార్పు అంశాలపై దృష్టి కేంద్రీకరించారు.

వార్షిక ప్రణాళికలు

వార్షిక ప్రణాళికల కాలం(1966-69)లో.. మూడో పంచవర్ష ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థలో సంభవించిన అనిశ్చిత పరిస్థితులను నివారించడంపై దృష్టి సారించారు. దీంతోపాటు ఏ విధమైన అదనపు ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తకుండా సహేతుక వృద్ధి రేటు సాధనకు ప్రాధాన్యం ఇచ్చారు. అవస్థాపితా సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం, ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి కేంద్రీకరించారు. విద్య, కుటుంబ నియంత్రణ, రక్షిత తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర అంశాలపై దృష్టి సారించి వివిధ సాంఘిక సేవా పథకాలను ప్రవేశపెట్టారు.

నాలుగో పంచవర్ష ప్రణాళిక

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1969-74) వార్షిక ప్రణాళికల్లో అవలంబించిన వ్యూహాన్ని కొనసాగించారు. చిన్న రైతులకు ప్రోత్సాహం కల్పించేవిధంగా వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి సంబంధించిన వ్యూహాలను అమలు చేశారు. ఆధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే క్రమంలో.. చిన్న, పెద్ద తరహా పారిశ్రామిక యూనిట్ల వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎగుమతులను పెంచడం, దిగుమతులను తగ్గించుకోవడంతో పాటు క్రమంగా విదేశాలపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించడానికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. సమతౌల్య ఆర్థికవృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుస్థిరత, స్వయం సమృద్ధి సాధనకు ఈ ప్రణాళికలో పెద్దపీట వేశారు.

అయిదో పంచవర్ష ప్రణాళిక

పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వయం సాధనను దృష్టిలో ఉంచుకొని 5వ పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని రూపొందించారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల వాడకం, బహుళ పంటల కార్యక్రమం ద్వారా ఉత్పత్తి పెంపునకు ప్రాధాన్యం ఇచ్చారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిలో భాగంగా వినియోగ వస్తువులు, వ్యవసాయాధారిత పరిశ్రమల విస్తరణ, ప్రోత్సాహం లాంటివాటిపై దృష్టి సారించారు.

ఆరో పంచవర్ష ప్రణాళిక

ఆరో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో నిరుద్యోగ సమస్య, అల్ప ఉద్యోగిత, పేదరికాన్ని అట్టడుగు స్థాయికి తగ్గించడం లాంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడుల వృద్ధిని వేగవంతం చేయడం ద్వారా అవస్థాపనా సౌకర్యాల పెంపు, ఉత్పత్తి, ఎగుమతుల వృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. ఆయా లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. ప్రజలకు కనీస అవసరాల కల్పన, గ్రామీణ, అసంఘటిత రంగాల్లో ఉపాధి అవకాశాల పెంపునకు ప్రాధాన్యం ఇస్తూ వ్యూహాన్ని సిద్ధం చేశారు.

ఏడో పంచవర్ష ప్రణాళిక

మానవ వనరుల అభివృద్ధి, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఏడో పంచవర్ష ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకోవడం ద్వారా దేశంలో పేదరికం, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానతల తగ్గింపునకు కృషి చేసే దిశగా అవసరమైనఅభివృద్ధి వ్యూహాన్ని అవలంబించారు.

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక (1992-97)లో మానవాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో ఉపాధి అవకాశాల విస్తరణకు అవలంబించిన వ్యూహాలు, విధానాలు, కార్యక్రమాల్లోని ముఖ్యాంశాలు కింది విధంగా ఉన్నాయి..

1. వేగవంతమైన, అన్ని ప్రాంతాలకు విస్తరించిన వ్యవసాయ రంగ అభివృద్ధి.
2. వ్యవసాయాధారిత, అనుబంధ కార్యకలాపాలైన డెయిరీ, ఫిషరీలకు సంబంధించి అవస్థాపనా సౌకర్యాలు, మార్కెటింగ్ సౌకర్యాల అభివృద్ధి.
3. గ్రామీణ ప్రాంతాల్లో తయారీ కార్యకలాపాల అభివృద్ధి.
4. చిన్న తరహా, తయారీ రంగ వికేంద్రీకరణపై దృష్టి సారించడం.
5. ఆరోగ్య, విద్యా సౌకర్యాలను పటిష్టపరచడం.
6. సేవా, ఇన్‌ఫార్మల్ రంగాల కార్యకలాపాల్లో వేగవంతమైన వృద్ధి.
7. ఉపాధి వృద్ధి పెంపులో భాగంగా నియంత్రణ విధానాన్ని సరళీకరించడం.
8. అవస్థాపనా సౌకర్యాలు, గృహ వసతి కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను ప్రవేశ పెట్టడం.

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక (1997-2002) వ్యూహంలో భాగంగా.. వ్యవసాయ ఉత్పత్తి పెంపు ద్వారా సాంవత్సరిక వృద్ధి రేటు పెంపు, వనరుల సమీకరణలో స్వయం సాధన (సెల్ఫ్ రిలయన్స్), గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో మార్పులను తీసుకురావడం ద్వారా గ్రామీణ పేదరిక తీవ్రత తగ్గింపు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని మధ్య తరహా, భారీ పరిశ్రమల్లో సామర్థ్యం, పోటీతత్వం పెంపునకు తగిన చర్యలను విస్తరించడం, ఫార్మల్, ఇన్‌ఫార్మల్ రంగాల్లోని గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి, అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. మానవాభివృద్ధిని మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

పదో పంచవర్ష ప్రణాళిక

పదో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో.. ప్రైవేట్ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. వృద్ధి పెంపునకు వ్యూహాలు, ప్రభుత్వం ఎదుర్కొంటున్న విధానపరమైన సవాళ్లను అధిగమించడంపై దృష్టి సారించారు. ప్రభుత్వ రంగ పెట్టుబడుల్లో మూలధనం - ఉత్పత్తి నిష్పత్తికి ప్రాధాన్యం ఇవ్వడానికి బదులుగా ప్రైవేట్ రంగంలో అధికవృద్ధి వ్యూహాన్ని అమలు చేశారు.

పదకొండో పంచవర్ష ప్రణాళిక

పదకొండో పంచవర్ష ప్రణాళికలో (2007-2012) పేదరికం తగ్గించడం, ఉపాధి అవకాశాల కల్పన, లింగ సంబంధిత తేడాలు నివారించడం, అక్షరాస్యత పెంచడం, వ్యవసాయ రంగంలో 4 శాతం వార్షిక వృద్ధి సాధించడం ధ్యేయంగా విశాల దృక్పథంతో కూడిన సమ్మిళిత వృద్ధి వ్యూహాన్ని అమలు చేశారు.

పన్నెండో పంచవర్ష ప్రణాళిక

పన్నెండో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో (2012-2017) వ్యవసాయ రంగంలో అధిక ప్రగతి సాధించడం, ఉపాధి కల్పన (ముఖ్యంగా తయారీ రంగంలో) వేగవంతం చేయడం, విద్య, ఆరోగ్యం, శిక్షణా నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి పటిష్ట చర్యలు తీసుకోవడం, పేదల అభ్యున్నతికి ప్రత్యేకంగా ఉద్దేశించిన పథకాలను సమర్థంగా అమలు చేయడం, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్రణాళికలు, లక్షిత వర్గాల ప్రజలకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించడం లాంటి విధానాలపై దృష్టి సారించారు. వేగవంతమైన, సుస్థిర, అధిక సమ్మిళిత వృద్ధికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు.

మాదిరి ప్రశ్నలు

1. మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ఏ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు?
   1) ప్రభుత్వ రంగం 2) ప్రైవేట్ రంగం
   3) అసంఘటిత రంగం
   4) సంఘటిత రంగం
2. కింది వాటిలో నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో భాగం కానిది?
   1) దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ
   2) పరిశ్రమలకు సంబంధించిన రక్షిత విధానం
   3) సమ్మిళిత వృద్ధి
   4) భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం
3. ఎన్నో పంచవర్ష ప్రణాళికలో చిన్న రైతులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి వ్యూహం అవలంబించారు?
   1) 3 2) 4 3) 5 4) 6
4. ఆర్థిక ప్రణాళికా వ్యూహాన్ని కింద పేర్కొన్న ఏ అంశం ప్రభావితం చేసింది?
   1) మహలనోబిస్ వృద్ధి నమూనా
   2) ఉపాధి లక్ష్యం
   3) సామాజిక లక్ష్యాలు
   4) పైవన్నీ
5. దీర్ఘ కాలంలో అధిక పారిశ్రామికీకరణ అనేది బొగ్గు, విద్యుచ్ఛక్తి, భారీ యంత్రాలు, ఇనుము, ఉక్కు రంగాల్లో ఉత్పత్తి పెరుగుదలపై ఆధారపడి ఉంటుందని భావించిన వారు?
   1) వి.కె.ఆర్.వి. రావ్ 2) మహలనోబిస్
   3) కాల్డర్ 4) ఎస్. చక్రవర్తి
6. భారీ పరిశ్రమల వ్యూహం ఏ పరిస్థితికి దారి తీసిందనే విమర్శ ఉంది?
   1) వాణిజ్య లోటు పెంపు
   2) వ్యవసాయ ఉత్పత్తి పెంపు
   3) అసంఘటిత రంగ అభివృద్ధి
   4) అసమానతల తగ్గింపు

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2;
4) 4; 5) 2; 6) 1.

The head office of BIS is located in?

BANK EXAMS

BANKING AWARENESS

1. What is the minimum capital requirement for New Banks in the Private Sector?
   a) Rs. 200 crore b) Rs. 300 crore
   c) Rs. 500 crore d) Rs. 600 crore
   e) None of these
2. Many times we read a term "ECB" in financial newspapers. What is the full form of ECB?
   a) Essential Commercial Borrowing
   b) Essential Credit and Borrowing
   c) External Credit and Business
   d) External Commercial Borrowing
   e) None of the above
3. Which among the following banks has launched "Dhanchayat" an educational film to raise awareness on the dangers of borrowing money from unorganised sources?
   a) Axis b) ICICI
   c) HDFC d) SBI e) YES
4. What is the maximum monthly pension for the subscribers under Atal Pension Yojana?
   a) Rs 2000 b) Rs 3000
   c) Rs 4000 d) Rs 5000
   e) None of these
5. If a company which is not a non - banking financial company wants to collect public deposits, it is governed by ___ Act:
   a) RBI Act 1934
   b) Banking companies Act
   c) Companies Act 1956
   d) Central Government
   e) None of the above
6. Which among the following has launched a Smart Humsafar Plan, a unique plan which offers multiple benefits of savings and insurance cover for husband and wife under a single policy?
   a) ICICI Prudential
   b) SBI Life c) NIACL
   d) LIC e) HDFC ERGO
7. Which country launched world first Facial recognition ATM?
   a) China b) Japan
   c) US d) Canada
   e) Brazil
8. Which type of machine is used by Business Correspondents?
   a) Micro ATMs b) POS
   c) Biometric Card Reader
   d) Solar empowered
   e) Water resistant
9. Which among the following bank has tied up with Chinese e-commerce giant Alibaba to provide easier trade finance to small and medium enterprises (SMEs) in the country? a) HDFC Bank
   b) SBI Bank c) Canara Bank
   d) ICICI Bank e) Axis Bank
10. In India, conventionally, bonds are issued by institutions in ____ sector while debentures by corporate in ____ sector.
    a) private, public b) public, private c) either a or b
    d) cooperative, NBFC
    e) None of the above
11. What is the name of the platform launched by State Bank of India (SBI) that enables customers to book their foreign exchange transactions online?
    a) SBI eforex b) SBI emoney
    c) SBI eonline d) SBI eshare
    e) SBI ebuddy
12. In CDR, "R" stands for ____.
    a) Ratio b) Receipt
    c) Regulation d) Restructuring
    e) Reserve
13. Which of the following is not a function of General Insurance?
    a) Cattle Insurance
    b) Crop Insurance
    c) Marine Insurance
    d) Fire Insurance
    e) None of the above
14. The Bank for International Settlements (BIS) is the world's oldest international financial organization established on 17 May 1930. The mission of the BIS is to serve central banks in their pursuit of monetary and financial stability, to foster international cooperation in those areas and to act as a bank for central banks. The head office of BIS is located in ___.
    a) Hong Kong b) Switzerland
    c) China d) Mexico
    e) Australia
15. National Investment and Infrastructure Fund (NIIF) is a fund created by the Government of India for enhancing infrastructure financing in the country. To be operational by the year end, the headquarter of NIIF will be located in ____.
    a) Mumbai b) New Delhi
    c) Bengaluru d) Chennai
    e) Kolkata
16. Special Drawing Rights (SDRs) are international foreign exchange reserve assets issued by-
    a) World Bank b) WTO
    c) ADB d) IMF
    e) None of these
17. Which of the following types of accounts are known as "Demat Accounts"?
    a) Zero Balance Accounts
    b) Accounts which are opened to facilitate repayment of a loan taken from the bank. No other business can be conducted from there
    c) Accounts in which shares of various companies are traded in electronic form
    d) Accounts which are operated through internet banking facility
    e) None of the above
18. According to the Socio Economic and Caste Census (SECC) which among the following states in India has highest per cent of Urban BPL households?
    a) Bihar b) Uttar Pradesh
    c) Manipur d) Jharkhand
    e) Sikkim
19. Payment of a cheque may be countermanded by the ___
    a) Payee b) Drawer
    c) True owner d) Drawee
    e) None of these
20. Union Government has decided to set up a Bank Board Bureau (BBB) to monitor key performance indicators of two dozen public sector banks (PSBs). BBB will start functioning from ___.
    a) 31st December 2015
    b) 1st January 2016
    c) 31st March 2016
    d) 1st April 2016
    e) 1st June 2016
21. Identify the well known person related to Banking field in India from the following?
    a) Mrs. Meira Kumar
    b) Mrs. Kiran Shaw
    c) Mr. Arun Jaitley
    d) Dr. D Subbarao
    e) All of the above
22. A fixed deposit receipt is kept with the bank for its safety, is known as ___?
    a) Safe custody b) Safe deposit
    c) Locker d) Valid safe deposit
    e) None of the above
23. Reserve Bank will issue ___bank notes with 3 additional features to aid the visually impaired in identification.
    a) Rs. 500 and Rs 1,000
    b) Rs. 100 and Rs. 500
    c) Rs. 50 and Rs. 100
    d) Rs. 10 and Rs. 100
    e) None of these
24. Simply click a card launched by SBI special for ____.
    a) Cash Transfer
    b) Online Shopping
    c) Pay Utility Bills
    d) For Home Loans
    e) None of these
25. Banking Companies are prohibited under Sec 8 of banking Regulation Act to sell and purchase securities. Yet Banks are selling securities (of the customer) which are under pledge as permitted by:
    a) Indian Contract Act
    b) SARFAESI Act
    c) Government Notification
    d) Banking Regulation Act
    e) None of these
26. Hypothecation is:
    a) A transaction of conditional sale
    b) A legal transaction whereby goods may be made available as security for a debt
    c) Transfer of ownership by the borrower to the lender
    d) Either a or b
    e) None of the above
27. Mortgage is a:
    a) Security on movable property for a loan
    b) Security on immovable property for a loan
    c) Concession on immovable property
    d) Facility on immovable property
    e) Security on loan sanctioned against fixed deposits
28. What is the minimum amount to be invested under Sukanya Samriddhi Scheme?
    a) Rs. 500 b) Rs. 1000
    c) Rs. 1500 d) No ceiling
    e) Rs. 100
29. The Main activity of the Financial Intelligence Unit India (FIU-IND) is to control:
    a) Tax Evasion
    b) Money Laundering
    c) Terrorism d) Avoiding NPAs
    e) Avoiding frauds in ATMs
30. The SARFAESI Act 2002 empowers Banks / Financial Institutions to recover their non-performing assets (bad loans) without the intervention of the Court. In "SARFAESI" second "S" stands for ____.
    a) Securitisation b) Security
    c) Statutory d) Share e) Saving
31. The main function of an Asset Management Company is to:
    a) hold the securities of various schemes
    b) manage the funds by making investments in various types of securities
    c) hold its property for the benefit of the unit holders
    d) act on behalf of SEBI
    e) All the above
32. Global Rating Agency Fitch has downgraded Viability Rating (VR) by one notch to 'bb' of which among the following banks?
    a) Bank of Baroda
    b) State Bank of India
    c) Punjab National Bank
    d) Canara Bank e) IDBI Bank
33. The Banking Codes and Standards Board of India was registered on 18th February, 2006 under which of the following RBI Act?
    a) Banking Regulation Act
    b) The Societies Registration Act, 1860
    c) Cooperative Societies Act
    d) None of the above
    e) All the above
34. As per the Banking Ombudsman Scheme, any person can file a complaint before the Banking Ombudsman, if the satisfied reply is not received from the bank within a period of ____.
    a) one month b) three months
    c) two months d) six months
    e) None
35. CIBIL as a credit bureau caters to:
    a) Consumer segments
    b) Commercial segments
    c) Both commercial and consumer segments
    d) Nationalized Banks only
    e) Private Banks only
36. Infusion of liquidity, by RBI, is done through ____ from / to banks under a ____ transaction.
    a) borrowing, repo
    b) borrowing, reverse repo
    c) lending, repo
    d) lending, reverse repo
    e) None of the above
37. Some banks are financing big projects like construction of roads, bridges etc. Financing such projects means banks are helping exactly in:
    a) Infrastructural Development
    b) Project Management
    c) Developing core sector Industry
    d) Financial Inclusion
    e) All of the above
38. A rate of exchange established between any two currencies on the basis of the respective quotation of each currency in terms of a third currency is known as:
    a) Cross rate b) Merchant rate
    c) Wash rate d) Composite rate
    e) None of the above

KEY

1) c; 2) d; 3) c; 4) d; 5) c;
6) b; 7) a; 8) c; 9) d; 10) b;
11) a; 12) d; 13) e; 14) b; 15) a;
16) d; 17) c; 18) c; 19) b; 20) d;
21) d; 22) a; 23) a; 24) b; 25) d;
26) b; 27) b; 28) b; 29) b; 30) b;
31) b; 32) c; 33) b; 34) a; 35) c;
36) c; 37) a; 38) a